


# అది ప్రశ్న - ఇది జవాబు

## అవసరాల రామకృష్ణారావు

శ్రీకృష్ణమూర్తి విజయకుమార్ ముఖాన్ని బలవంతాన పైకెత్తేడు. "చూడండి డాక్టర్! ఏ క్షణంలోనూ విచక్షణకూ క్రమశిక్షణకూ లోటు రానియ్యకూడదని ప్రతిజ్ఞలు చేసుకున్న భారత సైనికులం మనం. జరిగిందానికి ఆడదానిలా మీరే యిలా కృంగిపోతే మీకింద పనిచేస్తున్న యిందరి మాటేమిటి?"

కంపౌండరు లక్ష్మణసింగ్ అన్నాడు: "వారంరోజులై డాక్టర్సు సెమినార్‌లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్ళేం. ఇంతలో ఇంత జరుగుతుందని కలలోకూడా అనుకోలేదు."

సిగ్నలింగ్ ఆఫీసరు శ్రీకృష్ణమూర్తి పిడికిలి బిగించి ఉద్రేకంతో అన్నాడు: "మంచీ చెడ్డా అనేవి రెండూ వదిలేస్తే ఎంత సిగ్గుమాలిన పనికయినా సిద్ధపడవచ్చు. పగవారికి బాంబులు వెయ్యడానికి తెల్లవారుఝామున రెండుగంటలుతప్ప మంచి ముహూర్తమూ, పగ తీర్చుకోడానికి నిరాయుధులూ రోగపీడితులూ తప్ప తగిన శత్రుపక్షమూ దొరకలేదా? పోనీ పొరపాటున ఒకచోట వెయ్యబోయి మరొకచోట

వేళారా అంటే – విమానాలు బాగా క్రిందికి దిగి వరసగా కనీసం ఎనిమిదయినా బాంబులు వెయ్యడం స్పష్టంగా కనిపించిందే. యింతకన్న దారుణమూ, అమానుషమూ ఉంటుందా? ఆపరేషనుథియేటరూ, సర్జికల్‌వార్డూ, ఎక్సురేడిపార్ట్‌మెంటూ నామరూపా ల్లేకుండా పోయాయ్!"

లక్ష్మణసింగ్ మళ్ళీ అన్నాడు: "డాక్టరుగారికి యీ ఆసుపత్రే యిల్లు. ఈ రోగులే వారి బంధుజనం. ఒక్కసారి అంతా నాశనమైపోయి యింతగా భీభత్సం జరుగుతే ఆయన గుండె దెబ్బతినక ఏమౌతుంది!"

"అంతేనా డాక్టర్?" మూర్తి ప్రశ్నకు జవాబు రాలేదు.

"గురుతరమైన యింతబాధ్యత ఎప్పుడైతే మనం నెత్తిన వేసుకున్నామో అప్పుడే అన్నిటికీ సిద్ధమయి వచ్చాం. సాధారణమైన రాగద్వేషాలకు మన సైనికవృత్తిలో స్థాన మెక్కడిది! క్షణక్షణం మన కర్తవ్యం పటుతరమైపోతుంది. మరింత మెళకువతో మన బాధ్యత నిర్వర్తించే సమయం ఆసన్నమైంది. పదిమంది పరమ పదించినా, పాతికమంది గాయాలతో గిలగిల తన్నుకుంటున్నారు. అలవాటులేని ఈ అలసత్వం మీ కెక్కడ్నుంచి వచ్చింది? మృత్యుముఖంలో ఉన్న రోగులకయినా చిరునవ్వుతో ధైర్యం చెప్పే అనన్యమైన మీ స్థయిర్యం ఎక్కడ దాచారు? డాక్టర్! లేవండి. ఎందరు అసిస్టెంట్సు ఉన్నా మీరే హేండిల్ చెయ్యవలసిన కేసులు అనేకం ఉన్నాయి. ఇలా నేను మీకు చెప్పవలసివస్తుందని కలలోకూడా అనుకోలేదు. లేచి మొహం కడుక్కోండి?"

"క్షమించండి మూర్తీ, ఇక నావల్ల కాదు!"

డాక్టరు విజయకుమార్ ముఖం మరింత తెల్లగా పాలిపోయిఉంది. "నావల్ల కాదు – అనేమాట మనం అనవలసింది కాదు. మనల్ని నమ్మి దేశం మనమీద ఇంత భారం పెట్టింది. తమ శరీరభాగాలలో అవికూడా ఒకటిగా భావించి అలంకరించుకున్న ఆభరణాల్ని తృణప్రాయంగా ఎంచి మన చెల్లెళ్లు మనకి యిస్తున్నారు. తాము తిన్నా తినకపోయినా ఒకముద్ద మిగిల్చి మనకోసం సొమ్ము కూడబెడుతున్నారు. ఇంతింత తమ్ముళ్ళు పైసలు కూడబెట్టి రూపాయలు చేసి మనకి పంపిస్తున్నారు. స్వేదం మొదలు రక్తంవరకు మనదేశం మనకోసం ధారపోయనిది లేదు. మనల్ని కన్నదేశం మనల్ని పూర్తిగా నమ్మింది. ఎందుకు డాక్టర్? మనవల్ల కాదని చెప్పడానికేనా?"

"నాకు జరిగిం దేమిటో మీకు తెలియదు. నాకు కలిగిన నష్ట మెంతో మీరు ఎరుగరు. నన్ను అర్థం చేసుకుంటే మీ రిలా అని ఉండరు. మానవసేవే జీవితలక్ష్యంగా

ఎంచుకున్న మామూలు డాక్టర్ని మీరు ఎరుగుదురు. ఈ డాక్టరు ఇలా తయారవడానికి ప్రేరేపించిన శక్తులూ, వ్యక్తులూ ఎవరో మీకు తెలిసిఉంటే మీరు ఇంత ఆలోచించకుండా మాటాడరు మూర్తీ."

శ్రీకృష్ణమూర్తి వాచీ చూసుకున్నాడు. కన్నీరు కారుతుండగా డాక్టరు అన్నాడు: "ఈరోజు వచ్చి చూశాను. ఇటుకలు బద్దలయాయి; గాజుపలకలు పిప్పి అయాయి; ఫర్నీచరంతా ముక్కముక్కలయింది; శస్త్రపరికరాలన్నీ చెడిపోయి చెల్లాచెదరు అయిపోయాయి. వీటిమాట లెక్కేమిటి? బాధలతో, బలహీనతలతో, భయపెట్టే పీడలతో ప్రతిక్షణం భయంకరసమరం చేసి అణువంత ఆధారం కనిపిస్తే ఆకాశమంత ఆశ పడుతూ పసిపిల్లలై నా ఆశ్రయం కోరిన కొందరు రోగులే శాశ్వతంగా విశ్రాంతి పొందేరు! ఈ దృశ్యం నన్నెంత కలచివేసిందో నా పరిస్థితిలో ఉన్నవారుగాని అర్థం చేసుకోలేరు. నా చేతగానితనం నాకు జ్ఞాపకం చెయ్యడానికి ఈ దారుణసంఘటన ఒక సాధనం మాత్రమే అయిందిగాని నేనింతగా నిరాశ చెందడానికి కారణం మీకు తెలియదు మూర్తీ!"

శ్రీకృష్ణమూర్తి ఎంతో సానుభూతితో విజయకుమార్‌వైపు చూశాడు. అయితేనేం, అతని విధి అతన్ని హెచ్చరించింది.

"డాక్టర్... మిమ్మల్ని నేను సరిగ్గా అర్థం చేసుకోలేకుండాఉన్నాను. స్పెషల్ ఎమర్జన్సీ కాల్‌మీద నేను సిగ్నల్‌స్టేషన్ మరొకరి అధీనంలో ఉంచి ఆసుపత్రికొచ్చాను. మీతో ఉన్న పరిచయంవల్ల, మీ మీద నాకున్న గౌరవంవల్ల యీ కొద్ది సమయమైనా మీతో గడపగలిగాను. నేను వెంటనే వెళ్ళాలి. మీరుకూడా వెంటనే ఆసుపత్రికి వెళ్ళండి. అత్యవసరమైన కేసులకు వెంటనే ఎటెండ్ కండి. సరిగ్గా ఏడున్నరకి మా క్వార్టర్సుకి నే వస్తాను. అప్పుడు మీ గురించి పూర్తిగా వింటాను. ఫర్ కంట్రీస్ సేక్, డోన్ట్ వేస్ట్ ఒన్‌మోర్ సెకండ్. లేచి డ్రెసప్ అవండి. మీ విధి మిమ్మల్ని పిలుస్తోంది. ఊ!"

శ్రీకృష్ణమూర్తి వెళ్ళిపోయాడు. ఐదు నిమిషాల్లో రెడీ అయిపోయిన డాక్టరు విజయకుమార్‌ని చూసి లక్ష్మణసింగ్ ఆశ్చర్యపోయాడు.

* * * *

"నన్ను కలుసుకోగానే మీఅంతట మీరు ఎన్నోవిషయాలు చెప్తారనుకున్నాను. ఇలా ఇంతసేపు మౌనముద్ర వహిస్తారనుకోలేదు," అన్నాడు శ్రీకృష్ణమూర్తి ఖాళీ చేసిన టీకప్పు కింద పెడుతూ.

"మీతో చెప్పి నా హృదయభారాన్ని తగ్గించుకుందామని మొదట్లో అనుకున్న

మాట నిజమే. కాని ఎక్కడికి వచ్చినా, ఏ విధంగా చూసినా సార్థకతలేక కేవలం వ్యర్థంగా కనిపించే నా దురదృష్టజీవితం ఒకరితో పంచుకోడం ఏమిన్యాయం, ఏమి ప్రయోజనం అని యిప్పు డనిపిస్తోంది.''

విజయకుమార్ వైపు మూర్తి అయోమయంగా చూశాడు. చూస్తూ అన్నాడు: "ప్రమాదకరమైన మన జీవితాలలో యివా శెక్కడో రే పెక్కడో. యాంత్రికంగా నడిచే మన జీవన విధానాలలో మనసువిప్పి మాట్లాడుకునే అవకాశాలే తక్కువ. ఆ మధ్య ఒకసారి జీ. టీ. కోసం వెయిట్ చేస్తూండగా ఢిల్లీ ప్లాట్‌ఫాంమీద మన వాళ్ళని ఓ నలుగుర్ని కలుసుకున్నాను. ఎంతలా ఎంజాయ్ చేశామనుకున్నారు! ఎవరికి వాళ్ళం యింటిబాధ్యత లేని విడిమనుషులమే మో-యిక మాకు పట్టపగ్గాలు లేక పోయాయి.

"ఆ సందర్భంలో నేను నవ్వుతూ అన్నాను: 'జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలుతుం దంటారు. నలుగురు జోగులు రాసుకుంటే ఏం రాలుతుందా' అని.

"నా నవ్వుకి అందులో ఒకరు అభ్యంతరం చెప్పేరు: 'పవిత్రమైన జాతిభద్రత కాపాడే బ్రహ్మాండమైన బాధ్యత పైన వేసుకున్నాం. మనల్ని మనం హాస్యం చేసుకోడం న్యాయమా,' అని.

" 'ఎలా అన్నా దానికి మరోలా అర్థం చెప్పుకోవచ్చు. బూడిద అంటే విభూతి-జ్ఞాన వైరాగ్యాలకు చిహ్నం. దీక్ష, త్యాగం మేళవించిన మన జీవితాలకు శిరోధార్యం,' నేను ఏదో విధంగా సమాధానం చెప్పినా, పైలట్ వేణుగోపాలస్వామి తృప్తి పడలేదు. నా కెందుకో అతన్ని యింకా కదిలించా లనిపించింది.

" 'మిమ్మల్ని చూస్తూంటే మీ దగ్గిర కొన్ని విషయాలకు వివరణ తెలుసుకోవా లనిపిస్తోంది వేణూ. మీకు అభ్యంతరం లేకపోతే చెబుతారా?'

" 'నాకు తెలిసినంతవరకు తప్పక చెబుతాను. అభ్యంతరం దేనికి?'

" 'ఆశోపహతులూ, విధివంచితులూ-జీవితాలనుండి పారిపోయే ఒక మార్గంగా జీవితాలను అంతం చేసుకునే ఒక విధానంగా యుద్ధం సూచితం అవుతూంటుంది దానిమీద మీ వ్యాఖ్య?'

" 'అసలు మీ అభిప్రాయం ఏమిటో ముందు చెప్పండి?'

" 'మొదట అడిగింది నేను. మొట్టమొదట జవాబు చెప్పవలసింది మీరు."

"మిగిలిన యిద్దరూ మధ్యలో అడ్డుకున్నారు: 'అసలు మాకు ప్రశ్నే బోధపడ లేదు. వివరించి చెప్పండి.'

" 'అది కాదండీ! ప్రమాదభూయిష్టమని తెలుసుండి ప్రజలు యుద్ధంలో చేరడా

నికి కారణం ఏమిటి? ఆర్థికంగా వెనకబడిఉండటమా? ప్రేమవిషయంలో తిరస్కారమా? పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసవలేకపోడమా? ఒంటరిగా రాని కష్టాలను ఒంటరిగా భరించలేక తప్పించుకొని పారిపోవడమా? ఏమిటంటారు?'

"పైలట్ నా వైపు అసహ్యంగా చూస్తూ అన్నాడు 'ఏమీ ఎరగనివాళ్ళు. బొత్తిగా అజ్ఞానంతో వెయ్యవలసిన ప్రశ్నలు సర్వీసులో ఉన్న మీరు వేస్తూంటే వినడానికే నాకు చాలా చిన్నతనంగా ఉంది శ్రీకృష్ణమూర్తీ! మీ దృష్టిలో యుద్ధంలో చేరడం అంటే ఒక విధంగా తైలుకిరావ ఖర్మ పెట్టినంతా ఉంది చూస్తూంటే'

" మీరు పొరబడుతున్నారు వేణూ ఇవి నా ప్రశ్నలని ఎవరు చెప్పేరు? ఈ ప్రశ్నలకు మీ జవాబులు వినాలనుంది అంతే,' అన్నాను నేను "

హఠాత్తుగా డాక్టరు విజయకుమార్ కలుగజేసుకున్నాడు "ఈ ప్రశ్నకి వాళ్ళేం జవాబు చెప్పేరు మూర్తీ?"

"జవాబు చెప్పేలోగా గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్ వచ్చేసింది ఎవరి హడావిడిలో వాళ్ళు విడిపోయాం - ప్రశ్నే మిగిలిపోయింది జవాబు దొరకలేదు '

విజయకుమార్ నిస్పృహగా తనలో అనుకుంటున్నట్టు "అవును. ఈ జీవితం అంతా ఒక పెద్దప్రశ్న జవాబు దొరకదు!' అని మళ్ళీ యీ లోకంలోకి వచ్చి అన్నాడు "నిజమే, 'యుద్ధంలో చేరిన ప్రతి ఒకడూ యింట్లోంచి చెప్పకుండా పారిపోయి వచ్చినవాడే' అనే ప్రజాభిప్రాయం ఒకటి లేకపోలేదు దానిని కాదనడానికి మన మేం ఋజువు చేయగలం!"

"అదేంటి డాక్టర్! ప్రతీదానికీ మన మేం రుజువు చెయ్యగలమా అని ప్రాక్టికల్‌గా లెక్కలు కట్టుకు కూచుంటామా.. ఎవరి అంతరాత్మకి వారు జవాబు చెప్పుకోగల స్థితిలో ఉంటే చాలదా? లేదా మనసిచ్చిన ఒక్క ఆత్మీయుణ్ణి సంతృప్తి పరిస్తే సరిపోదా? నామటుకు నే నీ ప్రశ్నగురించి ఎప్పుడూ ఆలోచిస్తూఉంటాను ఆజవాబే నాకు మానసికబలా న్నిస్తూఉంటుంది నేను ఈదేశంలో పుట్టేను ఈతల్లి ఒడిలో పెరిగేను, ఇక్కడఉన్న వెల్తురు చూసి అక్కడఉన్న వెన్నెల చూసి ఎక్కడా లేనంత వెర్రెత్తిపోయాను ఇంతవాణ్ణయాను అమ్మకు తిరిగి నే నేమిచ్చాను? తల్లి పట్ల తనయుడిజన్మ ధన్యం చేసుకునే కర్తవ్యంఅంటూ లేదా? తరతరాల త్యాగ మూర్తులు చేతికిచ్చిన స్వేచ్ఛాభాగ్యాన్ని పదిలంగా భద్రపరుచుకునే బాధ్యత లేదా?"

"ఆపండి, శ్రీకృష్ణమూర్తిగారూ . . ఇంక ఆప్రశ్నలు అక్కడితో ఆపండి,"

విజయకుమార్ గట్టిగా అరిచాడు మూర్తి ఆతనివైపు ఆశ్చర్యంగా చూశాడు

"నాకూ ఒక కథ ఉంది జవాబు లేకపోయినా ప్రశ్నయినా ఉంది సందడికే

కాదు, సర్వాడికే నోచుకోని నాలో మళ్ళీ సంచలనం ఉందనిపించారు. బండబారిన బతుకులలో లేత మొలకలు లేపుతున్నారు మూగబోయిన మనసుముంపులలో వలపుఅలలను ఊపుతున్నారు ఇంతవరకూ వచ్చాక యీవ్యధ యిట దాగదు ఈ కధ యిక ఆగదు "

డాక్టరు విజయకుమార్ ముఖ్యమైన తన జీవితఘట్టాలను వినిపించ నారంభించాడు సిగ్నలింగ్ ఆఫీసరు శ్రీకృష్ణమూర్తి. అతను చెప్పే ప్రతీఅక్షరం ఎంతో ఆసక్తితో వింటున్నాడు

* * * *

'ప్రజలు యుద్ధంలో ఎందుకు చేరుతారు?' అనే ప్రశ్నలాగే ముందు నే నొక ప్రశ్నవేసి నాకధ ప్రారంభిస్తాను. విద్యార్థులు మెడిసన్ అంటే ఎందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు? జవాబు నేనే చెబుతాను మనుషులంతా, ఇన్ జనరల్, దుర్మార్గులనేంత నిరాశావాదినికాను నేను సరైనతోవని కనీసావసరాలు తీరతాయనే ధీమాఉంటే మనిషి సర్వసాధారణంగా తప్పుతోవ తొక్కడు కాని జీవనవ్యయం పెరిగిన, భౌతికసుఖాలమీద భ్రమ ఎక్కువైన నేటి నాగరిక జీవన వ్యాపారసరళిలో ఈ 'కనీసఅవసరాలు' అనేదాని నిర్వచనం తాటిప్రమాణాన ఎదిగిపోయింది నెలకి నాలుగుఅంకెల జీతమయినా లేనిదే మొగుణ్ణి మొగాడికింద లెక్కకట్టరు చిట్టితల్లులు కన్నం వేసిగాని, కన్నుమూసి కంట్రాక్టు చేసి కమిషన్ కొట్టిగాని, కల్లుదుకాణం పెట్టికాని, కన్యలచే కానివ్యాపారం చేయించిగాని కాసులు గడిద్దామని అందరూ అనుకోరు. మరి? గొర్రెతోకలాంటి గుమస్తా ఉద్యోగం, బతకలేక బడిపంతులుపని, చెట్టుకింద ప్లీడరు డబ్బు తగినంత సంపాదించేది కాకపోయినా చేస్తున్న ఉద్యోగాన్ని గౌరవించడం, ముసిలిమొగుణ్ణి ప్రేమించడంఅంత కష్టం. అందుకనే ఎంబీ అన్నా బియ్యే అన్నా అంతగిరాకీ ప్రజల్నందర్నీ రుణవిముక్తుల్ని చేసేసి అపారమైన లోకసేవ చేసిపారేద్దామని నేను మెడిసిన్ లో చేరలేదని చెప్పడానికే యిదంతా చెప్పవలసివచ్చింది అంతకంతా కట్నం లాగుదామనీ, కట్టుకున్న కట్లపాములాంటి కాంతాస్వరూపం కళ్ళముందు కదలక మాననని కూచున్నా పైచదువుకు ఫారెన్ వెళ్ళడం, మెరుస్తున్న విమానం వీపుమీద స్వారీచేస్తూ మెరుపుల్నీ మబ్బుల్నీ దాటివెళ్ళి, మరోప్రపంచంలో దిగి, మెరుపుతీగల్ని స్పృశించి....కల షాక్‌కొట్టగా కళ్ళు తెరవడం అందరితోపాటు నాకూ అలవాటే.'

'అబ్బాయికి మెడిసిన్‌లో సీటొచ్చిందిటగా!' మా అమ్మ పట్టలేని ఆనందం.


'నే చెప్పలేదటే వాడిది బ్రహ్మాండమైన జాతకమని!' నాన్న పొంగు.

'అన్నయ్యకి రాకపోతే మరెవరి కొస్తుందీ?' చెల్లెలి అంచనా

'వాడి పేరేమిటి వాడి ఊరేమిటి?' అక్కయ్య ఉత్తరం ఆరోజు చూడాలి ఆకళ్ళల్లో ఆశాదీపాలు ఆకాశ హర్మ్యాలు!

మా అమ్మకి ఆమె పుట్టింటివారిచ్చిన నగలు చాలా ఉండేవి ప్రతీరోజూ దేవుడికి పూజ చేసేటప్పుడు పక్క నొక వెండిపళ్ళెం ఉంచి, వాటిలో నగలన్నీ పేర్చి, పసుపూ కుంకుమా పువ్వులూ వేసి కళ్ళ కద్దుకుని ఒకటీ ఒకటీ ఒంటినిండా పెట్టు కొనేది. మానాన్న ఆమధ్య స్నేహితుడికి అప్పిస్తానంటే ఎన్నాళ్ళు అడిగినా ఒక్క గాజుకూడా యివ్వలేదు మా అక్క పెళ్ళికి అయిన అప్పులు తీర్చలేక మానాన్న ఎంత యిబ్బందిపడినా అంత బంగారం ఉండికూడా మాటాడలేదు మెడిసిన్‌లో నాకు సీటు వస్తే వెంకటరమణమూర్తికి నిలువుదోపిడీ యిస్తానని— అలాగే చేసిందంటే నామీద ఎంతాశ పెట్టుకుందో మీకు అర్ధమయే ఉంటుంది ఒక్క నిమిషమేనా మాటాడకుండా ఉండలేని మానాన్న రాత్రి ఎనిమిదీ అయేసరికల్లా తను మాటాడ్డం మాట అటుంచి, ఎవడు నోరెత్తినా తుపాకిని వేస్తానన్నాడంటే నా చదువుగురించి ఎంత శ్రద్ధ వహించేవాడో మీకు బోధపడేఉంటుంది ఎప్పుడూ లేంది మా చెల్లెలు కాసులమ్మ నా గదిలో సామాను ఎప్పటికప్పుడు సర్దిపెట్టేది నా ఫ్లాస్కునిండా చిక్కని కాఫీ పోసిఉంచేది ఇంతెందుకు, ఇంట్లో అందరూ నన్ను ఒక్కొక్కమెట్టు సింహాసనం ఎక్కుతూన్న రాజకుమారుడిలా చూసేవారు అయితే నన్ను ప్రత్యేక వ్యక్తిగా ఏమాత్రమూ గుర్తించడానికి యిష్టపడనివాడుకూడా ఒకడు మాయింట్లో ఉండేవాడు సుమండీ! వాడిపేరు వ్యాసమూర్తి ఆపేరు పలకలేక యింట్లో అందరం 'వాసూ' అని పిలిచేవాళ్ళం

వ్యాసమూర్తి మా అమ్మకి వరసకి చెల్లెలికొడుకుట వాడి ఆస్తి అంటూ ఏవో భూములు ఉన్నాయిగాని నా అనే వారు ఎవరూ లేక మా అమ్మే చిన్నప్పట్నుంచీ వాణ్ణి చేరదీసి మాతోపాటు పెంచింది నాకంటె నాలుగునెలలు చిన్న. పెద్దయాక మారిపోయాడు గాని చిన్నప్పుడు నాకంటే బాగా పీపుగా, దుండులా, బూడిద గుమ్మడి పండులా ఉండేవాడు చిన్నప్పట్నుంచీ వాడిపంతా అదోరకం వీధి గేటు అడ్డంగా గడియ వేసిఉంటే అది తీసుకుని వెళ్ళడం వాడికి బద్ధకంట— గేటు ఇటువైపు ఎక్కి అటువైపు దిగడం వాడికి ఎంతో సుళువుగా ఉంటుంది కాబోలు ముక్కుతో మాటాడ్డం, నోటితో గాలి పీల్చడం వాడికి సరదా పది పన్నెండేళ్ళ దాకా అన్నం గిన్నెలో పెట్టి, వాడికి జామచెట్టుమీదకి అందించవలసిందే చిలకలు జామపళ్ళు కొరకడం చూస్తూ తనూ ఏ అప్పడమో కొరుకుతూ ఉంటే వాడికి




---

బ్రహ్మానందానుభవం అయిపోతుందనుకుంటాను 'మానవుని దంతముయొక్క మూడు ఉపయోగములు వ్రాయుము' అని సైన్సులో యిచ్చిన ప్రశ్నకు వాడు వ్రాసిన జవాబులు ఇవీ

1. తోచనప్పుడు చక్కగా గోళ్ళు కొరుకుకొనుటకు
2. మనకు ఇష్టము లేనివారిని తనివితీర వెక్కిరించుటకు
3. కోపము వచ్చినప్పుడు పటపట కొరుకుటకు

ఇక క్లాసుల్లో మేష్టర్లనీ అమ్మాయిల్నీ ఏడిపించడంలో వాడు రీసెర్చిస్కాలరు. వాడి గురించి యింటికి ఫిర్యాదు రాని రోజంటూ ఉండేది కాదు మా నాన్న మా అమ్మమీద తారాజువ్వలా లేచేది వాటిగురించే.

'వీడి గురించి వీధిలో తలెత్తుకు తిరగలేకుండా ఉన్నాం ఈ తెచ్చిపెట్టుకున్న తద్దినం జన్మాంతం శనిలా ఉందే! ఇదెక్కడ నా కొంపకి తెచ్చిపెట్టేవ్!'

'చాల్లెండి, వాడు వింటే నొచ్చుకుంటాడు తల్లీ తండ్రీ లేనివాడు వాడికి మన బాబుగారి మూటలోంచి ఏం తెచ్చిపెట్టడంలేదు చిన్నప్పుడు పెంకితనం చేసిన వాళ్లే పెద్దప్పుడు ఎంతో బుద్ధిగా తయారవడం ఎరుగుదుం. మన కడుపున పుట్టిన వాడే అల్లరి చేస్తే ఏం చేస్తాం? అడవిలో దిగబెట్టి రాలేంగదా!' నాన్న విసుక్కుంటూ వెళ్ళిపోగానే, అమ్మ పోపులపెట్టి తీసి చూస్తే, అందులో డబ్బుల్లేవు!

'చచ్చి ఎక్కడుందో-అది ఏడుస్తుందని ఊరుకున్నానుగాని, యిదే నా కడుపున పుట్టిన కొడుకైతే యీ పాటికి...'

మా చెల్లెల్ని 'మంకీ' అని పిలిచేవాడు నన్ను 'డాంకీ' అనేవాడు. నాన్న ఎన్ని సార్లు కొట్టినా వా అనదల్చుకొన్నదీ చెయ్యదల్చుకొన్నదీ మానేవాడుకాడు

'ఈ ఏబ్రాసి మొహానికి చదువేమిటి, సంధ్యేమిటి? వీడి పరీక్షకి ఫీజు కట్టేకన్న అచ్చ రూపాయిలకింద మార్పించి పదహారూ పెద్ద చెరువులో పారెయ్యడం మంచిది,' అనే వాడు నాన్న. కాని ఎస్సెస్సెల్సీ రిజల్ట్సు వచ్చిననాడు నా నెంబరుతో పాటు వాడి నెంబరూ పేపర్లో ఉండడం మాకు ఆశ్చర్యం కలిగించింది. అయితే అసలైన ఆశ్చర్యం ముందే ఉందని మా కప్పుడు తెలియలేదు. మా మార్కుల రిజిష్టర్లు వచ్చాయి. నేను బొటాబొటీ మార్కులతో ప్యాసయ్యాను. వాడిటోటల్ నాలు గొందల ఇరవై అయిదు! ఏం మాటాడ్డానికీ నా నోట మాట రాలేదు.

'ఎక్కడో కాపీ కొట్టిఉంటాడు వెధవ,' అన్నాడు మా నాన్న.

'ఎం తల్లరి చేస్తాడో అంత బ్రహ్మాండమైన తెలివితేటలు! ఏం బాబూ వాసూ! మంచిమార్కు లొచ్చాయని నీకు సంతోషంగా లేదట్రా?'

మా అమ్మ మాటకి అదోలా నవ్వేడు వాడు అప్పటి వాడి మొహం యిప్పుడు నా కళ్ళెదుట చూస్తున్నంత స్పష్టంగా నాకు గుర్తుంది అదృష్ట దురదృష్టాలకు అతీతంగా ఉన్నంత ప్రశాంతంగా ఉంది తల దువ్వుకోడు. ఇంత పౌడరు రాసుకోడు శుభ్రమైన బట్టలు వేసుకోడు అయితేనేం దొంగవెధవ బాగుంటాడు!'

## 2

అరోజు రాత్రే అనుకుంటాను వాడి మార్కులవిషయం మళ్ళీ నాన్నగారు కదిపేరు

'స్కూలికి సెకండు వచ్చావ్ కదా! నీకు సరదాగా, గర్వంగా లేదుట్రా వాసూ?'

'నేను అనుకున్నవన్నీ పడ్డాయి ఆ వేళకి నాకు జ్ఞాపకం వచ్చాయి, రాశాను. అలా జరక్కపోతే మంచి మార్కులమాట దేవు డెరుగు, పరీక్ష ఫెయిలయి ఉందును పోనిద్దూ పెదనాన్నా, యివి ఓ పరీక్షలట, యివీ ఓ మార్కులట! ఎవరేనా నవ్వుతారు!'

నాన్న ఫెడేల్మని ఒక్క లెంపకాయ కొట్టేరు

'ఓరి వెధవా...ఇంతున్నావోలేవో ఏం తెలుసునని పెద్దపెద్ద కబుర్లు చెబుతున్నావ్? ఏకంగా పరీక్షవిధానాన్నే విమర్శిస్తున్నావే ... ముందుముందు ఎంత చదువుకోవాలి, ఎన్ని పరీక్షలకు వెళ్ళాలి...'

నాన్న ఊహించినది పొరపాటు. వాడు మళ్ళీ మళ్ళీ ఎక్కువపరీక్షలకు వెళ్ళలేదు. మళ్ళీ మరే పరీక్షా ప్యాసయిన పాపాన పోలేదు! ఇంటర్మీడియట్ రెండోక్లాస్సులో నేనయినా ప్యాసయానుగాని అయిదుసార్లు వెళ్ళినా వాడు అక్కడే ఉండిపోయాడు.

'అయినా చదువొకటే వాడి వ్యాపార మైతేగదా!' అనేవాడు నాన్న. నిజమే. పదిహేడు పద్దెనిమిది సంవత్సరాలు వచ్చినకొద్దీ వాడికి ఊరిధ్యాస ఎక్కువైపోయింది.

'ఏంరా బాబూ వాసూ! నీ కింక బాగుపడేయోగం లేదా ఏమిట్రా? నాలుగు రోజుల్లో పరీక్ష లున్నాయి. రాత్రనగా వెళ్ళిపోయావు, ఇప్పుడా రావడం? నీ కెప్పు డొస్తుందిరా బుద్ధి? నీవల్ల నే నింట్లో నిలబడలేకుండాఉన్నాన్రా బాబూ!' అని ఓనాడు మా అమ్మ గోలపెడితే వాడి జవా బేమిటో తెలుసా?

'న న్నేం చెయ్యమంటావ్ పెద్దమ్మా! సూరమ్మపిన్ని రెండోకూతురికి రాత్రి నొప్పులొచ్చాయి. సమయానికి యింట్లో మొగా ళ్ళెవరూ లేరు. నే నలా వెడుతూంటే నన్నుపిలిచి లేడీడాక్టర్ని తీసుకురమ్మంది. తీరా వెడితే ఆవిడ ఊళ్ళోలేదు. మరొక డాక్టరు ఎక్కడో నాలుగుమైళ్ళ దూరాన ఉంటోంది. అద్దెసైకిలు తీసుకుని ఆవిణ్ణి తీసుకువచ్చేసరికి చాలా రాత్రయిపోయింది. సమయానికి ఆవిడ రాబట్టిగాని సీతక్క ప్రాణం పోయిఉండును. అంత కష్టమైపోయింది. వెంటనే నేనే టాక్సీ తీసుకు రావలసివచ్చింది సీతక్కని టాక్సీమీద పెద్దాసుపత్రికి తీసుకెళ్ళేం.'

'పోనీ హాస్పిటల్లో చేర్పించి వెంటనే వచ్చెయ్యకపోయావా?'

'సీతక్కని ఆపరేషన్ థియేటరులోకి తీసికెళ్ళేరు. ఎంత గోలపెట్టినా సూరమ్మ పిన్నిని లోపలికి రానిచ్చారుకాదు. ఒక్కర్తే బైట బెంచీమీద ఏడుస్తూ కూచుంది. 'నీ ఉపకారం మరిచిపోన్రా వ్యాసం!' చాలా రాత్రయిపోయింది. మీవాళ్ళు దెబ్బ లాడుతారు. ఇక వెళ్ళిపో అమ్మా!' అంది సూరమ్మపిన్ని. పైకి అలా అందిగాని ఆవేళప్పుడు ఆమొహం న న్నెంతగా సహాయం కోరుతోందో నేను మరచిపోలేను పెద్దమ్మా! అంతరాత్రివేళ ఆవి ణ్ణెలా విడిచిరాను, నువ్వే చెప్పు. ఆవిడ కేం లేదా, పోదా? మొగుడేమో క్యాంపుకు వెళ్ళేడు. కొడుకులిద్దరూ శలవలకి మేనత్త గారి ఊరు వెళ్ళేరు. అప్పటిదాకా ఉన్న అల్లుడూ, అతని స్నేహితుడూ అప్పుడే మెయిలుకి వెళ్ళిపోయారు—ఆ కాస్సేపే నేను ఆమెకి ఎవరినయినా అయితే, కేవలం సూరమ్మపిన్నికోసమే నేను ఉండలేదనిపిస్తోంది, ఇప్పు డాలోచిస్తూంటే. స్ట్రెచర్ మీద పడుకుని చావుబతుకులమధ్య కొట్టుకుంటున్న సీతక్క ఆపరేషన్ గదిలోకి వెళ్ళింది. దాని కేమయిందో తెలుసుకోందే నేనుమాత్రం అక్కణ్ణుంచి కదలగలనా పెద్దమ్మా?'

అయిదు నిమిషాలు ఆగి మళ్ళీ వాడే అన్నాడు: 'అయితేనేం, సూరమ్మపిన్ని అదృష్టవంతురాలే సుమీ పెద్దమ్మా...సీతక్కకి ఆపరేషను చేశారు. తల్లీ పిల్లడూ కులాసాగానే ఉన్నార్ట - నేను పిల్లాణ్ణి చూశాను. ఎంతున్నాడనుకున్నావ్? పడవలా ఉన్నాడు దొంగభడవ...ఊచిపుచ్చుకుని ఒక్క లెంపకాయ యిచ్చుకోవా లనిపించిందనుకో ..'

అమ్మ యివేవీ వినడంలేదు వ్యాసమూర్తిని కన్నతల్లి చచ్చినతరవాత నరకానికి వెళ్ళిందో స్వర్గానికివెళ్ళిందో ఇదివరకు ఆమెకి అనుమానంగా ఉండేది అందుకనే 'చచ్చి ఎక్కడుంవో ..' అంటూండేది యిదివరకు. ఈసారిమాత్రం 'ఇలాంటి వాణ్ణి కని నీకడుపు పండిపోయిందే చెల్లీ ... ఈసారి నువ్వెక్కడుంటావో తెలిసిపోయిందే తల్లీ!' అనుకునిఉంటుంటుంది ఆమెకళ్ళల్లో నీళ్ళు నిండేయి

'ఎందుకు పెద్దమ్మా ఏడుస్తున్నావ్ సీతక్కకి కులాసాగానే ఉందని చెప్తుంటే నీకు నమ్మకము లేదాయేం?'

అమ్మ జవాబు చెప్పే స్థితిలోలేదు వెంటనే వాడికి కడుపునిండా అన్నం పెట్టింది. నాలుగురోజుల్నించీ నాకోసం తీసిఉంచి ప్రత్యేకించి దాచిన పట్టెడువెన్నా వాడికి వేసేసింది. చెల్లెలికి యిష్టమనిఉంచిన గిన్నెడుమీగడా వాడికి ఒంపేసింది నాన్నకోసం అట్టిపెట్టిన కమ్మటి పెరుగంతా వాడికే పోసేసింది

అవాళ భోజనాలదగ్గిర మేం ముగ్గురం చాలా అల్లరిపెట్టేశాం. అమ్మ అంత అల్లరీ హాయిగా భరించింది 'వెర్రివెధవ, ఎలాబతుకుతాడో ఏమో!' అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది, గంటయి గుర్రుపెడుతున్న మా వాసుగాణ్ణి తలుచుకుని!

ఆ మర్నాడు కాఫీలు మా అమ్మ వాడితో అంది: 'ఏంరా బాబూ వాసూ! ఊరి సంగతేగాని యింటిసంగతి నీ కేమీ పట్టినట్టులేదే! మీ పెదనాన్నలాంటి మనిషిని పెట్టుకుని మీ అక్కపెళ్ళి ఎలా చేశానో ఆ భగవంతుడి కెరుక. ఇక ఈ కాసులు పెళ్ళికూడా అయిపోతే నాకు నిశ్చింత. ఆయనకి ఎలాగా చీమకుట్టినట్టయినాలేదు. ఎదిగిన చెల్లెలు యింట్లో ఉంటే అన్నీ తెలిసినవాడివీ, అందరికీ సహాయం చేస్తున్నవాడివీ నువ్వే ఊరుకుంటే ఎలా?'

'చాలా పొరపాటు జరిగింది పెద్దమ్మా...ఏమిటో ఇది నేను ఆలోచించనేలేదు తప్పకుండా చూస్తాను. చెల్లమ్మని నాకు బాగా తెలుసు దానికి ఎలాంటి సంబంధం తీసుకురావాలోకూడా నాకు తెలుసు ఏమే మంకీ?' కాసులమ్మ గంయ్యమంది

'వీడిబతుక్కి సంబంధాలు తీసుకురావడం ఒకటా? అమ్మా! నేను మళ్ళీ చెప్పలేదనుకునేవ్ - వీ డెవర్ని తెచ్చినా నేను చిక్కగా పేడనీళ్ళు కలిపిఉంచుతాను!'



'ఏమిటే కాసులూ! మరీ నోటికి ఏదొస్తే అదీ?'

'లేపోతే చూడు, నేను మంకీనట, మంకీ!'

'అంతో యింతో మనమందరం మంకీలమేనే సుందరాంగీ! నాలాంటివాడికి గుణాలలో కోతిపోలిక; నీలాంటిదానికి చక్కని ఆ కనుముక్కు తీరులో వానరం వాలకం.'

కాసులు వాసుని నిజంగా కోతిలా వెక్కిరించింది.

అన్నట్టే రెణ్నెల్లు దాటకుండా మా వ్యాసమూర్తి ఎవడో పెళ్ళికొడుకుని బుక్ చేసి ముందుగదిలో కూచోబెట్టి లోపలి కెళ్ళేడు.

'పెద్దమ్మా పెద్దమ్మా! అల్లు డొచ్చాడు. వెల్లవేస్తున్నదాన్లా నువ్వింకా ఇలాగే ఉన్నావేమిటి? పట్టుచీర కట్టుకుని ఏడువారాల నగలూ బిగించు — అన్నట్టు కాసు లేదీ?'

కాసులు ఆ వేళకి తలుపుకన్నంలోంచి కాబోయే భాగస్వామిని తిలకిస్తోంది.

ఆమె కతడు చూడగానే నచ్చేశాడు తెల్లగా పొడుగ్గా ఉన్నాడు. ముఖ్యంగా షోగ్గా కనిపిస్తున్నాడు. టెర్లిన్‌సూటు వేశాడు. 'చేతికి వాచీ, కళ్ళకి గాగిల్సు. ఇంతకన్న కొరతగిం దేముంది!' అనుకుంది. తెలుగు సినిమాలు తెగచూసే కాసులికి మరు క్షణం తనూ అతనూ బృందావనగార్డెన్సులో డ్యూయెట్సు పాడుతున్నట్టు అని పించింది. ఇంతట్లో వాసొచ్చి చెవికి కీ యిచ్చి, చక్కనికల చెరిపేశాడు

'ఏమే. సి. హెచ్. నాతిలా మొహం నువ్వూ - యిక్క డేం చేస్తున్నట్టూ? వెంటనే వెళ్ళి పగటివేషం ప్రారంభించు '

ఈలోగా అమ్మ వాసుని పెరట్లోకి తీసికెళ్ళింది

'తలచుకున్నప్పుడే తాత పెళ్ళని - ఎప్పుడుపడితే అప్పుడు ఓ వారం వర్జ్యం చూసుకోకుండా పెళ్ళికొడుకుని తీసుకువచ్చెయ్యడమేనట్రా! మీ పెద్దనాన్నకూడా సమయానికి ఊళ్ళో లేరాయె ఇంతకీ అతని తాలూకు పెద్దవా ళ్ళెవరూ రాకుండా ఏకనిరంజన్ అని యిత నొక్కడూ రాడ మేమిటి?'

'ఇత నొక్కడే కదుటమ్మా పెళ్ళి చేసుకునేదీ!'

'గొప్ప గొడవొచ్చిపడిందే నీతో ... పోనీ వాళ్ళ కుల మేమిటో గోత్ర మేమిటో...'

'అదంత ముఖ్యమని నాకు తోచలేదు, కనుక్కోలేదు. అంతే;' ఈసారి అమ్మ బుగ్గలు నొక్కుకుంది అమ్మని చూసి వాడు నెత్తి మొత్తుకున్నాడు.

'బియ్యే పాసయ్యాడు '

'ఇంతా చేసి బియ్యేయేనా, ఛీ ఛీ,' అనుకుంది కాసులు

'నెలకి నూటయాభై తెస్తాడు.'

'అఘోరించినట్టే ఉంది,' అనుకునిఉంటుంది కాసులు.

'కానీ కట్నం పుచ్చుకోని మనిషి.'

'కట్నం పుచ్చుకోని మనిషి, అదేం మనిషి!' అంది అమ్మ - పైగా ఇలా అంది: 'బాబూ మరోలా అనుకోకు. మీ పెదనాన్నగారు వచ్చాక నెమ్మదిమీద కబురంపు దాంలే, మెల్లిగా వచ్చినవాణ్ణి వచ్చినట్టే సాగనంపు.'

'ఛ! ఏం మనుషులు!' అనుకుంటూ వాసు యివతలి కొచ్చేశాడు.

'ఈసారి చిక్కని పేడనీళ్ళతోపాటు, చక్కని సున్నపునీళ్ళుకూడా వేరే ఉంచుతానే అమ్మా!' అంది కాసులు.

'ఎందుకూ?' అన్నట్టు చూసింది అమ్మ.

'మొదటిది పెళ్ళికొడుక్కి, రెండోది తీసుకొచ్చిన పెద్దమనిషికి.'

ఇద్దరూ నవ్వుకున్నారు.

* * * *

పట్టుకోవలసిన పెద్దతలల్ని పట్టుకుని మానాన్న ఎలాగైతేనేం నాకు ఎం. బీ. లో సీటు సంపాదించాడు. నేను ఒక్కొక్క ఏడూ ప్యాసవుతూంటే మా యింట్లోవాళ్ళు నా అడుగులకి ఎలా మడుగులొత్తేవారో మొదట్లోనే చెప్పేను. నాకు జరిగే ఆదరణతోపాటు వాసుకి నిరాదరణకూడా ఎక్కువైపోయిందని వేరే చెప్పనక్కర్లే దనుకుంటాను. ఒకసారైనా యింట్లో ఎవరోఒకరు వాడ్ని ఇస్సల్టు చేస్తేగాని-మాకు రోజు వెళ్ళేదికాదు. వాడు సాధారణంగా జవాబు చెప్పేవాడుకాదు. జవాబు చెప్పాడా యిక దులిపి దుళ్ళకొట్టేసేవాడు. అలాంటి పరిస్థిలో నాన్న వాణ్ణి ఎక్కడ వెళ్ళగొడతారో అని నాగుండె పీచుపీచు మనేది. వాడు చదువు ఏకంగా మానేసి ఊరిమీదపడి వేళా పాళా లేకుండా తిరగడంతో మా అమ్మకూడా అస్త మానూ వాణ్ణి ఏదోఒకటి సాధించడం ప్రారంభించింది. వా డింట్లోంచి వెళ్ళిపోతే వాడికన్న ఎక్కువ నష్టపోయేది మేమే. పంటకాలువ ఒడ్డున పదిహేను ఎకరాల పొలం వాడిపేరఉంది. మేం ఏటా సరిపడే ధాన్యం అక్కణ్ణుంచి తెచ్చుకోడమేకాక మిగిలినవి అమ్ముకుంటున్నాంకూడా. నా చదువుకి ఎక్కళ్ళేని సొమ్మూ చాలడం లేదు. పోతే వీడిఆస్తీ మాకు దక్కదు. అందుకని వాడి అల్లరికూడా చచ్చినట్టు భరించేవాళ్ళం. అదిగాక వాడికి బుద్ధి పుట్టాలేగాని అందర్నీ అలా కూచోబెట్టి ఎంత పనైనా చేసేవాడు.

నేను ఎం. బీ. లో చేరేక మానాన్న తన స్నేహితులదగ్గిర నన్ను ఉదహరించే టప్పుడు 'వాడు' అనడం మానేసి 'అతను' అని గౌరవిస్తున్నారు. మా అమ్మ కూడా మాపెద్దాడు అనడం మానేసి 'మా అబ్బాయి విజయకుమార్' అనడం అలవాటుచేసుకుంది. ఇక మాకాసులు 'డాక్టరన్నయ్యా' అని తప్ప మరోలా నన్ను పిలవదు. ఇక మా వ్యాసమూర్తి మాత్రం అతి కష్టంమీద నన్ను డాంకీ అనడం మానేస్తానని మాట యిచ్చేడు 'ఒరే అనిమాత్రం పిలవకమానను; నీ దిక్కున్నచోట చెప్పుకో,' అన్నాడు.

ఒకసారి మావూళ్ళోనే మా దూరపుబంధువులు ఒకరింట్లో పెళ్ళి జరిగింది. వారేమో ఆడపెళ్ళివారు. ఎక్కువ డబ్బున్నవాళ్ళు కాకపోవడంచేతా, ఉన్న కాస్త ఆస్తీ కట్నంకింద జమకట్టెయ్యడంవల్లా పెళ్ళిపనులకని పనిమనుషుల్ని పురమా యించే స్తోమతలేక యింట్లోఉన్న లెక్కమనుషులే తలోపనీ పైన వేసుకున్నారు.

ఈ రాత్రి పెళ్ళనగా ఈ మధ్యాహ్నందాకా పెళ్ళికూతురుకూడా ఒళ్ళు వంచి పని చేస్తూనేఉంది. పెళ్ళికూతురు చిన్నన్నయ్య నా క్లాసుమేటు. మమ్మల్ని పిలవడానికి ప్రత్యేకించి వచ్చాడు.

'తెల్లారి లేస్తే ఎనాటమీ థీరీపేపరు ఉందిరా, రాలేనేమో!' అన్నాను నేను.

'నన్ను పిలవడానికి రావాలిట్రా క్రేక్‌మాస్టర్‌జనరల్! అయినా నేను రాకపోతే సోముడు పెళ్ళి ఎలా జరుగుతుందట! పద, ఇప్పుడే నేను నీతో వచ్చేస్తున్నాను,' అని వెంటనే మా వ్యాసమూర్తి వాడితో వెళ్ళిపోయాడు.


నిజానికి ఈ పెళ్ళిళ్ళకీ వాటికీ వెళ్ళడం నా కొట్టే యిష్టం ఉండదు. ఏమిటో చెప్పలేని మొహమాటం. అందర్లో అలైట్లలో అన్ని అడచూపులకి తట్టుకోలేక పోడం ఒక బలహీనత అయితే అవుగాక, ఏదో ఓ వంకపెట్టి నా గదిలోనే కూచుని సన్నగా రేడియో పెట్టుకుని వినాలని ఉంటుంది.

'అన్నట్టు యీ పెళ్ళికి గీతావాళ్ళూ వస్తారుకదుటే అమ్మా!'

మా చెల్లి మాటలు విని నేను ఉలిక్కిపడ్డాను. గీతావాళ్ళమ్మ సుందరమ్మగారు మా నాన్నగారికి దూరపుచుట్టం. వాళ్ళనాన్న కేశవరావుగారు అనకాపల్లిలో ఆకాశాని కంటే చెరుకుతోటలు వేయించి, మధుర జలధరాలు సృష్టించి కనకవర్షం కురిపించిన సమర్థుడు. ఎప్పుడో ఆరేడేళ్ళక్రితం వాళ్ళ కొత్తమేడలో గృహప్రవేశానికని పిలిస్తే అమ్మా నేనూ చెల్లీ వెళ్ళేం. కొత్తయిల్లు ఎంత బాగుందని! వాళ్ళు నలుగురే అయినా పదిమందికి సరిపడే విశాల భవనం. పెద్దపెద్ద గదులూ, ప్రతీ గదిలో కొళాయిలూ, మెత్తని సోఫాలూ, స్ప్రింగు మంచాలూ...చక్కగా అలంకరించబడిన ఆ హాల్లో తూగుటుయ్యాల్లో కూచుంటే ఇంకెక్కడికీ వెళ్ళాలనుండదు. పొరపాటు – ఆ యింటిముందున్న పెద్ద పువ్వులతోటా, అందులో ఉన్న దోసెడేసి రంగురంగుల డాలియాపువ్వులూ చూస్తూ అక్కడున్న సిమెంటు బెంచీమీద కూచుంటే ఇంకెక్కడికీ వెళ్ళాలనుండదు. ఇదీ పొరపాటే – ఒప్పుగా ముద్దుగా చక్కగా వాళ్ళమ్మపక్క కూచుని ఉన్న పది పదకొండేళ్ళ గీత ఎదురుగా ఎక్కడ కూచున్నా సరే, ఇంకెక్కడికీ వెళ్ళాలనుండదు. ఆ ఆకారం నా కళ్ళముందునుంచి కదలదు.

'అమ్మా! గీత ఎంతయిందో ఎలా ఉందో చూడలనుందే.'

ఈ ప్రశ్న మా చెల్లి మా అమ్మని అడుగుతున్నదికాదు. నా మనసు నన్ను అడుగుతున్నది. నాకు జవాబు కావాలి. ఇప్పుడా అమ్మాయికి పదిహేడేళ్ళు ఉండొచ్చు. ఎలా ఉందో! ఎలా ఉందో?




అమ్మ నాన్నతో అంటోంది, 'ఏమండోయ్, మీకు చెప్పేనో లేదో — ఆవాళ అనకాపల్లి వెళ్ళిననాడు నేను మీ సుందరాన్ని కదిపిచూశాను, 'ఏవమ్మోయ్ వదినా, మళ్ళీ ఎవరికేనా మాట యిచ్చేరుగనక...మీ గీతకీ మా విజయకీ సరిగ్గా ఈడూ జోడూ కుదురుతుంది. పై సంబంధాలు వెతకమాకండి.' ఆవిడ జవాబు జ్ఞాపక ముందా ?'

'ఏదో చెప్పేవ్, నే నంతగా పట్టించుకోలేదు. ఏవందేం ?'

'అబ్బో ఆవిడగారి కెంత టెక్కు ! గావీణ్ణం పురుషుళ్ళ దిగి కారుతోంది ! 'ఇం తింత పిల్లలు, ఇప్పట్నుంచీ పెళ్ళిమాట లేమిటి వదినా—ఎవరేనా నవ్వగల్రూ' అని కొట్టిపారేసింది. సర్లెండి, పడినగోడలు పడినట్టే ఉండవుకదా ! ఈనాడు నా కొడుకు డాక్టర్ వెలిగిస్తున్నాడు. నా కాళ్ళదగ్గిర కొస్తుందో రాదో నేనూ చూస్తాను. అక్కడికి ప్రపంచంలో వాళ్ళే భాగ్యవంతులు కాబోలు...అయినా నేను పిల్లాణి తీసుకుని పెళ్ళి కెడితే ముందే లోకువై పోయినట్టు ఉంటుందేమో ! ఏమండీ, ఏవంటా రు ?'

మా కాసులు ఊరుకోలేదు. 'అదేం మాటే అమ్మా ! వాళ్ళు ఏ కారుమీదో వచ్చి ముహూర్తం చూసి వెంటనే వెళ్ళిపోతేనో ?'

'బాగుంది. అలా చెయ్యడానికి ఎన్ని వేల గుండె లుండాలేం ?' అంది అమ్మ ధీమాగా, ఆమె ధీమాను ఏమంత కొట్టిపారెయ్యవలసిందిగా నాకు తోచలేదు. పెళ్ళి కెదిగిన పిల్ల యింట్లో ఉందాయె. శుభ్రమైన పెళ్ళికొడుకు, మంచి చదువులో ఉన్నవాడు నిజానికి ఎవరింటికి ఎవరు వెళ్ళాలి చెప్పండి !'

నాన్న అన్నాడు: 'మొగపెళ్ళివారికి ఈ సుందరమ్మగారే బాగా దగ్గిరట. యిలా వచ్చి అలా వెళ్ళిపోతే వాళ్ళు ఒప్పుకోరు; కనీసం నాలుగైదు రోజులు ఉంటారను కుంటాను అయినా మనమటుకు మనం ఎవరింట్లోనో పెళ్ళికి వెళ్ళడం మన పరువు తక్కువ అనుకోడం తెలివితక్కువ.'

'సరే అయితే ... అందరం వెడదాం. విజయకుమార్ని మాత్రం తీసికెళ్ళొద్దు' అంది అమ్మ నా గుండె గతుక్కుమంది – ఏమి నా దౌర్భాగ్యం!

'ఏం అతని కేం లోపముందని యింట్లో తొక్కి పెడతాం! అందరం వెడదాం మరేం మించిపోయింది లేదు. నువ్వూ రడీకావోయ్.' అన్నాడు నాన్న

'అబ్బా. నే న్రాలేను; మీరు వెళ్ళండి. నాకు మొహమాటంగా ఉంటుంది.' అ సిన నా నాలికని వెంటనే అక్కడికి కోసేద్దామా అనిపించింది!

'అయితే సరే ... ముందు మేం స్టడీచేసివస్తాం ... యిల్లు కనిపెట్టుకుఉండు.

చూస్తూండగా అన్నితాళాలూ వేసేసి, వీధిగదితాళాలు నాకిచ్చి అందరూ పెళ్ళికి వెళ్ళిపోయారు అంత ఒంటరితనమూ, అంతటి ఆశాభంగమూ నేను జీవితంలో ఎప్పుడూ ఎరగను అరగంటపైగా నే నెంత బాగా కనపడగలనో అంతగా అలంక రించుకుని ఆ గదికికూడా తాళం వేసేసి పెళ్ళివారింటికి బయలుదేరాను.

అసలే మొహమాటస్థుణ్ణవడంచేతా, అందరితోటి బయలుదేరకపోవడంచేతా ఎదో తప్పుచేసినవాడిలా వెనకగుమ్మంలోంచి లోపల జొరబడవలసివచ్చింది. పెరటివైపునకూడా భోజనాలకోసం కాబోలు పెద్దపందిరి వేయించారు. అది సరిగ్గా ముహూర్తంవేళ అవడంచేత చాలామంది వీధివైపునే ఉన్నట్టున్నారు నేనలా లోపలికి వచ్చి వరండామీంచి నడిచి పెరటివైపుగది కిటికిలోంచి లోపలికి చూశాను. నా అదృష్టం ఏంచెప్పను! పెళ్ళివారింట్లో నాకు మొట్టమొదట కనిపించింది గీత!

మనిషికీ మనిషికీ మన స్తత్వంలో తేడా ఉంటుంది దీన్నిబట్టే మనోదృక్పథమూ, పరిశీలనాజ్ఞానమూ ఉంటాయి. కాని నేర్చుకునే విద్యరీత్యా స్టూడెంట్సుకి భౌతికమైన పరిశీలనవిషయంలో మిగిలిన విద్యార్థుల కున్న సుతారపుపొరలూ, సున్నితమైన తెరలూ ఉండవు ఇవేకాక ఎంత మొహమాటస్థుడికయినా సాటి లేడీస్టూడెంట్సుతో, ఆసుపత్రులలోని నర్సులతో, డాక్టరమ్మలతో, పగలూ రాత్రీ అనకుండా కలసి పని చెయ్యడంవల్ల పరిచయాలకూ పరిశీలనలకూ అవకాశం ఎక్కువ మా ఇంట్లో నేను చూసే మా అమ్మావాళ్ళూ అదోలోకం. సహవిద్యరీత్యా నేను కలుసుకునే సోదరీ మణులతీరు అదోలోకం. కాని వీటన్నిటినీమించిందీ, వందపువ్వుల్లో ఉన్నా ముందు నాదృష్టిని ఆకర్షించేదీ గీతమాత్రమే! పదిహేడేళ్ళ గీతకు నే నెంత చక్కని



రూపకల్పన యివ్వగలనో అంత అందంగానూ తయారయింది గీత. శరీరంతో పాటు ఆమె వేషధారణలోని నాజూకుతనం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఆ పందిరీ, ఆ మంత్రాలూ, ఆ సన్నాయివాయిద్యమూ నా మనసుని ఆ క్షణాన్న పెళ్ళికొడుకును చేసి కూచొపెట్టింది

ఎవరో గదిలోకి పెద్దగా జోళ్ళచప్పుడు చేసుకుంటూ వచ్చారు. దాన్తో నేను ఈ లోకంలోకి వచ్చాను. గీత కొంచెం పక్కగా తిరిగిఉంది – ఎవరినో విసనకర్రతో విసురుతోంది. ఆ దెవరికా అని కళ్లెత్తిచూశాను. అక్కడ ఉన్నది మా వ్యాస మూర్తి।

## 3

గదిలో యింకా ఒకరిద్దరు ముసలమ్మలుకూడా ఉన్నారు. గదిలోకి చప్పుడు చేసుకుంటూ వచ్చింది డాక్టరు. ఆయన్ని తీసుకొచ్చింది గీతనాన్న కేశవరావుగారు।

'వీళ్ళింటికి కబురుచేశాం గీతా! ఎవరూ లేరట; యిల్లు తాళం వేసిఉందిట యిదిగో డాక్టరుగార్ని తీసుకొచ్చాను.'

డాక్టరు మా వాసుని పరీక్షచేసి 'ఇతనితలకి యీ మంచుముక్కని పెట్టి కాస్తున్న దెవరూ?' అన్నారు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి.

'నేనేనండీ, ఏమీ?' అంది గీత.

'ఇలా చెయ్యాలని నీ కెవరు చెప్పారమ్మా?' అన్నాడు మళ్ళీ...

"చెప్పడాని కేముందండీ...మంచి ఎండవేళ...ఎండ నిప్పులు చెరుగుతోంది. వద్దు వద్దంటూంటే ఈయ నలా బిందెలకొద్దీ నూతిలోనీళ్ళు తోడిపోసేస్తున్నారు. ఒక్కసారి ఉన్నట్టుండి పడిపోయారు, మొహం తిరిగినట్టు. గదిలోకి తీసుకొచ్చి పడుకోబెట్టేరు. అదృష్టవశాత్తూ నే నక్కడ ఉన్నాను. అప్పటికప్పుడు ఆయనకి ఒళ్ళు కాలిపోయేంత జ్వరం వచ్చేసింది. వడదెబ్బ తగిలితే మంచు పెడతారని ఎవరో అంటూంటే విన్నాను. కాని రాత్రికి పెళ్ళి...ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. తమ్ముణ్ణి పంపించి అయిసు తెప్పించాను. ఏం, ఇప్పు డెలా ఉందంటారు?' అంది గీత.

'తెలిసిచేస్తేనేం తెలియకచేస్తేనేం–సమయానికి తగిన ప్రథమచికిత్స చేసి అతన్ని రక్షించావమ్మా..ఇలాంటి వడదెబ్బకి అప్పటికప్పుడు ప్రాణం పోయినవాళ్లున్నారు;' డాక్టరుగారు వాసుకి ఏదో యింజక్షను యిచ్చారు. ఏవో రెండుపొట్లాలుకూడా ఇచ్చినట్టున్నారు.

'టెంపరేచరు తగ్గిపోతుంది. మరేం గాభరాపడకండి. బాగా అలసిపోయిన ట్టున్నాడు. విశ్రాంతి తీసుకోనియ్యండి. ఎవరూ డిస్టర్బ్ చెయ్యొద్దు. జ్వరం ఒకవేళ ఎక్కువగానిఅయితే మళ్ళీ ఐసుపెట్టండి;' మరోమారు గీతను ప్రశ్నించి డాక్టరు గారు వెళ్ళిపోయారు. ఇక ఆగలేక నేను లోపలికి వెళ్ళి కేశవరావుగార్ని విష్ చేశాను.

'నువ్వటోయ్ విజయా ... ఎవరో అనుకున్నాను. మాయింటికి వచ్చినపుడు పొట్టిగా పీలగా ఉండేవాడివి. ఎంతలో ఎంత ఎదిగేవ్! మెడిసన్ ఫోర్తియరుటగా యిప్పుడూ? బాగుందోయ్...వెరీగ్లాడ్ టు మీట్ యూ...అమ్మా గీతా! మన నారాయణగారిఅబ్బాయి విజయకుమారే!'

'నమస్కారం,' అంది గీత లేచి, రెండుచేతులూ జోడించి.

'నమస్కారం.' అన్నాను నేను ఆమెను నఖశిఖపర్యంతం పరికిస్తూ.

'ఎవనికైనా ఏదైనా సహాయం చేస్తూంటే యిక మా వాసుకి ఒళ్ళూ పయీ తెలీదు...సమయానికి మీరు ఆదుకోబట్టిగాని ..' అన్నాను ఏదో ఒకటి అనాలని

ఆమె మాటడలేదు. మళ్ళీ అన్నాను. 'ఇంతకి మా వ్యాసమూర్తికి ఏమయిందండీ ?'

ఈ ప్రశ్నకి అక్కడ పడుకున్న ఒక అవ్వగారు లేచికూచుంది. "ఎవరుబాబూ ఆ అడుగుతున్నదీ- వాసు అన్నయ్యా ? మనిషిటయ్యా బాబూ మీ తమ్ముడు- మణి పూసగాని ? ఒళ్ళొంచి చాకిరీ చేసే మా పూర్వోత్తరంవాళ్ళంకూడా అతనిముందు పనికిరాకపోయాం కదుటయ్యా ! మూడురోజులకింద కాబోలు వచ్చాడు. ఒక్క నిముషమైనా నడుం వాలిస్తేనా- గాడిపొయ్యి తవ్వడం దగ్గర్నుంచీ పందిరిలైట్లు బిగించేవరకు, వడ్డనమొదలు రాత్రి పక్కలు వేసేవరకు, ఎక్కడ చూసినా ఇతనే కదటయ్యా ! ఎవరి కేం కావలసినా అడగవలసింది ఇతన్నే కదటయ్యా ! అసలు యితనే లేకపోతే సోముడు పెళ్ళి ఇంత ఘనంగా జరిగిఉండునా అని...!"

ఇంకా అవ్వగారు ఏమిటేమిటో అంటూనే ఉంది; బిలబిలమంటూ ఆ గదిలోకి ఓ అయిదారుగురు ఆడవాళ్ళు చక్కావచ్చారు. నేను పక్కకి తప్పుకున్నాను; అవ్వ ముడుచుకు పడుకుంది.

'ఏడీ, ఎక్కడా మా వాసుబాబూ ? వీడితో ఇదేచిక్కు...ఇలాగే పీకలమీదికి తెచ్చుకుంటూ ఉంటాడు,' అంటూ అమ్మ వాడిదగ్గిర కొచ్చి ఒంటిమీద చెయ్యివేసి చూసింది.

'అయ్యో! ఎలా కాలిపోతోందో...ఇంత హడావిడిలో వీడి కిక్క దేం జరుగుతుంది ? ఏమండీ, ఎక్కడా...వెంటనే రిక్షా పిలిపించండి...వెళ్ళిపోదాం.'

'నిజంగా వాసు మా కెంతచాకిరీ చేశాడనుకున్నావ్ సుభద్రమ్మపిన్నీ...వాడి రుణం తీర్చుకోలేం అనుకో...తీరా పాపం పుస్తిముడుపు వేళకి ఒళ్ళెరక్కుండా పడిపోయాడు ... వాడి కిలా వచ్చినప్పుడే ఎవరం ఏమీ చెయ్యలేకపోయాం ... మమ్మల్ని మన్నించు పిన్నీ !'

'అయ్యో ఎంతమాట ... మీ రేం చేస్తారు రాధమ్మా ! .. వాడికి యిలాంటివి మామూలే...ఇవా ళ్ళొస్తుంది...రేపు పోతుంది...ఎవరూ అక్కడ కూచున్నది ? నువ్వు గీతవి కదుటే అమ్మాయీ ?'

'నమస్కారం అత్తా.'

'పోన్లే...యిప్పటికేనా మేం నీ కంటికి కనిపించడం సంతోషించతగ్గవిషయమేనే కోడలా ... పెళ్ళిపందిట్లోకి రాకుండా ఒక్కర్తివీ ను వ్విక్కడ ఏం చేస్తున్నట్టూ.'


'దాన్దంతా అదో చిత్రమైనపద్ధతి వదినా,' అంటూ గీత తల్లి సుందరమ్మగారు వెనకనించి జవాబు చెప్పింది. అవ్వగారు మళ్ళా లేచికూచుని విజృంభించింది.

'ఏమిటర్రా? ఏమిటి? మీ కిందులో ఏమిచిత్రం కనిపించిందో నాకు చెప్పండి చూస్తాను. పెద్దకాలపు ముండని న నోర్మొముక్క ఎవరైనా అన్నా, కాటికి కాళ్లు జాపుకున్న నా కేం పూసురాదు. అందుకని మనసులో ఉన్నది అనేస్తున్నాను. ఆ పిల్లాడు ఈ పెళ్ళివారు — రెండుతరపులవారికీ ఏమంత దగ్గిరబంధువుకాదు. అయినా చచ్చీచాకరి చేశాడు ఒళ్ళు తెలియకుండా పడిపోయాడు. మీ రందరూ ఏం చేశారు? ఎవరో ముఖ్యమైనవారు వెళ్ళి ఆ పెళ్ళితంతులో పాల్గొనవచ్చు; ఎవరూ కాదన్రు. కాని కేవలం చూడ్డాని కొచ్చిన యింతమంది ఆడా మొగా ఉన్నారు. ఒకక్కళ్ళు వచ్చి 'అయ్యో పాపం ఎలా ఉం' దనైనా కనుక్కున్న పాపాన పోయారూ? ఎక్కడో ముక్కూ మొఖం ఎరగని యీ అమ్మాయికి కావలసి వచ్చింది. నే నీ గదిలో ఉండి చూస్తున్నాను— ఆ పిల్ల మనసు ఎలా కొట్టుకు పోయిందో...తలమీద తడిగుడ్డలు వేసింది. విసురుతూ కూచుంది. మంచు ముక్కలు తెప్పించి పెట్టింది. డాక్టర్ని పిలిపించింది. మా కాలంలో ఆమాత్రం యీమాత్రం తెలిసినవాళ్ళకి ఎవరి కేమొచ్చినా యిలాగే చేతనైన సహాయం చేసేవాళ్ళం. ఈ పిదపకాలంలోకూడా యిలాంటి మంచి మనసున్నవా ళ్లున్నారంటే ఎంతో సరదావేసింది. అలాంటిది యిది మీకు చిత్రమనిపించిందా? మతిలేకపోతే సరి!'

అవ్వగారు మళ్ళీ ముడుచుకు పడుకుంది. అమ్మ కృతజ్ఞతాపూర్వకంగా గీత వైపు చూసి ఏదో అనబోయింది. ఇంతలో మా కాసులు:

'ఎప్పు దొచ్చాడో! యిదిగో, డాక్టరన్నయ్యకూడా యిక్కడే ఉన్నాడే అమ్మ!' అంది. అప్పటివరకూ ఎవరూ గుర్తించలేదని పక్కనున్న బీరువా చాటున నిల బడి సిగ్గుతో దహించుకుపోతున్న నేను మనసులో చెల్లికి ధన్యవాదాలు చెప్పు కున్నాను. కాని అందరూ నా వైపు చూసేసరికి అదోలా అనిపించి మెడ పక్కకి వాల్చేశాను.

'అబ్బాయిని యింట్లో ఉంచివచ్చానని చెప్పేవ్ కాదుటమ్మా వదినా! మొత్తానికి చమత్కారివే,' అని సుందరమ్మత్త నా వైపు తిరిగి నన్ను ఎగాదిగా నవ్వుతూ చూసి, 'ఎక్కడైనా సంబంధంగాని జతపడిందా ఏమిటయ్యా! అలా ఊఁ పెళ్ళి కొడుకులా సిగ్గుపడిపోతున్నావూ?' అంది. అందరూ నవ్వేరు.




'నీకు తెలీని సంబంధం మే మెలా స్థిరపరుచుకుంటాం వదినా?' అంది గుంభనగా అమ్మ. సుందరమ్మత్త జవాబు చెప్పేలోగానే రిక్షాలు వచ్చేశాయి.

'వెళ్ళేముందు సుందరమ్మవదిన్ని మా యింట్లో ఓ రోజు ఉంచి మరీ పంపాలి సుమా రాధమ్మా! ఇక్కణ్నుంచి యిలాగే దాటించేశేవ్ గనక,' అంది అమ్మ. అందరం వీధిలోకి వచ్చేశాం. వాసుని నేనూ నాన్నా పట్టుకుని నెమ్మదిగా నడిపించుకుని రిక్షా ఎక్కించాం. వాడి పక్కరిక్షాలో నేనూ కూచున్నాను. వాడు నా భుజం మీద తలవాల్చి కూచున్నాడు. ముందురిక్షాలు కదిలాయి, మూడోరిక్షా మాది. ఇలా మా రిక్షా ఆ వీధి దాటిందో లేదో 'ఏయ్ రిక్షా ఆపు' అని ఎవరో కేకేశారు. నేను రిక్షా ఆపించి వెనక్కి చూశాను. ఆ వీధిలైట్లో స్పష్టంగా కనిపిస్తోంది – గీత తమ్ముడు బాబ్జీ. చేతిలో ఏదో తెల్లగా మడిచిఉన్నది పట్టుకుని పరిగెత్తుకువస్తున్నాడు.

నా రక్తం ఒక్కక్షణం నాట్యం చేసింది. నా గుండె మృదంగం వాయించింది. నా మనసు పరవశించిపోయింది. గీత నా కేదో కబురు పంపిస్తోంది. అంత తొందరగా ఏం రాసి పంపగలదనే అనుమానం అనవసరం. "రేపు సాయంకాలం ఐదు గంటలకి పార్కుదగ్గిర నన్ను కలుసుకోండి," కావచ్చు. ప్రేమలేఖలో రోగి ముఖ్యం కాదు, రమ్యత ముఖ్యం. బాబ్జీ రిక్షాను చేరుకున్నా ఒకపట్టాన ఆయాసం తగ్గి వాడి నోట మాట రాలేదు.

'మీరేనా విజయకుమార్‌గారు? మా అక్క ఇది మీకు యిమ్మంది;' ఎంత

సూటిగా, ఎంతసుఖవుగా పంపింది! ఇక ఆ ప్రేమలేఖలో ఎన్ని కేజీల పంచదార ఉంటుందో!

'ఇదిగో యీ పొట్లంలో రెండుమాత్ర లున్నాయి. ఒకటి వెళ్ళగానే వాసుగారి చేత మింగించమంది. రెండోది ఓ రాత్రివేళట. మరిచిపోవద్దని మరీ మరీ చెప్ప మంది.'

నామీద తల వాల్చుకుని పడుకున్న వాసుగాణ్ణి అలాగే రిక్షాలోంచి కిందికి తోసెయ్యా లనిపించింది.

ఓ తల్లిలేదు, తండ్రిలేడు, మనస్సా కనుక్కునే దిక్కులేదు; అయితే నేం దొంగవెధవ అదృష్టవంతుడు!

* * * *

ఆవాళ థీరీపేపరు పూర్తిగా పాడుచేశాను. బుర్ర వేడెక్కిపోయింది. ఎంతో అలసటతో తిరిగొచ్చాను.

'ఇంతసేపు చేశావేంరా? నీ కోసం గీత వచ్చింది. పాపం చాలా సేపయింది.'

'బహుశా నాకోసం అయిఉండదులే,' అన్నాను గట్టిగా.


'నా మొహం, నీ కోసంకాక మరెవరికోసం? అది వింటే నొచ్చుకుంటుంది ఊరుకో,' అంది అమ్మ.

గీతతమ్ముడు బాబ్జీ అన్నాడు: 'నిజమే, మేం కేవలం విజయకుమార్ బావ కోసమే రాలేదు!'

నాకు ఒళ్లు మండిపోయింది. ఆ కోపమంతా మా అక్కయ్యమీద చూపించాను. 'ఆ అమ్మాయి నన్ను అవమానపరచడంకోసమే ఈ ఊరు వచ్చినట్టుంది. మధ్యని నువ్వుకూడా దూరుతావెందుకు సిగ్గులేక? ఆ వాసుగాడికోసం వచ్చిఉంటుంది. వాడికి నిన్నటికే పూర్తిగా తగ్గిపోయిందనీ యీ మధ్యాహ్నమే కడుపునిండా కొట్టేసి వాడు వీధిని పడ్డాడనీ ఆమెకు తెలియదుకాబోలు.'

'మేం వ్యాసమూర్తిగారికోసమైె రాలేదు; ఊరు విడిచి వెళ్ళిపోతున్నాంగదా! ఒకమారు చెప్పిరమ్మని నాన్న పంపిస్తే యిలా వచ్చాం,' అంది గీత అతి నెమ్మదిగా.

నేను చరచర మేడమెట్లు ఎక్కబోతున్నవాణ్ణి సడెన్ బ్రేకు వేసినట్టు ఆగిపోయాను. అయినా నా కేమిటో అంతా అయోమయం అనిపించింది. ఇక అక్కడ ఉండలేకపోయాను. మేడమీదకు వెళ్ళిపోయాను. నేను కిందకి దిగి వెళ్ళిపోతూంటే మా అమ్మ గీతకి బొట్టుపెట్టి తమలపాకులూ బత్తాయిపండూ యిస్తోంది.



వాళ్ళు వెళ్ళిపోతున్నారంటే నా మన సెందుకో వెలవెలబోయింది. అక్కడ పెళ్ళి వారింట్లో అంత సరిగ్గా చూడలేదు. ఇక్కడ మా యింట్లో ధైర్యంగా స్థిమితంగా ఆమెను చూశాను; చాలా చక్కని ముఖం. అందులో ఏం సందేహం లేదు. కాని ఎక్కడో ఏదో చెప్పలేని వెలితి. ఒకింత జాలితో కూడిన ప్రేమ మరింతగా నాలో పొంగిపొర్లింది.

'వీధిదాకా వెళ్ళి గీతను దిగబెట్టిరా బాబూ!' అంది అమ్మ. ఆ అవకాశం యిచ్చినందుకు అమ్మకు లోలోపల నమస్కరిస్తూ గేటుదాకా వాళ్ళను సాగనంపేను.

గీత తమ్ముణ్ణి తీసుకుని గబగబా నడిచింది. బాటకి అటూ ఇటూ తల

లూగిస్తున్న తెల్లచామంతిపూలు చూడలేదు. నెత్తిమీద కెక్కి కూచున్న చంద మామను పరికించలేదు. అట్నించి యిటు వీచే చక్కని పిల్లగాలులతో ఆడుకో లేదు. పూర్వకాలపుదానిలా ఒళ్ళంతా కప్పుకుంది. వయసు మళ్ళినదానిలా తల వంచుకు నడిచింది. ఒక్కసారైనా నావైపు చూడలేదు. కాని వీటన్నిటికి సరిపడే ఒకేఒకమాట వెళ్ళేముందు నమస్కారం చేస్తూ అంది: 'మీరు అదృష్టవంతులు!' అంతే. గబగబా నడిచి కనుమరుగైపోయింది.

అది చాలదా? నేను మెచ్చుకునే వ్యక్తినుంచి నన్ను మెచ్చుకునేవాక్యం ఒకటే ఒకటి, వేలకివేలు చెయ్యదా? మెడిసిన్ చదువుతున్నాను. ఆరోగ్యమూ అందమూ ఉన్న పాతికేళ్ళలోపు పడుచువాణ్ణి. నన్నెవరు మెచ్చుకోరు? కాని గీత మెచ్చు కోడందారి వేరు. ఆ అమ్మాయికి నా హృదయంలో ఉన్నస్థానం వేరు. అవును, నేను అదృష్టవంతుణ్ణి! కాని నేనొక్కణ్ణీ ఎలా అదృష్టవంతుణ్ణి అవుతాను గీతా? నువ్వూ నేనూ ఒకటి అయాక కదా మనం అదృష్టవంతులం! ఏమయినా గీత గురించి పూర్తిగా తెల్సుకోవాలనీ, అన్ని విషయాలూ పూర్తిగా చర్చించాలనీ ఆరాత్రి పడుకోబోయేముందు ఎన్నెన్నో అనుకున్నాను.

'మన భోగభాగ్యాలు వాళ్ళ అంచనాకి ఏమాత్రం అందుబాటులో లేనట్టున్నాయి. లేకపోతే తల్లీ తండ్రీ ఒకమారయినా మనింటికి రాక 'వెళ్ళిపోతున్నామని చెప్పిరండి' అంటూ పిల్లల్ని పంపడ మేమిటి! ఏవిధంగా చూసినా వాళ్ళ పద్ధతి సవ్యంగానూ సంతుష్టిగానూ లేదు. ఇక ఆ సంబంధంమాట ఎంత త్వరగా మరిచిపోతే అంత మంచిది,' అని మానాన్న అంటూంటే నాగుండెలు దడదడ కొట్టుకున్నాయి. మా అమ్మ గాని మాయింట్లో మరెవరుగాని నాన్నమాట కాదనకపోవడం నాకు మరీ నిరాశ కలిగించింది. ఆమర్నాడు తెల్లారకుండా పెళ్ళివారింటికి వెళ్ళిపడ్డాను. గతరాత్రి పాసెంజర్లోనే వాళ్ళావూరినుంచి వెళ్ళిపోయారని తెలిసింది! మేము వాళ్ళంత గొప్పవాళ్ళం కాము. మాకు ఒక ఎకరం పొలముందా, ఒక సొంతకొంప అంటూ ఉందా? స్పష్టంగా తెలుస్తూనేఉంది వాళ్ళకి మావాళ్ళు నచ్చలేదని. పీడాపోయింది. నచ్చితే ఎవడిక్కాలి, నచ్చకపోతే ఎవడిక్కావాలి? అసలది ప్రశ్నేకాదు. వాళ్ళమ్మా యికి వీళ్ళబ్బాయి నచ్చేడా, లేదా? చెప్పలేము; వీళ్ళబ్బాయికి వాళ్ళమ్మాయి నచ్చిందా, లేదా? ఎంతగానో... చెప్పలేము!"

శ్రీకృష్ణమూర్తి విజయకుమార్ భుజం తడుతూ అన్నాడు. "నచ్చనియ్యండి, మాననియ్యండి డాక్టర్‌గారూ! మీ నెరేషనుమాత్రం చాలా డ్రామెటిక్‌గా ఉందండీ. కంగ్రాచ్యులేషన్సు. మీరు మంచి రచయితలన్నమాట."

"ఉద్రేకపూరితమైన సంఘటనలు ఉత్సాహభరింగా చెప్పగలిగే నాటకంగాని జీవితం, కవిగాని జీవీ ఉంటాయంటారా మూర్తిగారూ! మన మనసులో మాట ఆత్మీయులతో చెప్పకోడం ఎదుటివారికోసమే కాదు; ఆమాటకొస్తే ముఖ్యంగా మనకోసమే; చెప్పకుండా ఎలా ఉండగలము!''

ఇద్దరూ మళ్ళీ టీ తాగేరు.

''చెప్పండి డాక్టర్ మీ ప్రేమగాథ ఎలా విఫలమయిందో," అన్న శ్రీకృష్ణ మూర్తిని చూసి విజయకుమార్ నవ్వేడు.

''ఇది మామూలు ప్రేమగాథాకాదు. ఇది విఫలమయిందని నేను అనుకోలేను కూడా."

"మరి?"

"చెబుతా వినండి." విజయకుమార్ మంచినీళ్ళు తాగి మళ్ళీ ప్రారంభించాడు.

* * * *

గీత ఎడ్రసు నాకు తెలుసు. ఒక ఉత్తరం రాస్తే వచ్చిన తప్పేమిటి? అని చాలా సార్లు అనుకున్నాను. అనుకున్నదానిని ఆచరణలో పెట్టలేని సహజమైన నా పిరికి తనం నన్ను నిరుత్సాహపరచడంవల్ల నేనేమీ రాయలేకపోయాను. అలాగని గీత గురించి ఒక్క క్షణమైనా ఆలోచించకుండా ఉండనూలేకపోయాను; ఇంట్లో నా పెళ్ళి గురించి ప్రయత్నాలేమైనా జరుగుతే ఎలాగో ఓలా సాహసించి బయటపెట్టిఉందును. కాని నాకంటె ముందుగా మా అమ్మనీ నాన్ననీ పీడిస్తున్నసమస్య కాసులమ్మ పెళ్ళి ఎంతముందు చేసేద్దామా అని. నా తెలివితేటలన్నీ ఉపయోగించి ఓసారి మా అమ్మతో అన్నాను: 'అమ్మా, పోనీ మనవాళ్ళేగదా, అటువైపు మనచెల్లికి తగినవరు డెవడైనా ఉన్నారేమో చూడుమని సుందరమ్మత్తకీ వాళ్ళకీ అనకాపల్లికి ఓ ఉత్తరం రాస్తేనో?'

మా అమ్మ ఊరుకోక ఆమాట నాన్నతో ఉదహరించింది. అయితే ఒక్క ఉపకారం చేసింది; నన్ను బయటపెట్టలేదు.

'నీ కేం మతిగానిపోయిందా ఏమిటి? అసలే మన మేదో అణుక్కుతింటున్నట్టు వాళ్ళకి హాస్యాస్పదంగాఉంది. ఊరికి వచ్చి మనగడప తొక్కడమే వాళ్ళకి చిన్న తనంగా తోచింది. అటువంటిది వాళ్ళనా సలహా చెయ్యడం? మన కాసులికి పెద్ద సంబంధం ఒకటితెచ్చి చేస్తే వాళ్ళతెగులు సగం కుదురుతుందిగాని...' ఇలా మొదలుపెట్టి నేను అనుకున్నది మొగ్గలోనే తుంచేశారు.

'మీరు అదృష్టవంతులు!' ఈమాటే అస్తమానూ నాకు జ్ఞాపకానికి వచ్చేది.

తాము చాలా భాగ్యవంతులమనీ మేము బాగా తక్కువస్థితిలో ఉన్నామనీ నన్ను కించపరచడానికి అన్నమువ్కా అది? ఎంతమాత్రంకాదు. సరళమైన ఆ స్వరంలోని నిజాయితీని నేను శంకించలేను. మరి ? ఆమెకన్న ఏవిధంగా నేను అదృష్టవంతుణ్ణి? తల బద్దలుకొట్టుకున్నా నాకు అవగాహన అవలేదు.

చదువువిషయంలో తీరికలేదని నన్ను నేను భ్రమపెట్టుకున్నా. నా మనసు ప్రతి క్షణం గీతచుట్టూ పరిభ్రమిస్తూనేఉంది. నా గీత ఎలాఉందో అని అస్తమానూ అనుకుంటూ ఉండేవాణ్ణి. ఆ ఏడాది థీరీపరీక్షలూ, ప్రాక్టికల్సూ అయిాఅవగానే, యిక ఉత్తరా లెందుకు ? ఏదో వంకపెట్టి అనకాపల్లి వెళ్ళి ఆ అమ్మాయిని కలుసుకు రావాలి అనిపించింది. కాని ఇంటిదగ్గిర ఏమనిచెప్పి ఎలా బయలుదేరడమో ఒక పట్టాన నేను తేల్చుకోలేకపోయాను. ఈలోగా మా ఇంట్లో మే మెవ్వరమూ ఎప్పుడూ అనుకోని సంఘటన ఒకటి జరిగింది. అది మరెవ్వరిగురించీకాదు. మా వ్యాసమూర్తి గురించి !

## 4

మా వ్యాసమూర్తి మా నాన్నగారిని ఒకసారి అడిగాడు. ఓ వంద రూపాయలుంటే ఇమ్మని. నాన్న లేదనేశారు. ధాన్యం అమ్మితెచ్చిన డబ్బు ఆరువందలు నాన్న బీరువాలో పెడుతూంటే వాడు చూశాడట. 'అది నా డబ్బు. అందులోంచి యివ్వండి' అన్నాడు. వా డెప్పుడూ అలా అడిగింది లేదు. అలా అడగడం మే మెవ్వరం సహించలేకపోయాం. అమ్మ ఎంత వాదిస్తున్నా వినకుండా నాన్న వాణ్ణి నోటికొచ్చినట్టు తిట్టిపోశాడు.

'ఎవడికొక్కవాలి నీ టోడిసొమ్ము ?' అంటూ నోట్లకట్టలు తెచ్చి వాడిమీదకు విసిరేశారు. వాడు ఏమీ అనలేదు. ఒక వంద లెక్కపెట్టి తీసుకుని మిగిలినవి అమ్మ కిచ్చి గబగబ వెళ్ళిపోయాడు. వాడిని వెళ్ళనిచ్చి మా నాన్న మరింతగా చిందులు తొక్కేరు.

'మంచి వయసులో ఉన్నాడు, దున్నపోతులా ఎదిగాడు, ఓ చదువా సత్కాలక్షేపమా ? ఈ పాటికి సప్తవ్యసనాలూ సంక్రమించిఉంటాయి. లేకపోతే ఒక రోజులో వీడికి వందరూపాయిలు ఖర్చేమిటంట ! ఇవాళ వంద తీసికెళ్ళేడు, రేపు వెయ్యి అడుగుతాడు. ఇదేం సానికొంపనుకున్నాడా, సంసారికొంపనుకున్నాడా ? వీడి డబ్బు తిన్నామని నిందా మనకొద్దు, వీడి చాకిరీ మనకొద్దు; ఏదో ఒకనాడు 'నా ఆస్తి ఏం చేశావో అణాపైసలతో లెక్కచెప్పు' అని అడిగే రకమే ఇది. ఈ రోజు మొదలు ఇంట్లో నేనైనా ఉండాలి, వాడైనా ఉండాలి.'




అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుని ఆ రాత్రి వాసుని అడిగింది: 'ఏమిట్రా బాబూ ఇదీ? నిన్ను పెంచి పెద్దవాణ్ణి చేసినందుకు ఇలాగేనా నువ్వు చెయ్యవలసిందీ? చదువూ సంధ్యా మానేసి రోడ్లమ్మట తిరగడమే కాకుండా వందలకి వందలు తగలేస్తూంటే పెద్దవాళ్ళు అదేమనైనా అడగకూడదట్రా? అడిగితే 'నా సొమ్ము నాకు పారెయ్' అంటావా మీ పెద్దనాన్నగారిలాంటివారితో, తప్పుకాదూ?'

'తప్పే పెద్దమ్మా! ఎంత అడిగినా ఇవ్వకపోతే నోరు జారేను. అయినా ఆ అవసరం అంతటిది మరి.'

'ఒక్క రోజులో వందరూపాయిలు ఖర్చుపెట్టే అవసరం నీ కేమొచ్చిందిరా? పోనీ నాతోనైనా చెప్పకూడదుట్రా?'

'ఎవరైనా ఎందుకని నన్నడిగితేకద?'

'పోనీ ఇప్పుడేనా చెప్పకూడదా?'

'మరేం లేదు. తెలుగు మాష్టారు రామదాసుగారు ఆర్నెల్లై యింటద్దె కట్టలేదట పెద్దమ్మా. నిన్నటితో కట్టకపోతే యిల్లు ఖాళీ చేయిస్తామని నోటీసు యిచ్చారుట. ఆయనికి ముగ్గురు కొడుకులూ అయిదుగురు కూతుళ్ళూ. పెద్దకూతురు బాలెంతరాలు. వీళ్లుగాక ఆయన ముసలితల్లి ఒకర్తి. ఇంతమంది ఈ శీతాకాలంలో ఎక్కడికి పోతారు పెద్దమ్మా.'

గ్గోకి. ఎవ రెలాచ స్తే నీకేం? నాకేం, అంత ఉపకారబుద్ధున్న మొగాడి
ౕరవై మూడేళ్ళ వయస్సుంది, గోళ్లు గిల్లుకుంటూ ఊరికే ఇంట్లో కూచో
ఏదైనా ఉద్యోగం చేసి ఊరంతటినీ ఉద్ధరించరాదూ? మళ్ళీ అందులో లేదు
మన ప్రతాపం. అత్తగారి సొమ్ము అల్లుడు ధారపోశాడని...'

'పెదనాన్నా...నన్నాట్టే వేగించకు. నేను చేసిందేమో తప్పుపనికాదు. నేను ఎవరిసొమ్మూ ఎవరికీ ధారాదత్తం చెయ్యనూలేదు.'

'ఇంకా నీ సొమ్ము ఎక్కడుందోయ్...సిగ్గులేక మాట్లాడుతున్నావ్...నీ తిండికీ, నీ చదువుకీ ఎంతయిందో అదేం లెఖ్ఖలేదన్నమాట....నీ పల్లపుముక్క కాస్తా నువ్వు బతికున్నన్నాళ్ళూ వస్తుందనుకున్నావేం? అయినా నాకెందుకీ అల్లరి... ప్లీడర్ని పిల్చుకొచ్చి నీకు రావలసిం దెంతో యిప్పుడే తేల్చేస్తాను

'ఏమండీ, ఇదిగో, నా మాట వినండి.'

అమ్మ అడ్డుకోపోయింది. ఆ మాట ఎవరూ వినలేదు. నేనుకూడా వెళ్ళి అడ్డుకుంటే మా నాన్న మరీ రెచ్చిపోయాడు. 'ఇంక నన్నెవరూ ఆపకండి. ఈ అర చేతిలో అగ్నిహోత్రం నేనింక భరించలేను. ఇప్పుడే ప్లీడర్ని పట్టుకొచ్చి అణా పైసలతో లెఖ్ఖ తేల్చేస్తాను.'

'అంత శ్రమ నీకెందుకు పెదనాన్నా! నాకు తెలిసిన ప్లీడరు ఒకాయన ఉన్నాడు. వెళ్ళి కనుక్కొస్తాను. ఈ డబ్బుగొడవ నాకూ తలనొప్పిగానే ఉంది.'

అమ్మా చెల్లీ ఎంత గట్టిగా పిలుస్తున్నా వినిపించుకోకుండా మా వ్యాసమూర్తి గబగబ వీధిలోకి వెళ్ళిపోయాడు. అలా జరుగుతుందని ఎంతమాత్రం ఊహించని నేనూ నాన్నా ఒకాళ్ళమొహం ఒకాళ్ళు చూస్తూ కూచున్నాం. ఆవాళ ఇంట్లో సరిగా భోంచేసిందీ లేదు; ఆ రాత్రి యింట్లో ఎవరికీ నిద్రర్లాలేదు!

"అనవసరంగా లేనిపోని అల్లరి తెచ్చిపెట్టేరు. ఓ వందరూపాయిలు వాడు అడిగింది, అదైనా వాడికోసం కాదు. మాటాడకుండా యిచ్చేస్తే యింత అల్లరౌనా? ఇదంతా వాణ్ని వీధిలో పెట్టడానికీ, మనం వీధిలో పడ్డానికీ వచ్చినట్టుంది చూస్తే..." అంది అమ్మ.

'నోరుముయ్యి... నీ వల్లే యిదంతా వచ్చింది. ఎక్కడో దూరపుచుట్టం. కొంపమీదికి ఈ కొరివిని ఎవరు తెచ్చిపెట్టమన్నారు? మేజరవగానే అంతపొలమూ వాడికి హక్కుభుక్తం అయిపోయేటట్టు అందులో రాసుంది. మంచిమాటలాడి నీ పేరయినా రాయించేశాను కాను. ఇప్పు డన్నివిధాలా కొంప మునిగింది. ఏమనుకుంటే ఏం లాభం; ఆ కాగితాలు పట్టుకుని వాడు పారిపోయేడంటే మనపని గోవిం

దాయే,' అని నాన్న అంటూంటే నే నన్నాను 'ఆ కాగితాలు ఎక్కడున్నాయో చూడరాదూ?'

అవి కనపడలేదు అలాంటి వేవో మా వాసు చేతిలో ఆవాళ సాయంకాలం చూసి నట్టు గుర్తుని కాసులుకూడా చెప్పగానే నాన్న నీరుకారిపోయారు! బుర్ర బాదు కున్నాడు

'ఇంకా వీడి చదువు ఏణ్ణర్థం గడవాలి. దీనికి చూస్తే పద్దెనిమిదీ వెళ్ళిపోయాయి. ఎలా యీదుకురాను భగవంతుడా! ఆఖరికి వీణ్ణి పెంచడం పామునికి పాలు పోసిన ట్టవుతుందని కలలోకూడా అనుకోలేదు;' మా అమ్మ అవస్థ వర్ణించలేనిది. ఇరవై మూడేళ్ళు పెంచిన పిల్లడు, ఇంత అపకారం చేస్తాడంటే ఆవిడ నమ్మలేకపోతు న్నది. నాన్నతో ఏటువంటి జవాబూ చెప్పలేకపోతున్నది.

'తండ్రీ వెంకటరమణమూర్తీ! మా తప్పులుంటే మమ్మల్ని దండించు. తల్లీ తండ్రీ లేనివాడు, బొత్తిగా దుడుకువాడు; వాడంరోజు లయింది యిల్లుడిచి. నాకు వాడి ఆస్తీవద్దు, ఐశ్వర్యమూ వద్దు. నా చేత్తో నేను వాడికి యింత అన్నం పెట్టుకునేటట్టు అనుగ్రహించు తండ్రీ!' అని కన్నీళ్ళతో వేడుకొంటున్నది.

పదిరోజుల తర్వాత మా వ్యాసమూర్తి దగ్గిర్నుంచి నాన్నగారికి రిజష్టరు పోస్టులో పెద్దకవరు వచ్చింది. నాన్న వణుకుతున్న చేతుల్తో అది విప్పుతూంటే మా కెవరికీ మతుల్లేవు. అందులో వాడి ఆస్తికి సంబంధించిన కాగితాలూ, ఒకపట్టా, ఒక ఉత్తరమూ ఉన్నాయి. ఉత్తరంలో యిలా ఉంది:

"పెదనాన్నా,

నా పొలమంతా నీపేర రాసేసిన కాగితాలు ఇందులో పంపుతున్నాను. నా పొలం అమ్మి ఆడబ్బుతో చెల్లికి కట్నం ఇచ్చి పెళ్ళి చేస్తే నేను సంతోషిస్తాను; అటుపైన నీ యిష్టం. నే నెక్కడ స్థిరపడేదీ యింకా నిశ్చయించుకోలేదు. అందాకా విశాఖ పట్టణంలో ఒక స్నేహితుడిదగ్గర ఉన్నాను. నీకూ పెద్దమ్మకీ అన్నయ్యకూ నా నమస్కారములు; కాసులమ్మకు నా దీవనలు. తప్పులుంటే క్షమించవలసింది.

వ్యాసమూర్తి."

ఆ ఉత్తరం చూసి మరి ఎవరిమొహమూ నాన్నగారు చూడలేకపోయారు.

'అంతా నాకే యిచ్చి ను వ్వేమైపోతావ్ చిన్నన్నా!' అని కాసులమ్మ ఒకటే ఏడుపు. కడుపు తరుక్కుపోయేటట్టు కన్నీళ్ళతో నిండిపోయిన అమ్మమొహం నేను చూడలేకపోయాను.


ఓ చదువులేదు; సంధ్యలేదు. అయితేనేం, దొంగవెధవ హృదయ మున్నవాడు

మా పరీక్ష లయిపోయాక 'అమ్మా! ఓసారి విశాఖపట్నం వెళ్ళి వాసుగాణ్ణి చూసొస్తానే.' అన్నాను. 'చూసిరావడంకాదు, తీసుకురా ఇంతప్పట్నుంచీ వాణ్ణి పెంచాను. చూసి ఎన్నాళ్ళయిందో,' అని మాఅమ్మ కళ్ళనీళ్ళు పమిటచెంగుతో తుడుచుకుంది.

విశాఖపట్నం వెడుతూ రైల్లో కూచుని నేను మొట్టమొదటిసారిగా వ్యాసమూర్తి గురించి తీవ్రంగా దీర్ఘంగా ఆలోచించాను. ఇంకొక్క ఏడాది హౌస్‌సర్జన్ అయిపోతే నేను క్వాలిఫైడు డాక్టర్ని అయిపోతాను. గవర్నమెంటుఛాన్సు వస్తే గజిటెడ్ ర్యాంకు; ప్రైవేటు ప్రాక్టీసుపెట్టుకుంటే నెలకి ఓ అయిదారువందలయినా కళ్ళజూస్తాను. అయినా వాసుని నే నెప్పటికీ అందుకోలేనేమో అనిపించింది. వాడు చెప్పులు లేకుండా ఎండలో నడవగలడు. పెళ్ళివారింటికయినా మాసినబట్టలు కట్టుకు రాగలడు. పరీక్ష ఫేలయినరాత్రికూడా నిశ్చింతగా నిద్రపోగలడు. వాడు వేదాంతి; చక్రవర్తి. నేను ఎం. డీ. ప్యాసయినా, ఎఫ్. ఆర్. సి. ఎస్. డిగ్రీ పొందినా వాణ్ణి కల్సుకోలేను. పచ్చని భవిష్యత్తుకోసం బంగారుకలలు కనేవయసు నాది. చదువు నాది. 'నేను పడినశ్రమంతా మా బాబు తీరుస్తాడు,' అని మా నాన్న అనుకుంటే నేం, 'మళ్ళీ మా తండ్రి ఎలా తీసిన నగలు అలా నా ఒళ్ళంతా నింపుతాడు,' అని మా అమ్మ ఆశపడితేనేం, ఓడిపోయేవాళ్ళ కున్న మనస్తత్వంలాటిది, యిక ఏ విధంగానూ తీరదనే నిరాశలాటిది నన్ను నిలువెల్లా క్రుంగదీసింది. పరీక్షలు పాసవుతున్నా నా కీ పరాజయభావన దేనికి? పరీక్షలు ఫేలయినా మా వాసుగాడి కీ విజయోల్లాసం ఏమిటి? వాణ్నే అడగా లనిపించింది.

కాదంబరివారి వీధిలో ఉన్న, వాడిస్నేహితుడు, వా ళ్ళింటికి వెళ్ళేను. ఏం లాభం? వాడు ఆ ఊరుదాటి వారంరోజులు దాటిందిట. ఆ ఊళ్ళో ఉన్నంత కాలం ఎక్కువసేపు మాధవసేవాసదన్ మందిరంలోనే గడిపేవాడట. లక్కడికి వెళ్ళి కనుక్కుంటే 'సరళ జీవనమూ, సచ్చింతనమూ,' అనే విషయం ప్రబోధం చెయ్యడానికి వీలుగా ప్రత్యేక శిక్షణ పొందడానికి మద్రాసులో ఉన్న సంస్థకి పంప బడ్డాడట. అక్కడే ఉండిపోవడానికి నిశ్చయించాడుట.

వ్యాసమూర్తిని గురించి ఆలోచించినకొద్దీ నా బుర్ర మరింత బరువెక్కిపోయింది ఈ చదువు దేని? ఈ బతుకు దేనికి? ఉద్దేశం ఏమిటి? ప్రయోజనం ఏమిటి? ఇలాంటి పెద్దపెద్ద ప్రశ్నలు మొట్టమొదటిసారి నాలో కలిగి, జవాబులు తెలియక, నా ఆత్మ గిలగిల తన్నుకోడం ప్రారంభించింది సరిగా అప్పుడే. సరిగ్గా అదే సమయంలో ఒక సుందరస్వప్నం నాకు తాత్కాలికంగా శాంతి నిచ్చింది ఇసుకలోనా, సము



ద్రములోనా, ఆకాశములోనా ఎక్కడ చూసినా తరంగాలు. ఈ తరంగాలకు కేంద్రం ఎక్కడ? ఇంకెక్కడ? నన్ను అనుక్షణం పాలించే నా గీతదగ్గర. నే నింక ఆలశ్యం చెయ్యలేదు. వెంటనే అనకాపల్లి బస్సు ఎక్కేశాను.

అనకాపల్లిలో నాతో చదువుకున్న మోహనరావు అనే అతను ఫిజిక్స్ డిమాన్‌స్ట్రేటరుగా పనిచేస్తున్నాడు. వాడు హాస్టల్లో ఉంటున్నాట్ట - కనుక్కొని అక్కడ దిగేను. మర్నాడు మధ్యాహ్నం ఫోంచేసి వాడలా కాలేజీకి పోగానే నే నిలా కేశవారావుగా రింటికి వెళ్ళేను. ఇల్లు తాళం వేసిఉంది. నా గుండె ఆగిపోయినట్టయింది. పోనీ ఆయిల్లు కాదేమో అనుకుంటే స్పష్టంగా నేమ్‌ప్లేట్ ఉందాయె

నే నటూయిటూ తెల్ల మొహం వేసుకుని చూస్తూంటే, గీత పక్కింటినుంచి గబగబా వచ్చి తాళం తీసి నన్ను లోపలికి ఆహ్వానించింది.

'ఎంత సేపయింది వచ్చి ? ఇంకా నయం వెళ్ళిపోయారుకారు. సామాన్లేవీ?'

స్నేహితుడింటికి పెళ్ళికి వచ్చాననీ, రాత్రి పెళ్ళయిపోయిందనీ — ఆ సాయంకాలం తిరిగి వెళ్ళిపోతూ ఓసారి చూడాలనిపించి వాళ్ళింటికి వచ్చాననీ కోశాను. వాళ్ళమ్మా నాన్నా బెజవాడ వెళ్ళేరుట. తమ్ముడేమో బడికెళ్ళాడుట. ఏమీ తోచక పోతే తలుపు తాళంవేసి పక్కింటి బాలాంబగారింటికి వెళ్ళిందిట. మంచిసమయంలో వచ్చినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను. కోరినకాంతా, ఏకాంతమూ ఒకేసారి లభ్యమవడం ఎంత అదృష్టం!

'అమ్మా, నాన్నా, చెల్లీ అంతా బాగున్నారా?' అంది కాఫీ యిస్తూ.

'ఊఁ' అన్నాను, గడియారంవంక చూస్తూ. అప్పుడు పదకొండున్నర అయింది. వాళ్ళ తమ్ముడు నాలుగున్నరకి వస్తాడుట. ఈలోగా అన్నీ మాట్లాడెయ్యాలనుకున్నాను.

'మీ తమ్ముడు వ్యాసమూర్తిగారు క్షేమమేనా?'

నా ఒళ్ళు మండిపోయింది. ఆప్రశ్న అడుగుతున్నప్పుడు ఆమె కళ్ళలో స్ఫురించిన ఆతృతా, ఆమె కంఠంలో ధ్వనించిన ఆప్యాయతా చూస్తే నాలోని మంచితనం మంటకలిసింది.

'వాడెక్కడ తమ్ముడు నాకు? ఎక్కడో దిక్కూ మొక్కూ లేనివాడని మా అమ్మ తీసుకొచ్చి పెంచింది. దానికి తగ్గట్టు మరి మేమెవరమూ తలెత్తుకోకుండా చేశాడు.'

'అదేం, ఏం చేశారేం?'

మళ్ళీ ఆమెవైపు చూశాను. ఆందోళనతో ఆ పెదవులు కంపిస్తున్నాయి. ముందున్న ఇసుకవైపు పయనిస్తున్న ఆ మధురవాహినికి వెంటనే ఆనకట్ట కట్టడం నా బాధ్యతగా భావించాను.

'ఇంకేంచెయ్యాలి? మా ఎదురింటి గుమాస్తాగారిభార్యని తీసుకు లేచిపోయాడు!' అంత అబద్ధం నా జీవితంలో ఆడడం ఇదే మొదటిసారి. నిలువెల్లా నేను ఒణికిపోయాను. ఎలాగో నిలదొక్కుకున్నాను. ఆమె రెండుచెవులూ మూసుకుంది.

'నే నమ్మను, నమ్మలేను. ఎవరో కిట్టనివాళ్ళు కల్పించిన కట్టుకథ–ఇది మీరెలా నమ్మేరు, ఎలా నమ్మగలిగేరు? వ్యాసమూర్తిగార్ని అంత తక్కువగా అంచనా వెయ్యడానికి మీ మన సెలా ఒప్పింది?'

అపజయమూ అవమానమూ నన్ను చిత్రవధ చేశాయి. నేను నా ముందు నేరస్థుడిగా సిగ్గుతో నిలబడిపోయాను.

'మాటాడరేం? అంతటి అపవాదుని మీ రెలా నమ్మగలిగేరు?'

'వా డలాంటిపని చెయ్యడని మీకుమాత్రం అంత నమ్మక మేమిటి?'

'అయితే చెప్తా వినండి;' ఆమె కుర్చీ దగ్గిరికి లాక్కుని కూచుంది.

గీతతో అనేక విషయాలు ముఖాముఖీ మాటాడదామని నే వచ్చాను. ఆమె గురించి ఒక్క కొత్తవిషయం తెలియలేదు. నా ప్రేమవిషయం ప్రస్తావనగా నైనా రాలేదు. 'మీరు అదృష్టవంతులు!' ఎందుకో తెలియలేదు. అప్పుడే ఒంటి గంటయింది. నే నెక్కడికి వెడితే అక్కడికి వ్యాసమూర్తి మాత్రం నన్ను వదలడం లేదు!

'ఏమి టాలోచిస్తున్నారు?'

'ఏం లేదు, ఏదో చెప్తా నన్నారుగా, చెప్పండి.'

'వ్యాసమూర్తిగారిమీద నా కీంత నమ్మకానికి కారణ మేనా? చెప్తాను

'వాడి గురించి నాకు బాగా తెలుసు.'

'తెలియదనే నా ఉద్దేశం. అయినా ఇది ఆయన గురించి కాదు, నా గురించే. ఇన్నాళ్ళకు ఒకరితో చెప్పుకునే అవకాశం కలిగింది.'

ఇన్నిరోజుల తర్వాత, యింతగా వేచిఉన్న మీదట, యిప్పటికైనా ఈ అదృష్టం పట్టినందుకు నా కెంతో ఆనంద మనిపించింది. ఆమె గురించి నా చెవిలో ఏం పోసినా అది సుధే. ప్రతీఅక్షరం ఎంతో నెమ్మదిగా, పొదుపుగా, ప్రేమగా విన్నాను.

'ఇవన్నీ మీకు పెద్ద ఉత్తరంగా రాద్దామనుకున్నాను. మీరే నా ఎదుటికి వచ్చి వినడం నా అదృష్టం. తర్వాతైనా నా కేదైనా చెప్పుకోవాలని ఉన్నప్పుడు మీకు ఉత్తరాలు రాస్తూంటాను. జవాబులు కోరను. నా ఆలోచనలు సహృదయంతో పంచుకునే సన్నిహితులు ఒక రున్నారనే ధైర్యం నాకు ప్రసాదించండి.'

నాకు గీతమాటలు సరిగ్గా బోధపడలేదు. అయినా ఆమె ఉపయోగించిన కొన్ని పదాలలోని మాధుర్యం నన్ను పరవశుణ్ణి చేస్తోంది. తాత్కాలికమైన ఆనందంతో తల ఊగించాను. మరింత వేగంగా గీత తన జీవితంలో ఒక ముఖ్య సంఘటన గురించి చెప్పసాగింది.

## 5

గీతకు ఎనిమిదేళ్ళున్నప్పుడు జరిగిన సంగతి వాళ్ళ అమ్మమ్మ నిచ్చెనెక్కి అటకమీద ఆవకాయ తీస్తూంటే జారిపడి మోకాలిఎముక విగిరింది. వెంటనే కార

మీద వైజాగ్ తీసుకొచ్చి జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. సుందరమ్మగారికి అప్పుడే రెండు వారాలనుండి జ్వరంగా ఉండడంచేత ఆవిడ తల్లితో వెళ్ళడానికి కుదిరింది కాదు. అల్లుడు కేశవరావే ఆమెను దిగబెట్టవలసివచ్చింది. తనూ వస్తానని పేచీ పెడితే, పోనీ కారులోగదా, మళ్ళీ తీసికొచ్చి దిగబెట్టెయ్యవచ్చునని గీతనికూడా విశాఖపట్నం తీసికెళ్ళేరుట. తీరా అక్కడ అమ్మమ్మను జాయిన్ చేశాక, ఆమెను విడిచిరానని గీత ఒకటే అల్లరి. 'మరీ చంటిపిల్ల కాదుగదా, పోనీ ఉండనియ్యండి,' అని అక్కడివాళ్ళంటే ఆ ఒక్కరోజుమాత్రమే ఉంచడానికి అమ్మాయిని ఒప్పించి, భార్యకి జబ్బుగా ఉందని కేశవరావుగారు ఆ రాత్రే అనకాపల్లి వచ్చేశారుట.

ఒక్కరోజులో కొన్ని గంటలు. అయితే నేం ఆ బాలిక లేతమనసులో శాశ్వతంగా ప్రభావం చూపిన విలువైన గడియ లవి. అమ్మమ్మ ఏమైపోతుందో అని అక్కడ ఉండిపోయిందిగాని నిజానికి గీతకు ఆ మూలుగులూ, ఆ మందుల వాసనలూ, ఆ రోగిష్టి ముఖాలూ ఎంతో భయాన్ని కలిగించాయి. ఇంతలో కారు చీకట్లో కాంతిరేఖలాగ ఒక నర్సు అక్కడి కొచ్చి గీత మనసంతా నిండికూచుంది. రాగానే గీతను ముద్దెట్టుకుని, ఆడిగింది: 'మీకు బలే సాయం దొరికిందే మామ్మగారూ, మనవరాలా?' అమ్మమ్మ జవాబు చెప్పలేదు. నర్సుచెయ్యి పట్టుకుని ఏడవడం మొదలుపెట్టింది.

'అదేవిటి ఏడుస్తున్నారా, ఛ, మీ కేమయిందని?'

'ఇం కేం కావాలి! బాధ భరించలేకుండా ఉన్నాను; చచ్చినా బాగుణ్ణు.'


'చూడండి, మీ రలా అంటూంటే నోరెరగని ఆ పసిపిల్ల గుడ్లనిండా ఎలా నీరు నింపుకుందోను. ఇంతకీ మీ కేమయిందని!'

'అయితే నా కాలు మళ్ళీ మామూలుగా అవుతుందంటావా నర్సమ్మా?'

'ఎందు కవదు? పిప్పి పిప్పి అయిన కాళ్ళవాళ్ళు మా ఆస్పత్రినుంచి కుప్పి గంతులు వేస్తూ బయటకు వెళ్ళిపోయారు. అలా కాకపోతే మే మెందుకు, యిన్నిన్ని మందు లెందుకు?'

'ఎంత మంచి కబురు చెప్పేవు తల్లీ...అయితే పెద్దడాక్టరుగారు ఏమన్నారు! నా కాలికి. ఏం చేస్తారు? ఏమీ జరక్కపోతే యీ మిణికిదగ్గిర యింత నెప్పి, యిక్కడ యింత కట్టూ ఏమిటి?'

నర్సు నవ్వుతూ అంది: 'కట్టు కట్టద్దా మరి? మీ రీ వయసులో చేసిన సర్కస్ ఫీటు తక్కువదా? కట్టు సంగతి చెబుతా వినండి. విరిగిన ఎముకలు తిన్నగా ఉంచడానికీ, కండరాలు కొంచెం వదులు అవడానికీ కాలుని సాగదీసి కడతారు. రేపు ఆపరేషను




గదిలో విరిగిన ఎముకను సరిచేస్తారు. అంతే. రెండ్రోజుల్లో కొంచెం మీ కాలిని అటూ ఇటూ కదపొచ్చు.'

'నిజంగా?' అమ్మమ్మ ముఖంమీదకు వచ్చిన ఆశారేఖను గీత స్పష్టంగా చూసింది. 'అందుకు సందేహమా?' అన్నట్టు నర్సు ఆమె వీపుమీద ప్రేమతో నిమిరింది.

'ఇక్కడ బొత్తిగా అంటూసొంటూ ఉన్నట్టులేదే అమ్మా! ఎలా తినిచావను ఈ కూడు?'

'అదిగో అక్కడి పేషంట్లు మావాళ్ళే...వాళ్ళతో మాటాడి మీకు వేరే వండించడానికి ప్రయత్నిస్తాను.'

ఈసారి అమ్మమ్మ నర్సుచెయ్యి తీసుకుని తన గుండెలమీద పెట్టుకుంది.

'అక్కడ మా అమ్మాయి కెలా ఉందో...నే నిలా ఉన్నట్టు దానికి చెప్పేరో లేదో...ఇంతదూరం కబు రెలా పెడుతుందే మాయమ్మా!'

'ఈ పక్కవరండాలోనే ఫోను ఉంది. మూడుగంటల కొకసారి ఫోను చేసి చెప్పమని మీ అల్లుడుగారు పురమాయించి వెళ్ళేరు. మి అమ్మాయికి నార్మలు వచ్చిందని యిప్పుడిప్పుడే కబురు వచ్చింది.'

'అమ్మయ్య... సగం నా బాధ తగ్గిపోయిందే అమ్మా!'


'మామ్మగారూ, చాలా సేపు కూచున్నాను. ఇక నే వెడతాను. మీ కేం బాధ లేదు. మరో అరగంటకి మళ్ళీ నే వస్తాను. మీ కేం కావలసినా మేం ఎవరమో ఒకరం డ్యూటీలో ఉంటాం; సందేహించకుండా మీ బాధ ఏమిటో చెప్పండి. భగవంతుణ్ణి తలచుకుని పడుకోండి. మీకు చక్కగా నిద్రపడుతుంది. అన్నిట్నీ మించి ముత్యంలాంటి మనమరాలు మీ కుంది. 'కుంచమంత కూతురుంటే మంచంమీదే కూడుట;' మీ కేంలోటు? వస్తా,' అని రెప్పవాల్చకుండా తనవైపు చూస్తూ, ప్రత్యక్షరం ప్రశంసాపూర్వకంగా వింటున్న గీతను మరొక మారు ముద్దెట్టుకొని— 'నాలో ఏముందని అంత చిత్రంగా చూస్తున్నావ్ పాపా?' అంటూ టకటక నడుచుకుని వెళ్ళిపోయింది. గీత తనకు తెలియనంత ఆకర్షణతో రెండుచేతులూ జోడించి 'నమస్తే' అనడం ఆమె గుర్తించిఉండదు. ముసిలావిడ 'చల్లని తల్లివి. పది కాలాలపాటు బతుకు' అని గొణుక్కోవడం కూడా ఆనర్సు పరికించిఉండదు.

అందరికీ అన్ని జబ్బులూ నయమయాక అమ్మమ్మ అమ్మతో అన్నమాటలు గీత ఎప్పుడూ మరచిపోలేదు.

'నన్నెవరు బతికించారనుకున్నావ్, సుందరం? ఒళ్ళెరక్కుండా జ్వరంతో పడుకున్న నువ్వుకాదు; అప్పటి కప్పుడు ఆతృతతో నన్ను పెద్దడాక్టరుకి చూపించిన అల్లుడూకాదు; ఆఖరికి నే నేమైపోతానో అని నన్ను వదిలిపెట్టని మనవరాలూ కాదు. అసలు ఒకవేళ మీరు ముగ్గురూ కలిసి అక్కడున్నాసరే నన్ను రక్షించింది మీరై ఉండరు. కాటికి కాళ్ళు జాచుకున్నదాన్ని, కాలు విరుచుకున్నదాన్ని, కుంటిముండనై నే నెలా బతకాలి? అనే ప్రశ్నకి జవాబు చెప్పి నాకు ధైర్యాన్నిచ్చింది మీరెవరూ కానేకాదు. ఏది కావాలన్నా నాకు సహాయం చేసేవారు ఇంత ఆస్పత్రిలోనూ ఒక్కరైనా ఉన్నారనే భావమే నన్ను బ్రతికించింది. ఆ భావం కలిగించింది నర్సమ్మ; అంతకన్న జన్మకి సార్థకత ఏముంది! నే నక్కణ్ణుంచి వచ్చేస్తున్ననాడు ఆ అమ్మాయి ఏమందో తెలుసా—

'ఏమండోయ్ మామ్మగారూ! చూశారా, లేచి కూచోలేనేమో అనికూడా అనుకునేవారు—కొత్తగా నడక నేర్చిన పాపలా ఎలా అడుగులేస్తున్నారోను! అడుగులకి అరిసెలు పంచిపెడతారంటారే, ఏవీ అవి మాకు?'

'మా తల్లి... మా అమ్మ... ఇదిగో కొస్త ఓపికరానీ... నిజంగా బుట్టెడు




అరిసెలు చేసి నీకు పంపిస్తాను; అందాకా ఇదిగో ఈ పాతికరూపాయిలూ బహుమతిగా తీసుకుని ఓచీర కొనుక్కో అమ్మా;'

'డెబ్భైయేళ్ళ మామ్మగారు పిల్లిమొగ్గవేసి కాలు విరక్కొట్టుకుని కుంటుకుంటూ వచ్చారు. చురుగ్గా నడుస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నారు. అంతకు మించిన బహుమతి మా కేముంది మామ్మగారూ? వీలయితే మళ్ళీ ఎప్పుడేనా రండి.'

'ఏం, ఈసారి రెండుకాళ్ళూ విరక్కొట్టుకోమన్నావా? నిజంగా ఏం చేసినా సరే, నీ దగ్గిరకి రావాలనే ఉంటుందే పిల్లా. నీ పిల్లలు అదృష్టవంతులే తల్లీ!'

'మా పెద్దమ్మాయి వయస్సెంతో తెలుసా?'

'ఎంతటా?'

'డెబ్భై!

* * * *

గీత పమిటచెంగుతో చెంపల్ని తుడుచుకుంది.

'ఆపదలో ఉన్నవారికీ, అనేకరకాల బాధలతో అలమటించేవారికీ తాత్కాలికంగా అయినాసరే, ఉపశాంతి కలిగించగల జన్మ యెంత ధన్యమైన దంటారు విజయకుమార్! పసివారి మొదలు ముసలివారివరకు అందరూ నా పిల్లలే అనుకోగల వ్యక్తిత్వం ఎంత గొప్పదంటారు! 'ఫరవాలేదు, మీ గురించి కనుక్కోడానికి నే నున్నాను,' అని ఒక్కరితోనైనా త్రికరణశుద్ధిగా చెప్పగలిగిన అదృష్టం అదెంత అనన్యమైన దంటారు!

ఆనాడు ఆస్పత్రిలో నా హృదయఫలకంమీద చెరగని ముద్ర వేసిన ఆ సేవా బీజం నా ప్రత్యణువులోనూ ఊడలు దింపుకుని మహావృక్షమైపోయింది. పరార్థం కోసం కానిది బ్రతుకే కాదనే భావం నాతోపాటు పెరిగి పెద్ద దైంది.'

'అయితే దానికోసం మీ రేం చేశారు?' అని ఆమె నడిగాను.

'ఏం చేశాను; ఏమీ చెయ్యలేకపోయాను! ఒకసారి యింట్లోంచి పారిపోయి ప్రేమసమాజంలో సేవికగా చేరుదా మనుకుంటే నాన్న అడ్డుపడిపోయారు. మరో సారి నర్సు ట్రైనింగుకోసం దరఖాస్తుఫారాలు తెప్పించి నింపుతూంటే తమ్ముడు చూసి అమ్మతో చెప్పేశాడు. వెంటనే వాటిని అమ్మ చింపేసింది. నా కోరిక ముక్క ముక్క అయింది. అయినా నానుంచి తొలగిపోలేదు. మొన్న మళ్ళీ మీ ఊళ్ళో పెళ్ళికి వచ్చినపుడు మీ వ్యాసమూర్తిగారి సేవ చూస్తే నాకు నర్సు జ్ఞాపకా నికి వచ్చింది. అందుకే పరోపకారార్థమే బతుకుతున్నవాళ్ళు తప్పుమార్గం పట్టే రంటే నేను నమ్మలేను.'

'మీరు నమ్మినదానిమీద మీకున్న నమ్మకానికి నాకు చాలా ఆనంద మౌతోంది గీతా! నిజానికి వాసు ఏ పాపమూ ఎరగడు. పైగా ఆస్తంతా మా నాన్నగారిపేర ఒకస్వచ్ఛంద సేవాసంస్థలో చేరిపోయాడు. వాడి విషయంలో అలా కల్పించి చెప్పిన మహాపరాధం నా దే!' నా మనసు తేలికపడింది. కొత్త విషయాన్ని కనుగొన్న ఉత్సాహ మేమీ ఆమెలో కనబడలేదు గాని, ఆత్మవిశ్వాసంతో ఆమె ముఖం ప్రజ్వలితమైంది.

'నేను ముందే చెప్పలేదా? అలా చెబితే నే నేమంటానో అని మీ రలా కల్పించి చెప్పిఉండవచ్చు. అంతే కదూ?'


నే నేం మాటాడలేదు. అదంతా సుఖవుగా పూర్తయినందుకు సంతోషించాను.

'మొత్తంమీద వ్యాసమూర్తిగారు అదృష్టవంతులు!' అంది గీత తనలో అను కుంటున్నట్టు.

'అదృష్టవంతులు,' అనేమాట వినగానే ఇక నేను ఊరుకోలేకపోయాను. 'ఆమధ్య పెళ్ళికి మీరు మా వూరు వచ్చినపుడు మా యింటికి వచ్చారు జ్ఞాపక ముందా? అప్పుడు మా యింటినుంచి వెళ్ళిపోతున్నప్పుడు గేటుదాకా మిమ్మల్నీ, మీ తమ్ముణ్ణీ నేను దిగబెట్టేను. మీ రప్పుడూ యిలాగే అన్నారు: 'మీరు అదృష్ట వంతులు.' అని. అప్పుడలా ఏ ఉద్దేశంతో నాతో అన్నారో ఇప్పుడు చెప్పగలరా?'

గీత కొంచెంసేపు మౌనం వహించింది.

'ఇన్నేళ్ళ తరవాత ఎప్పుడో అన్న ముక్కకి అర్థం చెప్పుకోడం కష్టమే. కాని



ఆ మాటకి నా మనసు ఎన్నిరకాల అర్థాలు చెప్పుకుందో నా హృదయం ఎన్నిరకాల భావాలకు లోనయిందో మీరు ఒక్కసారైనా ఆలోచించిఉండరు సుమా, గీతా! బాగా ఆలోచించండి, కావలసినంత టైమ్ తీసుకోండి. అదేమిటో తెలుసుకుందామనే యింతదూరం వచ్చాననే మాట మరచిపోకండి.'

గీత నా వైపు ఆశ్చర్యంగా చూసింది. 'మీ మాటలు చిత్రంగా ఉన్నాయి విజయకుమార్! నిజంగా అప్పుడు నే నెందు కలా అన్నానో గుర్తురావడంలేదు. అయినా దాని కిప్పుడు జవాబు చెప్పుకోడమూ ఏమంత కష్టంకాదు. అప్పుడు కాదు ఎప్పుడైనా మీరు అదృష్టవంతులే మీ వ్యాసమూర్తిగారు సమాజసేవలో స్థిరపడిపోయారు. ఇక మీరా? మెడిసన్ పూర్తి చేశారు. వ్యాధిపీడితులకు బాధ తగ్గించే

పవిత్రమైన వృత్తి మీది. మానవసేవకు అంకితమైన ఉద్యోగం మీది. ఇంత కన్న ఏంకావాలి? నాలాంటి దురదృష్టవంతురాలికి నిరంతర సేవాభాగ్యం ఎప్పటికైనా అందేనా? ఆ ఊసెత్తితే అమ్మా నాన్నా ఒంటికాలిమీద లేస్తున్నారు. ఎం. బీ. లో చేర్పించమని ఎంతో మొత్తుకుంటే ఉన్నచదువుకూడా మానిపించి యింట్లో కూచో బెట్టేరు. అప్పట్నుంచీ మరింత ఎక్కువగా నాకు సంబధాలు చూడ్డం ప్రారంభిం చారు. ఇప్పుడు మావాళ్ళు బెజవాడ వెళ్ళింది అందుకే. నేను నేనుగా ఏమీ చెయ్య లేనట. అదృష్టం అన్నది నాకు వేరే లేదట. నన్ను కట్టుకున్నవాడితో ముడిపడి ఉంటుందిట.'

'నిజం, నిజం.' అన్నాను నేను అప్రయత్నంగా. అంతే కాదు. ఉద్రేకంతో ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను.

'గీతా, నిన్ను నా ప్రాణాధికంగా ప్రేమిస్తున్నానని నువ్వింకా తెలుసుకోలేదా? పవిత్రమైన నీ ఆశయానికి పటిష్ఠమైన ఆశ్రయం నేను నీ కివ్వలేనా?'

ఆమె నా చేతులు విడిపించుకోలేదు. ఆ ధైర్యంతో ఎడంచేత్తో ఆమె భుజం పట్టుకుని కుడిచేత్తో ఆమె గెడ్డం పట్టుకుని ముఖం పైకెత్తి సూటిగా ఆమె కళ్ళలోకి చూశాను. చూస్తూండగా అందమైన ఆ కళ్ళు అశ్రుపూరితాలయాయి. అలా ఎందుకు జరిగిందో అర్థం చేసుకొనే హడావిడిలో నేనుండి వెనక వాళ్ళమ్మా నాన్నా రావడంకూడా చూళ్ళేదు!

'ఆఁ ఆఁ! ఎవడ్రా అదీ? వదులు వదులు అమ్మాయిని, వదులు' అని కేశవరావు గారు గట్టిగా అరిచారు. నేను సిగ్గుపడి దూరంగా జరిగిపోయాను. గీత మొహం కప్పుకుని పెరట్లోకి పారిపోయింది.

'ఎవరూ? నువ్వటోయ్ విజయకుమార్! అయినింట్లో పుట్టి ఏం బుద్ధులోయ్ యివీ! అమ్మాయిని ఒంటరిగా చూసి అవమానిస్తావా? ఈ అవకాశంకోసం ఎన్నాళ్ళనుంచీ చూస్తున్నావ్?'

నా నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. అవమానంతో క్రుంగిపోయి పక్కనున్న కుర్చీలో కూలబడ్డాను.

'అయ్యో, ఏమయిందే నా తల్లీ!' అని పెరట్లోకి కూతురిదగ్గిరకి వెళ్ళిన సుంద రమ్మగారు పెద్ద గోలపెడుతూ మళ్ళీ వీధివైపు వచ్చేసింది.

'చేసిన సిగ్గుమాలినపనికి చివాట్లుపెట్టి సాగనంపక మర్యాదచేసి కుర్చీలోకూడా కూచోబెడతా రెందుకూ? మనం మనపిల్లని ఇవ్వలేదని మొదట్నుంచీ వాళ్ళ కేడుపే. ఆమధ్య సుభద్రమ్మగారు ఏవో పేరంటంలో నామీద విరుచుకుపడిందిట.

తెలిసినవాళ్ళు ఒకరు చెప్పేరు. తాహతూ, తారతమ్యం చూసుకోవద్దూ? ఆ వాసు గాడో ఎవడో వాడి ఆస్తంతా పడేసుకుని వాణ్ణి చల్లగా వెళ్ళగొట్టి - దాంతో యీయన గారిచదువు వెలిగించారు. ఇదీ మన ప్రతాపం. తనకి పిల్లనివ్వలేదని తల్లీ తండ్రీ లేకుండాచూసి పిల్లని అవమానించడానికి వస్తాడా? పిల్ల నోటిమాట రాకుండా దుఃఖంతో కుమిలిపోతోందే... కొంచెమైనా మంచీ మర్యాదా నీతీ జాతీ...'

నే నిక భరించలేకపోయాను. లేచి గబగబా వీధిలోకి వచ్చేశాను. వాళ్ళమాటలు నన్నింకా వెంబడిస్తూనే ఉన్నాయి.

'ఏతప్పు చెయ్యనివాడైతే నోరుమూసుకుని అలా చల్లగా జారిపోడం దేనికీ? సమయానికి మనం వచ్చాంగాని...తనకీ పెళ్ళికాని ఒక చెల్లెలు ఉందిగా...

మా ఫ్రెండుదగ్గిర హేండ్‌బ్యాగ్ తీసుకుని స్టేషను కెలా వచ్చిపడ్డానో తెలీదు. వెయ్యిసూదులతో ఒకమారు గుచ్చినంతబాధగా ఉంది తల. ఇటువంటి అవమానం జన్మలో ఎరగను. ఇంతటి ఆశాభంగం భరించేశక్తి నాకులేదు.

కేశవరావుగారూ, సుందరమ్మత్తా నాకు కొత్తకాదు. వాళ్ళకి మా కుటుంబంమీద ఎప్పుడూ మంచి అభిప్రాయంలేదు. గీత అభిప్రాయం ఏమిటి? విషబాణాలలాంటి అన్నిమాటలు తల్లిదండ్రులు నామీద వదులుతూంటే ఒక్క మాటకైనా అడ్డు కోకపోవడంలో ఆమె అంతర్యం ఏమిటి? ప్రేమించినవ్యక్తి ఎన్నాళ్ళయినా నాకు చిక్కుప్రశ్నగా మిగిలిపోవలసిందేనా? నిరీక్షణలో ప్రతిక్షణం నేను పొందుతున్న శిక్షకు అంతన్నది లేనేలేదా?

నే నామెను తాకినపుడు అశ్రుపూరితా లయిన ఆమెకళ్ళు చెప్పే భావం ఏమిటి? ఉన్న ఒక్క ఆధారమూ దూరమైపోతే ఎంత బాధపడిపోతామో అంత వ్యధా నిస్పృహా ఆ చూపుకి అర్థం అయితే దాని తాత్పర్యం 'ఏమిటి, మీరైనా మ రొక్కరైనా నన్ను అర్థం చేసుకుంటా రనుకున్నాను. ఇంతేనా?' అనా? ఆమె చేతుల్ని నా చేతుల్తో పట్టుకున్నపుడు నేను పొందిన అనుభూతి ఏమిటి? నాలో కలిగినవి వెచ్చవెచ్చని భావాలా? కాదు, ఎంతమాత్రం కాదు; చలనంలేని నదిలో చేపపిల్లలు యీదినట్టు, చల్లని చెట్టునీడలో లేడిపిల్లలు ఆడుకుంటున్నట్టు, చలించని రాతిని సముద్రపు కెరటాలు ఢీకొంటున్నట్టు.. మెత్తని ఆస్పర్శ నేను కోరే శారీరక సుఖాల కన్నిటికీ ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్టా?

డాక్టర్ని అయితేనేం గాక! మనిషి జీవించడానికి ఆరోగ్యమైన స్థితిలో ఉన్న ఒక గుండెకాయా, రెండు ఊపిరితిత్తులూ అతి ముఖ్యమని నా కా సంమయంలో అనిపించలేదు. అవేకాదు, నా క్రాఫింగు పాపిడిలో చివర లేచినిలుచున్న అన్నిటికన్న

ఎత్తైనవెంట్రుక చివరనుంచి అరిపాదం చర్మంవరకు నా శరీరమంతా కేవలం వ్యర్థమని అనిపించింది. మనిషి ప్రాణం తీసుకుపోవడానికి మృత్యువు వచ్చేది ఒక్కసారే. కాని, మనసు అనే మాయలో మమత అనే మత్తులో కలలు అనే అలలలో కాలం అనే కనీ కనిపించని కన్య ఆడించేదీ ఏడిపించేదీ ఎన్నిసార్లో!

తెగిపోయిన గాలిపటం ఎక్కడికి పోతుంది? గాలి ఎటు వీస్తే అటు. నేను మెయిల్లో కూచుని మద్రాసు వెళ్ళడమూ అలాగే జరిగింది. నాకు జరుగుతున్న ప్రాపంచిక విషయాలమీద ఏమాత్రమూ ఆసక్తి లేకపోయినా, పంచేంద్రియాలూ వాటిపని అవి చెయ్యక మానవుగా! దేశం దేశంఅంతా యుద్ధచైతన్యంతో నిండి పోయిందా అనిపించింది. ఏ ప్రయాణికుడి నోట విన్నా అదే మాట. ఏ స్టేషన్‌లో రైలాగినా అవేవార్తలు. ఆరోజు పేపరు కొనుక్కుందామన్నా దొరకనంత గిరాకీ పెరిగిపోయింది. మా కంపార్టుమెంటులో ఒకరిద్దరివద్ద ట్రాన్సిస్టర్సు ఉన్నాయి. ఎంత పల్లెటూరివాడయినాసరే ఆ క్షణం ఏం న్యూసు వస్తోందో చెవులొగ్గి వినవలసిందే.

నేను ఏరోజు కారోజు పేపర్ చదివేవాణ్ణే అయినా, చదువూ పరీక్షలూ హడా విడిలో యిటీవల సరిహద్దులో జరిగిన అలజడివివరాలు అంతగా పట్టించుకోలేదు. నేనెంత అన్యచింతావిమగ్నుణ్ణయినా అవే విషయాలు రైల్లో ఒకరు చర్చిస్తూంటే అంతో యింతో ఆసక్తి చూపించక తప్పలేదు.

'ఈ మధ్య సరిహద్దు ప్రాంతాల్లో పొరుగుదేశం పెట్టిన అల్లరీ చూపించిన దురా క్రమణ బుద్ధీ తక్కువదేం కాదు. కాశ్మీరు వేసవికేంద్రమైన గుల్మర్గ్ చుట్టుపట్ల మొట్ట మొదట ఈ అల్లరి ఆరంభ మయిందని అంచనాలు వేస్తున్నారు. ఆ నెల మొదట్లో కాబోలు గ్రామస్థులు అనుకున్నారు: 'ఇదేమిటి. ఎప్పుడూ ఎరగని ఇన్ని కొత్త మొహాలు ఊళ్ళో కనిపిస్తున్నా యేమిటీ' అని. కొందరు బుద్ధిమంతులైన కాశ్మీరీలు అధికారులకు ఈ వర్తమానం అందజేశారు. కాశ్మీరు ప్రభుత్వం తక్షణచర్య తీసు కునేలోగానే అప్పుడే అనేక ముఠాలు మన సరిహద్దురేఖ లోపలివైపున యించు మించు పదిమైళ్ళు చొచ్చుకువచ్చి అక్కడక్కడ మకాములు ఏర్పరుచుకున్నారు. కొందరు శ్రీనగర్ విమానాశ్రయంవైపు, మరికొందరు రహదారీని అడ్డంగా తవ్వెయ్యడానికి. అంతా ముందు కుట్ర చేసి ఒక్కమారు దెబ్బతీద్దామనీ, అంతరంగి కంగా మతకలహాలు రేపి, కాశ్మీరును కొల్లగొడదామనీ. కాని మన దళాలేనా అంత చేతకానివి? మన విమానాశ్రయాన్ని రక్షించుకున్నాయి. మన గస్తీదళాలు శ్రీనగర్ చుట్టూ మరింతగా పటిష్ఠం చెయ్యబడ్డాయి. ఇలా ఒకచోట వేసుకున్న కుతంత్రం

నాశనం కావడంతో భారీఎత్తున కాల్పులు సాగించి, అంతర్జాతీయ సరిహద్దు దాటి, ప్రచ్ఛన్నసమరాన్ని బాహాటంగా యుద్ధమని ప్రకటించారు.'

నా ప్రక్కనే కూర్చున్న మరొక ముసలాయన అన్నారు 'నిరంకుశ ప్రభుత్వానికున్న దృష్టిలోపమే యిది. ఏమిటంటే శాంతికాముకదేశాన్ని చేతకాని దేశంకింద జమకట్టడమే ఆనాడు పోట్లాటకి వచ్చిన రోగమూ ఇదే. మూడేళ్ళ



క్రిందట చైనీయులకు పుట్టి అగ్నిపర్వతంలా లోలో శాఖలు దింపుకుంటున్న విష బీజమూ ఇదే. కాని మనవాళ్ళు ఎంతచక్కని పౌరం చెబుతున్నారు! ఎంత క్రమ శిక్షణ పాటిస్తున్నారు ఆ నాటి మన పూర్వుల ఆదర్శాలకు యీ ఇరవయ్యో శతాబ్దంలోకూడా నిలబడి నెగ్గుకురావడం ఎంత ఘనకార్యం! ఎంతగొప్ప విజయమిది!!'

అందరు ప్రయాణీకుల్లో ఒక్కసారి సమరోత్సాహం పెల్లుబికింది పట్టలేని ఉద్రేకోత్సాహాలతో అందరూ ఒక్కసారి జయజయధ్వానాలు చేశారు. 'జై హింద్, జై జవాన్' అని అరచే అరుపుల్లో కెనేడియన్ ఇంజను కూతకూడా ఎవరికీ వినబడ లేదు. వ్యక్తిగతమైన నా వ్యధలూ బాధలూ ఒక్కసారి ఎక్కడికి పోయాయో తెలియదు. ఒళ్ళుతెలియకుండా కేకలు వేశాను కుడిచెయ్యి ఎత్తి పిడికిలి బిగించి ఉద్రేక ఉత్సాహాలతో అరచాను.

## 6

టేక్సీమీద మాధవసేవాసదనానికి చేరుకున్నాను. ఊరికి దూరంగా, ప్రశాంతంగా ఉన్న అయిదెకరాల కొబ్బరితోటలో అక్కడక్కడ నిర్మించబడిన కుటీరాల గుంపు అది అనుకోకుండా అక్కడ ప్రత్యక్షమైన నన్ను చూసి మా వ్యాసమూర్తి ఆశ్చర్యపోయాడు. వాడిలో నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఎన్నేళ్ళయినా ఏమాత్రమూ మార్పు లేకపోవడం. అక్కడికి నేను ఎందుకు వచ్చానో వాడు అడక్కుండానే నాకు తోచిన ధోరణిలో కల్పించి చెప్పేను. వాడు అడ్డుప్రశ్న లేపీ వెయ్యలేదు. నేను చెప్పింది ఎంతవరకు నమ్మేడో ఆ మొహం చూస్తే నాకు బోధ పడలేదు.

'చదువన్నది పూర్తయిందా?' అన్నాడు.

'అయింది జ్ఞానమన్నది ప్రారంభమయిందికూడా!' అని ఆ జవాబుకు నేనే ఆశ్చర్యపోయాను. నిర్మలమూ, నిశ్శబ్దమూ అయిన అక్కడి వాతావరణమే నన్నలా అనిపించిం దనుకున్నాను. అలా అంటూంటే నా కళ్ళమ్మట గిర్రున నీళ్లు తిరిగాయి

'కఠోరమైన కర్తవ్యనిష్ఠకేగాని కన్నీళ్ళ కిక్కడ తావులేదు.' అన్నాడు వ్యాసమూర్తి కఠినంగా.

'కాని కనపడకపోయినా కన్నీళ్లు ఉండొచ్చు. కళ్ళతో చూడలేని గాయాలు ఉండొచ్చు. వాటిమాట?'

'వేదన చాలదు. సాధన అవసరం,' అంటూ నా జవాబుకి ఎదురు చూడకుండా ఏదో పనిమీద వెళ్ళిపోయాడు.

అక్కడ అంతా ఓ వారంరోజులు ఉన్నాననుకుంటాను. ఆ కార్యక్రమమంతా పరిశీలకుడిగా కాక పరివ్రాజకుడిగా చూశాను. అంగవిహీన శరణాలయమూ, కుష్ఠు వ్యాధి నివారణ కేంద్రమూ, భక్తి గ్రంథమాల అనబడే లైబ్రరీ, వేదపాఠశాలా, కళాకేంద్రమూ — యివి మాధవసేవాసదనంలో కొన్ని అనుబంధకుటీరాలు. ప్రతి రోజూ ప్రార్థనలు, భక్తిబోధనలు జరుగుతాయి. మతకులవర్గభేదం లేకుండా, ఎవరి కే ఆపద జరిగిందని తెలిసినా శక్తికొలదీ సేవాకార్యక్రమాలద్వారా ఈ సంస్థ ఆదు కొంటుంది. నేను అక్కడికి వెళ్ళిన సాయంకాలమే రక్షణనిధి వసూలు చేసుకుని సేవాదళం వాలంటీర్లు సేవాసదనానికి తిరిగివచ్చారు.

'అమ్మ నిన్ను పిలుస్తోంది' అన్నాడు ఒకరోజున మా వ్యాసమూర్తి.

'నిజమే, పదిపదిహేను రోజు లయిపోయింది ఇల్లు విడిచి. ఒక ఉత్తరమైనా రాశాను కాను' అన్నాను నాలో అనుకున్నట్టు. వ్యాసమూర్తి చిరునవ్వుతో నా వైపు చూశాడు.

'అమ్మ అంటే నీ అమ్మ సుభద్రమ్మ అని నా ఉద్దేశం కాదు!'

నా ఆశ్చర్యాని కంతులేకపోయింది.

'నీకూ నాకూ అందరికీ అమ్మ, మన అమ్మలందరికీ అమ్మ. మనల్ని కని కనిపెట్టే మన దేశం, మన భారతమాత. మనదీ ఒక జాతి అనీ, మనకీ ఒక సంస్కృతి ఉందనీ, తలెత్తి మనం నలుగురిలో చెప్పుకోవలసిన మన పుణ్యమూర్తి మన ఆర్యభూమి. అమ్మ ఆపదలో ఉండి నిన్ను పిలుస్తోంది.' యుద్ధంలో చేరమని మా వ్యాసమూర్తి నన్ను ప్రోత్సహిస్తున్నాడన్నమాట. నాకూ క్కడా నవ్వు రావడానికి కారణముంది మరి.

'గాలి వీచడంలో, నీరు ప్రవహించడంలో, పక్షుల కిచకిచలలో, ప్రకృతి చేసే మృదుసవ్వడులు తప్ప, నిశ్శబ్ద వాతావరణంలో నిర్మలంగా ఉండే ఇంతటి ప్రశాంత ఆశ్రమసీమలనుండి నువ్వేనా వాసూ నన్ను యుద్ధభూమికి పంపుతున్నది?'

వ్యాసమూర్తి స్పష్టంగా, స్వచ్ఛంగా చెప్పిన జవాబు నే నెప్పుడూ మరువలేనిది. 'అవును మనం శాంతిప్రియులం. అహింసాప్రియుడైన అశోకుని ధర్మచక్రం మన పతాక — చరిత్రలో పతాకశీర్షిక. అయితే — దాని అర్థం అహింసావాదులు అసమర్థులనా? శాంతి స్థాపకులూ, సత్యకాముకులూ అయిన గాంధీ జవహరులు మనకు సదా స్మరణీయులు. అయితే — దాని అర్థం భారతీయులు పనికిమాలినవా రనా? మనం ఎవరిమీదా కత్తి కట్టలేదు. మన ప్రతిష్ఠ ఆపదలో ఉంటే మాత్రం

అడ్డుకొని తీరతాం. ఎవరి పరిధిలో వారు, ఎవరికి చేతనయినంత వారు దేశమాతక రుణం తీర్చుకోవలసిన సమయం ఆసన్నమైంది.'

'అయితే నన్నిప్పు డేం చెయ్యమంటావ్ వాసూ ?'

'ఎందుకూ పనికిరానివా రనుకొనే పసిపాపలూ, స్త్రీలే అనేకవిధాల దేశసేవ చేస్తూంటే యిన్నాళ్ళ నీ చదువుని ఉపయోగించవలసిన తరుణం ఇదేనని నీకు గుర్తు అవడంలేదా ? ఒక సైనికుడయితే పదిమంది శత్రువుల్ని చంపుతాడు. ఒక సైనిక వైద్యుడైతే వందమంది మిత్రుల గాయాలకు కట్టుకడతాడు. నీ కర్తవ్యం ఎంత గురుతరమైనదో నువ్వే నిర్ణయించుకో.'


నిజానికి నే నేమి నిర్ణయించుకోలేకపోయాను ఆ మర్నాడే మా అమ్మకి సీరియస్‌గా ఉందని టెలిగ్రాము వచ్చింది. మా వ్యాసమూర్తితో చెప్పనైనా చెప్పకుండా నేను రైలెక్కేశాను

*　*　*　*　*

చేసినపనికి దార్లో అనేకవిధాల సిగ్గూ, అవమానమూ దహించివేస్తున్నా, దేశం యొక్క క్లిష్టపరిస్థితీ ప్రతిపౌరుని బాధ్యతా చెవులు హోరెత్తుతున్నట్టు వినిపిస్తున్నా- అమ్మ కెలా ఉందో, హఠాత్తుగా ఏం జబ్బు చేసిందో, కళ్ళతోనయినా చూడగలనో లేనో అనుకుంటూ యిల్లు చేరుకున్నాను. అమ్మని చూసి నా ఆశ్చర్యాని కంతులేక పోయింది - అమ్మ మామూలు ఆరోగ్యంతో ఉంది !

నాన్న అన్నారు· 'ఎప్పుడూ లేంది ఇన్నాళ్ళు ఎక్కడికి వెళ్ళిపోయావో అని మీ అమ్మ ఒకటే బెంగపెట్టుకూర్చుంది విజయా ! విశాఖపట్నానికీ, మద్రాసుకీ ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాంలు యిస్తేగాని ఊరుకుందికాదు. ఐనా ఎక్కడి కెడితే అక్కడ ఉండిపోవడమేనా ? ఒక్క ఉత్తరమ్ముక్క రాస్తే నీసొమ్ము ఏంపోయింది ? అదిగాక అనుకోకుండా అప్పటికప్పుడు కాసులమ్మకి పెళ్ళి కుదిరింది. నీకు ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం రాశాం, అందలేదూ ? ఎల్లుండే పెళ్ళి. అన్నట్టు వాసు ఎలా ఉన్నాడోయ్ ?'

అమ్మ వాసుగురించి మరీమరీ ఆడిగింది. నేను చెప్పేను. పెళ్ళికి రమ్మని వాడికి టెలిగ్రాముకూడా యిప్పించింది. అదీగాక నేనూ, నాన్నా ఉత్తరంకూడా రాశాం. వాడు రానూలేదు జవాబూలేదు ! దాని పెళ్ళయినంతసేపూ అమ్మ వాసుని తలచుకొని కళ్లు తుడుచుకుంటూనేఉంది. మా బావ సుగర్‌ఫ్యాక్టరీలో అసిస్టెంటు కెమిస్టుగా ఉన్నాడు. వాళ్ళది బాగా పెద్దకుటుంబం. ఇదే పెద్దకోడలు. పెళ్ళి అవగానే కార్యం చేసేసుకుని వెంటనే కాసులమ్మని కాపురానికి తీసికెళ్ళిపోయారు. మాఅక్క-




దానితోకూడా వెళ్ళి ఒక వారంరోజులు అక్కడుండి, అక్కణ్ణుంచి వాళ్ళఊరు – బిలాసపూరు వెళ్ళిపోయింది. మీకు చెప్పలేదేమో మా పెద్దబావకి రైల్వేలో పని.

గీతనుంచి ఉత్తరం వచ్చింది ఒకనాడు. ఆతృతగా చింపాను. ఆ రోజు నేను అనకాపల్లిలో వాళ్ళింట్లోంచి వెళ్ళిపోయేముందు నేను పొందిన అవమానానికి తన తల్లితండ్రుల తరఫున తన్ను క్షమించమని మొట్టమొదట రాసింది గీత.

'మిమ్మల్ని చూస్తే మొట్టమొదట్నుంచీ పవిత్రమైన భ్రాతృసంబంధం తప్ప నాకు మరొక ఆలోచనేలేదు. అంతేకాక, మీకు నాపైన మరొకరకమైన భావం ఉందని – అదలా ఉదయించి వికసించడానికి నాకు తెలియకుండా నేను దోహదం చేశానని కలలోకూడా అనుకోలేదు. విశాలమైన సేవాదీక్షకీ, సంకుచితమైన సంసారిక జీవనానికీ పొత్తుకుదరదని నా ఉద్దేశం ఎప్పుడూ అలాంటి భావాలే నాలో కలగలేదు. పద్దెనిమిదేళ్ళ వయసులో యిటువంటి మనస్తత్వం ఆశ్చర్యమైతే అవుగాక, నా విషయంలో మాత్రం ఇది నిజం. అంతవరకు ఆత్మీయుల్లా ఉన్న మీరు ఒక్కసారిగా ఏదో కొత్తగా చూసి, కొత్తమాటలు ఉపయోగిస్తూంటే, నిజంగా నేను బెదిరిపోయాను. చేతికందినది ఏదో పోయినట్టు చెప్పలేని దుఃఖం ముంచుకొచ్చింది. ఒక పట్టాన నేను మామూలు స్థితికి రాలేదు. వచ్చాక వీధిలోకి వచ్చి చూస్తే మీరు

లేరు. మా అమ్మా నాన్నా మాటల్నిబట్టి మిమ్మల్ని వా రేదో అనరాని మాటలని పంపించివేసినట్టు తెలుస్తోంది. దీని కంతటికీ నేనే కారణం; నన్ను క్షమించండి.'

ఆ తరవాత ఆమె రాసిన సంగతులు నాకు కొత్తవి. ఆ రోజు గీత తల్లితండ్రులు యింటికొచ్చారే–వస్తూనే ఏదో కలకత్తా సంబంధమట, నిశ్చయించుకు వచ్చేశారట. గీత అవుననన్నూ లేదు. కాదననూ లేదు!

'ఎందుకే అమ్మాయ్, అలా వెర్రిచూపులు చూస్తావ్? ఆ మధ్య నిన్ను చూడ్డానికి వచ్చాడే–కలకత్తాలో పని చేస్తున్నానని చెప్పలేదూ–అతనే. ఏం, నీ కేం నచ్చలేదా?'

గీత మాటాడలేదు.

'అసలు పెళ్ళే చేసుకోవా యేమిటే?!' అని సుందరమ్మగారు నిలదీసింది. గీత కళ్ళల్లో నీటిచుక్కలు నిలిచాయి.

'శుభమా అని అదేమిటే తల్లీ! అంత పెద్ద సంబంధం కుదిరిందని మేం పొంగిపోతూంటే ... అయ్యోరామ! ఎక్కడ పోగయిందండీ ఈశుద్ధ బుద్ధావతారం.' కేశవరావుగారు సుందరమ్మగార్ని ఆగమనీ, అక్కణ్ణుంచి వెళిపొమ్మనీ సంజ్ఞ చేశారు. ఆవిడ గుమ్మంలో నిలబడ్డ కొడుకుని తీసుకుని గబ గబా లోపలికి వెళ్ళిపోయింది. మొదట్నుంచీ గీతకి వాళ్ళమ్మకన్న నాన్నగారిదగ్గిరే చనువు ఎక్కువట.

'చూడమ్మా, నీ కిష్టంలేందే పెళ్ళిచెయ్యం. అసలు నీ అభిప్రాయ మేమిటో నాతో స్పష్టంగా చెప్పు. పెళ్ళి చేసుకోకుండా ఏం చేద్దామని?'

గీత గదిలోకి వెళ్ళి ఆరోజు పేపరు తీసుకొచ్చి ఒకపేజీ వాళ్ళ నాన్నగారికి చూపించింది. 'చూడునాన్నా! వియత్నాంలో యుద్ధం మరీ ఘోరరూపం దాల్చిందిట. పాపం! ఎంతోమంది కాళ్ళూ చేతులూ లేనివాళ్ళయిపోయారట. ఎంతోమంది రెడ్‌క్రాస్ మహిళలు సమయానికి ఆదుకుని వాళ్ళ గాయాలకు కట్లుకట్టి ధైర్యం చెప్పేరుట. ఇంటింటికీ వెళ్ళి క్రైస్తవమతప్రచారిణులు ఎంతోడబ్బు పోగుచేసి వాళ్ళ కుటుంబాలకు పంపించారట. ఇంతకన్న జన్మకి సార్థకత ఏముంది నాన్నా ... నేనూ నా కుటుంబమూ నా పిల్లలూ అని కూచుంటే వీళ్ళంతటి మహోత్తమమైన సేవ చెయ్యగలిగేవారేనా నాన్నా?'

కేశవరావుగారు కూతురివైపు లాలనగా చూస్తూ అన్నారు: 'వీళ్ళు చేసినకృషి అన్నివిధాలా శ్లాఘించవలసిందే. లభించే అవకాశాలనుబట్టి సేవాధర్మం యొక్క తత్వం మారుతూంటుందమ్మా గీతా! ఇంతకీ ఈ సంఘసేవికల కందరికీ జీవితంలో మరొక అవకాశం లేక ఆత్మాంకితం చేసుకోలేదని నువ్వెలా చెప్పగలవ్?'

'అలా కాదనిమాత్రం నువ్వెలా చెప్పగలవ్ ?'

ఆయన నవ్వుతూ అన్నారు: "మనకి లభించే విజ్ఞానపరిమితినిబట్టి మన అంచనాలు ఉంటాయి. ఎక్కడైనా సంప్రదాయాన్నిబట్టీ దేశకాలరీతుల్నిబట్టీ సేవాధర్మం మారుతూఉంటుంది. ఇంతకీ సాంఘిక సేవకి సంసారజీవనం ఎలా అడ్డొస్తుందో నా కేం అర్థం కావడంలేదు. స్వధర్మాన్ని విడిచిన, మించిన సందర్భం అంటూ ఎక్కడుంది ? సంఘసేవికల్లో చాలామంది సంసారజీవితంకోసం తహతహలాడుతున్నవారే... ఆశ్రయాన్ని కోరే స్త్రీ మొదట తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటేనే ఎవరికైనా సహాయం చెయ్యగలదనుకుంటాను.' గీత తను చెప్పేది జాగ్రత్తగా వినడంచూసి ఆయన ఇంకా చెప్పేరు: 'మీ అమ్మ, అమ్మమ్మ – వీళ్ళ జీవితాలన్నీ నిరర్థకమని అనగలమా ? మీ అమ్మమ్మ నెవరు పిల్చినా వాళ్ళని కాదనకుండా వెళ్ళి పెళ్ళిపనులు చేసేది, ఊరగాయల పాళ్ళు వేసిపెట్టేది. నొప్పులు రాగానే వెళ్ళి పురిటిస్నానం చేయించివచ్చేది, ఇరుగు పొరుగుల కెవరికైనా సరే. ఇదంతా సాంఘిక సేవ కాదంటావా? ఈ క్షణాన నువ్వు ఏనర్సు ట్రెయినింగుకో వెడితేమాత్రం ! ఎల్లకాలం అవివాహితగా ఉండి నీ శరీరధర్మాన్ని కాదనగలవా ? సాంఘిక విమర్శల్ని కాదనే మనోనిగ్రహమూ, ఆత్మధృతీ నీ కున్నాయా ? ఆలోచించి చెప్పు.'

గీత మాటాడలేదు.

'మాకా ఏ పదిమందో లేరు; నువ్వూ, బాబిగాడూను. నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మీ అమ్మను కాదని మరెవరూ తొక్కని దారివిపట్టి నువ్వు జయించి రాగలవా ? నీ సాంఘిక సేవ నీ కన్నతల్లి మనసు నొప్పించడంతోటే ప్రారంభమౌతుందా ?'

గీత కళ్ళనీరు నింపుకుంది.

'చూడు తల్లీ... తల్లిదండ్రులకన్న నీ క్షేమం కోరేవారుండరు. నీమనసు చాలా మెత్తనిది. కాని నువ్వు సుఖపడాలన్నా యింకొకరికి సుఖం పంచిపెట్టాలన్నా మంచితనం, మెత్తదనంకన్న లోకజ్ఞానం ఎక్కువ అవసరం. దేశాన్ని స్వర్గం చేసేముందు నీయిల్లు నందనవనం చేసుకో."

కేశవరావుగారు సుందరమ్మగార్ని కేకేశారు: "ఇదిగో, ఏమోయ్! ఇంతలో ఎక్కడికి పోయావ్ ? ఇలారా ... నీకూతురు పెళ్ళికి ఒప్పుకుంది. మరి ఎంత తొందర్లో ముహూర్తం పెట్టిస్తావో, నీదే ఆలశ్యం.'

సుందరమ్మగారు, కూతురు బుగ్గలు పుణికింది. ఇవన్నీ వివరంగా రాస్తూ గీత ఆఖర్న రాసింది:


'కనీసం ఒకరికి సంతోషం కలిగించి నీ పని ఆరంభించు — అన్న సూత్రం ప్రకారం, కన్న తల్లిదండ్రులకు ఆనందం కలిగించేటట్టు — మొన్న దశమీ శనివారంనాడు తిరుపతిలో వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మా వివాహం అతి వైభవంగా జరిగింది. గృహిణిగా నాకు కావలసినవారి సందర్శ్నే ప్రతి నిముషమూ ఆనందింపజెయ్యడానికి ప్రయత్నిస్తాను. కాని నేను చేరుకోబోయే గమ్యస్థానానికి నా సంసారజీవితం మొదటిమెట్టు మాత్రమే. విశ్వవిస్తృతమైన సేవాభాగ్యం ప్రసాదించమని మీరు నాతోపాటు భగవంతుణ్ణి ప్రార్థించండి విజయకుమార్ !'

* * *

నాకు ఊపిరి తిరక్కుండా పెళ్ళిసంబంధాలు రాసాగేయి. ఎంత కావలిస్తే అంత కట్నం యివ్వడానికి సిద్ధంగా ఉన్నామనీ, అవసరమైతే పైచదువులు చదివించడానికి ఆర్థికంగా సహాయం చెయ్యగలమనీ...,ఇలా అనేకరకాలు. నేను ఎప్పటికప్పుడు ఎవేవో చెప్పి తప్పించుకుంటూవచ్చాను. 'ఇష్టం లేకపోతే పిల్లని చూసిరా...మనం అనుకున్నప్పుడల్లా మంచి సంబంధాలు రావు — గీత పెళ్ళికి మనకి శుభలేఖైనా పంపలేదు. వాళ్ళని తలదన్నే సంబంధం తీసుకొస్తాను,' అన్న అమ్మ మాటకి తాటిప్రమాణాన లేచిపోయాను: 'నా ప్రాక్టీసు వ్యవహార మేదో తేలేలోగా మళ్ళీ యీ ఊసు ఎత్తేవంటే మళ్ళీ కనపడకుండా పారిపోతాను.' నా దగ్గరయితే ఆ ప్రసక్తి మానేసింది కాని నాన్నదగ్గిర రోజుకి ఒకమాటయినా ఆ ప్రసక్తి లేనిదే అమ్మ ఉండలేకపోయేది.

కన్నకూతుళ్లు యిద్దరూ అత్తారిళ్ళకు పోగా, పెంచినవాడు మరి కనిపించకపోగా, మాట్లాడ్డానికేనా వీల్లేనంతగా నేను కట్టుదిట్టం చెయ్యగా ఎంతసేపు నడుం వాల్చినా తరగని మధ్యాహ్నపువేళల్లో మా అమ్మ కన్ను మూస్తూండగానే...

...కాదు, చూస్తుండగానే ఆ మధ్య హాల్లోకి ఒళ్ళుగా ఉన్న ఓ తెల్లని పిల్ల వచ్చేస్తుంది. చేతినిండా గాజులు, కొప్పునిండా పువ్వులు, కళ్ళనిండా కాంతులు. 'అదేం అత్తయ్యా! అలా పడుకున్నారు, లేవండి? చిక్కుడుకాయలు ఒలుద్దాం' అంటుంది. చిక్కుడుకాయలు జంగిట్లో పోసుకుని యిద్దరూ ఒలుస్తూండగా 'అయ్యో పాపం, తలుపుకి జారగిలబడి ఎలాకూచున్నారో; పెద్దకాలం...నడుం నిలబడదు మరి...పాపం పడుకున్నవారిని ఎరక్కపోయి పిలిచాను ఒక్రైసీ అయితే అదోలా ఉంటుంది నాకు; అందుకని ఉండబట్టక పిలిచాను' అంటుంది 'మహలక్ష్మి'.




ఎంత అభిమానం! 'అయితే అత్తయ్యా! చిక్కుళ్ళు ఏం చెయ్యమన్నారూ? వేయించుకుందామా, లేకపోతే పులుసూబెల్లం పెట్టి ఒండుకుందామా?' లక్షాధికార్ల ఇంట్లోంచి వస్తేనేం, సాంప్రదాయం ఎక్కడికి పోతుంది వీసమెత్తు గర్వమైనా ఉన్నదా పిల్లకి,..ఎంత చిన్న విషయమైనా తనని అడగందే చెయ్యదే! అమ్మ ఆనందం భరించలేక కళ్లు తెరుస్తుండగనే

...కాదు, మళ్ళీ మూసుకున్నా రాదు అంత చక్కని కల!

పిచ్చిఅమ్మ అక్కడలా ఊహించుకుంటూంటే, వెర్రినాన్న యిక్కడ స్నేహితుడితో చెప్పుకునే అంచనాలు ఇలా ఉంటాయి

'ఇక్కడ కుర్చీలో మా అబ్బాయి కూచుంటాడు. ఇలా పేషెంట్లు వచ్చి యీ సందులోంచి వెళ్ళిపోతుంటారు. పక్కపెరడుకూడా కొనేసి రెండు గదులు వేయిస్తే కొద్దిమంది రోగులయినా యిక్కడ ఉండడానికి వీలవుతుంది అస్పత్రీ యిల్లూ ఒకచోట ఉంటే భరించడం కష్టమేమో! కష్టానికేముంది, ఉన్న ఒకడూ కళ్ళెదుట ఉంటాడు అయినా అటూయిటూ తిరుగుతూంటే వాడి ఆరోగ్యం పాడైపోదూ? మందులకి మొదట్లో రెండు బీరవాలు చాలనుకుంటాను. అన్నట్టు నాకు మతే లేదు. ఆపరేషనుబల్ల ఒకటి ఉండొద్దూ? వీధివసారాలో పేషెంట్లు కూచోడానికి రెండు బెంచీలు సరిపోతాయా? ఏకంగా పురమాయించుకుంటే కలవ

కలిసొస్తుంది. ఓ కాంపౌండరూ, మరో నౌఖరూ, ప్రారంభంలో యిద్దరుంటే చాలంటావా? ఏదైనా భారీఎత్తున మొదలెట్టాలి. మొదట్లో కక్కుర్తిపడితే దెబ్బ తినేస్తాం బాగుంది, అసలుసంగతి మరిచేపోయాను. వీధిలో బల్లమాటో? కర్రదా, ఇత్తడిదా? ఛఛ...కర్ర దేం బాగుంటుంది మంచి నగిషీఅక్షరాలతో తళతళ మెరవాలి మా అబ్బాయి పేరు!' నా ప్రైవేటుప్రాక్టీసు విషయమై ఊపిరి తిర క్కుండా యింట్లో పనులు జరుగుతున్నాయి

'ఒక్క ఏడాది వీడి ప్రాక్టీసు చూసి నేను రిటైరయిపోతాను,' అని నాన్న అంటే, అమ్మ ముసిముసినవ్వు నవ్వుతూ అంది 'మీకూ నాకూ రిటైరవడ మంటూ ఉండదు.'

'మధ్య నువ్వు రిటైరవడ మేమిటి, ఉద్యోగం సద్యోగం లేనిదానివి!'

'బాగుంది, ఇంట్లో నేను వంటవుద్యోగం చెయ్యకపోతేనే యిన్నాళ్లూ మీరు బయటఉద్యోగం చేశారు కాబోలు! ఇదిమాత్రం శాస్త్రం కాదా! మీరు ఊం వందలూ వేలూ తగలేసి డింకీలు కొట్టికొట్టి డిగ్రీలు తెచ్చుచుంటారు మేం కాణీ ఖర్చు లేకుండా కేవలం చూసి నేర్చుకుని గౌరవపట్టాలని పొందుతాం.'

'ఏమో ఆశాస్త్రంలో మాత్రం మీకు పెద్ద పేరేముంది? నలభీమపాక మన్నారుగాని దమయంతీద్రౌపదీ పాకం అనలేదుకదా!'

'అ రాసినవాడు మొగాడయితే యిం కెలా రాస్తాడు మరి?'

'బాగుంది కాని మన కిక రిటైరవడం లేదంటావేం?'


'తీరిక ఉండొద్దూ?'

'నీ బదులు కోడలు యింట్లోపనీ, నా బదులు కొడుకు పైపనీ సవరిస్తే కాళ్లు జాపుకుని కృష్ణారామా అనుకోక మన కేం పనే?'

'బాగుంది కదూ? ఏళ్లు గడిచినకొద్దీ బిలబిలమంటూ పావురాల గూడులాగ యిల్లంతా మనవలతో మనవరాళ్ళతో నిండిపోదూ? అలోపొలోమంటూ గునగున మంటూ కిచకిచలాడుతూ పడుతూ లేస్తూ ఆగిలిగిచ్చకాయలు మనల్ని నిలబడ నియ్యొద్దూ?'

నాన్న నవ్వేరు. అంతకన్న గట్టిగా నేను నవ్వేను నవ్వుతూంటే నా హృదయం లోలోన ద్రవించిపోయింది. ఆ అమాయకజీవుల ఆనందాన్ని అడ్డుపెట్టడానికి నా కేమి హక్కుంది? అనిపించింది ఆవాళ నింపుదామనుకున్న అపికేషనుఫారాలు అప్పటికి వాయిదా వేశాను అవి చూస్తేనే గుండె దడదడ లాడుతోంది!

గీతదగ్గర్నుంచి మరొక ఉత్తరం వచ్చింది. తన కొత్తకాపురంలో తొలి రోజులు ఎలా గడిచాయో వివరించి రాసింది ఇదివరకు ఉత్తరంకన్న బాగా పెద్దదే.




‘మేము కలకత్తాలో ఉంటున్నామనీ, ఆయనకి ఛటర్జీ ఆటోమొబయిల్సు అనే ప్రైవేటు ఫర్మ్‌లో నెలకి వెయ్యి రూపాయిలు జీతంగల ఉద్యోగమనీ మీరు వినే ఉంటారు అత్తగారూ, మామగారూ, యిద్దరుమరుదులూ మాతోపాటే మా సొంత భవనంలో ఉంటున్నారు మేమూ యిళ్ళూ వాకిళ్ళూ తోటలూ దొడ్లూ బాగా ఉన్న వాళ్ళమేగాని యిన్నిరకాల సౌఖ్యాలూ సదుపాయాలూ ఏరగం మాకంటె అనేక విధాల ఉన్నవాళ్లు వీళ్ళు.

ఆయ నెందర్నో జమీందార్ల పిల్లల్ని చూశారట నన్ను చూసినతరువాత వాళ్ళ అంతస్థుకు మేం అందకపోయినా – మరొకపిల్లని చూడ్డానికి ఒప్పుకోక నన్నే పట్టుపట్టి చేసుకున్నారట

అందరికీ వేరే వేరే గదు లున్నాయి. మాకు వీధివైపు మేడమీద విశాలమైన గదులు వేరే ఉన్నాయి. మనం కదలక్కర్లేకుండా అన్నీ దాసీవాళ్ళే కూచున్న చోటికి తీసుకొస్తారు. మా అత్తగారూ, మామగారూ మరదులూ అందరూ చాలా మంచివాళ్ళు. ఆయన సరేసరి – నన్ను కాలు కింద మోపనియ్యరు. నా ముఖంలో లక్ష్మీకళ ఉందిట. మా అత్తగారు నన్ను లక్ష్మి అని పిలుస్తారు. ఆయన కళా అంటారు.

మా చిన్నమరిది శ్యాంప్రసాద్ చాలా ముద్దొస్తుంటాడు. నేను రాగానే వాణ్ణి ముద్దెట్టుకుని చంకనేసుకున్నాను.

'అదేమిటి కళా, దింపు దింపు... అసలే అతినీర్సంగావున్నావు. వాడు చూస్తే దుబ్బులా ఉన్నాడు. కళ్ళు తిరిగి పడిపోగలవు. వెంటనే దింపు. బాగుంది కర్మ!' అన్నారు.

ఇంకో గడియకి ఆయన బూట్లు నేను పాలిష్ చేస్తూంటే, మా పెద్దమరిది అటొచ్చి: 'ఛ ఛ! వదినా, అదేంపని! వెంటనే లేస్తారా అన్నయ్యాని పిలవమన్నారా? ఇలాంటి పనులు చెయ్యడానికి మీ కేం ప్రారబ్ధం!' అన్నాడు.

ఆ సాయంకాలం తోటలోకి వెళ్ళి మల్లెమొగ్గలు కోసుకుంటూంటే 'పనిమనిషి కోసి దండ గుచ్చిపెడుతుందమ్మా లక్ష్మీ! ఇవాళ నువ్విలా అలవాటు చేశావంటే నెత్తికెక్కి కూచుంటుంది ... ఇంకా అలా చూస్తావేం, లేచిరా, నీకెందుకా దురవస్థ!' అంది మా అత్తగారు.

ఆ రాత్రి గదిలో బొత్తిగా పాలిపోయిన మొహంతో కూచున్నాను. 'పిల్లాణ్ణి ఎత్తుకోవడం కర్మ! ఇంట్లో పని చేసుకోవడం ప్రారబ్ధం! మనకై మనం పువ్వులు కోసుకోడం దురవస్థ! భగవంతుడా! నా ప్రత్యణువూ ఎవరికైనా ఏ ఉపకారమేనా చేద్దాం అని కొట్టుకుపోతూంటే, నా పనులుకూడా నేను చేసుకోనోచుకోని యిక్కడ పడేసి నవ్వుకొంటున్నావా!' అని విలపించాను.

'అదోలా ఉన్నావేం? మీవాళ్ళమీద మనసయిందా?' అన్నా రాయన.

'ఏం లేదండీ!' అని కొట్టిపారెయ్యడానికి ప్రయత్నించాను.

'లేకపోవడ మేమిటి? నీ మొహంలో బెంగ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ నీకు బాగా కొత్తగా ఉన్నట్టుందికదూ!'

'మీరందరూ ఉన్నారు, నా కేం లోటు!'

'ఆ మాట నీ హృదయంలోంచి రావడంలేదు. నాలికమీంచి వస్తోంది, అంతే. మీ వాళ్ళను విడిచిపెట్టడం కష్టమయింది కదూ?'

అవుననక తప్పలేదు. ఆయన నా మెడచుట్టూ చెయ్యి పోనిచ్చి బుగ్గను తాకుతూ అన్నారు: 'కొన్నాళ్ళయాక 'మీవారిని' విడిచిపెట్టడం కష్టమవుతుంది కదూ!'

* * *

ముందు బాగా ఆలోచించుకుని ఒకనాడు ఆయనతో అన్నాను: 'చిన్న కోరిక తీరుస్తారా?'

'అంత మరీ చిన్నదయితే తీర్చలేను. బాగా పెద్దకోరిక కోరుకో.'



'అలా హాస్యం పట్టిస్తే నే చెప్పను. చాలా ముఖ్యమైన విషయం.'

'మీకు ముఖ్యమైన విషయమంటే అతిసామాన్యమైనది అయిఉంటుంది.'

'నన్ను బాగా పోల్చుకున్నారే!'

'లేకపోతే, ఎలా గెల్చుకున్నా ననుకున్నావ్?'

'మీరలా మాటకిమాట పేరిస్తే నా మాట చెప్పనేచెప్పను.'

ఆయన రెండుచేతులతో నోరు మూసేసుకున్నారు.

'చూడండి, మీ పనులు దాసీవాళ్లు చెయ్యడం నాకిష్టంలేదు. వాళ్లు సరిగ్గా చెయ్యడంలేదు. కనీసం మన రెండుగదులూ నేను శుభ్రం చేస్తాను. మీగది

సర్దుతాను. అంతేకాదు, మీ బట్టలు నేనే ఆరేస్తాను. మీ వంట నేను వండుతాను. కాదనకండి.'

ఆయన పెద్దనవ్వు నవ్వేరు: "భలే, భలే... ఇంటికోడలు యువరాణీ అని విన్నాంగాని పెద్దదాసీ అని ఇదివరకు వినలేదు ... ఈ యింటికి యిలాంటి పేరు ఇదివరకు లేదు మరి!' అని నవ్వడం ఆపేసి అన్నారు: 'ఇలాంటి వెర్రి మొర్రి ఆలోచనలు మానేసి పొద్దుపోయే వేళకి పున్నమినాటి చంద్రబింబంలా తయారయి ఉండు. మెట్రోలో మంచి బెంగాలీ సినీమా ఉంది.'

ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయారు. ఆశాభంగంతో అడుగులో అడుగు వేసుకుంటూ నేను మెట్లు దిగి కిందకివచ్చి, అలా లోపలివైపు వెళ్ళేను. ఎవరిదో మూలుగు వినబడుతోంది. దగ్గరకెళ్ళి చూశాను. అది మా పెద్దమరిది విశ్వనాథ్ గది. నిండా ముసుగు కప్పుకుని మంచంమీద పడుకునిఉన్నాడు. నా పాదధ్వని విని తలమించి ముసుగు తీసి చూశాడు. దగ్గిరగా స్టూలు లాగి కూచున్నాను.

'అదేమిటి వదినా, యిక్కడికివచ్చారు? నాకు జ్వరం వచ్చింది. టెంపరేచరు బాగాఉంది. అంటువ్యాధి కావొచ్చు. దూరంగా వెళ్ళిపొండి.' ఆ యింటి పరిస్థితులు ఎన్నాళ్ళయినా నాకు అయోమయంగానే ఉన్నాయి.

'అదేమిటి విశ్వం! నీకు జ్వరంగా ఉందని నాకు తెలియనివ్వారుకాదేం? నేను యింట్లో లేననుకున్నారా?'

'అమ్మకే తెలీదు వదినా! పొద్దుటే వచ్చింది. అదే తగ్గిపోతుందని ఫోంచేసే శాను. బాగా ఎక్కువైపోయింది. ఇప్పుడే నాన్నగారు ఆస్పత్రికి వెళ్ళేరు — బెడ్ బుక్ చేసుకువద్దామని.'

'అదేమిటి విశ్వం! ఎందుకూ?'

'ఇంట్లో ఎవరికేం రోగం వచ్చినా వెంటనే హాస్పిటల్లో ఎడ్మిట్ కావడం మాకు అలవాటు వదినా! ఏం, మీయింట్లో అలా చెయ్యరా? అక్కడ జరిగినట్లు అన్నీ కనుక్కోడం, వైద్యం చెయ్యడం ఇంట్లో జరుగుతుందా?'

నాకు కొత్తసంగతి ఇది. నేను జవాబు చెప్పలేని అవస్థ ఇది.

'అంతగా ఒణుకుతున్నావ్, చలిగా ఉందా బాబూ! దుప్పటీ కప్పనా? కాఫీ అదీ ఏదైనా కలిపియివ్వనా? తలనొప్పిగా ఉందేమో — తలపట్టనా? పోనీ కాళ్లు పీకు తున్నాయేమో, కొంచెం పట్టేదా బాబూ విశ్వం!'

'వదినా! మీ కొక్క నమస్కారం; ఇక్కణ్ణుంచి వెళ్ళిపొండి.'

చేతి కందినట్లున్నది చెయిజారిపోడం ఇది నాకు మొదటిసారి కాదు. ఇటు

వంటి అనుభవాలకు ఏనాడో హృదయం మొండితేరిపోయింది. బరువుగా అడుగులు వేస్తూ పూజామందిరంలోకి ప్రవేశించాను.

'నన్ను విష్ణుసహస్రనామం చదవమన్నారా అత్తయ్యా!

అత్తగారు రోల్డుగోల్డు కళ్ళజోడులోంచి నన్ను చిత్రంగా చూసింది: 'ఎందుకూ? మరో అయిదు నిమిషాల్లో బ్రాహ్మడు రాడూ?'

బ్రాహ్మడు రాడానికి పది నిముషాలు పట్టింది. ఈ పదినిముషాల్లోనూ మా అత్తగారు నన్ను దగ్గిర కూచోబెట్టుకుని తల నిమురుతూ తల వాచేటట్లు చివాట్లు పెట్టింది.

ఎన్నాళ్ళయినా నాకు మొహమాటం పోలేదనీ, ఏమి కావలసినా అడగననీ, సరిగ్గా తిండి తినడం లేదనీ, నీళ్ళు తోడుపుకోవడం, తల దువ్వుకోవడం—యిలాంటి పెద్దపెద్ద పనులుకూడా నౌకర్లు ఉండగా నేనే చేసుకోడం ఏం బాగులేదనీ, పళ్ళూ పాలూ సగానికి సగం ఉంచేస్తున్నాననీ—ఏదో మొదటివారం కదా అని ఊరుకున్నాను గాని యిక ముందు యిలా చేస్తే ఒప్పుకొనేది లేదనీ అడ్డమైన ఆరోపణలూ చేసి అందుకు శిక్షలో మొదటిభాగంగా ముద్దు ఒకటి పెట్టుకుంది; రెండవ భాగంగా దిష్టి తీయించింది!

* * * *

మా గది రెండంతస్థుల మేడమీద ఉంది. ఆ గదిని అనుకొని ఉన్న బాల్కనీలో పడక్కుర్చీలో తలకింద చేతులు పెట్టుకుని అలా ఆకాశంవైపు చూస్తూ గంటలు గంటలు గడపడమే నేను చూపించే విశ్వమానవప్రేమా, సాంఘిక సేవా కార్యక్రమమూను! నా ఆలోచనలు చుక్కల్లా మెరిసేవి. ఆకాశంలో ఉన్నన్ని రంగులూ దాల్చేవి. పక్షులంత వేగంగా పయనించేవి. మబ్బులన్ని రూపాలూ వేసేవి. కాని, తెల్లారితే చుక్కలూ లేవు, మధ్యాహ్నమయితే రంగులూ లేవు, చీకటిపడితే పక్షులూ లేవు, రాత్రయితే మబ్బులూ లేవు! మేనుమాత్రం అక్కడే; నేను మాత్రం ఎక్కడో!

ఊహాలోకం విడిచి ఉన్నలోకంలోకి వస్తే నాకు కనిపించే దృశ్యాలు నాకు దక్కకుండాపోయినదాన్నే స్ఫురింపజేసేవి. లేనిదానిపైపే మనస్సు కేంద్రీకరింపజెయ్యడం, ఆరంగు టద్దాలలోంచి చూస్తే అన్నివిషయాలూ అలాగే కనిపించడం అత్యంతసహజ మనుకుంటాను.


ఎదురుగుండా ఎనిమిదంతస్థుల మేడ ఉంది. కనీసం ఒక పాతిక మధ్యతరగతి కుటుంబాలయినా అందులో కాపురం ఉన్నాయనుకొంటాను. ఉన్న కాస్త వరండాలో

ప్రతిఒక్కరూ బట్టలు ఆరేసుకునేవారు. అందులో ఒకావిడ, ఎక్కడ ఊరి పోయేవో, ప్రతిరోజూ బండెడు బట్టలు ఆరేసేది. ఆవిడ బాగా లావుపాటి మనిషి. బాల్చీలో ఉన్న బట్టలు వంగుని నీళ్ళు పిడిచేటప్పుడూ, ఆమెకంటె కొంచెం ఏత్తుగాఉన్న తీగెమీద కొంచెం ఎగిరి బట్టలు పరచి ఆరేసేటప్పుడూ ఆమె మొహంలో ఎంతో ఆయాసం, ఊపిరి తీసుకోడానికి ఎంతో బాధా కనిపించేవి. ఓ వందమార్లైనా 'హరేరామ్' అనుకునేది. ఆమె కూతురో ఎవరో, పదేళ్లైనా ఉండవు, సన్నగా పీలగా రోగిష్టిదాన్లా ఉండేది-రెండు చేతుల్తోనూ రెండు బాల్చీలు మొయ్యలేక మొయ్యలేక మోసేది. అప్పుడప్పుడు ఆరిపోయిన బట్టలు బిల్లఎక్కి తీసేది.

సరిగ్గా ఆవిడకు ఎడంచేతిపక్క వాటాలో ఉన్న స్కూలుటీచరు - తెల్లారీ సరికల్లా ఆవిడ హడావిడి చూసితీరాలి. నలుగురు ఆడపిల్లలకీ మొగుడుకీ వండి పెట్టేది. నాలుగు రెళ్లు ఎనిమిదీ ప్లస్ తనది ఒకటీ, తొమ్మిది జడలు వేసేది! ఇక ఏమి పరుగో, ఏమి లోకమో! తొమ్మిదీ ఆయేసరికి ఒక చేత్తో పుస్తకాలూ, ఒక చేత్తో గొడుగూ-బస్సుకోసం పరిగెత్తుకుపోయేది.

మొదట్లో ప్రతినిముషం అమ్మా నాన్నా గుర్తుకువచ్చేవారు. పోనీ తమ్ముణ్ణయినా టెలిగ్రాం యిచ్చి పిలిపించుకుని కొన్ని రోజులపాటు ఉంచుకుందామా అనుకునే దాన్ని. కాని ఇప్పుడా ఆలోచన లేదు. ఈ పదిరోజులకీ నేనెంత మారిపోయానో గుర్తిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ యిల్లూ, యీ యింట్లో మనుషులూ అంటే అప్పుడే నాకు ఒక విధమైన భ్రాంతి ఏర్పడింది. ఇల్లాలిననే ఇష్టమైన భావం యీ కొద్దిరోజులకే నాలో తలఎత్తి స్థిరపడడానికి ప్రయత్నిస్తోంది.

ఇల్లాలి స్థానం అంతవరకేనా? కాదు, కాదు. ఈ యింటికి కులదీపకుణ్ణి యివ్వ వలసిన మధురాతి మధురమైన బాధ్యత మరెవరిదీ కాదు; నాదే. ఈ బాల్కనీలో తీరుబడిగా కూచుని ఆకాశంవైపు తిలకిస్తున్న యీ అమ్మకళ్ళలో పక్షుల్నీ, రంగుల్నీ, చుక్కల్నీ, మబ్బుల్నీ చూడ్డానికి ఇటోకాలూ అటోకాలూ వేసి బైఠాయించే పసివాడొకడు రాకపోడు. ఈ అమ్మ ఒళ్ళో కూచుని ఉయ్యాల లూగుతాడు. ఒళ్ళోనా? కాదు, అంతరంగంలో. మీదపడి మెళ్ళో గొలుసులు పట్టుకులాగుతాడు. గొలుసులా? కాదు; ఇన్నాళ్లూ దాగిన ప్రేమపాశాలు. ఉండుండి ఊరంత నవ్వు నవ్వు తాడు ఉత్తుత్తినవ్వులా? కాదు. 'అందరిలాంటి అమ్మవే నువ్వు. అంతకన్న మరేమీ కావు' అని నన్ను వెక్కిరిస్తాడు! వీ డొక్కడేనా? అమ్మ అనురాగాన్ని పంచుకోడానికి పోటీదార్లు ఎక్కువై పోతారు. నన్ను 'తల్లి'ని చేసి నా మనసుతో




దొంగాట ఆడుకునే పిల్లలు నా యిల్లు నిండిపోతారు! నన్నిక కదలనియ్యరు! కాని...

...కాని, నేను అంచనా వేసింది ఇదేనా? నేను అందుకోగోరింది యిదేనా? దేశమంతా వేదనామయం అయినప్పుడు సుఖపడే హక్కు నా కేమి ఉన్నది? 'నీకు బంధువులూ స్నేహితులూ కానివారికి కనీసం ఒక్కరికి నువ్వు చేసిన సహాయం, ఏదీ – ఒకటి చెప్పు' అంటే నే నేం మాటాడగలను?

ఇక్కడివారి అందరి కళ్ళలో వెలుగుతున్న నా మీది ఆదరాభిమానాలను నేను గుర్తించగలను. మా పట్టింటివారు వీరికంటె భాగ్యహీనులనే ప్రసక్తి ఒక్కసారైనా నా దగ్గిర తీసుకురాని వీరి హృదయవిశాలత్వాన్ని నేను కీర్తించగలను.

వచ్చిన ప్రతి ముష్టివాడికీ మా యింట్లో బియ్యం వేస్తాము. అతిథి లేనిదే మా మామగారు ఇప్పటికీ భోజనం చెయ్యరు. నేను వచ్చాక దానధర్మాలు మరింత ఎక్కువచేసినా ఎవరూ నన్నేమీ అనలేదు. ఏ సేవాసంస్థవాలంటీర్లు వచ్చినా పది రూపాయలు తక్కువ యిచ్చిపంపము, కాని ...

... కాని ఇల్లనే చీకటినూతిలోపల ఇంగితజ్ఞానమనే బాల్చీ మరి కనపడకుండా పడిపోయిందా? దీన్ని బయటికి తీసే గేలం పేరేమిటో ఎవరికీ తెలియదా?

ఆలోచించగా ఆలోచించగా నాకు జవాబు దొరికింది విజయకుమార్! అది మీకు

స్పష్టంగా చెప్పడానికే ఇంత ఉత్తరం రాసింది. అందర్లాటివారు కాదనీ, అది మీరు అందుకోగలరనే నమ్మకమే నా చేత యింత ఉత్తరం రాయించింది.

శారీరకంగా, సాంఘికంగా స్త్రీలం - అబలల మైఉన్నాము ఈ దేశం మాకు కొన్ని కట్టుబాట్లు విధించింది. ఈ కట్టుబాట్లు ఒకప్పుడు మరీ చాద స్తంగా అర్థం లేనివిగా ఉండొచ్చు. మరీ ఇప్పుడిప్పుడు విచ్చలవిడితనం నేర్పేటంతగా సడలించ బడిఉండొచ్చు. కాని కట్టుబాట్లు అనేవి ఉన్నాయి. కాదనలేము ఇవి మీకేనా, మాకు లేవా అని పురుషులు అడగవచ్చు. ఉన్నాయి, కాని మాకు ఉన్నంత బంధనాలు మీకు లేవు కాబట్టి మీ రంగం మాకన్న స్వేచ్ఛాయుత మైనది. విస్తృత మైనది. అందుకనే ముఖ్యసాధనములన్నీ పురుషార్థములనే చెప్పబడిఉన్నాయి కాబట్టి కార్యశూరులూ, కదనవీరులూ మీరే అలాగని మా బాధ్యతేం తక్కువకాదు తెరపక్కనుండి మీకు ప్రాంప్టింగ్ ఇచ్చేది మేమే, జీవమిచ్చేదీ, శిక్షణిచ్చేదీ మేమే చరిత్రపుటలు తిర గేస్తే అరుదుగా మాలో కార్యస్వరూపిణులు కనబడవచ్చు. కాని మొత్తమ్మీద నాయకత్వం వహించే ఖ్యాతి మీదే ప్రేమలో ముంచి పరవశింపజేసే భార్యలమే కాక ప్రగతిపథంలోకి మళ్ళించి ప్రయోజకుల్ని చేసే మాతృమూర్తులంకూడా మేమే. మిమ్మల్ని అంటిపెట్టుకుని ఉండడమే మా జాతికి బలం మీరు గొప్పవాళ్లు కావడమే మా జన్మకు ఫలం

కీర్తిప్రతిష్టలు మాకేం అక్కర్లేదు. 'ఇలాంటి వాళ్ళని కన్నాం ఇంతటివాళ్ళని చేశాం' అనే తృప్తి మాకు చాలు. మనదేశంలో యిందరు వీరు లున్నారంటే ఆపేరు ప్రత్యేకించి ప్రతిఒక్కరిదీ. కాని అందరిదీ కలిపిన ఖ్యాతి, మన అందరికీ తల్లి మన దేశమాతదికాదా ?

విజయకుమార్‌గారూ ! సామాన్యురాలైన ఆడదాన్ని. ఎన్నో అనుకున్నాను, ఏమీ చెయ్యలేకపోయాను కాని ఈనాడు నా కా విచారంలేదు ఒక చిన్న చీపురుపుల్ల ఆరిపోతున్న ఒక జ్యోతిని పైకి తీయగలదు. ఆ కాంతి ఎంతయినా వెలుగు నియ్య గలదు. అన్నివిధాలా అవకాశమున్న పురుషుడు ఎంత దేశసేవ చెయ్యగలడో అంతా మీనుంచి ఆశిస్తున్నాను. సేవితుడూ, సేవకుడూ అయిన సర్వేశ్వరుడు మీకు తగిన శక్తి నిమ్మని ప్రార్థిస్తున్నాను '

## 8

గీత రాసిన ఉత్తరం ఎన్నిసార్లు చదువుకున్నానో చెప్పలేను. సంకుచితమూ, స్వార్థభూయిష్టమూ అయిన సాధారణ జీవనగమ్యాన్ని ధర్మయుతమూ, త్యాగ

మయమూ అయేలాగ తీర్చిదిద్దే తత్వబోధ ఎలా పెడచెవిని పెట్టను ? మిలటరీ సర్వీసుకని తెప్పించిన అప్లికేషనుఫారమ్సు అప్పుడే నింపి పంపించేశాను.

అమ్మతో నాన్నతో ఈ విషయం ఎలా చెప్పడమో ఎంత ఆలోచించినా బోధ పడ్డంలేదు. నేను మిలటరీలోకి వెళ్ళిపోతాననే విషయం వాళ్ళు కలలోకూడా ఊహించలేదు. ఆసంగతి తెలిస్తే భరించి బతకగలరా ? జవాబు ఊహించడానికే భయంగా ఉంది ఊహించకుండా ఉండడ మెలాగోకూడా నాకు తెలియడంలేదు

ఇంట్లో తల్లిదండ్రుల సమక్షంలో తలెత్తుకు తిరుగలేక వీధిలోకి అడుగుపెడితే చాలు - మన దేశంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితిని గురించి వార్తలు తప్ప మరొకటి వినపడంలేదు ఎక్కడ చూసినా అవసరమైన వస్తువులూ, సొమ్మూ, బంగారమూ సేకరించి దేశరక్షణనిధికి సమర్పిస్తున్నారు అధికసంఖ్యాకులైన విద్యార్థులు చేసే హడావిడి ఇంతా అంతా కాదు

కని పెంచిన తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో వదిలి వెళ్ళిపోడానికి ఎన్నివిధాల ఆలోచించినా నా మనసు సమాధానపడడం లేదు పట్టుకుని నడిచే చేతికర్ర పెట్టిన మూల కనపడకపోతే మా అమ్మ ఎంత హంగామా చేస్తుందో నే నెరుగుదును. చత్వారం కళ్ళజోడు ఒక్కగడియ లేకపోతే మా నాన్న ఎంత కంగారు పడతారో నేను అర్థం చేసుకోగలను. చేతికందిన కొడుకు, ఆశ లల్లిన కొడుకు, ఒక్కగా నొక్క కొడుకు వయస్సు మళ్ళిన తల్లిదండ్రులకి ఎన్ని చేతికర్రల, ఎన్ని కళ్ళజోడుల సమానం ? ఇలాంటి నా బలహీనతల్ని ఆధారం చేసుకుని అనేక పిల్లప్రశ్నలు రాత్రీ పగలూ అనకుండా నన్ను కలవరపెట్టజొచ్చాయి. ఎక్కడికో వెళ్ళి ఎవర్ని ఉద్ధరిస్తావ్ ? ఇక్కడే ప్రాక్టీసు పెడితే వచ్చే నష్ట మేమిటి ? ఉచితంగా వైద్యం చేసి బీదవాళ్ళ బాధలు తగ్గించడానికి యింటినుంచి పారిపోవాలా ? నువ్వు అనన్యమైన సన్మార్గపథం త్రొక్కితే నీ తల్లిదండ్రులు నిన్ను మరింతగా దీవించేవారేగాని నీ మేలు కోరనివారు కాదే ! నీ మంచివారికి అడ్డువచ్చేవారు కాదే ! నీ సాంఘికసేవ ఏదో నీ స్వగృహంనుంచే ప్రారంభించరాదా ? పోషించి పెంచిన యిన్నాళ్ళ ఆశా ఒక్క క్షణంలో ముక్క ముక్కలయిపోతే నీ తల్లిదండ్రుల గుండె బ్రద్దలయిపోదా ? సంఘానికీ దేశానికీ సేవ చేయవలసిన బాధ్యత నీకున్నమాట నిజమే వృద్ధులైన నీ తల్లిదండ్రులకు సేవ చేయవలసిన బాధ్యత నీకులేదా?

ఆ సాయంకాలమే ఏదో యధాలాపంగా మా అమ్మ యుద్ధప్రసక్తి తెచ్చింది. 'పాపం, ఇంతమంది ప్రాణాలకి తెగించి పోరాడుతున్నారుకదా. అలాంటి ప్రదేశాల్లో వీళ్ళకి గాయాలు తగిలినా జబ్బుచేసినా చిక్కేవరు బాబూ ?'

అప్రయత్నంగా అమ్మ వేసిన ఈ ప్రశ్న నాకు అవకాశా న్నిచ్చింది. 'అలాంటి చోటికి వెళ్ళి చేసిందే సేవ. ఏమంటావు?'

'కాదామరి? ఎంత గొప్ప వీరులైనా ఒక తల్లిబిడ్డలే కద. ఆ సైనికుల్ని కన్న తల్లిదండ్రుల హృదయాలు పాపం ఎలా తల్లడిల్లిపోతూంటాయో...ఏ రోజు కెలా వున్నారో, పాపం! కబురూ అదీ తెలియదు కాబోలు...వాళ్ళవా ళ్ళెంత కొట్టుకు పోతూవుంటారో!'

'లేదమ్మా! దేశంకోసం పోరాడుతున్న మహావీరులు కాబట్టి వాళ్ళకి మనవాళ్ళ వుద్యోగా లన్నిటికన్న ఎక్కువ జీతమూ, సదుపాయాలూ వుంటాయి. మనదేశం దేశమంతా ఏకమై వాళ్ళకి అండగా నిలుస్తోంది. నిజంగా మనం ఏం చేసి వాళ్ళ రుణం తీర్చగలం!'

'నిజమే. కాని ఎవరికి తోచిన సాయం వాళ్ళు చెయ్యొచ్చుకదా?'

'అవును దేశానికి సాటిలేని సేవ చేసే అవకాశం నీకూ వున్నదమ్మా! నీ కొడుకుని ఆర్మీడాక్టరుగా యుద్ధానికి పంపకూడదటమ్మా?' అని అడుగుదామని నోటి చివరిదాకా వచ్చింది కాని అడగనక్కరలేదు. జవాబు నాకు తెలుసు మరు క్షణం పండిన పండులా వున్న మా అమ్మ మొహం ఎండిన ఆకులా ఎలా ముడు చుకుపోతుందో నేను ఊహించగలను. అలాంటి మొహం నేను చూడలేను రక్త స్పర్శ అనేది నన్ను వివేకహీనుణ్ణి చేస్తే చెయ్యవచ్చు. నే నీ ప్రేమపాశం విప్పుకోలేకపోతున్నాను!

ఇంటర్వ్యూకి రమ్మని కబురు వచ్చిననాడు నేను పొందిన ఆందోళన వర్ణించలేనిది

'ఇవాళ నా మనసెందుకో బాగులేదురా బాబూ!' అని అమ్మ అంటూంటే నేను ట్రాన్నుడిపోయాను నే నెంత జాగ్రత్తగా కాగితాలూ అవీ దాచుకుంటున్నా నాన్న గారికి ఎలాగైనా తెలిసిపోయిందేమో. అమ్మతో చెప్పేశారేమో! నా గుండె ఎంతో వేగంలో కొట్టుకుంది

'ఇంత అన్యాయం జరుగుతుందని కలలో అనుకోలేదు!' ఇంకేం, తెలిసిపోయిం దన్నమాట! నిజానికి గట్టిగా మా అమ్మ వెళ్ళొద్దని పట్టుబడితే నేను కాలు కదప గలనా?

'ఏం జరిగిందమ్మా?' అని నేను అడక్కుండానే ఆమె చెప్పింది.

'మరేం లేదు. మన పురోహితుడు సుబ్బావధాన్లు లేడూ. ఆయనా కొడుకూ వేరుపడిపోయారుట!'

'అమ్మయ్య!' అనుకున్నాను నేను. పైకి మాత్రం ఇలా అన్నాను 'అదేమిటి,



పాపం అరని పెళ్ళానికి యీ మధ్య మశూచికం వచ్చి కళ్లు కూడా పోయా యను కున్నారే, ఈ వయసులో వేరింటికాపురం పెడితే ముసిలాళ్ళు ఏమైపోతారు ?'

'బాగుంది, ఆడవాళ్ళకి పడకపోతే మొగాళ్లు ఎంతకని భరించగలరు!'

'అయితే? ఊరంతా ముష్టెత్తి కొడుక్కి చదువు చెప్పించాడు కదా! వాడి కామాత్రం జ్ఞానం వుండొద్దూ? తల్లి గుడ్డిదికదా! ఏమైపోతుందనుకున్నాడు! పెళ్ళాం మాటే వేదవాక్యమా?'

అమ్మ నవ్వింది నేను ఎప్పుడూ అనుకోని ఒక విసురు విసిరింది 'బాబూ! నువ్వుకూడా తొందరగా పెళ్ళి చేసుకుని వేరైపోదూ!' అంటూ నవ్వింది. నాకు కోపమొచ్చి అక్కణ్నుంచి లేచి వెళ్ళిపోబోతే చెయ్యి పట్టుకు కూచోబెట్టింది

'ఎంతలో ఎంత కోపమొచ్చిందిరా బాబూ· మరి ఎన్నాళ్ళకీ నువ్వు పెళ్ళికి మొగ్గకపోతివి అందుకని తమాషాకి అలా అన్నాను నువ్వు బంగారు తండ్రివి, అలా ఎందుకు చేస్తావ్ ?'

ఈ బంగారు తండ్రి ఎలాంటి పని తలపెడుతున్నాడో ఆ వెర్రితల్లికి తెలియదు. నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి.

'అదేమిటి విజయా! అంతలో కన్నీరు దేనికి? ఇంతకీ నిన్ను నేనేమన్నానని! ను వ్వింత నొచ్చుకుంటావని తెలీదు. అందరూ అలా తల్లిదండ్రులకి అన్యాయం చేస్తారా? లే ..లే . ' మా అమ్మ నా భుజంమీద చెయ్యి వేసింది ఆ స్పర్శకి నా దుఃఖం కట్టలు తెంచుకుంది గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను...

డాక్టరు విజయకుమార్ కళ్ళమ్మట నీళ్ళు జలజల కారిపోయాయి శ్రీకృష్ణ మూర్తికూడా కళ్లు తుడుచుకోడం చూసి డాక్టరు చాలా ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? ఈ చుట్టుపక్కల మిమ్మల్ని అయిరన్‌మ్యాన్ అని వ్యవహరిస్తారు క్రమశిక్షణకు ఏమాత్రం లోపమొచ్చినా కొంచెమైనా సహించరనీ, హృదయమన్నది లేని పెద్ద పెద్ద శిక్షలు విధిస్తారనీ జూనియర్సు అనుకుంటూంటే విన్నాను నా కథ మిమ్మల్నీ కదలించి కరిగించిందా?''

శ్రీకృష్ణమూర్తి ముఖం అంతట్లో ప్రశాంతంగా మారిపోయింది. "సామాన్యుల్ని మించిన సాహసమూ ధైర్యమూ మన సైనికులకి ఉండవచ్చు అత్యవసర పరిస్థితికి తగిన సమయస్ఫూర్తి, అత్యంత ప్రమాదస్థితిలోకూడా సడలని మనోనిశ్చలతా మనకి ఉండవచ్చు క్రమబద్ధమైన వ్యాయామంతో గట్టిపడిన శరీరం మనది కావొచ్చు. మనం ఎన్నుకున్న ప్రమాదకరమైన వృత్తి, మనం పొందిన కఠినమైన శిక్షణా మనల్ని ప్రత్యేకమైన మరిమనుషులుగా పైవారికి కనిపింపజేయవచ్చు. కాని అన్నిటి అడుగునా మనం ఎవరం? అందర్లాంటి మానవులం. వెలుగునీడలకు ప్రతి బింబించే వదనమూ, రాగద్వేషాలకు ప్రతిధ్వనించే హృదయమూ మనకూ ఉన్నాయి. గుండీలుమాత్రమే కాక గుండెలుకూడా విప్పి చూడకలిగితే ఏ సైనికుడి జీవితంలో ఎన్నెన్నిరకాల ఎత్తుపల్లాలు లేవు!''

''అయితే ఏమిటి మూర్తీ నా అన్నవారు మాకు లేరని అందరూ అనుకునే మీ జీవితంలోకూడా సంచలనం కలుగజేసే సంఘటనలు ఉన్నాయా?" విజయకుమార్ విస్ఫారితనయనాలతో అడిగాడు.

"మొదట మీరు చెప్పేది పూర్తి చేయండి,'' అన్నాడు శ్రీకృష్ణమూర్తి ఎప్పటి చిరునవ్వుతో.

"నేను చెప్పడం పూర్తి అయాక మీరు చెప్తారుగా."

"చెప్పాలనే మీ చేత యింతసేపూ చెప్పించింది"

డాక్టరు విజయకుమార్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు—

తెలిసిన స్నేహితు డొకడిదగ్గర కొద్దిరోజులు గడిపివస్తానని యింట్లో చెప్పి యింటర్వ్యూకి వెళ్ళివచ్చాను నేవచ్చిన మర్నాడే మా వ్యాసమూర్తి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అంతకుముందే నేను హఠాత్తుగా మెద్రాసునుంచి యింటికి వచ్చేసిన కారణాలు రాస్తూ. నేను ఆర్మీ డాక్టరుగా వెళ్ళిపోడం విషయంలో వాడి అభిప్రాయాలు మరింతగా విపులీకరించమని రాశాను కాని నేను కోరినట్టు ఉత్తరం విస్తృతంగా లేదు. బాగా క్లుప్తంగా సూటిగా ఉంది

'జటిలమైన ఒక సమస్యని సాధించడానికి నువ్వు పూనుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది ఇంతగా ఎదిగినందుకు నిన్ను మనఃపూర్వకంగా అభినందిస్తున్నాను కన్నతల్లికి సేవ చెయ్యడమా, దేశమాతకి సేవ చెయ్యడమా! ఏది ముఖ్యం అనే ప్రశ్నకు నువ్వు సరిగా జవాబు చెప్పుకోలేక పోయినట్టు నీ ఉత్తరం చూస్తే అర్థమవుతోంది ప్రశ్నలోనే లోపం ఉంది. 'మేష్టరీ ఉద్యోగం చెయ్యనా, ప్లీడరీ చదువుతే బాగుంటుందా? లాంటి ప్రశ్నకాదు ఇది. ఒకటి తేల్చుకుని రెండవది విసర్జించవలసిన అవసరం ఏమి లేదు తనయుడిగా తల్లిరుణం తీర్చుకోవలసిన బాధ్యత నీ కున్నది. భారతీయుడిగా భరతమాత రుణం తీర్చుకోవలసిన బాధ్యతా నీ కుంది. ఈ బాధ్యతలు గుర్తించినందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను. ఒకదాని కోసం ఒకటి త్యాగం చెయ్యవలసిన అవసరం రాకుండా నేర్పరితనం చూపించు. త్యాగం చెయ్యలసిన అవసరం వస్తే మహారాజ్యమో, మానవకళ్యాణమో తేల్చుకుని సిద్ధార్థుడైన గౌతముని పద్ధతి బాగా పరిశీలించు '

మరొక పదిరోజుల కనుకుంటాను పోస్టుమేన్ ఆర్డర్సు తెచ్చి నాకు రహస్యంగా అందించాడు. ఒక పెట్టెలో, ఒక హోల్డాల్‌లో అవసరమైన సామాన్లు అన్నీ సర్దుకుని, పెద్ద ఉత్తరం రాసి టేబిల్‌మీద ఉంచి, రాత్రికిరాత్రి బయలుదేరి వచ్చేశాను.

నేనిక్కడ ఉద్యోగంలో చేరిన తరువాత యింటికి ఎడ్రసూ అదీ పంపుతూ మరొక ఉత్తరం రాశాను అక్కణ్ణుంచి నాకు వచ్చిన జవాబుమాత్రం ఒకటే ఒకటి నాన్న రాశారు. నాన్నరాసిన దేమిటంటే—

'ఎంత దగ్గరవారినుంచీ ఏమీ ఆశించకూడదనీ, అలా ఆశించడమే అన్ని రకాల ఆశాభంగాలకూ మూలకారణమనీ, ఆ సంగతి తెలిసికూడా ఆ దౌర్బల్యానికి అతీతులుగా ఉండలేకపోవడం మానవులకి అతి సహజమనీ...'

ఇలా మొదట వేదాంత ధోరణిలో ప్రారంభమై —

'వారాలు చేసీ, వీధిలాంతరు దగ్గర చదివీ తన జీవితం కష్టాలతో ఆరంభమైందనీ, తీరా ఒక ఉద్యోగమంటూ దొరికి కాపురమంటూ ఏర్పడ్డాక, పిల్లలు పుట్టేక,

జీత మందిన మొదటివారమే తప్ప తక్కిన నెలంతా తనెప్పుడూ చిరునవ్వు అన్నది ఎరగననీ, మా అక్క పెళ్ళితో బాగా అప్పులపాలు అయిపోయాననీ, అప్పట్నుంచీ ఒక్క రాత్రీ తను నిశ్చింతగా నిద్రపోయి ఎరగననీ ...'

ఆయన జీవితంలో నేను సరిగా గుర్తించని కొన్ని కష్టాలు హృదయం కరిగేలా వర్ణించి —


'నాద్ది సేపటిలో ప్రొద్దు గ్రుంకనున్న ఎడారిలాంటి తన బతుకు చివరిగడియలలో కొంచెం విశ్రాంతి, కాస్త మనశ్శాంతి, కొద్ది క్షణాల ఆత్మశాంతి కోరుకోవడము కేవలం తెలివితక్కువని తన కిప్పుడు తెలిసిందనీ, తను చేసిన తప్పు అదెవరిమీదా రుద్దబోవడం లేదనీ, ఎప్పుడయినా ఎక్కడయినా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నేను బతకాలని తా మిద్దరూ ఆశీర్వదిస్తున్నామనీ —'

నాన్న ఉత్తరం ముగించారు.

ఉత్తరం కొన్ని వందల సార్లు పైనుంచి కిందకీ, వెనకనుంచి ముందుకీ చదివాను ఎక్కడా అమ్మ ప్రసక్తి లేదు. అమ్మకి అక్షరజ్ఞానం లేదు ఎవరిచేతనైనా ఉత్తరం రాయించాలి, ఎవరిచేతనైనా చదివించుకోవాలి. అయినా ఆమె తలుచుకుంటే అవేవీ అంత అసాధ్యమైన పనులు కావు, నే నిలా పారిపోయి రావడం ఆమె ఏవిధంగా తీసుకుందో తెలీదు ఆ తల్లి అంత దుఃఖం ఎలా భరించిందో నాకు చెప్పేవారు లేరు. దానికి తోడు నే నింటికి పంపిన రెండువందలూ వెంటనే తిరిగి వచ్చాయి! ఇక నా ఆందోళనకి అంతులేకపోయింది.

ఇక్కడ మిలటరీ ఆసుపత్రిలో చూస్తే రోజు రోజుకీ నా బాధ్యత ఎక్కువవుతోంది. నాకు వేరే సంసారబాధ్యత అన్నది లేకపోవడంచేత నా శక్తీ, కాలమూ పూర్తిగా యిక్కడే వినియోగించడానికి అవకాశం కలిగి ఈ రోగుల సేవలోనే నాకు ఇరవైనాలుగుగంటలూ గడచిపోతున్నాయి పై అధికారుల ప్రశంసలవల్ల కాక, బాధ నివారితులైన వ్యాధిపీడితులు నావైపు బరపే కృతజ్ఞతాపూర్వక దృక్కులవల్ల నాకెంతో ఉత్సాహం కలుగుతూఉండేది నా వార్డులో నాతో పని చేసే కంపౌండరు లక్ష్మణసింగ్ కూడా ఎంతో చురుకుదనమూ, సహనమూ కలవాడు అవడంవల్ల నా పని మరింత జయప్రదంగా జరుగుతూఉండేది కాని ఏ ముసలిరోగికి సేవ చేస్తున్నా మా అమ్మో నాన్నో నా కనులముందు దుఃఖపూరితమూ, పరిదీనమూ అయిన వదనాలతో నాకు కనిపించడం మానలేదు

మామూలు వైద్యశాలలోనే పరధ్యానానికీ, ప్రమత్తతకీ చోటు లేదు అందులో ఇది సైనికవైద్యశాల. అందునా యిది అత్యవసర సమయం ఒక్కొక్కప్పుడు




కొద్దివెలుగులోనే ఆపరేషన్లు చెయ్యవలసిఉంటుంది. లభించని పరికరాలకోసం పరుగులెత్తే అవకాశం ఉండకపోవచ్చును. అప్పటికప్పుడు అసాధారణమైన సమయస్ఫూర్తి ఉపయోగించి చికిత్సావిధానం సవరించుకోవాలి. శిక్షణసమయంలో ఇవన్నీ ఊహించి చెబుతారనుకోండి – అయినా బోధనకీ కార్యసాధనకీ చాలాదూరం ఉన్నదికదా!

ఒకసారి ఒక వృద్ధుడికి బ్యాండేజి వేసే విషయంలో చిన్న పొరపాటు చేశాను కమిషన్డ్ ఆఫీసరు యిలా చెయ్యడం సహించమనీ, యీసారి యిలా చేస్తే డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటామనీ పై ఆఫీసరు మందలించాడు. ఆ పొరపాటు అప్పుడే సవరించబడింది కాని మానసికంగా తగిలిన ఆ గాయం నేను భరించలేకపోయాను. దానికితోడు 'అమ్మ ఎలా ఉంది? నువ్వేనా రాయ,' మని నేను కాసులమ్మకి రాసిన ఉత్తరానికి అప్పుడే జవాబు వచ్చింది.

'అమ్మ ఎలా ఉంటే నీకెందుకు? ఆమె ఎలా ఉందో నిజంగా నీకు కావలిస్తే అంత ఘోరం చేసిఉందువా?' అంటూ ఆరంభమైంది ఆ ఉత్తరం దాని ధర్మమా అని మా చెల్లెలు కేవలం చివాట్లేకాక అందులో కొన్ని సంగతులుకూడా రాసింది.

'నువెళ్ళిపోయాక అమ్మ బెంగపెట్టుకుని అన్నం నిద్రా మాని అహోరాత్రాలూ ఏడుస్తూంటే నాన్న నాకు ఉత్తరం రాశారు. నేను వెంటనే వచ్చాను. అప్పట్నుంచీ యిక్కడే ఉన్నాను. అక్కయ్య వచ్చి ఒకమారు చూసి వెళ్ళిపోయింది.

నువ్విప్పుడు అమ్మని చూస్తే గుర్తుపట్టలేవు - అంతగా జీవచ్ఛవంగా మారి పోయింది. అసలు మొన్న మొన్నటిదాకా ఆమె బతుకుతుందనే ఎవరమూ అనుకో లేదు. డాక్టరుగారు చెప్పేరు - బతుకులో పడిందనీ, యిక ఫరవాలేదనీ. చచ్చయినా పోయిందికాదు ఎందుకోసం బతుకుతూందో తెలియదు!

ఇప్పుడు పాతయింట్లో అమ్మా నాన్నా ఉండటంలేదు. వేరే అద్దెయింట్లోకి దిగేరు. కడుతూ కడుతూన్న నీ ఆసుపత్రిగదులు చూసి అమ్మ వెక్కి-వెక్కి-ఏడవని రోజులేదు, అందుకనీ నాన్నగారు ఆ మధ్య రిటైరవుదా మనుకున్నారు. నీకు తెలుసుగా? సెక్రటరీని పట్టుకుని మరి రెండేళ్ల ఉద్యోగకాలం ఎలాగో పొడిగించుకున్నారు ఆయన ఒంట్లో మునుపట్లా ఓపికలేదు లేస్తే తూలిపడిపోతున్నారు. అయినా ఎవ రెన్ని విధాల చెప్పినా ఆయన ఉద్యోగం మానడంలేదు

ఇక్కడి సంగతులు రాయమని మరీమరీ రాశావు ఒక్క సంగతి రాయనని అమ్మకి మాట యిచ్చికూడా నీకీ ఉత్తరం రాస్తున్నాను ఒక్క ప్రశ్నకి నాకు జవాబు కావాలి. అక్కయ్యకీ మనకూ బాగా ఎడంగాని, నీకూ నాకూ వయసు బాగా దగ్గర. ఆ చనువుతో చిన్నదాన్నయినా అడుగుతున్నాను - ఇందర్ని యిన్ని విధాల దుఃఖపెట్టి అక్కడ నువ్వు చేసే దేశసేవ ఏమిటి?'

## 9

ఉత్తరం చదవడం యిలా పూర్తిచేశానో లేదో 'బాబూ!' అని పెద్దకేక వినిపించింది చూపుడువేలితో కంట్లో నిలిచిన బిందువుల్ని తుడిచేసుకుని గబగబా మెట్లెక్కి ఆసుపత్రిలోకి పరిగెత్తేను.

నన్ను పిలిచింది రామూ అనే పేషెంటు. ఎడంవైపుకింది పక్క ఎముకలో దిగిపోయిన తుపాకిగుండును ఆపరేషను చేసి తీశాము వారం రోజులై. రెండ్రోజులైంది కుట్లు విప్పి నేను రాగానే అతని చూపులో ధైర్యం నిలిచింది

'డాక్టరుబాబూ! నా చేతిని పట్టుకు కూచుంటామని చెప్పేరు... మళ్ళీ ఎక్కడికి వెళ్ళిపోయారు?' నే నతనిచేతిని గట్టిగా పట్టుకున్నాను.

'ఏదో ఉత్తరం వస్తే అందుకోడానికి వెళ్ళేను రామూ... అదలా చదువుతూ ఉండిపోయాను. అంతలా కంగాపడిపోతే ఎలా?'

'నిజమే బాబూ... ఏం చెయ్యను, ఒకసారి ఇలా కదిలేసరికి పక్కలో చెప్పలేని నెప్పి వచ్చేసింది. ఏమైపోతానో అని మా చెడ్డభయమేసింది. అందుకే అంత కేకేశాను. మీరిలా దగ్గిరగా కూచుని నా చెయ్యి పట్టుకుంటే ఎంత ధైర్యంగా ఉందో

చెప్పలేను. నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళకండి డాక్టర్. ఉత్తరం వస్తే యిక్కడికే యిస్తారు. మీరు పరిగెత్తుకుని వెళ్ళి అందుకుంటేగాని దొరకదా యేం? అయినా మమ్మల్నిమించి మీ కెవరూ లేరని చెప్పేరు ఆదంతా అబద్ధమా డాక్టర్?'

'ఎవరున్నారు! ఎవరులేరా? ఉంటే ఉన్నారు. మిమల్నిమించి నా కెవరున్నారు? ఇకముందు మిమల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళను వెళ్ళలేనుకూడా. అన్నీ ఒదులుకుని నేను వచ్చింది మీకోసమే ఇంకెక్కడికి వెడతాను!'

ఇంకొకరు పిల్చారు

'జాలిగొలిపే మా చూపులు మిమ్మల్ని కదలనియ్యవని ఒకసారి మీరు అంటూంటే విన్నాను. చాలా తలనొప్పిగా ఉంది. ఇలా వచ్చి మీ చల్లనిచెయ్యి నా నుదుటిమీద ఒకసారి పెట్టండి డాక్టర్!'

లక్ష్మణసింగ్ నవ్వుతూ అన్నాడు 'పోనీ, కాలో చెయ్యో విరుచుకుని మీ మధ్య మంచం వేసుకుని డాక్టరుగారినే ఏకంగా యిక్కడ ఉండిపోమనకూడదూ?'

అందరూ గొల్లున నవ్వేరు.

'సార్, మిమల్ని మోహన్‌లాల్ రమ్మంటున్నాడు.' నర్సువచ్చి చెప్పింది నేను అటువైపు వెళ్ళేను

'మీరు ముందిలా రండి డాక్టర్. మీతో మాటాడాలి. నాకు ఇవాళో రేపో కట్లు విప్పుతారనీ, వీలయినంత తొందర్లో డిస్చార్జి చేయిస్తాననీ మీరు మాట ఇచ్చేరు. అవునా? ఎన్నాళ్ళు యిక్కడిలా వుంచేస్తారు? ఇక్కడిలా పడుకుని శత్రువుల్ని హతమారుస్తున్నట్టు ఎన్నాళ్లు కలలు గనమన్నారు?'

అతను కూచోబోయి వెనక్కి పడిపోయేడు

'నువ్విలా కదలకూడదని ఎన్నిసార్లు చెప్పను? అలా తొందరపడితే మేము చేసిన కృషి అంతా వృధా అయిపోతుంది. నువ్వెలాంటి స్థితిలో ఇక్కడికొచ్చావో, ఎంత రక్తం కారిపోయిందో కొంచెం గుర్తుంచుకో. రక్తం ఎక్కించాము. మూడు రోజులపాటు నువ్వు ఏ లోకంలో వున్నావో ఎవరికీ తెలీదు. మళ్ళీ నువ్వు బతికి మనుషుల్లో పడ్డావంటే, ఇంకా నువ్వు దేశానికి చెయ్యవలసిందెంతో ఉందన్నమాట.'

ఒక కాలూ ఒక చెయ్యీ పూర్తిగా తీసెయ్యవలసివచ్చినా మోహన్‌లాల్‌లో ఆత్మవిశ్వాసం ఏమాత్రమూ తగ్గలేదు. అతని కళ్ళు మెరిశాయి.

'అబద్ధం చెప్పకుండా నా కళ్ళలోకి సూటిగా చూసి చెప్పండి. మీరు చెబితే నాకు నమ్మకమే. నేను దేశానికి ఇంకా సేవ చెయ్యగలను కదూ డాక్టర్! ఆటోమాటిక్ రైఫిల్ మళ్ళీ నా చేత్తో ఎత్తగలను కదూ! నా జన్మభూమిలోకి అన్యా

యంగా అడుగుపెట్టి ఆక్రమింపజూసిన ద్రోహిని ఒక్కణ్ణేనా నేను కాల్చివెయ్య గలను కదూ డాక్టర్ !'

మోహన్‌లాల్‌ని ఆగమని చెప్పి ఒక ఇంజక్షను ఇచ్చాను. వేడివేడి పాలు ఒక గ్లాసెడు తెమ్మని నర్సుతో చెప్పి అతనిచేత నెమ్మదిగా తాగించాను.

'మోహన్‌లాల్ ! పాతికేళ్ళ పడుచువాడివి నువ్వు. మండుతున్న రక్తం నీలో వుంది. పొంగి పొరలుతున్న దేశభక్తి నీ నరనరాల్లోనూ నిండి వుంది. వ్యక్తిగత రక్షణని ఏమాత్రం లక్ష్యపెట్టని చిత్తశుద్ధితో రెండు శత్రువుల టాంకుల్ని నాశనం చేశావు. మూడవది ఉపయోగం లేకుండా పిప్పిచేశావు. కాలూ చెయ్యీ విరిగి స్పృహ లేకుండా పడిపోయేదాకా శత్రువులతో పోరాడుతూనే వున్నావు. వెంటనే మన గస్తీదళాలు అక్కడికొచ్చి శత్రువుల్ని తరిమికొట్టి నీకు ఫస్ట్‌ఎయిడ్ యిచ్చి స్థానికవైద్యశాలలో సాధారణచికిత్స చేయించి వెంటనే నిన్నిక్కడికి పంపి వుండకపోతే నువ్వు మాకు దక్కేవాడివికాదు. ఏ రైలుకిందో ప్రమాదవశాత్తూ పడి నీ కాలూ చెయ్యీ విరిగిపోలేదు. కాలూ చెయ్యీ కానుకగా ఇచ్చిన నీ చరిత్ర దేశంకోసం ఒక్క రక్తబిందువు ఇవ్వడానికి ముందూ వెనకా ఆడే భీరువులకు గుణపాఠం.'

నే నింకా చెప్పబోతూఉంటే డాక్టర్ కృపాళ్‌సింగ్ వారించాడు. 'ఉద్రేకానికి సమయం కాదని రోగితో చెప్పి మీరే అలా ఆవేశపడితే ఎలా డాక్టర్...చూడండి అతని కళ్ళమ్మట ఎలా నీరు కారిపోతోందో! కన్నీరు తుడుచుకోడానికైనా అతనికి అవకాశం లేదే !'

ఒక గుడ్డ చల్లనినీటిలో తడిపి నేను మోహన్‌లాల్ మొహం తుడిచాను.

'ఇప్పుడు డాక్టర్ శశికాంతఘోష్ వస్తారు. మనం మెస్‌కి వెళ్ళొద్దాం రండి అన్నా డతను. నేను టైం చూసి లేచి నిలుచున్నాను.

'నా దగ్గరకు వచ్చి ఒకసారి కూచోండి డాక్టర్...నే నేం మాటాడను. మీ కళ్ళలోకి చూడను కూడా. నా గుండెమీద చెయ్యివేసి ఒక్క అయిదు నిమిషాలు ఇలా కూచోండి.'

'మీరు వెళ్ళిరండి కృపాళ్!...నే నిప్పుడే వస్తాను.'

ఆయన విసుక్కుంటూ వెళ్ళిపోయారు. నేను మోహన్‌లాల్ బెడ్‌మీద కొద్ది సేపు కూచున్నాను.

'మీరు చెప్పినట్లు కళ్ళు మూసుకుని పడుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకుంటాను గాని; డాక్టర్! నాకు యీ ఒక్కమాటకీ జవాబు చెప్పి వెళ్ళిపోండి. కళ్ళు మూసు

కునేసరికి మన సరిహద్దు దృశ్యమే నా బుర్రలో వుంటోంది. ఒక్కొక్కప్పుడు శత్రువులమీద కసితో కోపంతో ఒణికిపోతున్నాను. ఒక్క నిమిషమైనా వృధా చెయ్యకూడని యింతటి అత్యవసరస్థితిలో యిలా ఎందుకూ కాకుండా ఉండి పోయానే అనే నిస్సహాయస్థితి నన్ను క్రుంగదీస్తోంది. ఆలోచించకుండా ఉండ డానికి మందేమీ లేదా డాక్టర్?' నేను లక్ష్మణసింగ్‌కి సంజ్ఞ చేశాను. వెంటనే అతనికి ఇంజక్షను ఇచ్చాము. మరొక పావుగంటకి అతను నిద్రపోతూఉన్నాడు.

నేను ఇవతలి కొచ్చాను. ఆపరేషను థియేటరు తలుపులు తెరుచుకున్నాయి. డాక్టరు ఆషాముఖర్జీ, అయిదుగురు అసిస్టెంట్లూ ఇవతలి కొచ్చారు. కేసు ఏమ యిందో ఒక డాక్టర్ని యింకో డాక్టరు అడిగి తెలుసుకోనక్కర్లేదు. మొహం చూస్తే చాలు. అబ్దుల్‌కరీమ్ ఆపరేషన్ విజయవంతం కాలేదన్నమాట. భక్తి గౌర వాలతో అతనికి నమస్కరించాను. సైనిక సంప్రదాయాలకు అనుగుణంగా అతని అంత్యక్రియలకు అప్పుడే సన్నాహాలు జరుగుతున్నాయి.

మేజర్ కరీమ్‌కు ఇరవై ఎనిమిదేళ్లట. లాహోర్ పొలిమేరలో ఒక కీలక స్థానంలోఉన్న శత్రువుల మిషన్‌గన్ స్థావరాలమీదకి తన ప్లటూన్ని ధైర్యసాహ సాలతో నడిపించి తీవ్రంగా పోరాడి అపారనష్టం కలిగించాడు. అతనికి మొదట రెండు తుపాకిగుండ్లు తగిలాయి. కాని అతను ఏమాత్రమూ జంకలేదట. మూడు టాంకుల్లో ఉన్న శత్రుసిబ్బందిని హతమార్చి ఆ టాంకులు వశపరుచుకున్నాడు. ఆ సందర్భంలో అతనికి తొడలో మరొక గుండుదెబ్బ తగిలింది. ఆస్పత్రిలో చేర్చడం కొంచెం ఆలశ్యం అయింది. ఆరుగురు డాక్టర్సు అయిదుగంటలసేపు పరిశ్రమించినా లాభంలేకపోయింది. దేశచరిత్రకు మరింత దీప్తి కలుగజేసి కరీమ్ వీరస్వర్గ మలంకరించాడు.

అబ్దుల్‌కరీం నూటికి నూరుపాళ్లు మహమ్మదీయుడు. అయితేనేం, నూటికి నూరుపాళ్లూ భారతదేశపు బిడ్డ అతను. తల్లికోసం తనువు యిచ్చి ధన్యుడవడానికి అతన్ని భాషా, మతమూ అడ్డుపెట్టలేదు. మతవిభేదాలు ప్రవేశపెట్టి మనలో అంతః కలహాలు రేపుదామని పొరుగుదేశం అనుకోడం ఎంత వెర్రితనం!

మెస్‌కి వెళ్ళాలని ఆస్పత్రి మెట్లు దిగుతూ నా అలవాటుప్రకారం పాంటు కుడి జేబులో చెయ్యి పెట్టుకున్నాను. ఏదో కాగితం తగిలింది – తీసి చూశాను. అది చెల్లి రాసిన ఉత్తరం! పొద్దుట అది చదవగానే నా కడుపులో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్టు అయిపోయింది.

'ఇందర్ని ఇన్నివిధాల దుఃఖపెట్టి అక్కడ నువ్వు చేస్తున్న దేశసేవ ఏమిటి?' అనే ప్రశ్న నన్ను విడవకుండా వెంటతగిలింది. నేనిక్కడ ఉద్యోగంలో చేరినపుడు

'ఒక్క మనిషిని — నాకు పెద్ద ఖర్చేముంటుంది! నా జీతమంతా ఇంటికి పంపించేస్తాను నాన్న విశ్రాంతి తీసుకుంటారు ఇరవైనాలుగ్గంటలూ యింట్లో ఉండే ఒక పనిమనిషినీ వంటమనిషినీ పెట్టుకుంటే అమ్మకి యీ ముసలికాలంలో పని చెయ్యవలసిన అవసరం ఉండదు దేశంలో ఏర్పడ్డ క్లిష్టపరిస్థితి తొలగిపోయాక — అంటే ఆఖరికి యింకో ఏడాది పోయినతర్వాతయినా నాకు శలవు యివ్వకపోరు అప్పుడు వెళ్ళి అమ్మనీ నాన్ననీ చూసిరావొచ్చు. ఏమాత్రం అవకాశం ఉన్నా యిక్కడికి తీసుకురావొచ్చు!'

ఇలాంటి ఆలోచనలతో నన్ను నేను సమర్థించుకున్నాను. చెల్లి రాసిన ఉత్తరంతో వెనక్కి తిరిగి పంపబడ్డ నా మనియార్డరు కూడా జోడించి ఆలోచిస్తే ఏమని తేలుతుంది.

'నువ్వు మా కళ్ళెదుట ఉంటే అంతేచాలు. నువ్వు పెళ్ళి చేసుకుని నీ కుటుంబం మా ఎదుట కలకలలాడుతూ కాపురం చేస్తూంటే చాలు. నీ పెట్టుపోతలు మాకు అవసరమూ లేదు; మేము ఆశించనూ లేదు. బతికినన్నాళ్ళూ తలచి తలచి ఏడ్చుకునేలా అర్ధాంతరంగా నువ్వు అమ్మకి చేసిన లోటు తిరిగి ఏమిచ్చి పూడ్చుకోగలవు '

కలచివేసే ఈ ప్రశ్నకు నావద్ద జవాబు లేదు. ఈ ఉత్తరం చదివేక యింటి ధ్యాసే తప్ప నా మనసులో మరొక ప్రసక్తే లేదు. కాని నే నెప్పుడూ ఊహించని చిత్ర మొకటి జరిగింది. నేను అస్పత్రిలో ఎంత ఏకాగ్రచిత్తంతో పని చేసినా, అన్నిరకాల ఆలోచనలూ అమ్మతోనే అంతమయేవి. కాని ఆరోజు, నన్ను నిలువెల్లా అశాంతితో దహింపచేసే అలాంటి ఉత్తరం వచ్చాక కూడా, అస్పత్రిలో అడుగు పెట్టినదగ్గిర్నుంచీ తిరిగి బయటకి వచ్చేదాకా నా కా విషయమే గుర్తుకు రాలేదు! తొందర తొందరగా మీల్సు పూర్తి చేసి, ఒక్కసారి మొహం కడుక్కుని సిద్ధంగా ఉన్న జీపుమీద అస్పత్రికి వచ్చేశాను. జీపు ఆగగానే జేబులో చెయ్యి పెట్టుకు దిగేను. మళ్ళీ ఉత్తరం తగిలింది. పైకి తీశాను. ముక్కలు ముక్కలుగా చింపేసి గబగబ లోపలికి వెళ్ళిపోయాను.

ఏదో కొత్త ధైర్యం నాలో ప్రవేశించింది. నా కళ్ళముందు ఇన్నాళ్ళూ ఉన్న తెరలు తొలగిపోయిన ట్లయింది.

ఈ మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈ రామూ, మోహన్‌లాల్ యిలాంటివారు సైనికవృత్తిలో అనేక శాఖలనుండి వచ్చినవారు. వీరిని చూడ్డానికి వచ్చేవాడు సాధారణంగా ఆ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుడు — లేదా స్నేహితులు. బంధువులు అనబడేవారు లేకపోలేదుగాని బహుతక్కువ. ఎందుచేత? వీరికి తల్లి

దండ్రులూ, అన్నదమ్ములూ ఎవరూ లేనేలేరా? అసలు వీరు ఏ ఉద్దేశంతో యుద్ధ రంగంలోకి దిగేరు?

ఆరోజు మొదలు రోగుల యోగక్షేమం, రోగ లక్షణం యివేకాక వారి సన్నిహితుల గురించికూడా కొంత భోగట్టా సేకరించడం ప్రారంభించాను. వారి గురించీ, వారివారిగురించీ, శ్రద్ధ చూపించడంలో నా గురించి నేను ఆలోచించ డానికే తీరుబడి లేక పోయింది. ఎదుటివారిగురించి తెలుసుకున్నకొద్దీ చెరువులోంచి ఒక్కసారి నదిలోకి ఉరికిన చేపలా అయింది నా పని.

న్యూమోనియాతో బాధపడుతూ హై టెంపరేచరుతో మూలుగుతున్న నాయక్ రాజగోపాల్ సంగతే తీసుకోండి.

తను జోకొడితే గాని పడుకోని పాపని, తనొకసారి వీధిలోకి వెడితేచాలు, తనూ వస్తానని అల్లరి పెట్టి కళ్ళు జ్యోతుల్లా చేసుకుని కుంచెడుసీళ్ళు కార్చే పాపని ఒక్కసారి ముద్దుపెట్టుకుని శిల చేసుకున్న తన హృదయాన్ని అల్లుకున్న ప్రేమలతల్ని బలవంతాన తెంచి – టాటా చెబుతున్న బుల్లిబుల్లి చేతుల్ని మరొకసారి ముద్దుపెట్టుకుని సైనికజీవితంలోకి అడుగుపెట్టిన రాజగోపాల్ని ప్రేరేపించిన శక్తి పేరుఏమిటి?

బెడ్ నెంబర్ టెన్ – పైలట్ నటేశన్ కథ?

నటేశాన్ని వాళ్ళక్క మీనాక్షీఅమ్మాళ్ పెంచింది. తల్లి చచ్చిపోతూ నాలుగేళ్ళ తన కొడుకుని కూతురుచేతిలో పెట్టింది. మీనాక్షి అత్తమామలకేకాదు భర్తకికూడా యిష్టంలేదు నటేశన్ని పెంచడం. ఎన్ని విధాల నచ్చజెప్పినా భర్త వినలేదు. ఆఖరికి తల్లికిచ్చినమాట నిలబెట్టడానికోసం కాపురాన్ని ఒదులుకుంది మీనాక్షీఅమ్మాళ్!

'బెంగుళూరులో ఎయిర్ఫోర్సులో ఏవో వేకెన్సీస్ ఉన్నాయని పేపర్లో పడింది అక్కా! అప్లికేషన్ఫారమ్సు పంపమని రాశాను.' అన్నాడు ఒకనాడు నటేశన్.

'అది మిలటరీ సంబంధమైన ప్రకటన అనుకుంటాను.' అంది మీనాక్షి గంభీరంగా.

నటేశన్ అవునన్నట్టు తల ఊపాడు.

'నిన్ను పెంచి పెద్దవాణ్ణి చెయ్యడంవరకే నా ధర్మం. ఆ తరవాత నీ కేది మంచిదని తోస్తే అది చెయ్యడం నీ ధర్మం,' అని జవాబు చెప్పింది మీనాక్షి తొట్రుపడకుండా; అంతేకాదు, ఇండియన్ ఎయిర్ఫోర్సులో రెండేళ్ళు ఉద్యోగం చేశాక ఫైటర్ పైలట్గా సీఫా ఏరియాకు ప్రమోషన్వస్తే తిలకంపెట్టి దీవించి పంపింది. తమ్ముడు వెళ్ళిపోయాక, తలుపు వేసేశాక రెండుచేతులూ మొహాన్ని కప్పుకుని ఒక్కసారి బావురుమంది!

సాధారణ జీవనసరళికి ఏమాత్రం పోలికలేని దనుకునే సైనికుల జీవితగాథలలో

కూడా ఎన్నెన్ని కదలించే దృశ్యాలు! అసలా జీవనవిధాన మెంతటి సాహసోపేత మైనదని! కనుచూపుమేర చెట్టయినా లేని మంచుమైదానాలలో, తమ ముందున్నది సమతలమో అగాధమో తెలియని కటికచీకటిలో, ఎటువంటి దీపమూ వెలిగించ కూడని పరిస్థితులలో, నీతినీ మానవత్వాన్నీ పూర్తిగా విస్మరించి వెన్నులో పొడిచే శత్రువుల సామీప్యంలో ఎన్నెన్ని గగుర్పొడిచే సన్నివేశాలు!! అన్యజీవనమార్గం దేనిలోనూ అడుగడుగునా ఆపదలూ, అపాయాలూ ఎన్నెన్నని!!

డాక్టరు విజయకుమార్ సిగ్నలింగు ఆఫీసరుతో అన్నాడు: "మూర్తిగారూ! ఏరోజు కారోజు సాధనచేసి, కర్తవ్యదీక్షలో ఎటువంటి బలహీనతలకూ అవకాశం లేకుండా యీ ఆస్పత్రినే నా యిల్లనీ, ఈ రోగులే నా రక్త బంధువులనీ ఎంచుకున్నాను. వీరి సేవలో ప్రతిక్షణం భగవంతుణ్ణి సేవిస్తున్నాను. నా విధినిర్వహణలో సర్వ శక్తులూ త్రికరణశుద్ధిగా కేంద్రీకరింపజేస్తున్నాను. దానికి ఫలితమా యిది?"

డాక్టరు కళ్ళమ్మట నీళ్లు జలజల కారిపోయాయి: "ఇంక యీ కళ్ళలో నీళ్ళకు తావు లేదనుకున్నాను. ఒక్క రోజులో ఇంత ఆస్పత్రి నేలమట్టమైనా ఆశలకూడలిని ముక్క ముక్కలు చేస్తుం దనుకోలేదు. పసిపిల్లలా నన్ను ప్రతిక్షణం పిలిచే, నా చెయ్యి గట్టిగా పట్టుకుని మృత్యువుతో పోరాడే ధైర్యం తెచ్చుకునే నా ఆప్తు లందరూ ఏమై పోయారు? జీవితంలో అనేకసార్లు ఓడిపోయాను. ఈ కొద్ది రోజుల విజయంతో సర్వమూ మరచిపోయి బతుకుతున్న నాకు, నా అన్నది నిమిషాలమీద నాశనమైపోతే ఏం చూసుకుని యింకా భరించమంటారు మూర్తీ! నే నెక్కడ అడుగుపెడితే అక్కడ శోకమయం. సర్వనాశనం. నే నిక్కడికి రాకపోయినా యింత ఘోరం జరక్క పోనేమో! నేను ఢిల్లీ వెళ్ళకుండా యిక్కడే ఉండి, వీళ్ళతో నాశనమై పోయినా నా ఆత్మకి యింత తృప్తి మిగిలేదేమో!"

శ్రీకృష్ణమూర్తి డాక్టరు శోకాన్ని ఆపడానికి ఏమాత్రం ప్రయత్నం చెయ్యలేదు. అలా చాలా సేపు తలచుకొని తలచుకొని విజయకుమార్ రోదిస్తూనేఉన్నాడు.

డాక్టరు చెప్పడం ఆపివేసిన పావుగంటసేపు యిద్దరూ అలా కూచున్నారు. తరువాత ముఖాలు కడుక్కుని టీ తాగేరు.

"మీ కథ విన్నాను, మీ కన్నీటిని గుర్తించాను. కాని మీ కన్నీటిని తుడవగల ననే ధైర్యం, నమ్మకం యింకా నాకుంది. ఒక కథ చెబుతా వినండి."

విజయకుమార్ జవాబుకైనా ఎదురుచూడకుండా సిగ్నలింగ్ ఆఫీసర్ శ్రీకృష్ణ మూర్తి యిలా చెప్పడం ప్రారంభించాడు

[ముగింపు వచ్చేసంచికలో]



# అది ప్రశ్న-ఇది జవాబు

అవసరాల రామకృష్ణారావు

## రెండవ భాగము

"ఏ ప్రశ్న మిమ్మల్ని కదిలించి ఇంతకథ చెప్పించిందో, ఏమీ జవాబు మాకు తృప్తికరంగాలేక మీ కథ వ్యధగానే మిగిలిపోయిం దనుకుంటున్నారో ఆ చిక్కు ప్రశ్నతోనే యీ కథా మొదలెడతాను. మీ ప్రశ్నకు జవాబు ఆఖరిపేజీలో మాత్రమే దొరికే చిత్రమైన నా కథ వింటే మీకు చిత్తశాంతి కలుగుతుందని నాకు నమ్మక మున్నది డాక్టర్! చెప్పనా?" శ్రీకృష్ణమూర్తివైపు విజయకుమార్ కృతజ్ఞతతో చూశాడు.

"ఈ రోజు పొద్దున మీరు నన్నంత బలవంతపెట్టి ఆస్పత్రికి పంపకపోతే కనీసం రెండుకేసులయినా ఫేటల్ అయిపోను. నాకున్న బాధలతోపాటు యీ పాపాన్నికూడా బతికున్నన్నాళ్ళూ తలచుకుంటూఉందును ఇక మీరు చెప్పేది నేను వినకపోడ మనగా ఎటువంటిది! వెంటనే మొదలెట్టండి"

"నాకు బాగా జ్ఞానమొచ్చిన దగ్గిర్నుంచీ యీ కథ చెప్పుకువస్తాను. పేర్లు మాత్రం కల్పితం. సంఘటన లన్నీ నూటికీ నూరుపాళ్ళూ నిజం;" శ్రీకృష్ణ మూర్తి చెప్ప నారంభించాడు. విజయకుమార్ తన చికాకులన్నీ తాత్కాలికంగా మరచి శ్రద్ధగా వింటున్నాడు.

* * * *

పెళ్ళిచూపుల కని వచ్చిన పెళ్ళికొడుకుతో పెళ్ళికూతురు సరాసరి మాటాడ్డం సాంప్రదాయవిరుద్ధం. కాని విజయలక్ష్మి పద్ధతులు మొదట్నుంచీ అలాంటివే. తండ్రి సుబ్బరామయ్యను ఎలాగో ఒప్పించి రఘుపతిని పిలిపించింది.

అన్నితలుపుల్తూ బార్లా తీసిన ఆ హాల్లో రఘుపతీ, విజలక్ష్మి రెండుకుర్చీల్లో ఎదురెదురెగా కూచున్నారు.

'మీ అబ్బాయి గురించి చెప్పండి,' ఆమెవైపు ఆదేపనిగా చూస్తున్న రఘుపతి ఈ ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు.

'ప్చ్, వాడా? వాడేనా? పదేళ్ళుంటాయి. ఏ ఆరేళ్ళ వాడిలాగో ఉంటాడు. ఉత్త పిచ్చివెధవ. అందుకు తగ్గట్టే వాడిపేరు పిచ్చేశ్వరావు!'

విజయలక్ష్మి ఆశ్చర్యంగా అతనివైపు చూసింది.

'... మా యింట్లో బారసాల అనమాతీలేదు. వాళ్ళమ్మ ఆ వెర్రివెధవని చూసుకుని 'నా బుచ్చితండ్రే, నా పిచ్చికన్నే' అని మురిసిపోయేది. ఆఖరికి నలుగురూ పిలుస్తూంటే ఆ పేరే స్థిరపడిపోయింది. ఏం, వాడి సంరక్షణ నీ కెక్కడ తగులుకుంటుందో అని భయమా?' అతడు మొదటిసారి పరిశీలనగా ఆమె మొహంలోకి చూశాడు.

'అవును, భయమే!'

ఆ స్వరంలోని స్పష్టతకు అతనే భయపడ్డాడు.


'మీ గురించి మొదట్లో కొన్ని భయాందోళనలు ఉండేవి. అవి తీరిపోయాయి. ఇక మిగిలిందీ, ముఖ్యమైనదీ, నేను మిమ్మల్ని యిక్కడికి పిలిపించిందీ అది మాట్లాడ్డానికే. ఆ భయంగురించే.'

'నీ కా భయం ఏమీ అక్కర్లేదు.'

'ఏం, ఆ పిల్లాణ్ణి ఏం చేస్తారు?'

రఘుపతి నీళ్ళు నమిలాడు. 'ఏదో ఒకటి చేస్తానుగా! నీ కా భయం అక్కర్లే దన్నానుగా!'

'అలాకాదు. ఈ విషయంలో మీనుంచి నిర్దుష్టమైన జవాబు నాకు కావాలి.




'పదేళ్ళ సర్వీసుఉన్న గవర్నమెంటు ఆఫీసర్ని గడగడ లాడించావు. జేబులో వేసుకున్నావు.'

'వదినా !'

'ఏం విజయా ?'

'నీక్కూడా ఓ రెండుజేబులు కుట్టించిపెట్టనా ?'

'రెండెందుకమ్మోయ్? కొంపతీసి... !'

'ఓడాన్లో అన్నయ్య, ఓడాన్లో యిదిగో యీ తిమ్మయ్య. అక్కణ్ణుంచే వాళ్ళని నువ్వు 'సిట్' 'స్టేండ్' అని ఆడిస్తూంటే, చూసేవాళ్ళకు ఎలా ఉంటుందంటావ్ ?'

వదిన జవాబుగా విజయలక్ష్మిని మరోముద్దు పెట్టుకుంది.

తన మొదటిభార్య అయిన శాంత పోయాక పిచ్చిబాబుని చూడ్డానికి రఘుపతి యింట్లో ఒక ఆడ పనిమనిషిని పెట్టకపోలేదు; గాని దానికి ఫస్టుతారీఖు ఎప్పుడు వస్తుందా అనేదృష్టితప్ప మరొకటి ఉండేదికాదు. పిచ్చిబాబు సంరక్షణ అది సరిగ్గా చేసిందోలేదో కనుక్కున్నవాళ్ళూ ఎవరూలేరు. క్రాఫింగూ జడా కాని జుత్తూ, బనీనూ పొడుగుచేతులలాల్చీ కాని చొక్కా, నిక్కరూ పేంటూ గాని లాగూ వీటితో వాడు జీవపదార్థానికి దూరంగా జడపదార్థానికి దగ్గిరగా పెరిగాడు. పత్రికలవల్లా సినిమాల వల్లా, పెద్దవాళ్ళ కబుర్లు వినడంవల్లా పదిహేనేళ్ళ లోపుగానే వయోవృద్ధులు

అవుతున్న కుర్రాళ్ళముందు పిచ్చిబాబు పుల్లాయ్‌కాక ఏమౌతాడు? నూనె రాసుకుంటే తలమీంచి ప్రవహించక మానదాయెను; పాపిడి తీసుకుందామంటే ఆ మహారణ్యంలో దారి కనపడి చావదాయెను; పౌడరు రాసుకుందామంటే పగటివేషంలా బైటపడిపోక తప్పదాయెను... వాణ్ణి చూసి నవ్వితే నవ్వినవాళ్ళదా తప్పు? అయితే వాడికి తెలిసినవిద్యలు కూడా కొన్ని లేకపోలేదు. ఇరవైగజాల పొడవుగల వరండా అయినా ఆచివర మేష్టారు కనబడితే చాలు, ఈచివరనున్నా వీడికి చెమటలు పొయ్యక మానవు. మెచ్చుకుందామని అయినాసరే వీణ్ణి ఎవరైనా పేరుపెట్టి పిలిస్తే చాలు, కాళ్ళూ చేతులూ వణక్క మానవు. ఎప్పుడూ మఠంవేసుకుని చేతులు కట్టుకుని తల కిందికి దించుకుని కూచోడం వాడికి అలవాటు. కాంపోజిషన్ పుస్తకాలుగాని, పరీక్షపేపర్ల కట్టలుగాని మేష్టారితో వాళ్ళింటికి మొయ్యడంకన్న వాడికి దేవేంద్రపదవి లేదు!

అయితే వాడిబతుకు అనుకున్నంత అధ్వాన్నమేం కాదు. నెలకి ఏభై రూపాయిలు పంపగల తండ్రి వాడికున్నాడు. దాన్ని ఆమోదించగల పిన్ని వాడికుంది. అయినా వాడి చిన్నారిజీవితంలో బిక్కుబిక్కు మనిపించే కొన్ని ఘడియలు ఉండేవి. ఓసారి వీణ్ణీ మరొణ్ణీ కలిసి వాళ్ళమేష్టరు కొట్టేడు; చెవులు గింగురుమనేటట్టూ, కళ్ళు తిరిగేటట్టూ చావగొట్టేడు. పిచ్చిబాబూ, దెబ్బలుతిన్న రెండో కుర్రాడూ క్లాసులో ఊరెగిరిపోయేటట్టు గోల చేస్తూంటే మానిటరుచేత వాళ్ళ హాస్టల్లో దిగబెట్టించాడు. ఎలా తెలిసిందో మరి, మర్నాటికల్లా ఆ కుర్రాడితల్లి ఆ వూరు వచ్చేసింది. దురదృష్టవశాత్తూ అప్పుడు ఆ మేష్టరు క్లాసులోనే ఉన్నాడు. ఆమె క్షణం వేస్టు చెయ్యలేదు కుర్రాణ్ణి రెక్కపట్టుకుని బరబరా యీడ్చుకుంటూ సరాసరి క్లాసుకి వచ్చేసింది

'ఏమయ్యా మేష్టరూ! ఇదేనా నువ్వుచెప్పే చదువు? గుంటనాగమ్మకి యింకా కొనప్రాణం ఉందేమో ఒకటో రెండో దెబ్బలేసి తీసెయ్యకపోయావా? కుర్రాడు అల్లరి చేశాడనుకో.. కుర్రాళ్ళు కాకపోతే నేడోరేపో అన్నట్టుండే నువ్వా, నేనూ చేస్తామటయ్యా అల్లరి? పాఠం చెప్పడం చేతకాకపోతే తప్పుకోరాదూ, నీ బాబు అమ్మమ్మ మొగుడిలాంటివాడు మరోడు మరుక్షణానికి వస్తాడూ? పిల్లల్ని యిలాగే చంపుకుంటావేం? ఉన్నఊళ్ళో - చనువైనవాళ్ళదగ్గిర చదువబ్బదని - వేలెడు వెధవని వేలకివేలు తగలేసి పరాయిఊరు పంపడం, నీ పొట్టని పెట్టుకోడానికేనటయ్యా? తేలు కుట్టిన దొంగలా ఎంతకీ పైకి తేలవేం? ఎంతవాగినా నా నోరే

నొప్పెడుతుందనీ – నేను నిన్నేం చెయ్యలేననీ నీ ఉద్దేశంకాబోలు ... కోపంవస్తే నేను మనిషినికాదు తెలుసా ?... ఇవాళైతే యిలా కొట్టావుగాని...'

ఆవిడన్న ప్రతీముక్కా యిలా రికార్డు చేసుకుపోతే ఇదే పెద్దగ్రంథమైపోతుంది అక్కణ్నుంచి హెడ్మాస్టరుదగ్గిర కెళ్ళి పిల్లాడి ప్రతిదెబ్బా చూపించి హోరుహోరున ఏడ్చి, పదిరోజులు పిల్లాడికి శలవు గ్రాంటు చేయించుకుంది. మర్నాడుపొద్దున వెళ్ళిపోతాననగా ఆ రాత్రి పిచ్చిబాబు ఆ కుర్రాడిరూంకి వెళ్ళడం జరిగింది. ఆ కుర్రాడికి వాళ్ళమ్మచేస్తున్న సేవ చూసేసరికి పిచ్చిబాబుకి మొదటిసారిగా తను పోగొట్టుకున్న వస్తువ ఎంత విలువైనదో తెలిసింది. ఆ ఎనిమిదేళ్ళ కుర్రాడూ ఎనిమిదినెల్ల పసిపాపలా వాళ్ళమ్మఒడిలో యిమిడిపోయాడు. ఆవిడ కుర్రాడికి దిష్టితీసిపోసింది. వేణ్ణీళ్ళుపెట్టి ఒళ్ళంతా కాచింది. ఇరుకుమంత్రం వేసింది. ఒళ్ళంతా మృదువుగా నెమ్మదిగా పట్టింది. ఈ పనులన్నీ చేస్తున్నప్పుడు మేష్టార్ని వాళ్ళ వంశవృక్షాన్నీ శాపనార్థాలు పెట్టింది వాడు అటూ ఇటూ తిరిగినప్పుడు, 'అమ్మా' అని బాధతో మూలుగుతున్నపుడు, 'అయ్యో కన్నా! నేను చచ్చిపోయానుకదే!' అని కళ్ళనీళ్ళెట్టుకుంది ఆ కళ్ళనీళ్ళనుచూసి – ఆ కుర్రాడికంటె ఎక్కువగా దెబ్బలుతిన్న పిచ్చిబాబు తన శరీరబాధంతా మరచిపోయి – ఏదో తెలియనిలోటు స్ఫురించి హృదయమంతా కలచివేయగా – తనూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు 'అయ్యో అయ్యో! ఆ కిరాతకుడు నిన్నా చెయ్యిచేసుకున్నాడా అబ్బాయీ ? ఏడవకమ్మా...దీ న్నిలా నేను ఒదిలిపెడతా ననుకోకు ... యింటికెళ్ళి వీళ్ళ యజమానితో చెప్పి – సీమఅప్పీలు చేసైనా సరే – యీ దురంతం అంతుచూసికే ర్తాను నువ్వుకూడా మీ వాళ్ళకు రాయి...ఊరుకోకు,' అంది ఆమె.

'మావాళ్ళు ఎవరున్నారు ?' అనుకున్నాడు పిచ్చిబాబు హెడ్మాస్టరికి ఎప్పుడైనా అంతగా అవసరంవస్తే ఒకముక్క రాయడంతప్ప – తనతండ్రి తనకి ఉత్తరమైనా రాయడు ఇక పిన్ని – ఆమె చూపులు తండ్రిచూపులంత 'డ్రై'గా వుండవు. అయితేనేం ఆమెకూడా, తన్నెప్పుడూ దగ్గిరకు తీసిఎరగదు. తనతో ఎప్పుడు మాట్లాడినా ఎవరో పైవాళ్ళతో మాటాడినట్టు మాటాడుతుంది. ఆ మాటాడిన నాలుగు మాటలూ ఎదురుగా తనతోగాక పరోక్షంగా మాటాడుతున్నట్టు ఉంటుంది. 'పాపం ఆ కుర్రాడికి బట్టలూ అవీ సరిగ్గా ఉన్నట్టులేవు. ఒక అరడజను నిక్కర్లూ, చొక్కాలూ వెంటనే రడీమేడ్‌కి తీసికెళ్ళి కొనియివ్వండి. కొత్తపూరూ, చిన్నతనమూ. రెండు తువ్వాళ్లూ, ఒక పరుపూ కొనండి, ఇన్నాళ్ళయినా అతనికి చెప్పులే కొనలేదా, భలేవారండీ! అవసరమైతే ఎవర్నడుగుతాడుగనక – ఓ పదిరూపాయిలు

చేతి కివ్వండి,' అనేది తండ్రితో. 'ఒరే సముద్రం! కుర్రాణ్ణి జాగ్రత్తగా తీసికెళ్ళి దిగబెట్టిరా ... ఏం కావాలో ఏమిటో నువ్వే అడుగుతూఉండు. పాపం అమాయ కుడూ, మొహమాటస్థుడులా ఉన్నాడు...ఏం కావల్సినా వీళ్ళ నాన్నగారికి రాయ మని వాళ్ళ క్లాసుటీచరుతో చెప్పు...కుర్రాడు దేనికీ ఇబ్బంది పడకూడదు సుమా!' అనేది నౌఖరుతో.

మొత్తానికి చిత్రమైనది పిన్ని. సవతితల్లి వచ్చి తనకి చెయ్యలేని పనులన్నీ పురమాయిస్తుందనీ, చెయ్యలేకపోతే కొడుతుందనీ, అష్టకష్టాలు పెడుతుందనీ ఎన్నెన్నో విన్నాడు. ఆమె వచ్చింది – తనకి ఒక్క పని చెప్పలేదు; కష్టం కలిగించే ఒక్కమాట అనలేదు...తనకి సదుపాయం కలిగించడానికి ప్రతి ప్రయత్నమూ చేసేది. కన్న నాన్నకన్న వెయ్యివిధాల నయం. కాని ఆలోచించిచూస్తే ఆమె ప్రయత్నాలలో ఏదో వెలితి ఈనాడు తనకి కొట్టొచ్చినట్టు కనిపించింది తనకి కావలిసిం దేదో ఒకటి ఉంది, అదేమిటో తన కిప్పుడు తెలియడంలేదు – అదేదో పిన్ని తన కివ్వలేదు. అలా యివ్వలేదని పిన్నికి తెలుసా? ఏమో తనకి తెలీదు.


ఆరోజు పిచ్చిబాబు పడుకోబోయేముందు కళ్ళమ్మట నీళ్ళు కారుతూండగా, 'పిన్నీ! నన్నిక్కడి కెందుకు పంపించావు? వీధిలోకి వచ్చిన ఏ ముష్టివాణ్ణయినా బియ్యం వెయ్యందే పంపించవే; అలాంటి నీకు నేను బరువైపోయానా? దూరంగా ఉండేకన్న కొట్టినా తిట్టినా నీ కళ్ళముందు పడిఉండడం నాకు యిష్టమని నీకు తెలిదా?' అనుకున్నాడు.

* * * *

సంక్రాంతి శెలవలకు పిచ్చిబాబు ఇంటి కొచ్చి వెళ్లా లన్నప్పుడుమాత్రం విజయలక్ష్మికి అంతో ఇంతో వాడితో మాటాడక తప్పలేదు

ఒకనాడు మధ్యాహ్నం ఆవిడకి ఆస్పత్రికి వెళ్ళవలసిన అవసరం కలిగింది. రఘుపతి సాయంకాలానికిగాని యింటికి రాడు. అరగంటైౖ చూసింది; సముద్రంగాడు వస్తానని దగా చేశాడు. మళ్ళీ నాలుగు దాటితే పెద్దడాక్టరు దొరకడు. బట్టలు కట్టుకుని వెళ్ళడానికి రడీగా తయారై అరగంటసేపు చికాకుగా వీధిగదిలో సోఫాలో కూలబడింది విజయలక్ష్మి. ఇంతలో యింటిముందు రిక్షా ఆగింది. ఆగుతూనే పిచ్చిబాబు కిందకి ఉరికేడు.

'ఇదిగో పిన్నీ! రిక్షా వచ్చేసింది, ఆసుపత్రికి వెడతావేమో!' విజయలక్ష్మి ఆశ్చర్యంతో వాడివైపు చూసింది. ఈ వెర్రివెధవకి యింతటి తెలివితేటలు ఎప్పట్నుంచీ! తను ఆయనతో చెబుతూంటే విన్నాడు కాబోలు. మాటాడకుండా




గది తాళాలు వేసేసి రిక్షాలో కూచుంది. పిచ్చిబాబు మొహంవైపు చూసింది. వా దేదో చెప్పలేక మానలేక బాధపడుతూన్నట్టు సూక్ష్మగ్రాహి అయిన ఆమె యిట్టే గ్రహించేసింది. 'ఏమిట్రా ?' అన్నట్టు కళ్ళతో అడిగింది.

'ను వ్వొక్కర్తివీ అంతదూరం వెళ్ళిరాగలవా, పిన్నీ !' అమాయకతా, అప్యాయతా మేళవించిన ఆ ప్రశ్నకి ఆమె జవాబు చెప్పలేక రిక్షాలో ఒకపక్క కూచుని వాడ్నికూడా రమ్మని సౌంజ్ఞ చేసింది. అమ్మ రెండుచేతులూ జాపి పిలిచినంత సంతోషంతో వాడు ఒక్క ఉరుకుతో పిన్ని పక్కని కూచున్నాడు.

ఇంటి కొచ్చేశాక వాడు గదిగుమ్మందగ్గిర తటపటాయిస్తూ తచ్చాడుతూ ఉంటే, 'ఏ' మని కనురెప్ప లెగరేసింది.

'నేను లోపలికి రావచ్చునా పిన్నీ !'

మరొకప్పుడైతే విజయలక్ష్మి ఏమనేదో! ఇవాళ ఆమెమనసు చెప్పలేని సంతోషంతో ఊగిపోతున్నది అది పంచుకోడానికి ఎవరైనా - అదెవరైనా సరే - కావాలి. ఆమె ఆమోదం పొంది పిచ్చిబాబు లోపలికి వచ్చాడు

'నీ ఒంట్లో ఎలాఉంది పిన్నీ! డాక్టరు ఏమంది ?'

ఆమె పిచ్చిబాబు మొహంలోకి మరొక్కమారు చూసింది. తనకోసం కొట్టుకుపోతున్న ఆ పసిప్రాణాన్ని చూడగానే ఆమెలోని ప్రేమప్రవాహం కట్టలు తెంచుకు బయటికి వచ్చింది. రెండుచేతులూ జాచి వాణ్ణి దగ్గిరకి తీసుకుంది ఎప్పుడూలేనిది

ముద్దుల వర్షం కురిపించింది. వాడు ఉక్కిరిబిక్కిరై గుండె అతివేగంగా కొట్టుకోడం ఆమె స్పష్టంగా వింది. తడిసిన వాడి చెంపల్ని ప్రేమతో నిమిరింది.

'నీకు తమ్ముడు పుడతాడ్రా బాబూ!'

ఇంతటి మహత్తర సన్నివేశంలో అంతటి మధురవార్త వాడు భరించలేక పోయాడు. లేచి గంతులు వేశాడు. ఇల్లంతా పరుగులు తీశాడు. ఇరుగూ పొరుగూ చెప్పివచ్చాడు. 'ఈ కబురు విన్నావా?' అని అడిగినవారితోనూ, అడగనివారితోనూ ప్రాణం ఉన్నవాటితోనూ లేనివాటితోనూ చాటించాడు. చిన్నకళ్ళు కావొచ్చు, చింపిరిజుత్తు కావొచ్చు, చిక్కిడాకంత మొహం కావొచ్చు - అయితేనేం, విస్మయజ్యోతిని చిత్తుచేసేఅంత వెలుగు అక్కడుంది. తండ్రికోసం గేటుదగ్గర కాచుకున్నాడు — ఈ కబురు ముందు చెబుదామన్న గంపెడంతఆశతో.

'చీకటి పడిపోతోంది. లోపలికి వచ్చెయ్యండి;' పనివాడి కేక వాడికి వినపడలేదు

'దీపాలు పెట్టేశారు. చలిగాలిలో తిరక్కండి;' సముద్రం హెచ్చరిక వాడికి చేరలేదు.

'మీకు అన్నం వడ్డించేశాను. అమ్మగారు రమ్మంటున్నారు!' రంగమ్మ కబురు అందలేదు.

అలా ఇనపగేటుని ఆనుకుని - ఒక్కొక్కప్పుడు దాన్ని ఎక్కి అటూ యిటూ సంభ్రతనంగా ఊగుతూ— వీధి చివరివరకూ, చూపు ఆనినంతవరకూ చూస్తూ పిచ్చిబాబు అక్కడే కనిపెట్టుకుని ఉన్నాడు. 'నాన్న రావాలి. ఈ కబురు చెప్పాలి అందరికంటె ముందు తనే చెప్పాలి.'

పది దాటేక రఘుపతి వచ్చాడు. వీడు చేతులు జాచేడు. 'నాన్నా నన్నెత్తుకో. ముద్దు పెట్టుకో. మంచి కబురు చెప్పాలి, చెవిలో!'


రఘుపతి అసహ్యంగా కోపంగా చూశాడు. 'వెంటనే చెప్పు; నాలుగు తగిలియ్యగలను.'

పిచ్చిబాబు నీరసంగా చెప్పేడు.

'ఏడిశావ్. ప్చ్. వయసుకుమించిన భోగట్టాలు. నువ్వు చెప్పకపోతే తెలీదు గాబోలు!'

పిచ్చిబాబు మొహం ఎలా మారిందో ఆ చీకటికే తెలియాలి!

మర్నాడు రఘుపతి ఆఫీసుకి శలవుపెట్టి యింట్లోనే ఉండిపోయాడు. బాగా కబ్బున్నవాడూ, అనుభవించడం తెలిసినవాడూ గనక మామూలు రోజుల్లోనే వాళ్ళింట్లో భోజనం విందుభోజనంలా ఉంటుంది. ఇక ఆ సంతోషంలో నాలుగైదు




స్పెషల్ అయిటమ్స్ చేర్చబడ్డాయి. తెలిసినవాళ్ళని నలుగురైదుగుర్ని భోజనానికి పిలవడంకూడా జరిగింది. ముందురాత్రి జరిగిన అవమానం పూర్తిగా మరచిపోయి పిచ్చిబాబు వాళ్ళలో ఒకడైపోయి, ఆ సంతోషంలో లీనమైపోయి అటూ ఇటూ హడావిడంతా తనదే అన్నట్టు తిరగజొచ్చాడు.

'వీడు శాంతమ్మ కొడుకుగదూ!' అన్నారు అందులో ఒకరు.

'అవును; వీడు కడుపున పడ్డదగ్గిర్నుంచీ ఆ తల్లికి కష్టాలు ఆరంభమయ్యాయి. తగని రోగం పట్టుకుంది. అసలు వీణ్ణి కంటుందనీ, మళ్ళీ మనమొహం చూస్తుందనీ ఎవరూ అనుకోలేదు. అయితేనేం, ఏం సుఖపడి చచ్చిందిగనక! ఆ మూడేళ్ళూ నరకం అనుభవించింది. ఇంతకీ ఒక్కొక్క శనిగ్రహం దాపురించిన వేళా విశేషం!'

'ఇంకా రఘుపతిరావు మంచివాడు కాబట్టి సరిపోయింది. ఆ రోగిష్టిపెళ్ళాన్ని కట్టుకుని ఓనాడయినా సుఖపడ్డాడా? పోయినిపోక ఈ తంటసాన్ని ఒకటి తగిలించి వెళ్ళింది... వీడూ, ఆ తల్లితో...'

'బాగుంది. వీడిబరువుని నువ్వేం మోస్తున్నావ్. నోరెరగని వెధవ, తల్లి ఉంటే ఆ పిల్లడు యిలాగే ఉండిఉండునా? ఎంత బుద్ధిమంతురాలైనా మారుటితల్లి

మారుటితల్లే. ఈ చూపించే ప్రేమ నటన కాదని నమ్మక మేమిటి? ఇది ఎల్లకాలం ఉంటుందని రుజువేమిటి?'

లోపల్నుంచి వస్తున్న పిచ్చిబాబు చెవిలో — ఒకమూల చేరి రహస్యంగా మాటాడుకుంటున్న వీరిమాటల్లో — చివరిముక్కలు పడ్డాయి. వాడి మొహం ఎరుపెక్కింది.

'ఏమిటీ! మా పిన్ని నేనా అంటున్నారూ? మళ్ళీ అనండి ఏంచేస్తానో...' అతను ఏమీ అనకపోగా కృత్రిమంగా నవ్వేడు.

'ఓరి వెర్రివెధవా! మీ పిన్నమ్మ ప్రేమ ఎల్లకాలం ఉంటుందనుకుంటున్నావుట్రా? అందుకేనట్రా, పెళ్ళయిన వారంరోజులు దాటకుండా వేలెడంత వెధవని నిన్ను పొరుగూర్లో చదువుకి పెట్టిందీ!'

పిచ్చిబాబు అతని జుత్తు పట్టుకుని పీకబోతూంటే గట్టిగా పట్టుకున్నాడు.

'ఓరి వెర్రికుట్టీ! నాలుగురోజులు పోనియ్యరా... మీ పిన్నికి నలుసు పుట్టనియ్యరా... అప్పుడు ఈ పైపై ప్రేమలు ఏమవుతాయో చూద్దుగానిరా.'

'వాడితో నీ కేమిట్రా — కుర్రాడితో సరిగ్గా ...పోయి ఆడుకోరా సార్థకనామధేయా!' ఇద్దరూ గట్టిగా నవ్వేరు. తెలియని బాధతో పిచ్చిబాబు మనసు గిలగిల తన్నుకుంది. ఎంత ఆలోచించినా వా శ్ళేమంటున్నారో, ఎందుకు నవ్వుతున్నారో తెలీలేదు.

## *11*

శ్రీకృష్ణమూర్తి అయిదునిముషాలసేపు చెప్పడం ఆపేసి విజయకుమార్ వైపు చూశాడు

"ఏమి టలా చూస్తున్నారు?"

"అబ్బే, అశుభం శుభం తెలియని ఒక అమాయకహృదయానికీ, మనం ఇప్పుడు చర్చిస్తున్న జటిలమైన సమస్యకీ సంబంధం ఏమిటా అని..."

"మీకిప మూడుముక్కల్లో చెప్పెయ్యడానికి నా కేమీ అభ్యంతరం లేదు కాని ఆ కుర్రాడి అనుభవాలు మొదట్నుంచీ ఆకళింపు చేసుకుంటేగాని అందులో అంతరార్థం మీకు బోధపడదు"

"నా ఉద్దేశం క్లుప్తంగా తేల్చిపారెయ్యమని కాదు. నా అన్నవారు ఎవరూ లేనివారు సైనికవృత్తిలో చేరడానికి అడ్డేమీ లేదుగదా! ఇక కథేమి ఉన్నదని?"

"ఏమో విని మీరే చెప్పండి"

ఇద్దరూ చెరొకగ్లాసు తాగేరు. శ్రీకృష్ణమూర్తి మళ్ళీ మొదలుపెట్టేడు.

* * * *

'పిచ్చేశ్వర్రావ్! నేనే కబురంపిద్దా మనుకున్నాను. నువ్వే వచ్చావ్; కూచో.'

వాడు హెడ్మాస్టరు గదిలో భయం భయంగా నిలబడ్డాడు.

'ఫరవాలేదు, కూచోవోయ్.'

వాడు అప్పటికీ కూచోలేదు.

'మీ నాన్నగారు చెప్పిందాన్నిబట్టి నీ కేదో వచ్చునని నాలుగులో విన్ను చేర్పించాను. కాని ఒకటోక్లాసు స్టాండర్డుకూడా నీకు లేదు. పోనీ వచ్చిన ఈ ఏడాదిలోనూ ఏమైనా నేర్చుకున్నావేమో అనుకుంటే, కొత్తవి నేర్చుకోడంకంటె పాతవి మరచిపోడంలోనే నీకు నేర్పు ఎక్కువ. మీవాళ్ళను విడిచిపెట్టి యిక్కడ ఉండడం నీకేమైనా బెంగగా ఉందా?'

'లేదండీ!' అన్నాడు పిచ్చిబాబు వంచినతల ఎత్తకుండా.

'నీ కే యిబ్బందీ కలక్కుండా, యింత చిన్నతనంలోనే మీ నాన్నగారు నీ కోసం ఇంత డబ్బు ఖర్చుపెడుతున్నారుగదా! మరి దానికి తగ్గట్టు నువ్వు జాగ్రత్తగా చదువుకోవాలా వద్దా, చెప్పు?'

'తప్పేనండీ,' అన్నాడు వాడు బుర్ర మరీ కిందకి దించుకుని.

'అలా అనేస్తే సరిపోదు. క్లాసులో నీకు దోధపడకపోతే మళ్ళీ మళ్ళీ అడుగు. ప్రతి పాఠం శ్రద్ధగా విను. ఈసారి పరీక్షలో మంచి మంచి మార్కులు రావాలి.'

'ఫరవాలేదు, వచ్చేస్తాయండీ!'

ఊగుతున్న వాడి కోలబుర్రా, గుండ్రని కళ్ళూ చూసి ఆయనకి నవ్వొచ్చింది.

'అదేమిటోయ్? నీ కేమి టా ధైర్యం? నీకు జ్యోతిషంగాని వచ్చా?'

'రాదండీ.'

'మరి?'

'ఈసారి బాగా చదువుకుంటానని పిన్నిచేతిలో ఒట్టేశాగా!'

ఆ సంగతి అర్థంకాకపోయినా తెలిసినట్టు నవ్వి ఆయన అన్నారు: 'సరేలే... ఇకముందు అశ్రద్ధ చేస్తే ఊరుకొనేది లేదు; వెళ్ళు.'

వాడు వెళ్ళలేదు. అక్కడే నిలబడి, కొంచం సందేహించి, అడిగాడు: 'మేష్టారూ, మా నాన్నగారు మీకు ఉత్తరంగాని రాశారా?'

'ఆఁ, నాలుగురోజులై వచ్చింది. ఏం కావాలి?'

'అబ్బే, వాడిమాట రాశారేమోనని!'

'ఎవడిమాట ?'

'మా తమ్ముడిమాటలెండి.'

'నీకు తమ్ముడుకూడా ఉన్నాట్టోయ్, చెప్పేవ్ కాదు ?'

'ఇంకా రాలేదనుకోండి.'

'ఏం మీవా ళ్ళెవరితోనైనా ఊరెళ్ళాడా ?'

'అబ్బా... అదికాదండీ!'

'మరి ?'

ఎలా చెప్పాలో తెలియక పిచ్చిబాబు మొహం ఎర్రనైంది. ఆఖరికి ఎలాగయితే నేం చెప్పేశాడు. హెడ్మాస్టరూ, ఆ గదిలోవున్న యితర సిబ్బందీ పెంకులెగిరిపోయి నట్టు నవ్వేశారు.

'మా పిన్నికి పురుడొచ్చిందా అన్నప్రశ్న భలేగా అడిగావోయ్. అయినా అలాంటి భోగట్టాలు మీ నాన్నగారు నా కెందుకు రాస్తారూ ?'

'మ రెవరికి రాస్తారు ?'

'ఏమో నా కెలా తెలుస్తుంది ?'


'అయితే ఆ కబురు నా కెలా తెలుస్తుంది ?'

'భలేవాడివిలా ఉన్నావోయ్ నువ్వు; అమాయకుడివనుకోనా, అతితెలివైనవాడి వనుకోనా ? ఇంతకీ నీ కింత ఆతృత ఎందుకు ? కబురు తెలియకపోతుందా !'

పిచ్చిబాబు మొహం ఏమాత్రం సమాధానపడ్డట్టూలేదు.

'ఉండు, మన రైటరు సత్యనారాయణగారు పనిమీద మీ ఊరు వెళ్ళేటట్టుఉంది. మీ యింటికి వెళ్ళి ఆయన్ని కనుక్కురమ్మంటాను. సరేనా ?'

పిచ్చిబాబు ఆనందంగా తల ఊగిస్తూ వెళ్ళిపోయాడు. వాడికి హఠాత్తుగా వాళ్ళమ్మ బతికున్నప్పటి, తనకి రెండేళ్లు ఉన్నప్పటి దృశ్యం లీలగా కనిపించింది. రెండు చిన్న చిన్న పిల్లిపిల్లలు–గోధుమరంగువి–ఎంతో ముద్దొస్తూఉండేవి. గోడకి చేరేసిన నులకమంచంకి ఒకటి అటూ, ఒకటి యిటూ. ఎన్ని రకాల ఆటలు ఆడు కునేవో. తరుముకోడాలు, దొంగాటలు, దోబూచులు వాళ్ళమ్మని అంత దూరం లోంచి చూడగానే ఎక్కడి ఆట అక్కడే బంద్. పాలకోసం పోటీలు వేసుకుని పరిగెత్తేవి. రేపొద్దుట తమ్ముడూ తనూ అలా ఆడుకోవచ్చు. ఇద్దరూ ఒక చోట ఉండడం కుదురుతుందా ? ఎందుకు కుదరదు ! ఇల్లు విడిచి రాననీ, తమ్ముణ్ణి విడిచి తను ఉండలేననీ గట్టిగా పేచీపెడితే సరి; అంతగా కాదూ కూడదంటే వాణ్ణీ యిక్కడ చేర్పిస్తేసరి. బాగుంది, అంత చిన్నవాణ్ణా ? ఏం, పదేళ్ళవాడు తను




ఇలా పొరుగూరిలో చదువుకోడం బాగుందా? ఏడాది దాటనివాడు. వాడూ చదువుకుంటే తప్పొచ్చిందా!

రైటరుగారు వాళ్ళ ఊరు వెళ్ళొచ్చారని తెలిశాక పిచ్చిబాబు యింక ఓర్పుగా ఉండలేకపోయాడు. షష్టపీరియడు ఇంగ్లీషుమేష్టార్ని గంటసేపు బతిమాలి సత్యనారాయణగారింటికి పరిగెత్తుకువెడితే, ఆయన స్కూలుకే వచ్చేశారన్నారు. స్కూలికి వచ్చేసరికి అదృష్టవశత్తూ ఆయన మరెక్కడికీ వెళ్ళలేదు. హెడ్మాస్టారు గదిలో ఉన్నారంటే అక్కడికి పరిగెత్తేడు. గుమ్మంలోనే ఆయన మాటలు విని ప్రాన్పడిపోయాడు.

'పండంటి బిడ్డటండీ, పదిపౌన్లయినా తూగునుటండీ. ఏం లాభం? పుట్టిన గంటకంటె బతకలేదుటండీ. ఇంకా తల్లిప్రాణం దెబ్బతినలేదు, నయం కాదుటండీ?'

ఏడుపు విని వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగారు. చొక్కాతో కళ్ళను అద్దుకుని తన దుఃఖాన్ని కనపడకుండా వినపడకుండా చేద్దామని పిచ్చిబాబూ వ్యర్థప్రయత్నం చేస్తున్నాడు; హెడ్మాస్టరు గద్దించాడు.

'ఇదేమిటోయ్ పిచ్చేశ్వర్రావ్! నీ కేం మతిపోయిందా ఏమిటి?'

'అది కాదండీ...మరి...మరి నేను మా పిన్ని మొహం ఎలా చూడనండీ?'

హెడ్మాస్టరు ఒక పావుగంటకి వాణ్ణి పూర్తిగా ఏడుపు మానిపించి, కాఫీ తెప్పించి యిచ్చాడు. ఏమయినా వాడి ముఖంలో విచారం కొంచెంకూడా తగ్గలేదు.

'సత్యనారాయణా! నువ్వు మళ్ళీ ఆ ఊరు వెడతావు కాబోలు_ఇతన్ని ఒక సారి ఇంటికి తీసికెళ్ళి వీళ్ళవాళ్ళకి చూపెడుదూ! ఏమోయ్ వెడతావుటోయ్?'

రైటరుగారితో వాళ్ళూరు వచ్చిన పిచ్చిబాబు పిన్నిని చూడగానే బావురుమని ఏడ్చేశాడు.

'మధ్యని నీ కెందుకురా బాబూ అంత దుఃఖం!'

'బాగుంది పిన్నీ! నీకూ నాకూ కాకపోతే మ రెవరికి!' ఈసారి పిన్ని కళ్ళమ్మట నీళ్ళు తుడుచుకుంది.

రఘుపతి ఆఫీసునుంచి వస్తూనే అడిగాడు· 'అదేమిటి, పిచ్చిగాడు ఎక్కణ్ణుంచి ఊడిపడ్డాడు?'

'పిన్నిని చూడాలనిపించి మా రైటరుగారు వస్తుంటేకూడా వచ్చా న్నాన్నా...'

'ప్చ్, ఏడిసినట్టుంది. అసలే మార్కులూ అవీ అంతబాగా వస్తున్నాయా, దీనికి తోడు అటూ ఇటూ తిరగడంకూడానా? చెప్పా పెట్టకుండా ఈసారి యిలా బయల్దేరావంటే పళ్ళు రాలగొడతాను. నే నేం తక్కువ చేశానని మాటాడితే ఇలా పరిగెత్తుకొస్తావ్_ఇంకో అరగంటకి ఎక్స్ప్రెస్‌బస్ ఉంది, ఫో.'

పిచ్చిబాబు అతిదీనంగా సహాయంకోరుతూ పిన్ని మొహంవైపు చూశాడు. కాని ఆమె వాడి తరపున భర్తతో ఒక్కముక్క అనలేదు. అలా నిర్లిప్తంగా కఠినంగా చూస్తూకూచుంది. 'నాదీ అన్నది పోగొట్టుకున్నది చాలు ఇక ఈ లేనిపోని అల్లరికూడా ఎందుకు!' అనుకుంది

'ఇంకా అలా చూస్తావేంరా...అన్నం తిని త్వరగా బయల్దేరు.'

పిచ్చిబాబు యాంత్రికంగా తిరుగుముఖం పట్టేడు _ 'ఇంకా ఇక్క దేముంది?' అనుకుని.

* * * *

'మీ వాడికి నాలుగైదు రోజులుగా జ్వరం కాస్తోంది. మీరు ఒకసారి వచ్చి వెడితే బాగుంటుంది,' అని మరో ఐదారు నెలల తరువాత ఒకనాడు హెడ్మాస్టరు రఘుపతిపేర ఉత్తరం రాశాడు. వెంటనే తిరుగుటపాలో జవాబు వచ్చింది 'మీ సంస్థ పబ్లిక్‌స్కూలు పద్ధతిలో నడుస్తోందని విన్నాను. అంతా యాంత్రికంగా

నడుస్తుందని ఆశించి మా కుర్రవాణ్ణి అక్కడ చేర్పించాను. వాడికి కనీసం మెట్రిక్ అయినా అయేవరకూ పూర్తిబాధ్యత మీదే. వాడి మంచి చెడ్డలు మీవే. మిలటరీ స్కూల్లో జరిగినట్టు యిక వాడి తల్లీ తండ్రీ అన్నీ మీరే, మీ ఉపాధ్యాయవర్గమే. మా జోక్యం ఎంతవరకయ్యా అంటే, మీరు కోరిన సొమ్ము ఎప్పటికప్పుడు పంపుతూండడమే. నేను ఒకసారి వస్తే బాగుంటుందని రాశారు; ఏమిటి బాగుండేది? ఇక్కడ ఆఫీసుకి శలవుపెట్టి అక్కడికి వచ్చి మీ అందరికన్న అదనంగా నేను చేసే దేమిటి? నా భార్య దేహపరిస్థితి ఈ మధ్య బాగులేదుకూడాను. ఈ పరిస్థితుల్లో యిబ్బందిపడి నే నక్కడికి రావడం ఎందుకు? వేరే ఏభై రూపాయలు టెలిగ్రాముమనియార్డరు కడుతున్నాను. వెంటనే వాణ్ణి ఆసుపత్రిలో చేర్పించండి. అత్యాధునికమైన వైద్యసహాయం అంతా నిపుణులచేత యిప్పించండి డబ్బు కావలిస్తే ఒక వారంరోజుల్లో వంద పంపగలను.'

ఎప్పుడూ లేనిది హెడ్మాస్టరు ఈ ఉత్తరం రెండుమూడుసార్లు చదివాడు. ఆ ఉత్తరంలోని 'రీజనింగ్' చదివినకొద్దీ అది మరింత అసహజంగానూ, అమానుషంగానూ కనిపించింది. చిన్నప్పట్నుంచీ తల్లితండ్రులనుంచి పిల్లల్ని ఇలా వేరు చేసి చదివించే పద్ధతి యిక్కడ చెల్లదేమో అనిపించింది.

పిచ్చిబాబుకి జ్వరం తగ్గి పథ్యం పెట్టినరోజున స్కూల్‌డాక్టరు అన్నాడు: 'కొన్ని గంటలపాటు 'కోమా'లో ఉండిపోయాడు. తెలివొస్తుందనీ, మళ్ళీ యిలా మాటాడుతాడనీ ఎవ్వరం కలలోకూడా అనుకోలేదు. వీ డెలా బతికాడో భగవంతుడికి తెలియాలి!'

హెడ్మాస్టరు అందుకున్నాడు· 'అంతేకాదు, ఎందుకు బతికాడోకూడా భగవంతుడికే తెలియాలి!'

కొంచెం నీరసం తగ్గేక, ఆయనే అడిగాడు 'పోనీ ఓసారి మీ యింటికి వెళ్ళి నాలుగురోజులపాటు ఉండివస్తావేంటోయ్?'

పిచ్చిబాబు అడ్డంగా తల ఆడించాడు.

'మీ పిన్నిదగ్గరకోయ్!'

ఈసారి మరింత వేగంగా తల ఆడించాడు.

ఇంచుమించు ఇదే టైములో అక్కడ విజయలక్ష్మి భర్తని ఒకనాడు అడిగింది: 'ఏమండీ, బాబు కబురు విని చాలా రోజులయింది ఎలా ఉన్నాట్ట?'

రఘుపతి వాడికి బాగా జ్వరం వచ్చిందన్నసంగతే ఆమెతో చెప్పలేదు. పత్యం పెట్టేరని కబురు తెలిశాకకూడా ఏమీ అనలేదు 'ఆఁ, ఏమీలేదు; ఈమధ్య

కొన్నాళ్ళు 'కాస్త నలతగా ఉందట. కుర్రాళ్ళు కదూ! ఏదో తినేస్తూఉంటారు. ఇప్పుడు మామూలు ఆరోగ్యంగా ఉన్నాడని వాళ్ళ హెడ్ టీచరు రాశారు. అయినా నీ వంట్లోమాత్రం ఏం బాగుందనీ, వాళ్ళగురించీ వీళ్ళ గురించీ ఆలోచించడానికీ? ఆహారమూ నిద్రా చాలా జాగ్రత్తగా చూసుకోవాలనీ, బుర్రలో ఏమాత్రమూ పాడు ఆలోచనలు పెట్టుకోకూడదనీ డాక్టరు చెప్పలేదా? మరింత జాగ్రత్తగా ఉండకపోతే ఈసారికూడా...'

విజయలక్ష్మి భర్తనోటిని చేత్తో మూసింది. నిజానికి యీసారి ఆమె చాలా జాగర్తగానే ఉంది ఆమెకి తెలియంది ఒకటే-కిందటిసారి చేసిన అజాగర్త ఎమిటా అని ఏమైతేనేం గర్భవతినయానని తెలిసినదగ్గిర్నించీ యీసారి ఆమె మరీ జాగర్తగా ఉంది. నెలకోసారైనా ఆసుపత్రికి వెళ్ళి పరీక్ష చేయించుకు-వస్తోంది. పళ్లూ పాలూ ప్రతిరోజూ తీసుకుంటోంది. వీలైనప్పుడల్లా అలా చల్ల గాలిలో కొంతదూరం నడిచివస్తోంది.


ఇరుగుపొరుగమ్మ ఒకామె సలహా యిచ్చింది; 'ఎంతయినా సవతికొడుకు సవతి కొడుకే వాడికి నీ మీద ప్రేమ ఉండటమేమిటి, అసందర్భం' కుర్రాడని దగ్గిరికి తీస్తే నీ కూటిలోనే మన్ను; మరచిపోకు. కిందటిసారి ఆ దిష్టికళ్ళు పడే పండంటి బిడ్డను పోగొట్టుకున్నావు?'

ఇలాంటి సలహాలు ఏమాత్రమూ ఆమోదించకపోయినా యీసారి యీ కబురు వాడికి తెలియకుండామాత్రం విజయలక్ష్మి జాగర్తపడింది.

మొగుడుపురుడు బయాకి వచ్చిన సుబ్బరామయ్య అన్నాడు 'అదేమిటీ, ఒక్క-సారికే అలా ఆనమాలు పట్టలేకుండా అయిపోయావ్, విజయా! శరీరకంగా అయిన నష్టం కంటె మానసికంగా అయిన గాయం నిన్ను బాధిస్తున్నట్టుందే!'

లేడీడాక్టరు కూడా ఇంచుమించు అలాగే అంది 'పైకలా ఆరోగ్యంగా కనపడుతోందని మీ అమ్మాయి దుక్కలా ఉందనుకుంటున్నారా ఏమిటి సుబ్బరామయ్యగారూ! ఆ అమ్మాయి యూట్రైస్ అతి బలహీనంగా ఉంది. పొజిషన్ కూడా సవ్యంగా లేదు. కొన్నేళ్ళపాటు యీమె గర్భవతిగా ఉండకపోవడం శ్రేయస్కరం...'

కాని ఆరోగ్యసూత్రాల కిచ్చేంత తక్కువ ప్రాముఖ్యత మనుషులు మరి దేనికీ ఇవ్వరు. రెండవసారి గర్భవతి కాకముందు ఆమెకు ఒకటి రెండు ఎబార్షన్లు కూడా అయాయి. దానితో ఆమెకి లేస్తే కళ్ళు తిరుగుతా యన్నంత నీర్సం పట్టుకుంది. అందుకనే ఇంజక్షన్లూ, టానిక్కులూ, పళ్ళరసాలూ మరింత శ్రద్ధగా



జాగ్రత్తగా తీసుకొనేది ఆమె. వీలయినంత ఉల్లాసకరంగా గడుపుదామని ఆమె అనుకొన్నా ఏదో తెలియని పిరికితనం ఆమెని వేధించేది ఇవన్నీ కాక ఆమెకి కొత్తగా నడుంనొప్పి ఒకటి పట్టుకుంది. నెలలు ముదిరినకొద్దీ, ఎటు పడుకున్నా ఆమెకు ఆ నొప్పితో సరిగా నిద్ర పట్టేదికాదు.

విజయలక్ష్మికి ఏడోనెల వెళ్ళింనగ్గిర్నుంచీ, రఘుపతి నెలకి ముప్ఫై రూపాయిలిచ్చి ఆసుపత్రిలో అనుభవం వున్న సుబ్బుల్ని ఆమెకు తోడుగా ఇంట్లో ఉంచేశాడు అంతకుముందే చేస్తున్న పనిపిల్లకి మరో అయిదురూపాయిలు ఎక్కువ యిచ్చి రాత్రుళ్లుకూడా ఇంట్లోనే ఉండేటట్లు మాట్లాడేడు. వీళ్ళుకాక వంటావిడ రంగమ్మ ఎప్పట్నుంచో వున్నదే. ఇన్ని సదుపాయాలు కలుగజేసే భర్త వున్నా, యింతమంది నౌకర్లు ఉన్నా ఏదో తెలియని వెలితీ, భయమూ ఆమెను ప్రతిక్షణం వెన్నంటుతూనే వుండేవి వదినకు రాసి పిలిపిద్దామా అని ఆమెకి అనిపించేది, గాని అసందర్భంగా తోచి ఊరుకునేది భర్త సమక్షంలోనూ పరిరక్షణలోనూ కూడా క్రమక్రమంగా ఆమెకు సంపూర్ణమైన స్వాంతన చిక్కేదికాదు

'నాకు ఏలోటూ రాకుండా నాన్న పెంచేడు; ఏ లోటూ రాకుండా ఈయన చూస్తున్నారు నే నెందుకు బాధ పడాలి, నా కేమిటి లోటు? అనుకునేది ఆ ప్రశ్న

ఆమెకు జవాబు దొరకేది కాదు. పైగా ఆమెకి యింకో ప్రశ్న యింకో చోటునుండి వినబడేది. 'నాకు ఏ మాత్రమూ లోటు జరక్కుండా నాన్నగారు డబ్బు పంపిస్తున్నారు పిన్నీ! నాకు మాత్రం ఏమి టీ లోటు?' ఎక్కడెక్కడో అంతరాళాల్లోంచి అతి చిన్న స్వరంతో, పరిదీనస్వరంతో వినవచ్చేది. కాని స్పష్టంగా ఉండేది ఆ ప్రశ్న. హృదయానికి సూటిగా తగిలేది ఆ ప్రశ్న. 'పిన్నీ! నాకు మాత్రం ఏమి టీ లోటు!' అణు రూపంలో మొదలైన ఈ ప్రశ్న క్రమక్రమంగా ఆమెను అణువణువునా ఆక్రమించుకుకూచుంది.

'ఆ రాత్రివేళ పనిమనిషి సుబ్బుల్ని లేపి కూచోబెట్టింది. సుబ్బులు చింపిరిగా వున్న తల గోక్కుంది. ఒక్కమారు ఆవులించింది. వెన్నెల్లో దాని జుత్తు మెరుస్తోంది. కళ్లు నులుపుకుని లేచికూచుంది. ఎంత నిద్రలోంచైనా లేవగలదు. కావలసినంతసేపు మేలుకోగలదు. ఆస్పత్రిజీవితం నేర్పిన అమూల్యమైన అనుభవము అది దానికి. ఒకటోరకమైన సలహాలు కూడా అప్పటి కప్పుడు యివ్వగలదు. వైద్యం కంటె, సేవ కంటె అవే ఎక్కువ పని చేస్తాయని దాని నమ్మకం. అందుకే రఘుపతి దాన్ని భార్యకి తోడుగా తెచ్చిఉంచేడు.

'మాటాడవేమే ముద్దూ! పిచ్చిబాబు అక్కడ ఎలా ఉన్నా డంటావ్?'

'ఎవరి మాట శలవిస్తున్నారు తల్లీ! మీ సవతికొడుకు గురించా?' అని అటు తిరిగి నవ్వబోతే, విజయలక్ష్మి దాని మొహం పట్టుకు యిటు తిప్పుకుంది.

'నవ్వెందుకే?'

'ఎందుకా? ఎందుకో అనుకున్నాను. అందరిలాగే మీరూ శలవిస్తూంటే ఇంకేం చెయ్యను?'


'ఏమిటీ, నీ ఉద్దేశం?'

'పెళ్ళిముందే అయ్యగారి చేతిలో చెయ్యి వేయించుకున్నారంటే భేష్ అనుకున్నాము. పెళ్ళినాడే యీ యిల్లూ, అంటుమామిడితోటా మీ పేర మీ నాన్నగారు రాయించేసుకున్నారంటే సెభాష్ అనుకున్నాము!'

సుబ్బులు తరవాతి మాటలు విజయలక్ష్మికి సరిగా వినబడలేదు. యీ యిల్లూ, యీ తోటా నాన్న తన పేర ఆనాడే రాయించేసుకున్నారా? తనతో చెప్పకుండా ఎందు కిలా చేసినట్టు? ఇక పిచ్చిబాబు గతి ఏం కావాలి! ఆమె గజగజ ఒణికిపోయింది.

'అదేమి టలా అయిపోతున్నారు?'

'మరేం లేదు. ఈ కబుర్లన్నీ నీ కెలా తెలిశాయా అని.'




'బాగుంది, పెద్దింటి కబుర్లు ముందు తెలిసేది నౌఖరీవాళ్ళకే. కావలిస్తే ఆ సంగతి ఎవర్నైనా అడగండి '

విజయలక్ష్మికి ఎంత సరిపెట్టుకున్నా ఆందోళన తగ్గలేదు

'ఏమయితేనేం, మీరూ నాన్నగారూ మా కట్టుదిట్టమైనపని చేశారు  లేకపోతే యీ కలికాలంలో మనం బతగ్గలమా ?'

విజయలక్ష్మి సుబ్బుల్ని ఆగమని సంజ్ఞ చేసినా అది ఆగలేదు

'ఇంక పిచ్చిబాబుగారి సంగతంటారా, ఇప్పట్లో చావడు '

విజయలక్ష్మి సుబ్బుల్ని అప్రయత్నంగా ఒక్క లెంపకాయ కొట్టింది  దాన్తో దాని నిద్రమత్తు ఇంకేమైనా ఉంటే వదలిపోయింది !

'పొరపాటున చెయ్యి జారిపోయిందే సుబ్బులూ ! మరోలా అనుకోకు '

'అనుకోడాని కేముందిగాని  మీ స్వభావం ఏమిటోగాని  నా కేం అర్థం కావడలేదమ్మగారూ !  కడుపునిపుట్టిన  అయ్యగారికి లేంది కౌగలించుకుంటే మాత్రం మీకు వస్తుందా ? ఇంతకీ తల్లి లేకపోయినా డబ్బిచ్చేతండ్రి ఆయన కున్నాడు  అయినా తల్లిలేని పిల్లలు ప్రపంచంలో పిచ్చిబాబుగారు ఒక్కరేకాదు  వాళ్ళందర్నీ మీ రెందుకు పిలిపించుకుని పోషించరు ? ఎవరో ఎందుకు, అయినో కాన్పుకి నా పెద్ద

కూతురి ప్రాణం పోయింది. తల్లి లేని పిల్లలు మాయింట్లో సిద్ధంగా ఉన్నారు తెల్లవారి సరికి వాళ్ళయిదుగుర్నీ మన దేవిడీముందు సిద్ధం చేతునా ?'

ఆమె జవాబు చెప్పకపోవడం చూసి సుబ్బులు రెచ్చిపోయింది, లేచి కొప్పు ముడేసుకుని, కాళ్ళా చేతులా ఆర్గ్యుమెంటు మొదలుపెట్టింది. 'ఊరుకోండమ్మా ! ఎవరేనా వింటే నవ్విపోగల్రు మీకోసమని అయ్యగారు వేలకివేలు ఖర్చు పెడుతున్నారు పనసపండులాంటి బిడ్డ మీ ఒడినిండా నిండితే ఎవరెలాచస్తే మీ కేం, నా కేం ? అన్నట్టు మీ రివాళ మందు పుచ్చుకున్నారా? ముసలిముండని, నే నెంతకని జ్ఞాపకంచేసి చావనమ్మా ! మీయిష్టం మీకు పుట్టబోయేపాప బలంగా ఉండాలంటే తాగండి, లేకపోతే మానెయ్యండి మధ్యని నా కేం నెలతప్పలేదుగదా !

విజయలక్ష్మి నవ్వుతూ మందుగ్లాసు అందుకుంది

'మధ్యని వాళ్ళూ వీళ్ళూ మీ కేం అవుతారు ? ఆ దేవుణ్ణి తల్చుకుంటూ పడు కోండి.' అని వెళ్ళబోతూ సలహాకూడా యిచ్చింది సుబ్బులు

'తెలిసినవాళ్ళు వాళ్ళూ వీళ్ళూ ఏమీ అవరా ? ఏమీ ఎరగని దేవుడేనా ఏదో అయేది !' అని విజయలక్ష్మి ఆశ్చర్యపోయింది

## 12

భార్య గదిలోకి వచ్చినప్పుడికి రఘుపతి లేచి 'ఏం నిద్రపట్టలేదా ?' అని అడిగేడు

'ఊరికే వెన్నెలగా ఉందని అలా బయటకు వెళ్ళేను '

'ఊఁ,' అన్నాడు రఘుపతి ఆమె ముంగురుల్ని సవరిస్తూ

'ఏవండీ !'

'ఏం ?'

'ఏదో బెంగగా ఉందండీ !'

రఘుపతి మంచంమీంచి లేచికూచున్నాడు

'ఏం సుబ్బుల్ని లేపేదా ?'

విజయలక్ష్మి తల అడ్డంగా ఊపింది.

'ఒంట్లో ఏమన్నా బాధగా ఉందా ? డాక్టరికి ఫోన్ చెయ్యనా ?'

'అదేదీకాదు . ' అని ఆమె దుప్పటీ మీదికి లాక్కుని, '...ఏం లేదులెండి' అంటూ అటుతిరిగి పడుకుంది

'అలాకాదు .. ఏమిటో చెప్పు ... ఉత్తిమనిషివికూడా కావు. ఇలాంటప్పుడు

నీ కెలాంటి అదుర్దా ఉండకూడదు. పోనీ యీపురుడు అయిపోయేదాకా సాయంగా ఉంటుంది మీవదిన్ని పంపించమని రాయనా ?'

'పిచ్చిబాబుని చూసి చాలా రోజులయింది ఓసారి వాణ్ణి పంపించమని రాయండి,' అంది ఆమె భర్త వైపు చూస్తూ

రఘుపతి అటువైపు తిరిగిపోయాడు. చెప్పలేని నైరాశ్యం అతన్ని ముంచి వేసింది కాపురానికి వచ్చిన మొదటి ఏడాదీ ఏణ్ణర్ధం ఏం సంతోషంగా ఉందో అంతే. అందరిలాంటి ఆడదీ తనూ అయితే పెళ్ళికిముందు కట్టుబాట్లూ, తనకి లేనిపోని ఆశలు కల్పించడాలూ దేనికి ? ఇంత చక్కని వెన్నెలరాత్రి ఆమె నోటినుంచి రావలసింది పిచ్చిబాబు సంగతేనా ! వచ్చినమొదలు రోగాలతో తనని పీడించి పోయిన శాంత పిశాచమై తిరిగి వచ్చిందా ?'

'మాటాడరేం ? ఒక్కసారి వాణ్ణి పిలిపించరూ ?'

ఈ పరిస్థితిలో ఆమెను కష్టపెట్టడం అతని కిష్టంలేకపోయింది 'వాడి కిప్పుడు పరీక్షలు జరుగుతున్నాయి మొదట్నుంచీ వాడి ప్రోగ్రెస్ ఏమీ బాగులేదట దీనికీ కూచోపోతే వాణ్ణి ఈ ఏడాది ఉంచేస్తారు అంతగా నువ్వు కాదూ కూడదంటే నీకు ఒంట్లో బాగులేదని ఓ టెలిగ్రాం యిప్పిస్తాను

'వద్దు,' అంది వెంటనే విజయలక్ష్మి అలా అన్నందుకు తనని తనే తిట్టుకుంది

రఘుపతికి ఆనాడు ఒకపట్టాన నిద్రపట్టలేదు మనసంతా అదోలా అయిపోయింది పదేళ్ళకుర్రాణ్ణి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించారని ఎవ రేమన్నా అతను చలించలేదు అలా సూచించిన విజయలక్ష్మిమీద అతని అనురాగం రెట్టింపయింది తన కిప్పుడు ముప్ఫైఅయిదే ళ్ళున్నా, ఏ యిరవై ఆరేళ్ళవాడిలాగో కనిపిస్తాడు ఆరోగ్య ముంది అంతులేని భాగ్య ముంది అందమైన భార్యతో ఆనందశిఖరాలను అందుకోవాలని ఆశించడం అదో అపరాధమా ? తను ఎటువంటి వ్యసనాలకూ గురికాలేదు లక్షణంగా పెళ్ళి చేసుకున్నాడు ఆమె కోరికమీదే అబ్బాయిని దూరంగా ఉంచాడు వాడికైనా ఎలాంటిలోపమూ రానియ్యడంలేదు అదిగాక వాడి పూచీ పూర్తిగా తనది తన కెందుకు ?

మొదట్లో శాంతకూడా బాగానే ఉండేది వీణ్ణి కడుపుతో ఉన్నదగ్గర్నుంచీ ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతింది చూస్తూండగా మనిషి గుడ్డపీలికలా అయిపోయింది ఏవేళ చూసినా వేవిళ్లు ... కళ్ళు తిరిగి పడిపోవడం .. విపరీతమైన నీరసం ... అస లామెకి సవ్యంగా పురుడు వస్తుందనీ, తల్లీ పిల్లా బతుకుతారనీ ఎవరైనా అనుకున్నారా ? పురిటిలో చేసిన జబ్బుతో మరింతగా పాలిపోయి ఎంత

సేపూ యింజక్షన్లూ, టానిక్కులూ ఇంతేకదా! మున్నూటికాలమందూ మలేరియాతో - ఆడదంటే అసహ్యం కలుగజేసి, జీవితమంటే విరక్తి అనిపించిన శాంత హయాం ఇంకా అయిపోలేదా ?

ఏ విధంగా చూసినా యిన్ని అనర్థాలకీ పిచ్చిబాబే కారణ మనిపించింది రఘుపతికి

'నిద్రా ?' అన్నా డతను భార్య వీపుమీద చెయ్యి వేసి విజయలక్ష్మి దుప్పటి పక్కకి తీసి యిటుతిరిగింది ఆమె ఎడంచెయ్యిని అతడు కుడిచేత్తో గట్టిగా నొక్కేడు, కళ్ళలోకి కాంక్షతో చూస్తూ

*　　*　　*　　*

పెద్దపరీక్షలని పిల్లలకు వారంరోజులు శలవు లిచ్చారు ఇంచుమించు పిల్లలందరూ ఎవరి ఊళ్ళకీ వాళ్ళు వెళ్ళిపోయారు ఆ ముందురోజే రఘుపతినుంచి హెడ్మాస్టరుకి ఉత్తరం వచ్చింది

'పొద్దుటే భోంచేసి రైల్లో కూచుంటే రాత్రికి యిక్కడ చేరుతాడు నాకూ మావాణ్ణి చూసి చాలారోజు లయినట్టుంది దగ్గిర కూచోబెట్టుకుని చదివించాలని ఉంది కాని ఏంచెయ్యను ? మా ఆఫీసులో యినస్పెక్షన్ జరుగుతోంది ఇంట్లో మా ఆడవాళ్ళ ఆరోగ్యంకూడా ఏమాత్రమూ బాగులేదు ఇక్కడికి వాణ్ణి పిలిపిస్తే చదువు జరగదు సరిగదా, సాధారణ సదుపాయమైనా కుదరదు ఈ వారంరోజులూ నామీద దయతో మీరే వాణ్ణి ఎలాగో ఓలా చూడవలసింది పరీక్షలో పడతాయను కున్న ప్రశ్నలు చర్చించవలసింది సొమ్ము కావలిస్తే రాయవలిసింది '

'మొగాడు ఆడదాని చేతిలో కీలుబొమ్మ అయిపోయాక కొడు కేమిటి, కన్న కడు పేమిటి ? ఇంతకీ అ దెంత హృదయంలేనిదో !' అనుకున్నాడు హెడ్మాస్టరు

పిచ్చిబాబుకీ యీమధ్య కొంచెం మంచీ చెడూ, పట్టుదలా పెంకితనమూ తెలుస్తున్నాయి పిన్నిమీద వాడికి ఏ కొంచమైనా ప్రేమాభిమానాలు ఉంటే అవి అలాగే వాడిహృదయంలో భద్రంగా ఉన్నాయి తండ్రిమీద వాడి కెప్పుడూ చెప్పుకోదగ్గ అభిప్రాయమంటూలేదు పరీక్షలముందు, స్నేహితు లందరూ వాళ్ళవాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోయి, త నొక్కడూ బిక్కుబిక్కుమంటూ ఉండడం కష్టమే అయినా, వాడి క ది అసాధ్య మనిపించలేదు ఓసారి మనసుకి కొంచెం కష్టం కలిగినా, ఒక్కసారి ఏడ్చేసి తుడిచేసుకోడం నేర్చుకున్నాడు వాడు పైగా హెడ్మాస్టారి అఖరబ్బాయి నరసింహంతో వాడికి స్నేహ మయింది గంటలకొద్దీ ఇద్దరూ కబుర్లు చెప్పుకొనేవారు వా ళ్ళింటోవాళ్ళు తల్లిలేనివాడని పిచ్చిబాబుని ఎంతో

ప్రేమతో చూసేవారు ఒక్కొక్కరోజు భోంచేసి హెడ్మాస్టారింట్లోనే పడుకునే వాడుకూడా

'సంరక్షణ లేక యిలా ఉన్నాడుగాని పిల్లాడు ఎంత చక్కటివాడని! ఏమీ ఎరగనట్టు కనిపిస్తాడుగాని తెలివితేటలకు మళ్ళీ ఏమైనా లోపమా!' అనుకునేవారు ఆ యింట్లో అందరూ

ఒకనాడు సాయంకాలం విజయలక్ష్మి ఏమీ తోచక వీధిగేటుదగ్గిర నిలుచుంది. రెండ్రోజులబట్టీ ఆమెకి కడుపులో ఏదో నొప్పిలా వస్తోంది ప్రతినిత్యమూ తన గురించి ఎంతో ప్రేమాభిమానాలతో కనుక్కునే భర్తకు తన చిన్నచిన్న బాధల గురించి చెప్పి అశాంతి కలుగజేయదల్చుకోలేదు అదీగాక ఆ సాయంకాలం కొంచెం నొప్పి తగ్గినట్టయింది బత్తాయిరసంలో బార్లీ, గ్లూకోజు వేసుకు తాగి, ఏమీ తోచకపోతే వీధిగేటుదగ్గిర కొచ్చింది

'ఏపమ్మా ఒంట్లో ఇప్పుడు బాగుంటోందా?' కొత్తపేటలో ఉంటున్న మహాలక్ష్మి ఆ దారిన వెడుతూ పలకరించింది

'ఆ, కొంచెం నయమే మీ మేనల్లుడు సూరి బాగా చదువుకుంటున్నాడని ఉత్తరాలు వస్తున్నాయా?' సూరి బాగా అల్లరి చేస్తున్నాడని రెసిడెన్షియల్ స్కూల్లో పెట్టేశారు పిచ్చిబాబు క్లాసే

'ఇప్పుడు శలవలే కదటమ్మా, వారంరోజులై వచ్చేశాడు ఎల్లుండి వెళ్ళిపోతాడు ఏం, మీ పిచ్చి రాలేదా?'

రఘుపతి కన్నకొడుకుగురించి అంత అబద్ధం ఎందుకాడేదో విజయలక్ష్మికి అర్థంకాక విలవిలలాడిపోయింది

'అందరికీ ఒకవేళ శలవలు లేవేమో!' అంది

'బాగుందమ్మా! స్కూలు స్కూలంతా ఖాళీ అయిపోయిందని ఒకరిద్దర



'స్తేనూ! అయితే ఏదిక్కూ లేనివాళ్లు ఎక్కడికి వెడతారులే! వస్తా, పనుంది!'
ంహాలక్ష్మి వెళ్ళిపోయింది

ఆ రాత్రి ఆమె ఒక్క మెతుకయినా లోపల పెట్టుకోలేకపోయింది రెండంత
ంల మేడమీద, ఒకమూల గదిమెట్లదరగ్గి గోడకి జారపడి ముడిచిపెట్టుకుని
ాచున్న చిన్నకుర్రాడి దీనమైన చూపులే ఆమెను ప్రతిక్షణం వెంబడించాయి
మయానికి రఘుపతి ఊళ్ళోలేడు ఆమెకు గాబరా ఎక్కువైపోయింది ఉన్న
ండి నొప్పులు ప్రారంభమయాయి

సుబ్బులు సముద్రాన్ని లేడీడాక్టరు దగ్గరకు పంపబోయింది విజయలక్ష్మి
'రించింది ముందు పిచ్చిబాబుని ఉన్నపళంగా తీసుకురమ్మని సముద్రంచేత
ాడ్మాస్టరుకి కబురు పంపించింది సుబ్బులు సహాయంతో సైకిలురిక్షామీద వెంటనే
స్పత్రికి బయలుదేరింది

పిచ్చిబాబూ, నరసింహం హెడ్మాస్టరుగారి వరండామీద గచ్చునేలమీద సుద్ద
ంక్కతో లెక్కలు చేసుకుంటూండగా సముద్రం వెళ్ళిపడ్డాడు 'సిన్నబాబూ,
న్నబాబూ! లచ్చుమమ్మగోరు మిమ్మల్ని నిల్చున్నపాలాన ఎంటబెట్టుకు
మ్మన్నారు' అంటూ

'అదేమిట్రా? కలవలన్నీ అయిపోయాక మీ అమ్మగారికి హఠాత్తుగా తెలివి
చ్చుకొచ్చిందాయేం? పిల్లాడు చదువుకుని పరీక్షలు ప్యాసవడంకూడా ఆ మహా
్లకి కిట్టదు కాబోలు!' అని హెడ్మాస్టరుయింట్లోవాళ్ళు విసుక్కున్నారు

'అదేంటొాండమ్మాయిగోరు. ఆతల లచ్చుమమ్మగోరికి పేనాలు పోతాఉంటే..

'అయితే? ఈ పసివాడు ఆవిడగారికి సాయమా? ఇన్నాళ్లూ వీడొక్కడూ
క్కడ బెంగెట్టుకు చస్తూఉంటే చూసిందెవరు?'

అంతసేపూ లెక్కలు చేస్తున్న పిచ్చిబాబు ఏమయ్యాడో ఎవరికీ కనిపించలేదు
లేసి వంటింట్లో దూరేదేమో అంటే అక్కడా లేడు చేతులు కడుక్కోడానికి
'తిదగ్గిరకి వెళ్ళేడేమో అంటే అక్కడా కనపడు ఇల్లూ వాకిలీ అందరూ
కుతూంటే తన గదిలోకి వెళ్ళి ఒక చిన్నసంచీలో సామాను సద్దుకునివచ్చి
దరా సముద్రం,' అన్నాడు గబగబ నడుస్తూ

'భోంచేసి పోరా వెర్రివెంగళాయ్!' అన్న హెడ్మాస్టరుభార్యమాట వాడు
పించుకోనేలేదు ఎదురుపడిన హెడ్మాస్టరుతోనయినా ఇదిగో ఇలా వెడుతున్నా
చెప్పలేదు ఆఖరికి ఆ వారంరోజులూ ఒకసైకిల్ తిరిగిన నరసింహంతోనైనా
టాడలేదు తల వంచుకుని బస్టాండువైపు చరచర ఒకటేనడక మన స్తత్వ

శాస్త్రంలో మాస్టరుడిగ్రీ సంపాదించడమే కాక, రకరకాల శిష్యులతో ఏళ్ళతరబడీ అనుభవం వున్న హెడ్మాస్టరుగారికి పిచ్చేశ్వర్రావు చేష్ట చూస్తే పచ్చివెలక్కాయి గొంతుకలో పడినట్లయింది

రఘుపతి ఊర్నించి యింటికి వచ్చి, సంగతి తెలుసుకుని వెంటనే ఆస్పత్రికి పరిగెత్తేడు అతన్ని లోపలికి రానియ్యలేదు ఉసూరు మంటూ పైన ఉన్న బల్ల మీద ఎంతోసేపు నిరీక్షిస్తూ కూచున్నాడు బాగా తల నొప్పిగా ఉండంచేత కాఫీ తాగివద్దామని లేవబోతూంటే సుబ్బులు వచ్చింది

'మమ్మల్ని లోపలికి రానియ్యలేదుగాని, డాక్టరమ్మ మాటనిబట్టి నా కేం బోధ పడుతోందంటే పెద్దయ్యగారూ! ఇంకా నెలలు నిండకుండానే . '

సుబ్బులు మాట పూర్తవకుండానే లోపల్నుంచి డాక్టరు వచ్చింది 'వెరీసారీ మిస్టర్ రఘుపతీ! పిల్ల లోపలే పోయింది, వెంటనే ఆపరేషను చెయ్యకపోతే పెద్దప్రాణానికే ముప్పు '

రఘుపతి నెత్తిన పిడుగు పడ్డట్టయింది నీరసంగా బల్లమీద కూలబడ్డాడు 'మీ ఇష్టం డాక్టర్ మీకన్న నా కేం తెలుసు!' అన్నాడు ఒణుకుతూ

డాక్టర్ గబగబ లోపలికి వెళ్ళిపోయింది

మధ్యాహ్నమే చేసిన ట్రంక్‌కాల్ అందుకుని సుబ్బరామయ్యగారూ, అతని కొడుకు కామేశం ఎక్స్‌ప్రెస్‌లో వచ్చారు కోడలుకూడా వచ్చేదే, గాని చిట్టిగాడికి ఆటలమ్మట

దిగాలుపడిన మొగాలతో వాళ్ళిద్దరూ రఘుపతికి ఎదురుగావున్న బెంచీలమీద కూచున్నారు కిందని ఓపక్క సుబ్బులు చతికిలబడివుంది పక్కనున్న వంట మనిషి రంగమ్మ సందేహాలు పైకి వినబడకుండా తీరుస్తోంది అందరూ ఆతృతగా డాక్టరు రాకకోసం ఎదురుచూస్తున్నారు ఎలాగైతేనేం మరికొంత సేపటికి ఆ తలుపులు తెరుచుకున్నాయి

'యు ఆర్ లకీ రఘుపతీ...ఆపరేషన్ జయప్రదంగా ముగిసింది ఆమెకు అపాయం యింక తప్పినట్టే!' అని డాక్టరు అతన్ని ఒకపక్కకి పిల్చి నెమ్మదిగా అంది 'ఆమె గర్భకోశం చాలా వీక్‌గా వుంది ఆమె మూడేళ్ళపాటయినా గర్భం ధరించకుండావుండడం మంచిది యు మస్ట్ బీ వెరీ కేర్‌ఫుల్ ..మరొక గంటలో ఎలా వున్నదీ వచ్చి చెబుతాను ' డాక్టరు లోపలికి వెళ్ళిపోయింది

రఘుపతి మనసులోనే భగవంతుడికి దండం పెట్టుకున్నాడు అయినా అతని మనస్సంతా వికలమైనట్లు అయిపోయింది నిన్న ఆదేవేళకు విజయలక్ష్మి తనని


నవ్వుతూ ఊరికి సాగనంపింది ఇవాళ అచేతనంగా హాస్పిటల్ బెడ్ మీద పడుకుని వుంది! లోకంలో అరిగేది తినడానికిలేక కొంద రేడుస్తుంటే, తిన్నది అరగడానికి లేక కొంద రేడుస్తున్నారు తనకి ఏ ఏడుపూ లేదనుకున్నాడు అనుభవించే అదృష్టమే లేదు! ఎన్నుండి ఏం లాభం! ఎప్పుడు చేసుకున్న కర్మో!

తన ఎదుటిబెంచీమీద కూర్చున్నవారి నందర్నీ మరొకసారి పరీక్షగా చూశాడు అందరూ నిశ్శబ్దంగా కూచునివున్నారు వీ ళ్ళెవరితోనూ, ఆఖరికి ఒక్కరితో కూడా, మనసులో వున్న కష్టం చెప్పుకుని తేలిక చేసుకుందామని అతని కనిపించ లేదు ఇంత దైన్యస్థితికన్న, యిలాంటి స్థితిలో తనని ఆదుకునేవా రెవరూ లేక పోయారే అని అతని హృదయం విలపించసాగింది

అతను తల్లినీ తండ్రినీ ఎరగడు ఎవరో దూరపు మేనత్త బాగా ఆస్తి వున్నది అతన్ని చేరదీసి పెంచింది మంచివాడైన ఒక ప్లీడరుకు తన ఆస్తి కాగితాలు అప్ప జెప్పి తను స్కూలుఫైనలు చదువుతూండగా మేనత్త కన్ను మూసింది, ఆ ప్లీడరు గారే తన మంచీ చెడ్డా చూసేవాడు తన కీ ఉద్యోగం యిప్పించిందీ, శాంత నిచ్చి పెళ్ళి చేసిందీ ఆయనే ఆస్తులు యివ్వగలరు గాని అదృష్టాలు యివ్వలేరుగదా!

రఘుపతికి హఠాత్తుగా పిచ్చిబాబు జ్ఞాపకం వచ్చి రెండుకళ్ళూ నీళ్ళతో నిండి పోయాయి వాణ్ణి ఒక్కసారి దగ్గరకు తీసుకుని కరువుదీరా ఏడిస్తే ఎంత బాగుణ్ణు అనిపించింది సరిగా అదే సమయానికి 'నాన్నా!' అంటూ వాడు పరిగెత్తు కొచ్చాడు కూడా సముద్రం వచ్చి చెబితేగాని అది కలో నిజమో రఘుపతికి అర్థం కాలేదు యాంత్రికంగా వాణ్ణి పక్కని కూచోబెట్టుకుని కుడిచేత్తో దగ్గిరకు తీసు కున్నాడు 'పిన్ని కెలా ఉంది నాన్నా? అసలు ఏం జబ్బు చేసింది నాన్నా?' అనే ప్రశ్న లన్నింటికీ రఘుపతి కన్నీరే జవా బయింది సుబ్బులుద్వారా సముద్రం జరిగింది తెలుసుకుని-పిచ్చిబాబుకి, తనకి బోధపడినంత బోధపరిచాడు పిచ్చిబాబుకి అర్థ మయింది ఒక్కటే-పిన్ని చాలా ఆపదలో ఉందని బాధతో ప్రేమతో ఆ పసి ప్రాణం ఆల్లల్లాడిపోయింది ఇంతలో తలుపు తీసుకుని డాక్టరుగారు ఇవతలి కొచ్చారు

'మీరు అదృష్టవంతులు రఘుపతీ అంతా సవ్యంగానే జరిగింది ఆమె పరి స్థితి మొదట్లో చూస్తే యీ మాత్రం తట్టుకుంటుందని మే మెవరం అనుకోలేదు ఇప్పుడు ఆమెకి ఎలాంటి అపదా లేదు బాగా నీరసంగా ఉంది, అంతే ఇంక రెండు మూడు గంటల్లో తెలివి రావొచ్చు.. మీరంతా యింక యింటికి వెళ్ళి ఏదో యింత తినిరావొచ్చు'



డాక్టరు పక్కవార్డులోకి వెళ్ళిపోయాడు సుబ్బరామయ్య 'అంతా నీ దయ,' అని పైకిచూసి కొంగుతో కళ్ళు తుడుచుకున్నాడు 'మొదట మీరు వెళ్ళండి, తర్వాత మేం వస్తాం,' అని అతన్నీ, కొడుకునీ రఘుపతి బలవంతంచేసి దగ్గర్లో ఉన్న హోటలుకి పంపించాడు నౌఖర్లని ముందే పంపించేశాడు

పిచ్చిబాబుకి యిదంతా ఏం బోధపడిందో తెలీదు వాడి మొహంలో కన్నీటి చారికలుమాత్రం ఆరలేదు మొహమంతా పాలిపోయి – కళ అంతా కోలుపోయి, జాలిగొలుపుతూఉంది

'పిన్ని యిప్పుడు కులాసాగానే ఉన్నదికదరా, వెళ్ళి భోంచెయ్యి ' వాడు అడ్డంగా బుర్ర ఆడించాడు తండ్రి మాటకు అందరూ అంతో ఇంతో భోంచేసి వచ్చారు రఘుపతికీ అక్కడికి భోజనం తెచ్చారు అతనయినా ఓ రెండు మెతుకులు కొరికేడేమోగాని పిచ్చిబాబు గ్లాసెడు మంచినీళ్లు తాగి ఊరుకున్నాడు రాత్రయిన కొద్దీ ఒకరూ ఒకరూ అక్కడే కునుకసాగేరుకూడా, చివరిదాకా మేలుకొన్నది సుబ్బులూ, రఘుపతితోపాటు పిచ్చిబాబూను

'అసలు రెండుగంటలక్రితమే కొంచెం తెలివిలా వచ్చిందిట బాబూ దాన్తో అక్కడున్న నర్సమ్మ నడిగితే అది తెలీక పిల్ల పోయిందని చెప్పేసిందిట దాన్తో ఏడ్చేడ్చి మళ్ళీ తెలివి తప్పిపోయిందిట డాక్టరు వచ్చి నర్సమ్మతో దెబ్బలాడి, ఇంజక్షను ఇచ్చి వెళ్ళిందిట లేపోతే అయిదారుగంట లయిందిగదా అపరేషనై, ఇంకా తెలివి రాదూ ?

సుబ్బులు ఇలా అంటూండగా విజయలక్ష్మి మూలుగు స్పష్టంగా వినబడింది తెలివి రాగానే ఆమె కన్నతండ్రిని పిలవలేదు, కట్టుకొన్న భర్తని పిలవలేదు, రక్తం పంచుకు పుట్టిన అన్నను పిలవలేదు. 'బాబూ !' – ఆ పిలుపు పిచ్చిబాబుకే విని పించింది దార్లో అడ్డిన నర్సు చెయ్యికిందినుంచి దూరి 'పిన్నీ, పిన్నీ !' అని లోపలి కెళ్ళిపోయాడు నా బాబూ! వచ్చావా !' అని బలహీనమైన తన చేతులు రెండూ చాచి చంటిపిల్లాడిలా వాణ్ణి అదుముకుంది ఆ ఉద్రేకం ఆ పరిస్థితిలో భరించలేక మళ్ళీ తెలివి తప్పిపోయింది !

## *13*

"మొత్తానికి ఈ అనుబంధం చిత్రంగానే ఉంది !" అన్నాడు డాక్టరు విజయకుమార్

"ఈ చిత్రం ఎవరూ ఊహించలేనంత విచిత్రంగా మారడమే ఈ కథలో విశేషం." అని వెంటనే జవాబు చెప్పేడు శ్రీకృష్ణమూర్తి

"మీ విసుర్లు తమాషాగా ఉన్నాయే !"

"మీ విమర్శలకన్నానా ?"

ఇద్దరూ నవ్వుకొన్నారు

* * * *

తరువాత, ఆరేళ్ల గడిచాక, ఓ సాయంకాలంవేళ, దీపాలు వెలగ్గానే అలవాటు ప్రకారం పుస్తైలు కళ్ళ కద్దుకుందామని మెడలో చెయ్యి పెట్టిన విజయలక్ష్మి హృదయమంతా కలచివెయ్యగా, కళ్ళను నీళ్ళ పెట్టుకుని దిగాలుపడి కూచుంది, బోసిమెడతోపాటు మొహంకూడా మరింత బోసిపోయిందా అన్నట్టుంది మరో అరేళ్ళకి తన మొహాన యిలాంటి రాత రాసిఉంచే, ఆ నా డంత జబ్బు చేసినా పురిట్లో తన ప్రాణం ఎందుకు పోతుంది !

తనకి ఆపరేషనై పత్యం పెట్టిన తర్వాత, తండ్రీ అన్నయ్యా వెళ్ళిపోయారు ఆమర్నాడు కాబోలు పిచ్చిబాబు అన్నాడు 'పిన్నీ ! నేనూ వెడతాను మా పరీక్ష లేమయ్యాయో !'

'అసలు నువ్వెందుకు వచ్చావ్. నిన్నెవడు రమ్మన్నాడు. వస్తే వచ్చావ్. పిన్నెలా ఉందో అని రాత్రి తెల్లవార్లూ అరాటపడుతూ నిన్నెవరు కూచోమన్నారు?' వెలవెలబోతూన్న వాడి మొహం పైకెత్తి పిన్ని గట్టిగా ముద్దుపెట్టుకుంది

'ఇంకెక్కడికి వెడతావు? నిన్ను దూరం చేసుకుని యిప్పటికి నేను పోగొట్టు కున్నది చాలు ..ఏమండీ వెంటనే బాబు పుస్తకాలూ సామాన్లూ తెప్పించెయ్యండి ఆ పసిప్రాణానికి యిప్పటికి మనం పెట్టిన పరీక్ష చాలు. మనకి పడిన శిక్ష చాలు '

ఈ ఆరేళ్ళలోనూ పిన్ని సంరక్షణలో వాడు బాగా ఎదిగేడు ఒళ్ళు చేసేశాడు. ఫోర్తుఫారం చదువుతున్నాడు చనిపోయిన రఘుపతి జ్ఞాపకానికి వచ్చినపుడు ఒక ర్నొకరు ఓదార్చుకోరు ఏదో పనిఉన్నట్టు అక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపోడానికి గాని, ఉంటే ఆ విషయం మార్చెయ్యడానికిగాని ప్రయత్నిస్తారు

'పిన్నీ ! మంచి ఫైటింగ్‌పిక్చరు వచ్చిందిట వెడదామా ?' అంటాడు వాడు

'పద బాబూ '' అంటుంది పిన్ని ఏమాత్రం సందేహించకుండా

ఈవిధంగా మనసు లొంగదీయడానికి ఆమె చాలా ప్రయత్నంచేసి కృతకృత్యు రాలైంది భర్తపోయిన దుఃఖంకన్న పరామర్శల ఫార్మాలిటీస్ ఆమెకు సహించరాని వయాయి అందులో ఆసమయంలో వచ్చిన వరసకి పినతల్లి అయిన ఒకావిడా. ఆవిడతల్లీ చేసిన దొంగహంగామా. బంధువులు చూపించిన అబద్ధపు సానుభూతీ ఆమెకు అసహ్యం కలుగచేశాయి తనంటే మొదటినుంచీ ప్రాణంపెట్టిన తండ్రి. సుబ్బరామయ్యగారు ఎలాగా లేనేలేరు ఆయన పోయి మూడేళ్ళు దాటుతోంది ఇక మిగిలినవాళ్ళలో అన్నయ్యా వదినా తప్ప తక్కినవాళ్ళందరూ శుష్కప్రియాలు పలికేవారూ, తనని పిచ్చిబాబునుంచి వేరుచేయడానికి ప్రయత్నించేవారూ .. లోకమూ. బంధులోకమూ వీళ్ళ ధాటినుండి ఎలా ఐతేనేం విజయలక్ష్మి తప్పించుకు బయటపడింది

ఈమధ్య ఒకటి రెండేళ్ళలోనూ ఆమె పుస్తక పఠనం బాగా అలవాటు చేసు కుంది ఆమెకు స్కూల్లో చదువుకున్నప్పుడు యీ అలవాటు బాగా ఉన్నదే కాపురానికి వచ్చినతరవాతా, అనారోగ్యంవల్లా అదీ కొన్నాళ్ళు తాత్కాలికంగా మరుగునపడింది భర్త పోయిందగ్గిర్నుంచీ ఆమెకు వేరే మరొక వ్యాపకమే లేకపోయింది పనిమనుషుల్ని బాగా తగ్గించేసి ఇంట్లో పనులన్నీ చాలావరకు ఆమే స్వయంగా నిర్వహించినా, ఇరుగుపొరుగులతో కబుర్లు చెప్పి కాలక్షేపం చేసే మనిషి కాదుకనుక అప్పుడప్పుడు ఏమీ తోచేదికాదు 'పుస్తకాలే నీ ప్రాణ స్నేహితులు' అన్నసూక్తి అంతర్యమేంటో అప్పుడే ఆమెకు బోధపడేది పిచ్చి

బాబు స్కూలికి వెళ్ళిపోయి యింకా కొన్ని గంటలకిగాని రాడు అని అమెకు తోచి నప్పుడు పంటరితనంతో ఆమె దహించుకుపోయేది ఎన్నిసార్లో చదివిన ఓకథ ఆమెకు బాగా నచ్చినది తీసి చదువుకొనేది - అకథ యిదీ

జానకిరామయ్యగారు - భార్య పద్మావతి వాళ్ళకి యిద్దరు మొగపిల్లలూ ఇద్దరు ఆడపిల్లలూ అంతా పదేళ్ళలోపు పిల్లలు ఆయన నెలకి ఎలాలేదన్నా మందుల షాపుమీద అయిదువందలు లాభం తీస్తాడు ఆయన తల్లీ దండ్రీ కూడా వాళ్ళతోనే ఉన్నారు

విశాలాక్షి అని పద్మావతికి దూరపుచుట్టమూ, ప్రాణస్నేహితురాలూ కూడా ఓ పెద్ద ఆఫీసర్ని ప్రేమించి పెళ్ళిచేసుకుంది ఎప్పుడూ నలుగుర్నీ నవ్విస్తూ, పది మందికీ ప్రమోదకిరణాలు పంచిపెడుతూ జీవించడం ఒకకళ అని రుజువుచేసిన విశాలాక్షి - వలచి వలపించుకున్న భర్త దగ్గిరికి చేరగానే సాగరతీరంలో శయనించే వెన్నెలవన్నెలాడిలా, ఆమె జీవితం మరింత ఉజ్వలమూ, సుందరమూ అయింది కాని ఏం లాభం ? కన్నుకుట్టిన ప్రకృతి ఆమెను వెన్నులోనే పొడిచింది ఆమె భర్త అకస్మాత్తుగా సెరిబ్రిల్ మలేరియా వచ్చి ప్రాణాలు విడిచాడు !

మా విశాలని ఒకసారి చూసివస్తానంటే పంపేరుకాదు పాపం అంతకష్టం వచ్చినప్పుడు పరామర్శ చెయ్యకపోతే ఏం బాగుంటుంది చెప్పండి ? నెలలు నెలలు గడిచిపోయాయి దేవుళ్ళాంటి మొగుణ్ణి కోల్పోవడమే కాకుండా వాళ్ళవాళ్ళు ఆస్తి కూడా ఆమెకి రాకుండా నానా అల్లరీ పెడుతున్నారట ఎంతలా దుఃఖంతో కుళ్ళి పోతోందో ఏమిటో ! నేను వెళ్ళడం పోయి - అదే ఈ ఊరుమీంచి వెడుతోందిట, ఉత్తరం రాసింది - స్టేషనుకి ఎలా వెళ్ళను, ఏ మొహం పెట్టుకుని దాన్ని చూడను !' అంది పద్మావతి భర్తతో

'సరే జరిగింది, జరిగిపోయింది ఇప్పు డేమనుకుని ఏంలాభం ? ఆవిణ్ణి యిక్కడికి రమ్మని రాయి ఇక్కడ నాలుగురోజులపాటు నీ దగ్గిర ఉంచుకున్నాక వాళ్ళఊరు వెడుతుంది ఏమే అమ్మా ! పిలిపించమన్నావుటే ?'


'మునుపు మా కాలంలో అయితే వారం పర్జ్యం అని ఏడిచేవారు, ఇప్పటివాళ్ళకి ఆ పట్టింపులు అంతగా లేవుగా ? అయినా ఏడాది వెళ్ళిపోయినట్టుంది మధ్యని నా అభ్యంతరం దేనికి ? వస్తే రానియ్యండి పాపం చాలా మంచిపిల్ల తగనికష్టం వచ్చింది మన యింట్లోపిల్లలా తిరిగది కొన్నాళ్ళు మనతో ఉంచుకుంటే ఆ బాధ లైనా మరచిపోయినట్టు అవుతుందేమో !' అంది వీరమ్మ, జానకిరామయ్యతో,

ఈ మాటలు వింటున్న ఆదిశేషయ్య ఊరుకోలేకపోయాడు 'ఎవరూ, విశాలా

షేనా ? మా సీతారామయ్య కూతురేనా ? ఇంకా చూస్తా రేమిటి? వెంటనే రమ్మని రాయి తల్లీ! నా పిల్లలాంటిది. ఎంతలో ఎంత కష్టానికి గురిఅయ్యావు వెర్రి తల్లీ ! నాకు దాన్ని చూడాలని ఎంతగానో ఉంది ఇంతమందిమి ఎలాగా వెళ్ళలేము. అదే వస్తూంటే అంతకంటె కావలసిం దేమిటి ? కాస్త నలుగురిలోనూ తిరిగితే మళ్ళీ ధైర్యంగా ప్రపంచాన్ని చూడగలుగుతుంది '

పద్మావతి ఉత్తరానికి వెంటనే విశాలాక్షి జవాబు రాసింది – తప్పకుండా వస్తానని ఆవిడ వస్తానన్న రోజు దగ్గిర పడినకొద్దీ ఎలా ఆదరించాలో, ఎలా అనునయించాలో తెలియక ప్రాణస్నేహితురాలైన పద్మావతే గిలగిల్లాడిపోయింది ఇంటి చాకిరీతో మనస్సయితే అలసిపోయింది గాని పద్మావతి మనసు బాధతోనూ భయంతోనూ అలా కొట్టుకుంటూనే ఉండేది ఆఖర్కి ఆరోజు రానేవచ్చింది పద్మావతి స్టేషనుకు వెళ్ళలేక మొగుణ్ణి పంపింది

విశాలాక్షి కారు వెనకసీటులోంచి దిగుతూంటే, పద్మావతి కిటికీలోంచి చాటు చాటుగా త నేదో తప్పుచేసినదానిలా చూసింది విశాలాక్షి రూపంలో తను ఊహించినంత మార్పేమీలేదు మొహాన ఎప్పుడూ ఉండే గుండ్రని పెద్దబొట్టు లేకపోవడం చేత నుదురు మరింత విశాలంగా కనిపిస్తోంది ఒకే జత బంగారుగాజులు ఉంటం చేత చేతులు బోసిగా కనిపించినా పూర్తిగా తెల్లగా మరింత అందంగా కనిపిస్తున్నాయి అసలు ఆమెకి మొదట్నుంచీ నిరాడంబరంగా ఉండడం అంటే ఇష్టం లేతరంగు నేతచీరలు ధరించేది ఇప్పుడూ అంతే మెడలో ఒంటిపేట సన్నని గొలుసూ, చెవులకి ముత్యాలదిద్దులూ ఉన్నాయి ఎప్పుడూ తలల్లో ఎక్కువగా తెల్లనిపువ్వులు పెట్టుకొనేది. అవి లేకపోవడమే పెద్ద తేడా జడ మానేసి ముడి వేసుకుంది కొంచెం చిక్కినట్టు కనిపిస్తోంది. అయినా ఆమె అందం రెట్టింపు అయినట్టు ఉందిగాని మరోలా లేదు



జానకిరామయ్య ఆమె సామాన్లు లోపల పెట్టిస్తూండగా, విశాలాక్షి అడుగులో అడుగు వేసుకుని మేడమెట్లెక్కి లోపలికి వస్తూండగా అత్తా కోడలూ ఒక్కసారి గొల్లుమన్నారు విశాలాక్షిని కౌగలించుకుని లోపలికి తీసికెళ్ళేరు లోపలికి వెళ్ళి కూచున్నంతవరకూ విశాలాక్షి మెట్లపొడుగునా, దారిపొడుగునా కన్నీటిచుక్కలు కారుస్తూనేఉంది లోపలికి వెళ్ళి వెళ్ళగానే బాత్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కువచ్చేసింది! అంతే, ఆ తరవాత ఆమె వెళ్ళిపోయేదాకా ఆ మొహాన కన్నీళ్ళే కాదు-విచారరేఖలే ఎవరూ చూడలేదు

మొట్టమొదట ఆమెచే ఆకర్షితులైంది ఆ ముసిలావిడా కాదు, ప్రాణస్నేహితురాలు పద్మావతీ కాదు, ఆ యింట్లో ఉన్న నలుగురు పిల్లలూను పెద్దపిల్లకి ప్లాస్టిక్ తీగెలతో హేండ్‌బ్యాగ్ ఎలా అల్లడమో అతిసులువుగా నేర్పింది పెద్దవాడికి దగ్గిరుండి మ్యాపులు వేసిపెట్టింది రెండవ వాడితో డాబామీదకి వెళ్ళి గాలిపడగలు ఎగరేసింది ఆఖరికి రెండేళ్ళ పాపనికూడా కాళ్ళమీద పడుకోబెట్టి, పాటలు పాడి, నిద్ర పుచ్చింది ఎన్నాళ్ళనుండో వాడకుండా మూలపడేసిన ఫిడేలును అప్పటికప్పుడు తీయించి తీగెలు వేయించి బాగుచేయించింది

'పద్మా, వందలికి వందలు తగలేసి అయిదేళ్ళపాటు నేర్చుకున్నావు ఎందుకు ఇలా బూజుపట్టించడానికా? అన్నాళ్ళు సాధన చేసింది మరచిపోయావంటే ఎవరు నమ్మతారు? ఆనాటి బాలనాగమ్మలో సంగు పాడిన పాట ఎంత బాగా వాయించేదానివి? ఏదీ, నాకే జ్ఞాపకమున్నాయే ఆ ముక్కలు, నువ్వెలా మరచిపోగలవు? 'కెందామర లీ కనులే ఏలు జగాలు, అందా లొలికించు బలే మరుని శరాలు...నా సొగసే, ఆహా నా సొగసే ..'ఏదీ వాయించొసే' అర్జునుడు భక్తితో బాణమేస్తే అమృతధారలు పైకి చిమ్మినట్టు పద్మావతి మంత్రముగ్ధులా కుడిచేత్తో కమానుకదిపింది ఆనాటి 'రాగసుధారస'లు యింకా పచ్చగా ముచ్చటగా ఉన్నాయని రుజువు చేసింది

'అమ్మో! అమ్మో! యింత బాగా వాయిస్తున్నది మా అమ్మే! ఏమే అమ్మా, యిన్నాళ్ళూ చెప్పేవు కాదేం?' అని చిన్నపిల్లలిద్దరూ పద్మ చెరోచెంపా ముద్దెట్టుకున్నారు తను వెనక ఉండిపోయిందని చంటిది ఇల్లెగరగొట్టేసింది తన కిష్టమైన పాటలన్నీ వాయించేదాకా పెద్దది వాళ్ళమ్మని ఊరుకోనియ్యలేదు

ఆ తర్వాత రెండ్రోజులకి కాబోలు, విశాలాక్షి వీరమ్మగారితో అంది 'అత్తయ్యా, ఎన్నాళ్ళో అయింది పెసరట్లకూర తిని మీరు చాలా బాగా చేసేవారు, జ్ఞాపకముందా? ఇవాళ చేసిపెట్టరూ?'

వీరమ్మగారి కళ్ళు మెరిశాయి చిరుకోపం నటిస్తూ అంది పూర్వకాలపుదాన్ని ఇప్పటివాళ్ళకి నా వంటకా లేం రుచిస్తాయే అమ్మాయీ! నే నేం చేసినా యింట్లో ఎవరూ ముట్టుకోరుగా? ఇప్పుడు తిండికికూడా ఫ్యాషనొచ్చిపడింది. అన్నీ వేడిగా ఉండాలిట అన్నిటికి యూత ఉండాలిట దీన్ని చేత్తో వడ్డించకూడదట అందరి కన్నా ఎక్కువ ఫ్యాషన్లు మరిగిం దెవరో ఎరుగుదువా, మీ మామయ్యే!'

విశాలాక్షి వింతగా నవ్వింది 'ఊరుకోం డత్తయ్యా, మీరు మరీ చెబుతారు మీరు వంటింట్లో ప్రవేశించి నడుం బిగిస్తే ఎవతె నిలబడగలదేం! మీ దగ్గిర పెసరట్లకూర ఎలా చెయ్యాలో రాసుకున్నాను గాని స్వతహాగా చేతిలో వుండే ఆ పాకరేఖ నే నెక్కడ కొనితెచ్చేది? ఇవాళ మీరు చేసిపెట్టవలసిందే, తక్కిన వాళ్లు తినకపోతే మానెయ్యినీండి, వాళ్ళ ఖర్మ!'

వీరమ్మ సంతోషాన్ని పైకి తెలియనీయకుండా వంటకి ఉపక్రమించింది. విశాలాక్షి పద్మావతికి ఈలోగా జడవేసి పువ్వులు పెట్టింది

'ఏమంత పెద్దదాని వైపోయావని అప్పుడే ఈ పిడకముడికి మార్చేశావ్? ఎన్నాళ్ళయినా సూటూ బూటూ వేసుకుని కుర్రాళ్ళలా కనబడే మొగాళ్ళకి ఈ ఆడాళ్ళు అమ్మో, అమ్మమ్మో అనిపిస్తే ఎలాగ? ఇవాళ నువ్వూ బావా సినిమాకి వెళ్ళిరండి నేనూ అత్తయ్యా పిల్లలూ అలా రఘునాధస్వామి కోవెల్లోకి వెళ్ళొస్తాం ఊఁ, నామాట కాదనడానికి వీల్లేదు నాలుగురోజులపాటు నాకు సుఖ మివ్వడానికే కదా నలుగురూ కూడబలుక్కుని నన్ను పిలిపించారు నే చెప్పినట్లు వినాల్సిందే!'

ఆ రాత్రి పడుకోబోయేముందు జానకిరామయ్య భార్యతో అన్నాడు నువ్వింత బాగా ఫిడేలు వాయిస్తావని నాకు తెలీన్సుమా! ఇన్నాళ్ళయినా ఇంత బాగుంటావని నాకు తెలీన్సుమా!'

'ఇన్నాళ్ళయినా మీ రింత చక్కగా మాట్టాడతారని నాకూ తెలీన్సుమా!'

పక్కగదిలో ఇది విన్న విశాల కన్నీరు తుడుచుకుంది .

చదువుతూ చదువుతూ విజయలక్ష్మి కన్నీరు తుడుచుకుంది ఇంతటి తపస్సూ, నిగ్రహమూ ఈ వయస్సులో సాధ్యమా? అని ప్రశ్నించుకుంది ఇది కేవలం కధే గదా అనుకుంది. మళ్ళీ కాదేమో, ఇది సాధ్యమేమో అనిపించింది

ఎదురింటి భార్యకు భర్త తలలో పువ్వు పెడుతున్నాడు ఆమె కిటికీతలుపులు వేసేసింది

విశాలాక్షి కధను గుండెల కదిమిపట్టుకుంది మిగిలిన కధను చదవ నారంభించింది

మర్నాడు తెల్లారీసరికల్లా వాన పట్టుకుందని పెద్దపిల్ల విసుక్కుంటే విశాల అంది: 'ఇలా వర్షం వచ్చినతర్వాత పాతితే నీ చామంతిఅంట్లు బాగా లేస్తాయి. పరిగెడుతున్న పిల్లకాలువలలో వర్షపుబిందువులు పడుతున్నపుడు చూడ్డానికి ఎంత అందంగా ఉంటుందో తెలుసా? అవన్నీ బుడగల్లా పైకి లేస్తాయి. ఆకులూ, పువ్వులూ, ఎండకి నెత్తి మాడిన భూదేవీ, ఎదురు చూసే కర్షకుడూ–అందరూ సంతోషంతో నాట్యం చేస్తారు. ఆ హృదయాలన్నీ ఏమని పాడతాయో తెలుసా?

'చిరుచిరునవ్వుల చిలకల్లారా!

చిటపట చిటపట చినుకుల్లారా!...' ఏదీ పాడూ.'

సుందరి ఎంతో ఉత్సాహంతో లేచి అందుకుంది. అది ఒక్కర్తే కాదు; ఝాము పొద్దెక్కి లేచే పిల్లలందరూ ఆయా కొట్టకుండా లేచిపోయారు. ఆ పాటలో మైమరచి లీనమైపోయారు. రెండేళ్ళ పసిదాని గోల వర్ణించలేనిది. వచ్చీరాని మాటలతో

'సిరుసిరు నవ్వుల సిలకల్లాలా

సితపత సితపత సినుకుల్లాలా!' అని అందుకుంది.

'ఇంతట చక్కటి వాన మన కిచ్చాడు. అందరూ ఒకసారి జేజికి దండం పెట్టుకోండి.'

పదిచేతులూ పరంజ్యోతికి ప్రభాతవందనం ఆచరించాయి.


వీరమ్మ ఈ చిత్రం చూపిద్దామని భర్తకోసం వెదికింది. ఆయన మూల గదిలో వాల్మీకిరామాయణం వల్లెవేస్తున్నాడు.

'ఏళ్ళతరబడి అటకెక్కిన ఆ పురాణాలు కింది కెప్పుడు దిగేయి? అందుకేనా ఏమిటి చెప్మా, ఇంత వర్షం!'

ఆదిశేషయ్యగారు ఇటు తిరిగేరు. ఇలా అన్నారు· 'ఇంతగా జ్ఞానోదయమూ, ఇంతటి నూతనోల్లాసమూ యింటిల్లిపాదికీ ఒక్కసారే ఎందుకు కలిగేయో తెలుసా? సూర్యోదయంతో పద్మాలన్నీ విడుచుకొన్న సరోవరంలా ఉంది మన యిల్లు. విశాలాక్షిని ఏదో పరామర్శ చేద్దామని మనం తీసుకొచ్చాం. దాని దుఃఖాన్ని తొలగించి కాస్త సుఖాన్నైనా యిద్దామని తీసుకొచ్చాం. మనం చేసిం దేమిటి? తను త్యాగం చేసి తమోనాశనం చేసే దీపికలాంటిది ఆమె. మనల్నే ఆమె సంతోషపెట్టింది.'

విజయలక్ష్మి కథను చదవడం ఆపుచేస్తుంది.

'ఏమిట్టి పిస్సీ! ఎన్నిసార్లు చదువుతావ్ ఆ కథను?' అంటాడు వెనకనుంచి వచ్చి పిచ్చిబాబు. విజయలక్ష్మి కళ్ళను కొంగుతో తుడుచుకుని ఇటు తిరుగుతుంది.




'ఇందాకట్నుంచీ చూస్తున్నాను; నేను వచ్చానని నువ్వు గుర్తించావో లేదో అని ... కానీ, ఎంతసేపని చూస్తాను? నీకు ఆ కథలపుస్తకమే ముఖ్యమైతే అందులోనే తలదూర్చుకూర్చో...నేను ఆడుకోడానికి పోతున్నాను,' అని పిచ్చిబాబు గుణుస్తాడు.

'అయ్యో అయ్యో! బాబూ! ఆగరా ... నీకోసం ఇవాళ తొక్కుడులడ్డూ చేశాన్రా ... తినివెళ్ళరా బాబూ...'

పిచ్చిబాబు టక్కున ఒక్కక్షణం ఆగి చర్రున పిన్ని మీదకు లేస్తాడు. 'చేశావూ తొక్కుడులడ్డూలే చేశావూ? నా కిష్టమని చెపితే చెప్పేనుగాని నిన్నే చెయ్యమని ఎవరు చెప్పేరూ? అది గంటలకొద్దీ నడుంవంచి చెయ్యవలసిన పిండివంట అనీ - కిందటిసారి అది చేసినప్పుడు నడుంలో పోట్లు వచ్చి అరగంట బాధపడ్డాననీ నువ్వు పనిపిల్లతో చెబుతూంటే నేను విన్లేదనుకున్నావా? మళ్ళీ నాలుగురోజులు పక్కేస్తావ్ కాబోలు...అబ్బ, నీతో పడలేకుండాఉన్నాను పిన్నీ!' అనేసి పక్కకి తిరిగి నాలిక కరుచుకుంటాడు.

'మా బాబువికదూ! మా అమ్మవికదూ! ఈసారికి తినెయ్. ఇంకెప్పుడూ చెయ్యనుగా?' అంటుంది పిన్ని చీరచెరగు తెర చేసుకుని.

'ఆఁ, ఏమిటి పిన్నీ! – ఎన్నిసార్లు చెప్పినా నీకు వేళాకోళంగా ఉందీ!'

అంటూ ప్లేటు చూసి 'ఇదేమిటి? ఇంతకొంచం పెడితే నా కేం చాల్తాయి?' అంటూ పళ్ళతో ఉండల్ని పచ్చడిచేసి గుబుకూ గుబుకూ బొక్కుతాడు.

'పిన్నీ, పిన్నీ! చాలా బాగా చేశావ్, యింకొక్క రెండూ...ప్లీజ్!'

'చెయ్యడం తప్పుపనేమో !'

'బాగుంది ... ను వ్వెక్కడ నొచ్చుకుంటావో అని తినడంగాని, నా కోసమా ఏమిటి ? ఏవే మరో రెండిలా అందుకో ... అబ్బ ఎంత ఆలశ్యమైపోయిందో నీతో పెట్టుకుంటే ఇలాగే...' అని పిచ్చిబాబు బ్యాటు ఊపుకుంటూ వెళ్ళిపోతాడు

లోకంలో మనుష అందరూ దేన్ని చూసుకు బతుకుతున్నారు ? తమకోసమా, ఎదుటివారికోసమా అనే ప్రశ్న ఎలాంటివారికైనా యిలాంటి సందర్భంలో అడగ బుద్ధివేస్తుంది? తల్లితండ్రులు పిల్లల్ని పోషిస్తున్నారు? పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కంటు న్నారు. ఈ పరిభ్రమణానికి అంతం ఎక్కడ ? ఈ జీవనవలయానికి కేంద్రం ఎక్కడ ? ఈ చిక్కుప్రశ్నకు జవాబు ఎక్కడ ? ఆశా, ప్రేమా, త్యాగమా, స్వార్థమా, ఏది ? ఒక పదార్థానికే ఇవన్నీ పేర్లా ?

పొద్దుట హైస్కూలికి వెళ్ళినప్పుడూ, సాయంకాలం ఆటకని వెళ్ళినప్పుడూ విజయలక్ష్మి పిచ్చిబాబుని వీధిగేటుదాకా దిగబెడుతుంది.

అతడు వెళ్ళిపోయాకకూడా, కనుచూపు దాటిపోయాకకూడా కొంతసేపు ఆ గేటుని పట్టుకుని అటే చూస్తూంటుంది. అలా చూస్తూండగానే పదేళ్ళవాడు, పదహారేళ్ళవాడు, ఇరవై రెండేళ్ళవా డయిపోయాడు.

ఎడంచేత్తో జారిపోతున్న లాగును ఎగదోసుకుంటూ, కుడిచేత్తో కంట్లో పడుతున్న క్రాఫింగులోని పొడుగుపాటి వెంట్రుకల్ని పైకి తోసుకుంటూ ఉండే వాడు — కిందకి తేరిపార చూస్తేగాని కనిపించని నలుసంతవాడు, తలెత్తి ఒకసారి చూస్తే పూర్తిగా కనిపించనంత పొడుగ్గా, వెడల్పుగా తయారయాడు. ఎం.ఎస్సీ మొదటిసంవత్సరం చదువుతున్నాడు.

విజయలక్ష్మి ఒక్కొక్కప్పుడు గర్వంగా నవ్వుకొంటుంది – 'ఇదంతా నేను చేసినదే, నా ప్రతాపమే' అని. మరుక్షణం నిర్లిప్తత ఆమె నాశ్రయిస్తుంది. 'మళ్ళీ మళ్ళీ నేను భ్రమపడకూడదు. ఇందులో నేను ఆశించవలసిందీ, నేను చేస్తున్నదీ ఏమీలేదు. ఇదంతా నా డ్యూటీ,' అనుకుని ధైర్యం తెచ్చుకుంటుంది. ఆ ధైర్యమే ఆమెకు చెప్పలేని సుఖాన్నిస్తుంది.

*　　*　　*　　*

"పిచ్చిబాబూ, పిన్నీ – వీళ్ళ సంబంధం పైవాళ్ళకెలా ఉండేది ?" అని అడిగాడు డాక్టరు విజయకుమార్ హఠాత్తుగా.

"అది చెప్పేముందు విజయలక్ష్మి బాహ్యారూపాన్ని కొంచెం వర్ణించాలి," అంటూ శ్రీకృష్ణమూర్తి ఇలా చెప్పేడు:

* * * *

మొదట్నుంచీ విజయలక్ష్మి చాలా నాజూకైన మనిషి. రోగాలు ఆమె శక్తిని హరింపజేసినా సౌందర్యాన్ని నశింపచేయలేకపోయేవి. సన్నగా, పీలగా, పొట్టిగా ఎల్లకాలం చిన్నపిల్లలా ఉండేది ఆమె. పిచ్చిబాబు చిన్నప్పుడు, ఎవరో ఒకసారివచ్చి అడిగారు—'ఆమె మీ అమ్మా?' అని; 'ఎందుకు కాదు?' అన్నాడు. మరొకసారి 'మీ అక్కగారా?' అని అడిగారు; మళ్ళీ అదే జవాబు 'ఎందుకకాదు?' అని. ఈసారి తెలియనివాళ్ళు ఎప్పుడేనా అడుగుతూఉంటారు. 'ఆమె మీ చెల్లెలా?' అని.

'పేరుకిమాత్రం పిన్నీ అని పిలుస్తూంటాను, ఆమె నాకేమీటీకాదు!' అనుకుంటూ ఉంటాడు పిచ్చేశ్వరరావు.

## 14

ఏదో మాట అని పిచ్చిబాబుని ఏడిపించడం విజయలక్ష్మికి సరదా అయిపోయింది. అనేకసార్లు ప్రయత్నించింది. ఏదోవిధంగా యీ బలహీనతను పోగొట్టుకుందామని. కాని తెచ్చిపెట్టుకున్న కోపంతో వాడికళ్ళు చిత్రంగా మెరుస్తాయి. వాడి స్వరంలో శ్రుతిపేయమైన జీర ఒకటి వచ్చి చేరుతుంది. అవన్నీ గమనిస్తూంటే ఆమెకు అనిర్వచనీయమైన ఆనందం కలుగుతూఉంటుంది. ఎన్నిసార్లు తర్కించిచూసినా ఆవిధమైన అనుభవంలో ఆమెకు ఆవగింజంతైనా దోషం కనిపించలేదు. అందుచేత తీరికూచుని వాడితో ఏదో వాదం వేసుకుంటూఉంటుంది.

ఒక్కొక్కసారి వారి సంభాషణ యిలా సాగుతూంటుంది—

'నువ్వే నన్ను ఇంతలా కాల్చుకుతింటున్నావ్ కదా! రేపొద్దున నీ పెళ్ళాం వస్తే నన్ను బతకనిస్తుందా బాబూ?'

'ఏమిటన్నావ్ పిన్నీ! ఏదీ, మరొక్క మారనూ...'

'ఏం, ఏం చేస్తావేం?'

'ఇలాంటి మాటలంటే నేను పడను తెలుసా?'

'ఎవర్నీ?'

'ఎవర్నో ఏమిటి? నీకు తెలీదా?'

'ఏమోలే, నీ పెళ్ళాన్నేమోనని...'

'ఏడిసింది. అది నీ ముందు మాటాడ్డమే?'

'ఏం, మూగదాన్నిగాని పెళ్ళాడతావేమిట్రా?'

'బాగుంది, అదా కబురూ ? పెద్దకాలంలో నీ కామాత్రం చాకిరీఅదీ చెయ్యొద్దా ఏమిటి పిన్నీ !'

'అయితే నర్సుట్రెయినింగ్ ప్యాసయినపిల్లని పెళ్ళాడకూడదూ ?'

'ఏమిటి పిన్నీ! అంతా నీకు హాస్యం... నీ కోడలు నీకు చక్కగా ఉండడం యిష్టంలేదాఏమిటి ?'

'అయితే ఓ సినిమాతారని చూడు మరి. పదిహేనేళ్ళమొదలు ఏభైఏళ్ళవరకూ కన్యలు దొరుకుతారట !'

'ఎన్నిసార్లు చెప్పినా నీకు వేళాకోళంగా ఉందే...ఇలా నవ్వులకి పట్టించావంటే అసలు పెళ్ళే ఆడను. పెళ్ళామన్నతర్వాత పెద్దవాళ్ళకి తల్లో నాలికలా ఉండి, కాస్త వంటా పైపనీ చక్కబెట్టనక్కర్లేదాఏమిటి ?'

'అలాఅయితే ఓ వంటలక్కని కట్టుకుంటావందూ...'

పిచ్చిబాబు కోపంతో పిన్నిని తరుముతాడు. ఆమె అతనికి దొరక్కుండా పరిగెడుతుంది. వాళ్ళిద్దరూ ఆ క్షణంలో పసిపాపలూ, పరమాత్మలూ అయిపో తారు. నవ్వుతెరలు దగ్గుతెరలుగా మారి పిన్ని కూలబడుతుంది.

'నీకూ ఇలాకాదు ఉండు...కొరివిలాంటి, గొరకలాంటి, కొరకంచులాంటి, కోతిలాంటి, కొరకరాని కొయ్యలాంటి కోడల్ని తేకపోతే నా పేరు...'

'బాబ్బాబు... నువ్వు చెప్పిన అన్నిలక్షణా లున్న కోడల్ని తెచ్చిపెడుదూ. పెద్దదాన్ని అయిపోయాను...మీ రిద్దరూ చిలకాగోరింకల్లా కాపురం చేస్తూంటే చూడాలనిఉందిరా నాయనా...'

పిన్ని చమత్కృతికి పిచ్చిబాబు మనసా నమస్కృతి అర్పిస్తాడు. ఆమె సమ క్షంలో ఉండి ఆమెతో మాటాడుతూంటే ఇంక వేరే లోకం వాడి కేమీ ఉండదు వీళ్ళిద్దరి సంభాషణా విన్నవాళ్ళు ఎవరైనా ఉంటే 'చిన్నప్పుడే పెద్దకబుర్లు చెప్పిన యీ విజయలక్ష్మికి ఇంత చక్కగా మాట్లాడ్డం ఎప్పు డొచ్చిందీ ?' అనీ, 'మొన్నమొన్నటిదాకా అందరిచేతా పిచ్చిపుల్లాయి అనిపించుకున్న ఈ వెర్రివెధవకి ఇంతటి వాక్చాతుర్యం ఎప్పుడు పుట్టుకొచ్చిందీ ?' అనీ విస్తుపోక మానరు. దీనికి జవాబు ఒక్కముక్కలో చెప్పొచ్చు-పిచ్చిబాబు ఇవన్నీ పిన్నిదగ్గిర నేర్చుకున్నాడు పిచ్చిబాబుకి అనేక విషయాలు నేర్పడంలో పిన్ని చాలా నేర్చుకుంది. రెసిడెన్షియల్ స్కూలునుంచి పిచ్చిబాబుని మానిపించి ఇంటికి తీసుకొచ్చినతరువాత వాడికి క్లాసు టీచరూ ప్రైవేటు టీచరూ అన్నీ పిన్నే అయింది. మెట్రిక్‌వరకూ వాడికి చెప్పడం కష్టమవలేదుగాని ఎస్సెస్సెల్సీ మాత్రమే పాసయిన పిన్నికి ఆ తరవాత ఎంతో

'ప్రిపేర్' అయితేగాని వాడి సందేహాలు తీర్చడం కష్టమైపోయేది. 'ఎప్పుడూ ఇంతింత పుస్తకాలు ఇన్ని ముందేసుకు కూచుంటారు; మీ రేమైనా రీసెర్చిగాని చేస్తున్నారా ఏమిటండీ విజయలక్ష్మిగారూ?' అని ఎవరేనా అడిగితే, ఆమె చిన్నగా నవ్వుతుంది. 'దిక్కులేని ఒక దీనుడికి దిగ్భ్రమ పోగొట్టి దిక్కులన్నీ చూపించడంకన్న రీసెర్చి ఏముంది!' అంటుంది.

'అయినా ఇదెక్కడి అన్యాయం పిన్నీ... నీకూడా ప్రతీచోటుకీ నన్ను రమ్మని అల్లరిపెట్టడం ఏం న్యాయం? భగవద్గీత ఉపన్యాసాలమీద నీకంత సరదాగా ఉంటే నువ్వు వెడితే సరిపోదూ? తీరా వచ్చానా... ఎంత ఆపుకుందామన్నా ఒకటే కునికిపాట్లు... అక్కడ దోమలు, చీమలు... నీమీద ఎంతకోపం వచ్చిందో!' అంటాడు పిచ్చిబాబు ఒకనాడు.

'ఏమో — ఒకళ్ళు రమ్మంటే రెండోవాళ్ళు వెంటనే బయల్దేరడమే గాని ఎందుకని అడగడం మనలో లేదురా బాబూ ... 'పిన్నీ, పిన్నీ! ఇవాళ గొప్ప క్రికెట్ మ్యాచ్ అవుతుంది తెలుసా? నేను కేప్టెన్‌ని తెలుసా? ను వొచ్చి చూడవూ,' అని ఆ మధ్య నన్ను తోలుకెళ్ళేవు, జ్ఞాపకముందా? ఆ ఆటలో ఏబీసీడీలు నాకు తెలీవు. అయినా నన్ను వదిలిపెట్టేవా? ప్లేగ్రౌండ్ పక్కనున్న ప్లీడరుగారి యింటి డాబామీద కూచోబెట్టేవు. నేనూ ప్లీడరుగారి భార్యా కబుర్లకి తగులుకున్నాం. ఆట అయిపోయాక, 'పిన్నీ పిన్నీ నేను నాలుగు బౌండ్రీస్ కొట్టేను; అందరూ చప్పట్లు కొట్టేరు; నువ్వూ కొట్టేవా?' అని అడిగావు. నే నేం చెప్పను! నా కా ఆట బోధపడదాయె! ఎవరో పది పదిహేనుమంది అలా తెల్లనిబట్టలు కట్టుకుని అటూ యిటూ తిరుగుతున్నారు. ఒక డేదో విసురుతున్నాడు. ఇంకో డేదో బాదుతున్నాడు. దేన్నో పట్టుకోడానికి కొందరు పనిలేనివాళ్ళు పరిగెడుతున్నారు...'

'ఈసారి టెస్ట్‌కి నీచేత కామెంట్రీ చెప్పించాలి పిన్నీ...తెలిసినా తెలియనట్టు ఏడిపించడం నీకు బాగా అలవాటైపోయింది. నీకు యిష్టమని నన్ను లాక్కెళ్ళిన సందర్భాలూ యిలాగే ఉంటాయని మరచిపోకు. మొన్న దేవీస్తుతి గొప్పతనం చాటుతూ ఉపన్యాసం జరుగుతే నన్ను దేవాలయానికి తీసికెళ్ళేవ్, జ్ఞాపకముందా? అక్కడ ఏవో శ్లోకాలు చదివారు. అందులో ఒకచరణం మాత్రం నాకు చాలా నచ్చింది. 'దృశ్యాదృశ్య విభూతి వాహనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ,' అని చదువుతూంటే నాకు మన ఎదురింటి అన్నపూర్ణ జ్ఞాపకానికి వచ్చింది. ఆమెకూడా 'దృశ్యాదృశ్య విభూతి,' అంటే కనీ కనపడకుండా పౌడరు రాసిన మొఖాన్ని వహిస్తూంటుంది!'

విజయలక్ష్మి ముసిముసిగా నవ్వుతుంది 'ఆఖరికి నేను చెప్పినదాన్నిబట్టి నువ్వు నేర్చుకున్నది యిదిట్రా బాబూ! అవునులే ఆ తప్పు నీదికాదు. నీ వయసుది...'

పక్కనున్న బీరవా నిలువుటద్దం చూసి ఆమె త్రుళ్ళిపడింది మాటల్లో ఉంటే ఉండుగాక, పిచ్చిబాబు చక్కగాఎదిగిన శరీరంలోంచి ఉట్టిపడేదికూడా అమాయకత్వమేనా? ఎగురుతున్న గుండెలు, బలుస్తున్న జబ్బలు, పూర్ణిస్తున్న పురుషత్వం, పురివిప్పుతున్న యౌవ్వనం...ఆమెను ఎక్కువ ఉగ్భ్రాంతి కలుగజేసింది అతనుకాదు – తను! తలలో ఒక తెల్లవెంట్రుక లేదు. శరీరంపై ఒక్క ముడత లేదు. ఎల్లకాలం పెళ్ళికూతురిలా, చిన్నపిల్లలా, అతనిపక్క తను! కల వరపాటును నిలదొక్కుకోలేక విజయలక్ష్మి లేచినిలబడింది.

'ఏమిటి పిన్నీ, అలా చూస్తున్నావ్?'

'మరేంలేదురా బాబూ... ఎంతలో ఎంతవాడివై పోయావూ అని చూస్తున్నాను. ఇక లాభంలేదు; నీముక్కుకి తాడు వేసెయ్యాలి. ఇవాళనుంచే ఇల్లిల్లూ వెతుకుతాను. చెప్పు – చెప్పు, నీ కెలాంటి పెళ్ళాం కావాలన్నావ్ – కొరివిలాంటి, గొరకలాంటి, కొరకంచులాంటి...'

మాట పూర్తవకుండా బాబు ఆమెనోరు మూసేశాడు,

'బాబూ! ఎల్లకాలం చిన్నపిల్లాడివికాదు; నాదగ్గిరకి అస్తమానూ ఇలా రాకు. చూసివాళ్ళకు బాగుండదు;' విజయలక్ష్మి గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

ఆమెలో ఆ మార్పేమిటో బాబుకి తల బద్దలుకొట్టుకున్నా అర్థంకాలేదు.

*　　　*　　　*　　　*

పిచ్చేశ్వర్రావుకి అవాళ చాలా కోపంగా ఉంది. వారంరోజులై పిన్ని వాళ్ళన్న దగ్గిరకి భువనేశ్వరం వెళ్ళింది. మూడోనాటికల్లా వచ్చేస్తాననీ, ఒకవేళ ఏ కారణం చేతనైనా రాకపోతే ఉత్తరం రాస్తాననీ మరీమరీ చెప్పివెళ్ళింది. రానూలేదు, ఉత్తరమూ లేదు!

'రంగమ్మా, ఇవాళతో నీ కెంతయిందమ్మా?' అని హఠాత్తుగా ఒక్క కేకేశాడు పిచ్చిబాబు. వంటమనిషి హడలిపోతూ వచ్చింది.

'ఎంతయిందో చెప్పు, ఇచ్చేస్తాను. ఇక నాకు చెయ్యక్ఖర్లేదు.'

'అదేమిటి బాబూ! ఆమె వచ్చేదాకా మిమ్మల్ని వదిలివెళ్ళొద్దని అమ్మగారు మరీమరీ చెప్పివెళ్ళేరు. తీరా మధ్యలో ఎలా వెళ్ళనూ? అయినా కాలేజీవేళకి మీకు వంటా అదీ ఎలా అవుతుందీ?'

'అవకపోతే అఘోరించిందిలే...మరేం పస్తులుండి చచ్చిపోము. నా సదు

పాయం అంతగా కావలసిన మనిషైతే వెళ్ళినచోటే పాతుకుపోడం దేనికి? మను షులకిమాత్రం మంచీ చెడ్డా ఉండక్ఖర్లా?'

'బాబూ...అప్పుడెప్పుడో వెళ్ళేరు. మళ్ళీ ఇన్నేళ్ళకి పుట్టింటికంటూ బయలు దేరారు. అదీగాక వాళ్ళ అన్నయ్యా వదినా పదేపదే రాస్తే కాదనలేక ప్రయాణ మయారు. వెళ్ళడమంటే మనిష్టంగాని, రావడం మనిష్టమా? ఒక్క నెలయినా ఉండండే...'

'నెల కాకపోతే అక్కడే ఏకంగా వుండిపోమనమ్మా ... ఇప్పు డెవరు కాదన్నారు! అంతగా వాళ్ళవాళ్లు నెత్తిమీద దేవతలైతే...'

పిచ్చిబాబు ఇంక మాటాడలేకపోయాడు. అతని గొంతుక గద్గదికం అయిపో యింది. కళ్ళలో నీరు తిరిగి తింటున్న కంచంలో పడిపోయింది. ఆ అన్నం అలా వదిలేసి లేచి వెళ్ళిపోయాడు. రంగమ్మ అర్థంకాక అతనివైపే చూడసాగింది. మళ్ళీ ఏదో గుర్తు తెచ్చుకుని అతని వెనకే గదిలోకి వచ్చింది.

'అన్నట్టు మరిచేపోయానయ్యోయి...' అంది ముసిముసిగా నవ్వుతూ.

బాబు 'ఏమి' టన్నట్టు ఇటుతిరిగి చూశాడు.

'అమ్మగారు ఎందు కిన్నాళ్లు ఉండిపోయారో నాకు తెలుసు.'

'ఏమిటి నీకు తెలుసు?'

'తెలుసంటే పూర్తిగా తెలుసునని కాదు. నేను అనుకోడం అదని...అనుకోవడ మంటే ఉత్తినే అనుకోడం కాదు... అదే అయిఉంటుందని... అయివుండడ మంటే సందర్భ మేమీ లేకుండా కాదు...'

'చెప్పవమ్మా బాదస్తపు చెలమమ్మా!'

'ఉండవయ్యా బ్రహ్మదేవుడా... కాస్త ఆలోచించుకోనీ... ఓహో అలాగా! బాగుంది... సరిసరీ. అదా సంగతీ... చెప్పరైతిరి...'

ఒకనిమిషం ఆగి, 'ఆఁ, అదయ్యా విషయం' అని రంగమ్మ చెప్పింది: మా శాఖ పిల్లేనుట, బీయస్సీ చదువుతోందిట...'

'రంగమ్మా!' పిచ్చిబాబు కోపంతో అరచి అపుచేయించాడు.

'ఏం బాబూ:'

'ఇవాళతో నీ కెంతయిందమ్మా?'

రంగమ్మ మూతి విరిచి శరవేగంతో లోపలికి సర్దుకుంది.

పిచ్చిబాబు తొందరతొందరగా కాగితమూ కలమూ తీసి పిన్ని పేర ఉత్తరం రాశాడు:

'పిన్నీ,

ను వ్వెళ్ళి ఇవాళకి వారంరోజు లయింది.

నన్ను చూడకుండా ఒక్క సెకండు అయినా ఉండలేనని అనేదానివి.

నువ్వు వెళ్ళి ఆరులక్షల నలభై ఎనిమిదివందల సెకండ్లు నే నీ ఉత్తరం రాసే సమయానికి గడిచాయి.

దీని కేం జవాబు చెబుతావో చెప్పుకో.

నీ,

బాబు

అతడు ఉత్తరం పూర్తి చేశాడో లేదో, పిన్ని దగ్గిర్నుంచి ఉత్తరం రానేవచ్చింది రాసిన ఉత్తరాన్ని చింపిపారేసి వచ్చిన ఉత్తరాన్ని ఆప్యాయంగా అందుకున్నాడు ఆ కంగారులో కవరుతోపాటు లోపల ఉత్తరంకూడా రెండు ముక్కలుగా చించే శాడు. రెండూ దగ్గిర పెట్టుకుని ఆతృతగా చదివాడు.

'బాబూ! నిన్ను చూసి అప్పుడే ఎన్నోరోజు లై పోయినట్టు ఉంది. సరిగ్గా పరీక్షలవేళ. ఏ మిబ్బంది పడుతున్నావో ఏమిటో! ఇక్కడ పరిస్థితులు నాకు ఏమాత్రమూ అనుకూలంగా లేవు. ఇంకా యిక్కడ ఉండవలసిన అవసరం ఎంతయిన కనిపిస్తోంది. అక్కడికి వచ్చాక నీకు అన్ని సంగతులూ బోధపరుస్తాను. న బాబువి కదూ, నన్ను విడిచి ఉండలేక, అది చేతగాని అలకగా మార్చుకుని అన్నమూ అదీ తినెయ్యడం మానేస్తే నామీద ఒట్టు.

ఏడాది చదివిన చదువూ మళ్ళీ వృథా అయిపోతుంది; ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ బాగా చదువు. నీకు ఫస్టుమార్కు రాకుండాఉండడం అసాధ్యమని అందరితోనూ చెబుతూఉంటాను; కాదనిపించకు.

నేను ఆలశ్యంగా ఉత్తరం రాశాను. దానికి శిక్ష ఏమిటంటే మరి జవాబు రాయక పోడమే.

ఒకింత దూరమై, మరింత దగ్గిరయిన,

—— నీ, పిన్ని

ఏ పది పదిహేనుసార్లో ఆ ఉత్తరం చదువుకున్నాకగాని బాబుకి ఆ కవరులో మరో చిన్న మడత ఉందని తెలియలేదు. అది రంగమ్మకి... బాబు అప్రయత్నంగా అదికూడా చదివేశాడు.

'రంగమ్మకి – విజయలక్ష్మి వ్రాయునది. ఇక్కడ నేను క్షేమంగా జేరినాను మా అన్నయ్య, వదిన, పిల్లవాడు యిక్కడ కులాసాగా ఉన్నారు. పరిసితుల్ని



"సుబ్బయ్యా నిన్ను కొట్టినమాట నిజమేనా ?"
"ఛ, ముందు మనం కొట్టందే వా డేం కొడతాడు ?"

---

బట్టి యిక్కడ నేను యింకా ఉండవలసివస్తుందేమో అనుకుంటున్నాను. ఏమి ఆయినా అబ్బాయి పరీక్షలు అయేలోగా రావడము కుదరదు.

నేను అక్కడ్నుంచి వచ్చేముందు నీకు చెప్పిన విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నావని తలుస్తాను. అబ్బాయి తత్వం బాగా ఆకళింపు చేసుకున్నదానివి కనుకనే వాడి బాధ్యత నీకు ధైర్యంగా అప్పజెప్పి నేను యిక్కడికి రావడం జరిగింది. నీ విధినిర్వహణలో ఏమాత్రం లోపం జరిగినా నేను సహించేది లేదని నీకు మరొకమారు గుర్తుచేస్తున్నాను.

అబ్బాయి వట్టి అమాయకుడు. వయసు వచ్చినా పసితనం ఏమాత్రం వదలని వెర్రినాగమ్మ వాడు. వాడికి ఆకలెరిగి అన్నం పెట్టే అమ్మ అనుక్షణం కావాలి.

అబ్బాయికి కాఫీలో డికాక్షను ఎక్కువగా కావాలి. ఆరోజు తీసినవెన్న, నిమ్మకాయంత, విస్తట్లో వెయ్యాలి. బాగా పండిన అరటిపండు లేనిదే పెరుగూఅన్నం తినడు. పులుసుకన్న అందులో ముక్కలు ఎక్కువ కావాలి వాడికి. తీపికన్న కారం అంటే వాడికి ఎక్కువ యిష్టం. వేపుడుముక్కలు వేడిమీద ఎన్నయినా తినేస్తాడు. బీరకాయగాని కాకరకాయగాని వేలేసి ముట్టుకోడు.

ఇలాంటి విషయాలు, ఇదివరకు చాలాసార్లు చెప్పినవి, ఉత్తరంలో వ్రాస్తూంటే నీకు నవ్వొస్తోందేమో ! ఏంచెయ్యను ? నా మనసు అక్కడే ఉంది. ప్రతీక్షణం 'ఈపాటికి బాబు అక్కడ ఏంచేస్తూఉంటాడో,' అనుకుంటాను. వాడికి 'ఏలోపమూ జరుగదు కదా !' అని కొట్టుకుపోతూఉంటాను.

పసివారి హృదయం అగాధమంటారు. ఒక్కొక్కప్పుడు అబ్బాయి నాకే అర్థం కాడు. ఆ హృదయం ఏమాత్రమూ దెబ్బతినకూడదనే యింతవరకూ నీకు రాశాను. వాడి క్షేమం వీలయినన్ని ఎక్కువసార్లు వ్రాయిస్తూఉండు.

—విజయలక్ష్మి.

'ఎక్కడికో వెళ్ళిపోవడమేమిటి, పిన్ని నా దగ్గిరే ఉంది !' అనుకున్నాడు పిచ్చిబాబు వెలితిగా, నిండుగా...

* * * *

పిన్నిని వీలయినంత తన ఆలోచనల్లోకి రాకుండా చేసుకుని, చదువులోకి దృష్టి మళ్ళిద్దామని పిచ్చిబాబు గట్టిప్రయత్నమే చేశాడు. గెలిచాడని చెప్పలేం గాని పూర్తిగా ఓడిపోయాడనీ అనలేము.

'ఆమాట రాయలేదుగాని – తన పరీక్షలు అయిపోయేనాటికైనా పిన్ని వచ్చేస్తుంది. ఆమెమాత్రం అక్కడ ఎన్నాళ్ళని తనని వదిలి ఉండగలదు గనక ! అంతగా అప్పుడూ రాకపోతే తనే బయల్దేరివెళ్లొచ్చు,' అన్న ఆలోచనతో బాబుకి ధైర్యం చిక్కింది. 'ఏమిటిచెప్మా అక్కడ యీవిడగారు చక్కబెడుతున్న రాచకార్యం ?' అనుకునేవాడు. 'ఇంకేముంది, ఊరూవాడా కోడలికోసం గాలం వేస్తోంది కాబోలు !' అని జవాబు చెప్పుకునేవాడు. 'ఇప్పుడు పెళ్ళి చేసుకుంటానని యిక్కడ సిద్ధంగా కూచున్నవా రెవరుగనక !' అని తాత్కాలికంగా అనుకున్నా, మరొక మధురమైన ఆలోచన అతన్ని అద్యంతం ఆక్రమించి ఉక్కిరిబిక్కిరి చేసేది. పిన్ని సెలక్షనుమీద అతనికి మంచిగురి, గొప్పనమ్మకమూ ఉన్నాయి. తొక్కుడులడ్డూ చెయ్యడంలోనూ, మైసూరుపాకు చెయ్యడంలోనూ అతనికి తెలిసినంతవరకూ ఆమెకు సాటిలేదు. మంచిఅమ్మాయిని ఎన్నిక చెయ్యడంలోకూడా ఆమెను మించిన చెయ్యి ఉంటుందా ?

'బాబూ... ఇవిగో పాలు తాగండి... మళ్ళీ చల్లారిపోతాయి.'

మంచి ఆలోచనల్ని మధ్యలో చెడగొట్టిన రంగమ్మమీద అతనికి ఎక్కడలేని కోపమూ వచ్చేది.

'రంగమ్మా !'

'ఏం బాబూ !'

'ఇవాళతో నీకు ఎంతయిందమ్మా ?'

ఈసారి రంగమ్మ మూతీ ముక్కూ విరవలేదు. అక్కణ్ణుంచి కదలనూలేదు. పైగా చేతులూ కాళ్ళూ తిప్పుకుంటూ మీదమీదకు వచ్చింది.

'చూడు బాబూ! నువ్వూ మీ పిన్నీ రాకముందే నేను యీ యింటికి వచ్చాను. అయ్యగారు పోయాక అమ్మగారు నాతో 'రంగమ్మా! నా కేం తోచక పిచ్చెత్తినట్టు ఉంటోంది. ఇంట్లో కాస్త వంటపనిఅయినా చూసుకోనియ్యకపోతే నాకు పొద్దు పోయేది ఎలాగమ్మా ?' అంటే కొన్నేళ్ళపాటు నేనే పనిలోంచి తప్పుకున్నాను. అయినా ఆ దయగలతల్లి నెలా అయేసరికి నాకు జీతం పంపేసేవారు. ఈమధ్య తను ఊరెడుతున్నానని కబురెడితే నేను వచ్చాను. కాబట్టి... '

'రంగమ్మా!' బాబు మళ్ళీ గట్టిగా అరిచాడు.

'ఏఁబాబూ !'

'నిశ్శబ్దంగా ఉండడానికి నువ్వేం పుచ్చుకుంటావమ్మా; నాగురించి నీకు తెలియదటమ్మా ?'

'అన్నీ భరించి యిక్కడ ఉంటున్నది మరి అందుకే గదటయ్యా !'

ఇద్దరూ కలసి నవ్వుకున్నారు.

పిన్ని రాలేదన్న చేతకాని కోపం నౌఖర్లమీద ప్రదర్శించి కొంతవరకూ తృప్తి పడేవాడు పిచ్చిబాబు.

'బాబుగోరూ! అమ్మగోరు ఉత్తరం ఏశారా ?' అని అడిగేవాడు సముద్రం.

'మన మెందుకు జ్ఞాపకముంటాంరా. ఇంక ఆవిడకీ ? అన్నగార్ని చూడగానే మరి ఈలోకం జ్ఞాపకముండిఉండదు. ఎవ రెలాచస్తే ఆవిడ కెందుకూ ? ఏదో బాగుందదని ఓ ఉత్తరంముక్క రాసిపడేసింది. అంతే. మళ్ళీ ఉలుకూ పలుకూలేదు. పుట్టింటివారిని పట్టుకు వేళ్ళాడి యింక యీలోకాన్నే మరిచిపోయినట్టుంది. కానియ్యి. కమ్మకమ్మని కబుర్లు ఎన్నైనా చెప్పొచ్చు; కడుపులో ఉండొద్దూ ?'

'శా... ఎంతమాట శెలవిచ్చినోరు బాబుగోరు !'

'చాల్లే ఊరుకో.'

'సీమాలచ్చిమిలాటి ఆ దేవ(దేవ(తని. తవ(రా అలా సెప్పడం : గోరం, గోరం !'

'నోరుముయ్యి . నువ్వూ చెప్పడమే ? అంత అపేక్షఉన్న మనిషయితే మూడోనాటికి కొట్టుకురాదూ ? అక్కడే ఏకంగా ఉండిపోమనే రాసేస్తా సంటే: నాకు ఒళ్ళు మండించంటే మరి ఏమనుకున్నావో...'

'బాబ్బాబు.. ఆపనిమాత్రం సెయ్యవాకండి '

'ఏం, ఒక్క మనిషికోసం భూభ్రమణం నిలిచిపోతుందా ? కాలచక్రం ఆగిపోతుందా ?'

తమరలా సెలవిస్తే నానేటి సెప్పగల్ను ఆయమ్మ నేకపోతే మన లోగిలి ఎల ఎల బోతూంటది '

'మన మందరం అలా వెర్రెత్తిపోతున్నాం గనకనేరా ఆవిడంత లోకువ కట్టేసి ఆడిస్తోంది . లేకపోతే వెళ్ళింది వెళ్ళినట్టు ఉండిపోతుందీ ? ఇక్కడ ఎవరేమైపోతారో అన్న ఆలోచన ఉండక్కర్లా ? అయ్యో, పెద్దపరీక్షలు, పిల్లాడికేవేళ కేం కావలసివస్తుందో కొంచెం ఆలోచన '

'సదుకోండి బాబూ నాతో మీకు ఊసు లెందుకు ?' అనేస్తాడు సముద్రం, ఆ ధోరణినుంచి ఎలా విడిపించుకోవాలో అర్థంకాక

మొత్తంమీద పరీక్షలు అయిపోయాయి ఆఖరి పరీక్షనాడు నోటీసు వచ్చింది. ఎం ఎస్సీ వాళ్ళందర్నీ కలవల్లో ఎడ్యుకేషనల్ టూర్ తీసుకువెడతారట పిచ్చిబాబుకి మనసులో పిన్నిని ఓమారు కలుసుకుని చెడామడా తిట్టెయ్యాలని పీకుతున్నా ఆ ముఖ్యమైన విజ్ఞానయాత్ర తప్పించుకోడం కుదరలేదు

పరీక్షలయిన మర్నాడు పొద్దున్న పక్కమీంచి బద్ధకంగా ఒత్తిగిల్లి పిచ్చిబాబు కిటికీ తలుపులు తెరిచాడు

చల్లనిగాలి రివ్వున వచ్చి కితకితలు పెట్టింది కిటికీదగ్గరకి జరిగి అలా పైకి ఆకాశంవైపు చూశాడు ఎంతో ఎత్తున తెల్లని మబ్బు

ఆ గాలిని బంధించలేం

ఆ మబ్బుని అందుకోలేం

కాని వాటివైపు ఆశతో చూడకుండా ఉండలేం

ఆ అందమైన అనుభవం అందుకోకుండా ఉండలేం

'పిన్నీ, నువ్వూ ఇంతేనా ?' అనుకున్నాడు పిచ్చిబాబు కన్నీళ్ళతో శాలువ పైకి లాగేసుకుని కప్పుకున్నాడు

ఆ శాలువ అతనికి చాలలేదు నిజానికి ఆ మంచమే అతనికి చాలలేదు

'నాకింకా పొడుగుపాటి మంచం కావాలి పిన్నీ, చూశావా పాదాలు ఎలా పైకి వచ్చేశాయో .'

'అబ్బబ్బ . . ఎక్కడికేనా పారిపోవాల్రా నాయనా ... రోజురోజుకీ ఎదిగిపోతూంటే ఎంతకని చావను, ఎన్ని మంచాలని మార్చను !'

'లేకపోతే నీలా అందరూ వేబోరుశెనక్కాయలా ఉండిపోతారుకాలు!'

'రోజా కోలాంటి పేరు పెడుతున్నావు కదూ' నీతో మాటాడతానేమో చూసుకో!'

'అందుకు కాదు పిన్నీ! నీ పలుకులు ఎంతో రుచి''

'ఎక్కడ నేర్చేవయ్యా ఇంత మాటకారితనం?'

'సిసింద్రీ అని మా గురువుగారు ఒకావిడ ఉందిలే'

'బాగుందిగాని . ఇవాళ నువ్వింక పక్కమీంచి లేవడం అంటూ ఉండదా ఏమిటి? టైమెంతయిందో తెలుసా?'

'టైముకూ నాకూ పనేముంది? ఇరవైనాలుగుగంటలూ తిరగడమేగా!'

'లేవయ్యా మహానుభావా, ఆజానుబాహూ.. అప్పుడే పావుతక్కువ ఏడయింది వెంకటేశ్వర సుప్రభాతం వినపడ్డంలేదూ?'

'అవును పిన్నీ, అది వినే అంత ధీమాగా పడుకున్నాను.'

'అదేమిటి?'

'మరి పావుతక్కువఏడుకి భగవంతుడికి మేలుకొలుపు పాడ్డంలో అర్థమేమిటి? అలా పాడగాపాడగా ఏ ఏడున్నరకో ఆ ఏడుకొండలవాడు ఒళ్ళు విరుచుకుని, రెప్పలు అతిబలవంతంమీద విప్పుతాడన్నమాట అన్నీ తెలిసిన భగవంతుడే అంత ఆలశ్యంగా లేస్తే మాలాంటి పామరులు కనీసం తొమ్మిదింటికైనా లేవొచ్చునని అందులో తాత్పర్యం, తెలిసిందా'' పిన్ని ఎంతో సొంపుగా నవ్వుతుంది

'భలేగా తయారయ్యావ్‌రా బాబూ! మాట తిప్పికొట్టడం మా బాగా నేర్చావ్!'

'నీ పెంపకం ప్రభావం పిన్నీ! తెలియడంలేదూ?'

'అయితే ఇప్పట్లో నువ్వు లేవవందూ!'

'మన సుప్రభాతం నువ్వు పాడవందూ!'

'ఏం చంపుతావురా నన్నూ, నా కపతల పోట్లుపను ఉన్నాయ్‌రా బాబూ!'

'పన్లుంటే వెంటనే వెళ్ళవమ్మా – అక్కడికి ఇవతలివాళ్ళకే ఏపనీ లేనట్టు!'

'నీకా!'

---



'లేకపోతే నీకా! నాకెంత ముఖ్యమైనపను లున్నాయని! దుప్పటి నిండుగా కప్పుకుని పడుకోవాలి, గుర్రుపెట్టాలి, కలలు గనాలి' ఎంత కష్టం!!'

'ఎంత అవస్థ! నెలలు నిండిపోయాయికాబోలు మరి.. '' నవ్వాపుకుంటూ పిన్ని వెళ్ళిపోబోతుంది

'ఏమమ్మోయ్, రాడం వెళ్ళిపోడం అంతా నీ యిష్టమేకాబోలు! అదేం కుదర్దు ఎలాగా నిద్రాభంగం చెయ్యనేచేశావ్ పూర్తిగా లేవదీసి వెళ్ళవలసిందే''

'క్రేనులూ, కప్పీలూ తెప్పించనా?'

'యంత్రాలతో లేచే ఘటంటమ్మా ఇదీ? చిచ్చికొట్టినా లేవదీసినా తల్లులకే చెల్లింది 'పిచ్చేశ్వర సుప్రభాతం' నాలుగు చరణాలయినా పాడందేగాని నీకిరచరణాలు ఆడనివ్వను'

ఎన్నోసార్లు పాడిందే మళ్ళీ మొదలెడుతుంది సన్నగా, చక్కగా...'కమలా కుచ చూచుక కుంకుమతో' వరసలో

మరచెంబుడు కాఫీ తాగెదవో
ఒకపాతిక ఇడ్లీ లాగెదవో
ఫలహారమె బ్రతుకుకు ఫలముగదే
కవిభీముడ వేగమె కను విడవే!'

గతస్మృతులు కలవరపెట్టగా పిచ్చిబాబు లేచి రేడియో ఆఫ్ చేసేశాడు పక్కమీదకి మళ్ళీ చేరి ఏవేవో గుర్తుచేసుకోడానికి ప్రయత్నించాడు పరీక్షపిశాచి పరిపాలనకు తాత్కాలికంగా స్వస్తి జరిగింది కనక, అతని మనసును యిప్పుడు పూర్తిగా పిన్నే ఆక్రమించుకుంటుంది. రఘుపతితో ఒకసారి వాళ్ళు తిరపతి వెళ్ళినపుడు పిన్ని చేసిన వ్యాఖ్య ఎంత చిత్రమైనదనీ!

ఓసారి పిచ్చిబాబూ, పిన్నీ, రఘుపతీ తిరపతికి వెళ్ళేరు అక్కడ ఓనాడు సినిమా కెళ్ళేరు

సినిమానుంచి తిరిగి వచ్చేస్తుండే పిన్ని నాన్నతో చేసిన రిమార్కు పిచ్చిబాబులోని 'సెన్స్ ఆఫ్ హ్యూమర్'ని లెపి కూచోబెట్టింది

'పాపం అనుకుంటాం గాని దేవుడికికూడా ఎన్నెన్నికష్టాలు!

'అదేవిటి?' అన్నాడు రఘుపతి తెల్లబోయి.

'తిరపతి వెంకటేశ్వరస్వామి సంగతండీ!'

'ఏమిటీ?'

'ఆ ఏడుకొండలవాడికి సినిమా చూడాలని బుద్ధి పుట్టిందనుకోండి !' రఘుపతి పిన్నివైపు కోపంగా చూశాడు

'అపచారం అపచారం. లెంపలేసుకో కళ్ళు పోగలవు

పిన్ని నవ్వింది తను చెప్పేదేదో మానలేదు

'మరేం ఫరవాలేదు భగవంతుడు హాస్యప్రియుడు.'

'అయితే ?'

'అందరిలాగా ఉడుక్కుంటే ఆయన్ని దేవు డెందుకంటారు ! సరే వినండి వెంకటేశ్వరు డంతటివాడికి సినిమా చూడాలని కోరి కేమిటంటారేమో ... ఆయన మాత్రం ఒకప్పుడు మనిషిజన్మ ఎత్తలేదా, గతజన్మ వాసనలు ఉండవా ? అదీగాక తనగురించి తీసిన సినిమా 'శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం' అయినా చూసుకోవాలని ఆయని కుండదా ? మళ్ళీ నలుగురూ చూస్తే ఏమనుకుంటారో అని అంతో ఇంతో ఓఘాయిత్యమూ అందుకని ఓ రాత్రివేళ పాపం, ఆ తిరుమలనుంచి ఏడుకొండలూ దిగిరావాలి కొండకింద గుడి కట్టించినా, కొండమీద సినిమాహాలు కట్టించినా యింత యిబ్బంది ఉండేది కాదుకదా !'

పిచ్చిబాబు పకపక నవ్వేశాడు, రఘుపతి కేకవేశాడు 'చాలు నీధోరణి ఈపాటికి ఆపు లక్ష్మి !'

'ఎలా ఆపను ? అసలు కథంతా ముందే ఉంటే !'

'ఇంకా ఉందా ? తొందరగా చెప్పు పిన్నీ !'

'వెంకటేశ్వరస్వామి పద్మావతిని తీసుకుని సినిమాకి వెడదామంటే తిరుచానూరు వెళ్ళిరావాలి పోనీ ఒక్కడే వెళ్ళొద్దామంటే అదేవి కసలే ముక్కుమీద కోపం పుట్టింటినుంచి సారెతోపాటు కరివేపాకు తేలేదని భర్త అన్నంతమాత్రాన అలిగి, మరోఊళ్ళో వేరింటికాపురం వెలిగించిన అభిమానవతి ఆమె అన్నిమైళ్ళూ వెళ్ళి ఆవిడను మంచిమాటలాడి తీసుకువచ్చి, సినిమాకు వెళ్ళి, మళ్ళీ ఆవిడను దిగబెట్టి, ఏడుకొండలూ ఎక్కి, సుప్రభాతంవేళకి అందుకోవాలంటే – అయ్యో ఆపద మొక్కులవాడా ! నీ కెంతటి ఆపద వచ్చిపడిందయ్యా !'

* * * *

'పరీక్షబడలిక తీరలేదాఏమిటి బాబూ ! నిద్రలేచికూడా యింకా ఎంతసేపని అలా ఆలోచిస్తూ పడుకుంటావ్ ?' రంగమ్మ కేకతో పిచ్చిబాబు ఉలిక్కిపడి లేచి కూచున్నాడు

'ఓసారి నవ్వుతున్నావ్, ఓసారి ఏడుస్తున్నావ్ నీ కేం వెర్రెత్తలేదు గదా

బాబూ.. ! మధ్యని నన్నిక్కడ యిరికించివెళ్ళింది ఆ అమ్మ ఎప్పు డొస్తుందో ఏమిటో, మాయగోల !'

పిచ్చిబాలు ఏదో నిశ్చయానికి వచ్చినట్టు ఒక్కసారి దుప్పటీ తన్నేసి లేచి కూచున్నాడు అయిదునిమిషాల్లో ఆదరా బాదరా కాలకృత్యాలు ముగించివేశాడు

'రంగమ్మా !'

'ఏం బాబూ ?'

'ఇవాళతో నీ కెంతయిందమ్మా అని అడగడానికి నిన్ను పిలవలేదులే ఈ క్షణానికి ఎంత వంటయితే అంతా పెట్టెయ్ నేను అర్జంటుగా భువనేశ్వరం వెళ్ళి రావాలి '

'ఇప్పుడు అర్జంటుగా రైలు ఉండొద్దా బాబూ !'

'రైలు ఉండకపోవచ్చును గాని రైలురోడ్డు ఎప్పుడూ ఉంటుందిగదా దాన్ని అనుసరించైనా పోతాను '

'దేనికైనా నువ్వు సిద్ధమే అని నాకు తెలుసుగాని, ఇవాళరాత్రి ఎక్స్‌ప్రెస్‌లో మీ రందరూ మైసూరు వెడుతున్నారేమో !'

పిచ్చిబాబు మొహం అంతలో ముడుచుకుపోయి అంతలో విప్పారింది

'ఇప్పుడు బయల్దేరితే రాత్రికి కొట్టుకురాలేనుటమ్మా ?'

'ఏమోబాబూ .. నిన్నటిదాకా తెగచదివి అలసిపోయావు నువ్వు తిరిగి వచ్చే నాటికి మీ పిన్నమ్మ తిరిగి ఎలాగా వస్తుంది ఈలోగా ఎందు కంత కంగారో నా కర్థంకాదు తీరా నువ్వు రాత్రికి వచ్చి ఎక్స్‌ప్రెస్ అందుకోలేకపోతే ఏమవు తుందో ఆలోచించు '

'ఏమవుతుంది ? తలకొట్టి మొలేస్తారాఏమిటి ? అంతగా అందకపోతే తిన్నగా మైసూరు వెళ్ళి మా పార్టీని కలుస్తాను మా పిన్నిని ఒకసారి చూసి మాటాడివస్తే గాని నా కేం తోచడంలేదమ్మా!'

రంగమ్మ బుగ్గలు నొక్కుకుంది 'అదేమిటయ్యా... రేప్పొద్దుట ఎక్కడికేనా వెళ్ళి చదువుకోవలసిఉంటుంది పైఊళ్ళో ఉద్యోగం అవొచ్చు. అంతగా పిన్నిని వదిలిఉండలేకపోతే ముందుముందు యివన్నీ ఎలా జరుగుతాయయ్యా ! అదిగాక ను వ్వేం పసిపాపవి కాదు– అమ్మా! అమ్మా! అని తల్లి కొంగట్టుకు తిరగడానికి. చదువుకుంటున్నావు, పెద్దవాడ వయ్యావు.. పెళ్ళీడు వచ్చింది...'

'రంగమ్మా!' పిచ్చిబాబు గావుకేక వేశాడు

'ఏం బాబూ ?'



"ఆగండయ్యా ఆగండి! కొంచెం చలి కాచుకోనివ్వండి"

'నిశ్శబ్దంగా ఉండడానికి నువేం పుచ్చుకుంటావమ్మా?'

'ఏమోబాబూ నాకేం. అర్ధమయిచావదు ఈ చిత్రమైన తల్లీ కొడుకుల అనుబంధం!' అంటూ రంగమ్మ లోపలికి పోయింది పిచ్చిబాబు తొందరతొందరగా లేచిపోయి మొహం కడిగేసుకుని, కాఫీ తాగేసి, ఒకజత బట్టలు సంచీలో కుక్కుతూండగా 'పోస్టు' అని కేక వినిపించింది కవరుమీద దస్తూరీ చూడగానే అతను పొందిన ఆనందం లోపలిభోగట్టా చదివినప్పుడు నిలబడలేదు పిన్ని పూరీయాత్ర చేసుకుని మరోనెల తరువాతగాని రాదట। చేతిలోఉన్న బట్టలసంచీ ఒకపక్కకి విసిరేసి వెంటనే జవాబు రాసిపడేశాడు

'పిన్నీ, అంతదూరమూ వెళ్ళేక ఒక్క పూరీతో సరిపెట్టుకోవలసిన అవసరం ఏముందీ? పుణ్యతీర్ధాలూ, విహార యాత్రాస్థలాలూ దేశంలో ఎన్నిలేవు? కోణార్క ఉంది. సాక్షిగోపాల్ ఉంది. ఉదయగిరీ, ఖండగిరీ ఉన్నాయి. తప్తపాణీ ఉంది. గోపాల్‌పూర్ ఉంది ఇవి నువ్వు ఉన్నఊరికి చుట్టుపక్కలవి మాత్రమే వెళ్ళిన కొద్దీ మన భారతావనికి విస్తృతంలో ఏం లోపంగనక। నువ్వు సర్వస్వతంత్రురాలివి ఒక్క నెలే ఏం? నీ యిష్టమొచ్చినన్నాళ్ళు యిష్టమైన ఊళ్ళన్నీ తిరిగిరా.

—పిచ్చిబాబు.'

ఉత్తరం పడేసివచ్చి బాబు మళ్ళీ ముసుగుతన్ని పడుకున్నాడు – 'నా కివాళ ఒంట్లో ఏం బాగులేదు రంగమ్మా ! నువ్వు తినేశెయ్,' అంటూ.

*　　*　　*　　*

పిచ్చిబాబును కన్నతల్లి శాంతమ్మకు పినతల్లికూతురు పంకజం అని ఒకావిడ ఉన్నదట – వాడు కొంచెం పెద్దవాడై ఆస్తీ ఆదరణా సంపాదించాడని తెలిశాక ఈ విషయం బయటపడింది అతనికి విజయవాడలో ఏదో దినపత్రిక కార్యాలయంలో పనిట ఎన్నోసార్లు రమ్మని రాసినా పిచ్చిబాబు అటువైపు వెళ్ళడం జరగలేదు ఈసారి ఎలాగా దారేకదా అని టూర్‌నుంచి తిరిగొస్తూ పిచ్చిబాబు వాళ్ళింట్లో రెండ్రోజులపాటు దిగేడు

'ఇంతలా పోలిక పట్టకుండా ఎప్పుడు ఎదిగిపోయావురా ?' అంది పంకజం.

'ఇంత పెద్దచదువులో ఎలా ప్రవేశించగలిగావురా ?' అన్నాడు ఆమెభర్త.

'ఇంత మంచిబట్టలు ఎక్కడ కుట్టించావురా !' అన్నాడు ఆమె కొడుకు

పెద్దగా ఆహ్వానించారు బ్రహ్మాండంగా ఆదరించారు. అన్నం వడ్డిస్తూ, తింటూంటే విసనకర్రతో విసురుతూ, దగ్గర చేరి పంకజం బాబుని మెల్లిగా కదిపింది

'ఒరే, మీ సవితల్లి నిన్ను సరిగా చూస్తోందిట్రా ?'

ఒక్క క్షణం పిచ్చిబాబు నుదుటిమీద ముడతలు పడ్డాయి అంతలో సర్దుకుని లేనినవ్వును తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ – 'ఏమో ! నువ్వు నీ పిల్లల్ని చూస్తునట్టు మాత్రం చూడ్డంలేదు !' అన్నాడు

'అదీ... అలా చెప్పు.. ' అనేసి మళ్ళీ ఆ మాటలో ఏదో పెదర్ధం తోచి, అంటే ఏమి టన్ని ఉద్దేశం ?' అని అడిగింది

'నువ్వు ప్రశ్న అడిగావు, నేను జవాబు చెప్పేను మళ్ళీ దానికి వివరణకూడా దేనికి చిన్నమ్మా !'

సమయానికి ఆమె భర్త వచ్చి ఆదుకున్నాడు 'నీ తెలివితేటలన్నీ వెర్రిది – ఆవిడదగ్గర చూపిస్తా వెందుకురా ? నీ క్షేమం కోరింది కాబట్టి అడిగింది, చెప్పాలను కుంటే చెప్పు... డొంకతిరుగుడు జవాబులు దేనికీ ?

'నేను చెప్పినదాంట్లో మడతమాట ఏంలేదు బాబాయ్ ! నాకు తెలిసినంతవరకూ ఏ తల్లీ ఏ బిడ్డనూ అంత ప్రేమగా చూడ్డం నేను చూళ్ళేదు. పిన్ని మనిషికాదు, దేవత ! మా అమ్మ ఉన్నా ఇంతకన్న ఎక్కువ చెయ్యగలదని నా కేం నమ్మకం లేదు...'

పంకజం ఏదో మాట్లాడబోయింది కాని అది సమయం కాదని భర్త చేసిన సూచన గ్రహించి ఆమె అప్పటికి ఊరుకుంది

రాత్రి డాబామీద వాడు పడుకున్నప్పుడు, తమలపాకులు సున్నం రాసి ఒకటీ ఒకటీ అందిస్తూ మళ్ళీ కదిపిచూపింది 'ఒరే, ప్రస్తుతం నీ ఆస్తి ఏమాత్రం ఉందంటావ్?'

పిచ్చిబాబు అట్నించి ఇటు తిరిగి ఆమెవైపు తీక్షణంగా చూశాడు. ఆ చూపుకి తట్టుకోలేక ఆమె మొహం తిప్పుకుంది 'మీ రెవ్వరూ ఊహించనైనా లేనంత ఆస్తి మాపిన్ని నాకు యిచ్చింది చిన్నమ్మా!'

'మీ సవిత్తల్లి నీ కేమిచ్చిందో లేదోగాని చమత్కారంగా మాట్లాడ్డం మాత్రం నేర్పినట్టుంది!' అంది పంకజం

'సరిగ్గా గ్రహించావు చిన్నమ్మా!' అన్నాడు పిచ్చిబాబు. ఆమె ఇంకేం జవాబు చెప్పగలదు!

అయినా పంకజం కార్యవాది. ఆవిడ అడిగిన విషయానికి జవాబులు వాడి మొహం చూసే గ్రహించవచ్చు. అన్నింటికన్న ముఖ్యమైన విషయ మేమిటో ఆవిడ ఆ మర్నాడు పొద్దున్న బయటపెట్టింది

'ఒరే, మా తమ్ముడికూతురు గుంటూర్లో పియ్యూసీ చదువుతోంది. నీకు సరిగ్గా ఈడూ జోడూను వైర్ చేస్తే మధ్యాన్నానికల్లా పిల్లని యిక్కడికి తీసుకొస్తారు. నీకు నచ్చితేనే చేసుకోవచ్చు పిల్లని చూడ్డాని కేం అభ్యంతరం లేదుగా? అయినా ఒకసారి చూసినతర్వాత ఆపిల్లనుంచి దృష్టి మరలించుకోడం కష్టం. నువ్వే చూస్తావుగా, చూపులగుర్రం—ఏమంటావ్? అబ్బాయిని పంపి వైర్ చేయించనా?'

'నాకు కాదుగాని మరొకరికి కబురు చెయ్యవలసిఉంటుంది చిన్నమ్మా!'

'ఎవరికి, మీ పిన్నికా?'

'కాదు'

'మరి?'

'జట్కావాడికి!'

'అదేమిటి, మధ్య వాడి కెందుకూ?'

'గుర్రం అవసరం వాడికికాక మరెవరికీ?'

పిచ్చిబాబు పకపక నవ్వేశాడు వాడితోపాటు తన కొడుకుకూడా నవ్వడం భరించలేక పంకజం వాణ్ణి రెండు బాదింది

'మధ్యని నిరపరాధి వాణ్ణి దండిస్తా వెందుకు చిన్నమ్మా? నీకు కోపం తెప్పించింది నేనుగదా, నన్నే రెండువెయ్యి. ఆమాత్రం చనువూ స్వతంత్రమూ నామీద నీకు లేవా?'

'బాగుంది నాయనా! ఆ స్త్రీపరురాలైన పిన్ని నీకుంది. పైగా ఆవిడకి మందు పెట్టడం, మంత్రం వెయ్యడం యిలాంటివికూడా తెలుసులాగుంది. నిన్ను పూర్తిగా వశపరచుకుంది నీ మంచికోరి నీకు కావలసినవాళ్ళం మేం ఇప్పుడు ఏం చెబితే నీ తల కెక్కుతుంది! గొడ్డుదానికి బిడ్డల తీపి తెలియడం నీదగ్గిరే విన్నాను.'

'మా పిన్నిని చూస్తే నువ్విలా అనవు చిన్నమ్మా!'

'ప్రతీదీ దగ్గిరకి వెళ్ళి చూడాలా ఏంరా, వింటే తెలీదూ? ఏడేళ్లు వెళ్ళని నిన్ను బొయిగూర్లో హాస్టల్లో పెట్టించింది ఎవ రెరగని భాగవతం!'

'ఆ దెప్పుడో చాలా రోజులకిందటిసంగతి చిన్నమ్మా!...అప్పు డామెకుకూడా చిన్నతనం '

'ఓయబ్బో . నాకూ చిన్నతనమే.. మనకు యిష్టమైందని కప్పెట్టుకుంటే సరీ...పోనీ నెలాపదిహేనురోజులై పుట్టింట్లో కూచుందని నువ్వే చెబుతున్నావ్ కదా...నీకు పరీక్షరోజులుకదా – సరిగ్గా సమయానికి ప్రేమ కారిపోబట్టేనాఏమిటి, ఇలా దగాచేసింది!'

పిచ్చిబాబు రక్తం ఉడుకెత్తింది, ఉరకలెత్తింది

'చిన్నమ్మా! మా పిన్నిని ఒక్కమాట అన్నావంటే ఇంక ఊరుకునేదిలేదు. తెలుసా? ఇలాఅయితే నేనిక్కడ దిగకనేపోదును '

పంకజం అయిదు నిముషాలాగి మళ్ళీ నెమ్మదిగా తన ధోరణి కొనసాగించింది 'ఒరే...ఎల్లకాలం నువ్వు చిన్నపిల్లాడివి కావు మంచీచెడ్డా ఆలోచించుకునే వయసు నీకూ వచ్చింది. ఇంటికి వెళ్ళి స్థిమితపడ్డాక మీ చిన్నమ్మ చెప్పిన మాటల్లో అర్థమేమిటో నువ్వే ఆలోచించుకో నువ్వెలా ఉన్నావో ఓమారు కళ్ళతో చూసి ఆనందిద్దామని నిన్ను రమ్మని నీకన్నిసార్లు రాశాంగాని నీనుంచి ఏమీ ఆశిందికాదు. మీ అమ్మ పోయాక అసలు నేనే నిన్ను తెచ్చుకుని పెంచుకుందా మనుకున్నాను అయితే దురదృష్టవశాత్తూ ఆ రోజుల్లోనే నాకూ చచ్చినంత జబ్బు చేసింది సరే ఇప్పు డవన్నీ ఎందుకుగాని – నీకు నీ చిన్నమ్మదగ్గిరకి రావాలనివుంటేనే రా, బలవంత మేమీలేదు. కాని ఆ గడియ ఆట్టే దూరంలో లేదని నా నమ్మకం లేకపోతే ఒక్కసారి వాళ్ళన్నయ్యనూ పిల్లలనూ చూసివస్తానని బయల్దేరిన మనిషి నెలల తరబడి ఉండిపోతుందా? అక్కడేదో గూడుపురాణీ జరుగుతోందని నా నమ్మకం నీ వెర్రిగాని తోడపుట్టిన అన్న మాట నమ్ముతుందా. సవితికొడుకువైపు మొగ్గుతుందా? తెచ్చిపెట్టుకున్నవీ, పెంచుకున్నవీ – యిలాంటి అభిమానాలు నిలబడవు నాయనా! ఎంతయినా రక్తసంబంధం రక్తసంబంధమే...నువ్వే ఆలోచించు.



ఒకవేళ మీ పిన్నికి అంతో యింతో నీమీద పెంచిన ప్రేమ ఉన్నా, వాళ్లవాళ్లు పడకపోనియ్యవచ్చు ఇందాక మాటలసందడిలో నీకు సంబంధాలకోసం ఆవిడ వెళ్ళి ఉండొచ్చునని మీ బాబాయితో నువ్వు అంటూంటే విన్నాను. అప్పుడే నా గుండెల్లో రాయి పడింది వాళ్ళ పుట్టింటివారివైపు సంబంధం ఏదో ఒకటి మీ పిన్ని రైటు చేసుకురాకపోతే నన్ను మారుపేరు పెట్టి పిలు ఇలాంటి లోపాయికారీ లాలూచీలు కుర్రవాడివి నీ కేం తెలుస్తాయ్ ?'

'అబ్బ...ఊరుకో చిన్నమ్మా ..'

'నే నెలాగా ఊరుకుంటాను మొగాడివైతే నువ్వే ఊరుకోకు మీ నాన్న కష్టపడి వృద్ధిచేసిన ఆస్తి అనామకుల చేతికి అంకనియ్యకు.'

'చిన్నమ్మా...ఇవన్నీ నీ ఊహాగానాలు. నేను ఇంటికి వెళ్ళేసరికి కలిగిన ఎడబాటంతా క్షణంలో ఎగిరిపోయేలా నన్ను చిరునవ్వుతో, నిండుగుండెతో, రెండు చేతుల్తో ఆహ్వానించడానికి మా పిన్ని ఎదురుచూస్తూంటుంది, తెలుసా !'...

పిచ్చిబాబుదే పొరపాటు ఇంటికి వచ్చేసరికి పిన్ని యింకా రాలేదు ఎప్పుడొస్తుందో ఉత్తరమూ లేదు!

'రంగమ్మా! పిచ్చిబాబు చచ్చాడని పిన్నికి వెంటనే టెలిగ్రాం యియ్యి' అన్నాడు ఆవేశంగా. మరొక అయిదునిమిషాలేనా కానిదే 'రంగమ్మా! కొంపతీసి నేను యిందాక చెప్పిన టెలిగ్రాం యిప్పించలేదుగద! మా పిన్ని భరించలేదు సుమీ!' అన్నాడు

## 16

"ఆ మూడోనాడు పిచ్చిబాబుకి పిన్నిదగ్గర్నుంచి పెద్ద పొడుగుపాటి కవరొకటి వచ్చింది అది చించేదాకా ఉత్తరమని అతను అనుకోలేదు ఇరవై అరఠావుల ఉత్తరం అది!"

"ఇరవై పేజీలే, ఏముంది అందులో?" అన్నాడు విజయకుమార్ ఆశ్చర్యంతో

అంతవరకూ ఏభావమూ పైకి కనబడనీయని శ్రీకృష్ణమూర్తి మొహంలో ఒక్కసారి విచారం పెల్లుబికినట్లు బయటపడిపోయింది

"ఏం, ఆమె కక్కడ ఏమయింది? ఏమైనా పెద్దజబ్బు చేసిందా?" శ్రీకృష్ణ మూర్తి అయిదునిమషాలదాకా మాటాడలేకపోయాడు

"ఈ ఉత్తరం పూర్తి అవడంతో ఈ కథకూడా పూర్తవుతుంది. దయచేసి అంతవరకూ.. "

" . నే నేం అడగనులెండి. వెంటనే చెప్పండి," అన్నాడు డాక్టరు విజయకుమార్ నవ్వుతూ

*　　*　　*　　*

పిచ్చిబాబు ఆతృతతో ఉత్తరాన్ని చదవసాగేడు.

'నా పిచ్చితండ్రీ,

అనుక్షణం ఆనందంగా బతకమని ఆశీర్వదించేదాన్ని, నేను, నీ కివాళ యిలాంటి ఉత్తరం రాయవలసివస్తుందని కలలోకూడా అనుకోలేదురా నాయనా! కాని ఏం చెయ్యను? నీపిన్ని దురదృష్టవంతురాలు! అదిగాక యీ సంగతులన్నీ నీముందు ఉంచవలసిన సమయం ఇదే అని కూడా నా కనిపిస్తోంది. ఇప్పు డివి చెప్పకపోతే మరెప్పుడూ చెప్పలేను.

నీ పుట్టె విచ్చుత్తి కాకముందే
నీ బుర్ర పిచ్చెత్తి పోకముందే,
నీ ఆత్మ కింపైన ఒకవ్యక్తితో
నీ మంచి నీ చెడ్డ వివరించుకో.'



అనే ఆలోచన నాలో క్షణక్షణం బలీయమైపోతున్నది ఇక ఆగలేను, ఇక దాచలేను. నువ్వుతప్ప నా కెవరూలేరు. ఇది చదివి ను వ్వెంత బాధపడతావో, ఈ ఉత్తరంలోని సంగతులు విని పాపపుణ్యాల క్రీనీడల నెరగని నీమనసు ఎంతగా దెబ్బతింటుందో సూచనగా ఊహిస్తూ నన్ను నేనే శపించుకుంటున్నాను. ఏంచెయ్యను? స్వార్ధానికీ త్యాగానికీ తేడా తెలియని అజ్ఞానురాల్ని నామీద నీకున్న పవిత్రభావా న్నంతటినీ పోగుచేసి నన్ను మన్నించగలవని నమ్మక ముంటేనే ఇందులోని ముందుసంగతులు చదువు'

పిచ్చిబాబు చేతుల్లో పేజీలు జారిపోయాయి తడారిపోతున్న గొంతుకలో నీళ్ళు పోసుకున్నాడు. నుదుటను పట్టిన చెమటబిందువులు తుడుచుకున్నాడు టేబిల్‌ఫాన్ ఫుల్ స్పీడ్‌లో పెట్టేడు కింటనున్న కాగితాలు ఆత్రంగా తీశాడు

'ఉత్సాహమూ, ఉద్రేకమూ క్షణికమై, చపలమై, ఎటు గాలి వీస్తే అటు డ్యాన్సు చేస్తూ, ఎక్కడో పుట్టి ఎక్కడో మాయమైపోయే సాగరతరంగాలు సాధారణ

మానవజీవితాలు తీరని రాగద్వేషాలూ లేవు; తీవ్రమైన ఫలితాలూ ఉండవు. సంచలనం తక్కువ కనుక సంఘర్షణా అంతంతమాత్రమే.

సామాన్యమైన భావాలూ, సనాతన విశ్వాసాలూ, సాంఘిక నియమాలూ సాధారణ జీవనత్రిభుజికి మూడుభుజాలు – ఇవి దాటలేరు వీళ్ళు; దాటాలని ఉండదు కూడా. అందులో మనవాళ్ళు ముఖ్యంగా – స్వయం నిర్మితమైన ఇటువంటి సంకుచిత స్థలంలో నివసిస్తున్నారు '

పిచ్చిబాబు 'అబ్బబ్బ, ఏమిటీ బోరు !' అంటూ ఉత్తరం చదవడం ఆపుచేశాడు. ప్రతినిమిషం నవ్వుతూ నవ్విస్తూండే పిన్నినే అతను ఎరుగును అలాంటి పిన్ని కోసం ఎదురుచూడ్డమే అతనికి తెలుసును 'ఏమిటీ గోల ? ఇన్నాళ్ళయాక యింత సీరియస్‌గా ఉత్తరం రాయడంలో ఆమె అంతర్యంఏమిటి ? ఇక రాదల్చుకోలేదా ఏమిటి ?' అనుకుంటూ మళ్ళీ చేతిలోకి ఉత్తరం తీసుకుని చదవడం ప్రారంభించాడు

'ఏటికి ఎదురీది, జీవితంలో ఓడిపోయినవాళ్ళకి నలుగురూ నడిచిన యీదారే మంచిదేమో ! అని ఒక్కొక్కప్పుడు అనిపిస్తూఉంటుంది

కాని అభావం తాత్కాలికం మాత్రమే

పెర్సనాలిటీ, ఒరిజినాలిటీ ఏమాత్రం ఉన్నా యివి అంగీకరింపరేమో అనిపిస్తూ ఉంటుంది

ఇంతకీ నా దేమంత ప్రత్యేకమైన, అసాధారణమైన కోరికకాదు నారక్త మాంసాలు పంచుకుని పుట్టిన బిడ్డ ఒకడు కావాలని నేను కోరుకోవడం, స్త్రీగా నా జన్మకి స్వభావసిద్ధమైనదీ, సార్ధకమైనదీ – అయితే యిక్కడ నా ప్రత్యేకతను వివరిస్తాను

సృష్ట్యాదినుంచీ వస్తున్న, సకలజీవులకూ సహజమైన – పిల్లల్ని కనడం అనే విషయాన్ని మధురమైన మాతృత్వమనే పేరుతో పరమపవిత్రమైన బాధ్యతగా మనవాళ్ళు కీర్తించారు పదినెలలూ మోస్తుందనీ, ప్రసవించి రెండవజన్మ ఎత్తుతుందనీ, పాలిచ్చి పెంచుతుందనీ, పిల్లల అభివృద్ధికోసం ఎంతటి స్వార్ధత్యాగానికైనా వెనుదీయదనీ ప్రస్తుతించి, ప్రధమస్థాన మిచ్చి, తల్లిని గౌరవించారు. ఎక్కడ ? తాటాకులలో, తాటాకుల ఇళ్ళలోమాత్రం కాదు ! తల్లి హృదయం తల్లడిల్లచేసే తాటాకులమంటను ఆర్పడానికిమాత్రం కాదు ! పదిమందీ చూస్తూండగా ఆడదాన్ని భర్త బహిరంగంగా చావగొట్టినా అడిగేవాడు లేడు, కళ్ళు కనిపించని తల్లిని వీధిలోకి ఈడ్చి తలుపేసుకున్నా కొడుక్కి బుద్ధిచెప్పేవాడు లేడు సురా

పానమే సుఖసారమనీ, వ్యభిచారమే పురుషార్ధమనీ పబ్లిక్‌గా చాటుతూన్న మగ మహారాజును కాదనే మహనీయుడు లేడు! ఇదెప్పుడు? తాతలనాటి తాటాకుల యిళ్ళనాడు కాదు. ఈ నాటి ప్లాస్టిక్ గోడల పరమాణుయుగంలో!

పైవారు యిచ్చే గౌరవమర్యాదలు అలాఉంచు – నాటికీ నేటికీ తల్లు లేమైనా తమ స్త్రీమతను పెంచుకున్నారా? నగలమీద, చీరెలమీద ఏ మాత్రమైనా మోజు తగ్గించి విద్యావిజ్ఞానాలు పెంపొందించుకున్నారా? సంఘం తమకు అంటగట్టిన పరమ పవిత్రమైన మాతృశబ్దానికి అనుగుణంగా తమ ప్రవర్తన రూపొందించుకున్నారా? ప్రత్యామ్నాయంగా పిల్లలు తమ కిచ్చే సుఖంకోసం ఆశించకుండా నిస్స్వార్థంగా పిల్లల్ని పెంచే తల్లు లున్నారా? అంగవిహీనులూ, అనాకారులూ అయిన పిల్లలు పుడితే ఆమాట మనసులోకూడా అనుకోనంత పవిత్రతతో వాళ్ళని సాకే తల్లు లున్నారా? పుట్టిన పిల్లలు ఎదుగుతున్నప్పుడు, వాళ్ళ వయసుతోపాటు తమ అభి మానంకూడా పెంచుకుని, వాళ్లకు పెళ్లయి వాళ్లమటుకు వాళ్లు కులాసాగా ఉంటే చూసి మనసా సంతోషించగల మహిళామతల్లు లున్నారా?

ఆడదేనా ఈ ప్రశ్నలు వేస్తోంది? అని నువ్వు అడగొచ్చు అవును నేనే ఏ అనుభవమూ లేని మా పిన్నేనా యిన్ని అడుగుతోంది? అని నువ్వు అనుకోవచ్చు. నేనేరా బాబూ! నేనే. ప్రత్యేకత ఉన్న ఏ బ్రతుకయినా ప్రశ్నల మయం తరచిన కొద్దీ, చదివినకొద్దీ సమస్యలమయం ఇందులో నువ్వు గుర్తించవలసింది ఒక్కటే. నేను పదేపదే చదువుకున్న పుస్తకాల సారమే నన్ను యివి అడిగించింది నేను అడిగి నవి ప్రశ్నలుమాత్రమే అవును, కాదు అని నేను జవాబులుమాత్రం చెప్పలేదుసుమీ!

తల్లిపడే తపన నీ కేం తెలుసు? – అని నీ ప్రశ్న కావచ్చు నీకుమాత్రం ఏం తెలుసు? – అని నా జవాబు కాదుసుమా! న్నాకు తెలుసని నాకు తెలుసు తల్లి కావ డానికి నేను పడిన తపన, తల్లి అయినవారికి అందనే అందదనీ, దాన్ని మించిన దనీ నాకు తెలుసు ఇది నువ్వు దాచుకుని నీ జీవితంలో మళ్ళీ మళ్ళీ చదువుకుంటా వనీ, ఎప్పటికైనా నన్ను అర్థం చేసుకుంటావనీ నాకు తెలుసు

సరే, మొదట్నుంచీ నాగురించి చెబుతాను, విను నాకు జ్ఞానం వచ్చిందని విజ్ఞులు నిర్ణయించాక నాకు బోధపడింది ఒక్కటే, చీటికీ మాటికీ మాఅన్న నన్ను కొట్టడం, అలా ఎందుకు కొట్టేవని మానాన్న మాఅన్నను కొట్టడం నేను వ్యక్తురా ల్నయానని పెద్దలు గుర్తించాక నాకు బోధపడింది ఒక్కటే, వదిన నాకోసం సంబంధాలు అదేపనిగా వెతకడం, వచ్చినదాన్నల్లా నాన్న తిరక్కొట్టేయడం

మాఅన్న ప్రవర్తన నా కేమాత్రమూ బోధపడేదికాదు. ప్రేమలాగే ద్వేషంకూడా

అకారణం అనుకుంటే పోనీ, అదయినా వ్యక్తం చేయొచ్చునుగా, అదీలేదు ! నన్ను కొట్టినప్పుడుకూడా వాడి మొహంలో కోపం ఉండేదికాదు ! అదొక సజీవయంత్ర మేమో అనిపించేది అందులో కారుణ్యమూలేదు, కాఠిన్యమూలేదు ! మనసు విప్పి చెప్పకోడం లేదనుకుంటానే, అసలు మనసున్న దినుసేనా అది ! దగ్గినప్పుడూ, ఆవలించినప్పుడూ, గుర్రుపెట్టినప్పుడూ – ఇలాంటి కొన్ని సందర్భాలలో తప్పక ఏవైనాశబ్దాలు చేసేవాడేమోగాని మూర్తీభవించిన మూగస్వరూపం అది అసలు వాడు ఇంట్లో ఉన్న గంటలే తక్కువ ఎంతసేపూ స్కూలూ, తప్పితే ఏ ఫ్రెండ్స్ వెనకో తిరగడం, అంతే

ఇక నాన్నది మరొకరకరకం ఫలితాల్నిబట్టి ప్రయత్నాల మంచిచెడ్డలు లెక్క కట్టే విచిత్ర మనస్తత్వం ఆయనది. మా అమ్మ రాగానే ఆయనకు ప్రమోషను వచ్చిందిట, అందుకని మాఅమ్మ ఒక దేవతట మా అన్నను కన్నాక అమ్మ ఆరోగ్యం దెబ్బతిందిట అందుకని వాడు ఉత్తివెధవట. పుడుతూనే నేను అమ్మను పొట్టన పెట్టుకున్నానట, అందుకని నేను పరమహంతకినట !

తల్లిలేని నామీద దయాక్షిణ్యాలు ఇలాగే ఉండిపోనేమోగాని ఒక చిత్రమైన సంఘటన ఆయన్ని కొద్దిగా మార్చింది అన్నట్టు నీతో చెప్పడం మరచిపోయా నేమో ! అన్నకూ నాకూ తేడా పదహారేళ్ళు. నాకు నాలుగేళ్ళు ఉండగా వాడికి పెళ్ళవడం, వదిన కాపురానికి రావడంకూడా జరిగింది. ఏవిధమైన ఎక్స్‌ప్రెషనూ ఎరగని నాలిక గల అన్నను వదిన సుఖవుగా లోంగదీసుకున్నట్టు కనబడుతుంది.

ఆ తరవాత మానాన్న చెప్పేడు – వదిన వచ్చిన కొత్తలో ఓనాడు ఇలా జరిగిందిట. ఆవాళ మానాన్న ఆఫీసునుంచి వచ్చేసరికి నేను అదేపనిగా ఏడుస్తున్నాను, దాన్తో ఆయన చిర్రెత్తిపోయారు

'ఏమర్రా, యింట్లో ఎవరేనా ఉన్నారా, అందరూ కట్టకట్టుకు చచ్చారా? గుంటముండ గుక్కపట్టి ఏడుస్తూంటే... ఏమే, నువ్విక్కడ ఉందేనుటే?'

'బాగుంది మా ఏడుపు ఎవడు చూశాడు !' అంది చటుక్కున వదిన

దాన్తో నాన్న రెచ్చిపోయాడు 'ఏం, నీ తల్లేం చావలేదుగద !

'ఇలాంటి దరిద్రపుకొంపలో పడేశాక ఉన్నా నాతల్లి చచ్చినట్టేలెక్క. కొత్త కోడల్ని వచ్చానని నా కేముద్దూ ముచ్చటా లేదు పైగా మా అత్తగారు తను లేకపోయినా, అంతకుమించిన ప్రతినిధిని యిక్కడ ఉంచి మరీవెళ్ళింది '

'నీ కేం బుద్ధిలేదటే ? వేలెడు ఆడపడుచుని, నోరెరగనిదాన్ని...'



"ఒక్కడివీ ఎత్తలేవు. ఇం కెవరినన్నా తోడుపిలు."

'వేలెడుంటేమాత్రం? తే లెంత ఉంటుంది! తల్లిని గుటుక్కుమనిపించిన ఈ గుడ్లగూబగుంట నన్నుమాత్రం మింగదన్న మాటేమిటి?'

'నోరుముయ్యి. నోటి కెంతొస్తే అంతే!'

'కన్నతండ్రి మీరే దీన్ని తిట్టనిరోజు లేదుగదా - నాకూ దీనికీ ఏం చుట్టరికం ఉందని చాకిరీ చెయ్యను! మీకే అక్కర్లేనప్పుడు యింకిది ఎలాచస్తే నా కేం?'

మానాన్న కోపంపట్టలేక వదిన్ని ఒక్కటి వేశాడు. ఇలా దెబ్బ పడిందోలేదో ఇల్లెగిరిపోయేటట్టు ఆవిడ గోల ప్రారంభిస్తే, నా కేమిటో బోధపడక మరింతగా రాగాలు ప్రారంభించాను. మానాన్న తవ్వేడునూనె ఇంకేలాగ నా తలమీద మొట్టికాయలు మొట్టి - 'నోరెత్తవా, పీక నొక్కేస్తాను. నీగురించేకాదుటే ఇంతల్లరీను - లంఖిణీముండ!' అని పెరటిఅరుగుమీదకి తీసికెళ్ళి నన్ను కుదేశాడుట; 'నా పిల్ల నా సొంతం. నా యిష్టం. తిట్టినా కొట్టినా నాకే చెల్లిందిగాని పైవాళ్ళ కెవరికుంది బోడిపెత్తనం!' అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుకూచున్నాట్ట. మాడు అదిరేలా

మొట్టి నోరు మూసేదేమో. నాకు తలమీంచి రక్తం కారడమేగాక స్మృతికూడా తప్పిందిట పొరుగింటి ఒకాయన వచ్చి, నాన్నను నానాచివాట్లూ పెట్టి, నన్ను ఆసుపత్రికి తీసికెళ్ళి కట్టుకట్టించాడుట ఎప్పుడూలేంది నాన్న ఆడదాన్లా ఏడ్చాడుట. ఆసుపత్రినుంచి మేం యింటి కొచ్చేసరికి వదినా అన్నా లేరు.

'పుట్టింటికి వేంచేసిందాఏమిటి కోడలుగారు! ఈ కొడుకుఅడముండకూడా దానివెంట పడిందా, లేదా? రక్షించారు! ఇక కొడుకయినా కూతురయినా ఇదే నాకు,' అన్నాడుట నాన్న

నాన్నలాంటివాళ్ళు అనడానికీ ఆచరణలో పెట్టడానికీ ఆట్టే తేడా ఉండదు. ఆరోజునుంచీ, ఇంట్లో ఉన్నానో లేదో ఎవరికీ అంతుపట్టనిదాన్ని అయింటికి రాణీనై కూచున్నాను నాకు చాకిరీ చేసే నౌఖర్లూ, నాకు కావలసిన సామాన్లూ, నా కోరికలూ నా వయసుతోపాటు పెరుగుతూవచ్చాయి రెండేళ్ళయ్యాక పుట్టింటినుంచి వచ్చిన వదిన - మరి యింట్లోవాళ్ళు ఏం బోధించి పంపారో లేక భర్త ఎలాగా మామగారంత ప్రయోజకుడు కాడుగనక అణగిఉండక తప్పదని గ్రహించిందో క్రమంగా మారజొచ్చింది నా ఆలనా పాలనా విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకునేది మా అన్న తత్వంలోమాత్రం మార్పేమీలేదు

ముద్దు జరిగినా నాలోని సహజమైన చురుకుతనం మొద్దుబారకపోడం నా అదృష్టం పధ్నాలుగేళ్ళకే నేను ఎస్సెస్సెల్సీ ప్యాసవడం జరిగింది అప్పటికే ఏడాదై నేను వ్యక్తురాల్ని కావడమూ జరిగింది. అప్పటికి మా అన్న గ్రాడ్యుయేటు అయాననిపించుకుని మూడేళ్లై ఉద్యోగం చేస్తున్నాడు. మాలో బాగా చిన్నప్పుడే పెళ్ళిళ్ళు అవడం సాంప్రదాయం కాబట్టి నేను పెద్దదాన్ని అయినదగ్గిరనుంచీ నా పెళ్ళిగురించి మావదిన నాన్నతో ప్రస్తావిస్తూవచ్చింది. అంతకుముందు ఆ మాటంటే నోరు నొక్కుతానన్న మానాన్న క్రమంగా ఊరుకుంటూవస్తే, నాకే ఆశ్చర్యం కలిగింది ఒకరోజు -

'ఇదేమిటీ అన్యాయం, నేనే నీకు బరువైపోయానా?' అంటూ కళ్ళలో నీళ్ళతో నాన్నమీద విరుచుకుపడ్డాను. ఎప్పుడూ మాటకి మాట జవాబు చెప్పే నాన్న గుడ్లనీరు కుక్కుకుని ఊరుకుంటే నాగుండె దడదడలాడింది. కొంతసేపు అయాక ఎలాగో తేరుకుని తెచ్చిపెట్టుకున్న నెమ్మదితో అన్నాడు 'మీ అమ్మే మంచిది కాదనుకున్నాను, మీ నాన్నకూడా మంచివాడుకాదు తల్లీ!'

నాకేం బోధపడలేదు ఎందుకో ఎప్పుడూ లేని భయంమాత్రం నన్నావహించింది 'బుద్బుదప్రాయమైన ఈ శరీరాల్ని ఎవర్నివారు నమ్ముకోడమే శుద్ధ బుద్ధితక్కువ. అందులో ఇంకొకరిమీద ఆధారపడ్డం అదెంత తెలివితక్కువో!'

ఎప్పుడూలేని ఇలాంటి వేదాంతథోరణి కొంతసేపు సాగించి నాన్న అసలు విషయం బయటపెట్టేడు. ఆయనలో డయాబిటీస్ అపాయం కలిగించేంతగా ముదిరిందని పరీక్షచేసిన పెద్దడాక్టరు తేల్చాడుట చెప్పాపెట్టకుండా అదెప్పుడయినా దగా చెయ్యవచ్చునట!

నేను నిలువునా క్రుంగిపోయాను కొన్నాళ్ళు తిండి సరిగా తినలేదు, కొన్నాళ్ల నిద్రపోలేదు కొత్తగా బాధంచే ఏమిటో రుచి చూడ్డానికి చాలా బాధపడిపోయాను తర్వాత సహజం చేసుకున్నాను. ఎవరైనా అంతే అనుకుంటాను నాన్న తరవాత అనేవాడు 'మీ వదినది అసురగణం ఇక మీఅన్న ఒక అజగరం వీళ్ళకు నిన్ను అప్పజెప్పి నే నేలా వెళ్ళిపోయేది తల్లీ!

'అయినా వాళ్ళను అనుకోడం దేనికి? ఇంకా వాళ్ళు కుర్రాళ్ళు ఒకొక్కప్పుడు నే నెంత విర్రవీగేవాణ్ణని! నిన్ను ఏ డాక్టరమ్మనో చెయ్యాలనీ, నా వృధాప్యంలో నీదగ్గిర విశ్రాంతి తీసుకోవాలనీ - నా స్వార్ధంమాత్రం ఏమంత క్షమించతగ్గదా! ఇప్పుడు నిన్ను ఇంత కలిగున్న ఇంట్లో పడేసి నిశ్చింతగా వెళ్ళిపోదామనుకునే స్థితికి వచ్చాను ప్రకృతి చేతిలో మనుషులు ఒక్కొక్కప్పుడు ఎంతెంత వెర్రివాళ్లై పోతారో చూడు!

'పదిహేనేళ్ళు వెళ్ళిపోయాయి నీకు మన ఆచారాలప్రకారం పెళ్ళి చేసుకునే వయసు నీది వయసును మించిన తెలివితేటలు నీ కున్నాయని నాకు తెలుసు జ్ఞాన సంపదనుబట్టి నిర్ణయిస్తే నీవయస్సు ఇరవైఅయిదు అనవచ్చు ఏమయినా యిలకా యింకా పైచదువులకన్నా ప్రస్తుతం నీకు పెళ్ళి ముఖ్యంతల్లీ!'

'పది పన్నెండేళ్ళయి కాపుకానికి వచ్చినా మీవదిన కడుపు ఎలాగా పండలేదు రేపొద్దున్న నీ కడుపున ఒక కాయ కాస్తే - అంతదాకా నేను ఉంటే - అప్పుడు నామొహం చూస్తావా విజయా?'

నాకళ్ళు బరువెక్కిపోయాయి, నామొహం సిగ్గుతో వాలిపోయింది, పిచ్చిబాబూ! ఆరోజు ఆసుపత్రినుంచి వస్తూంటే రిక్షాలో నాపక్కని కూచుని నామొహం చూశావ్ కదూ! జ్ఞాపకముందా? అదోసారి గుర్తుతెచ్చుకో'

పిచ్చేశ్వర్రావు కాగితాలు బల్లమీద అలా ఉంచి పైన పుస్తకం ఒకటి వెయిట్‌గా పెట్టి, మడతమంచంమీద కళ్ళు మూసుకు పడుకున్నాడు. ఏదో ఉద్వృతాన్ని ఊహిస్తూ అతనిగుండె వేగంగా కొట్టుకుంది. ఈ ఉత్తరంలో కొన్ని కొన్ని విషయాలు తను పిన్నినుంచి ఇదివరకు విన్నవే. ఇప్పు డివన్నీ మళ్ళీ మళ్ళీ ఎందుకు చెబుతున్నట్టు? ఈపాటికైనా యింటిమొహం పట్టక యిరవై పేజీల యీ

ఉత్తరం ఏమిటి? బయలుదేరివస్తే తనే స్వయంగా యివన్నీ చెప్పుకోవచ్చును గదా। తరువాతి విషయాలు ఆతడు ఆతృతగా చదవసాగేడు.

ఆ ఉత్తరం తర్వాత ఇలా సాగింది:


'నల్లని చందనపుబొమ్మ కేవలం కర్రముక్క అని ఏడెనిమిదేళ్ల ఆడపిల్లకి తెలియదంటే ఎవరు నమ్మతారు। కాని, కాళ్లమీద పడుకోబెట్టుకుని ఆ కర్రముక్కకి నీళ్లు పోస్తుంది, ఉగ్గు పడుతుంది, తిరగేసి జోకొడుతుంది, ముక్కూచెవులూ కుట్టిస్తుంది, ముచ్చిరేకుల లోలకులు తగిలిస్తుంది, చింకిచీరలు చుట్టబెడుతుంది, రకరకాల బొట్లు పెడుతుంది, ఎత్తు మప్పుతుంది, ఎగరేసి నవ్విస్తుంది. ఆ చింతమొద్దుని ఎవరైనా ఏమైనా అన్నామా, ఒంటికాలిమీద లేస్తుంది. ఊపిరి ఊసంటూ లేనిదాన్తో ఊపిరి తిరక్కుండా ఊసులు చెబుతుంది।

చిన్నపిల్లకాబట్టి బయట పడిపోతుందేమో; అందరం అంతేసుమా పిచ్చిబాబూ। మనం జీవిస్తున్నది ఒక ఊహాలోకం. మనల్ని నడిపిస్తున్నది ఒక ఆశాలేశం. మనం స్థిరమూ శాశ్వతమూ అనుకుంటున్నవన్నీ సముద్రపుఅలలు, చంద్రకళలు, గాలికి ఊగే దీపాలు, రూపం మార్చే మేఘాలు। నిజం, బాబూ। నిజం.

పుట్టిన ప్రతివ్యక్తికీ రక్తమాంసా లుంటాయి. రాగద్వేషాలలోనే ఉన్న తేడా అంతా. సంప్రదాయానుసారంగా వస్తున్న తల్లిని కావాలనే కోర్కె వయసుకు మించిన మానసికపరిపక్వత గల మనవాళ్ళ పిల్లలకు మరింత ఎక్కువేమో। నాకు తామరపువ్వంటి తమ్ముడూ లేడు, చామంతిపువ్వంటి చెల్లెలూ లేదు; మొగలిపువ్వంటి మొగుణ్ణి కట్టుకుంటే తెల్లగులాబీలాంటి పిల్ల పుట్టదా? ఈ ఆలోచన నాలో పుట్టి, పెరిగి, ఇహమై, పరమై కూచుంది. నాన్న జబ్బుతో శలవలుపెట్టినకాలేజీచదువు ఏకంగా సలాం కొట్టడంతో పూర్తయింది. ఇక ఈ చింతే యిరవైనాలుగుగంటలూ నాకు రామనామస్మరణై కూచుంది.

ఈలోగా ఇంకో విశేషం జరిగింది. మా వదిన వాళ్ల చెల్లెలు పురిటికని వాళ్ల పుట్టిల్లు చేరింది, సాయం చేయడానికి రమ్మని ఉత్తరం వస్తే. చెల్లెలు పురుడైన నెల్లాళ్లకు వదిన తిరిగి వచ్చేసింది; ఒక్కర్తీ కాదు, నెల్లాళ్ల పురిటికందుతో. వదిన చేసిన ఈ సాహసానికి అన్నయ్య మొహంలోనే ఆమోదం కనపడలేదు. ఇంచుమించు ఏడుస్తూ వదిన అంది:

'మీరే కాదంటే నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకోవలసిఉంటుంది. మా మరిదికి టెలిగ్రాం యిచ్చి పిలిపించి, వాళ్ళిద్దర్నీ ఒప్పించేసరికే నా తాతలు దిగొచ్చారు. వాళ్లకి యిప్పటికే అయిదుగురు పిల్లలని మీకు తెలుసు. ఎన్నిసార్లు అడిగినా



‘మా పిల్లాడు మాకు బరువా, అంతలా అడుక్కుతింటున్నామా!’ అని అతగాడు ఒకటే నిష్ఠూరాలు ‘పాలిచ్చే బిడ్డను తల్లికి దూరం చెయ్యకు.’ అని మా చెల్లి గోల ‘ను వ్వొప్పుకున్నా మీఆయన ఒప్పుకోవద్దా? మీమామగారు హర్షించవద్దా?’ అని ప్రశ్నలు పురిట్లోంచే పిల్లాణ్ణి తీసి పెంచుకుంటే ప్రేమ నిలుస్తుందేమో అని నా ఆశ

అక్కడికి వచ్చిన నాన్నని వదిన జాలిగొలిపే చూపులతో వేడుకుంది: ‘మీతో చెప్పకుండా, మీ సమ్మతి పొందకుండా యీ యింటి కొక పాపను తెచ్చేను నా తప్పులన్నీ క్షమించి నన్ను దీవించండి మీరు కాదనరనే నా నమ్మకం. గరిటె డంత పాపతో గంపెడంత ఆశకూడా తెచ్చుకున్నాను.’

వదిన యింకా ఏదో చెప్పబోతోంది; పాపను అందీయబోయింది. నాన్న అక్కణ్ణుంచి గదిలోకి వెళ్ళిపోయారు. వదిన నిరాశగా అటు చూసింది. ఇంతలో పాప కెవ్వున ఏడ్చాడు. వదిన అదేసమయంలో నా మొహం చూసింది. నన్నేమీ అడగక్కర్లేదు; నేనే జవాబు చెప్పేను.

'ఎన్నాళ్లకు వినబడింది వదినా మనింట్లో యింత చక్కటి కేక! ఎంచి ఎంచి తెచ్చిన చుంచెలక, రాకరాక వచ్చిన రాచిలుక! దీన్తో ఎవరు పడగలరు; దీన్ని ఎవరు వీడగలరు!!' మెడకింద చెయ్యేసి పాపను ఎత్తుకున్నాను. వాడి దొంగ కన్నీళ్లనీ, ధారాపాతంగా ప్రవహించే చొంగనీ ముద్దెట్టుకున్నాను. అంతేకాదు; వాడి ఆకుల్లాంటి కనురెప్పల్నీ, పువ్వుల్లాంటి కళ్లనీ, మొగ్గలాంటి ముక్కునీ, పండులాంటి నోటినీ, చిగురులాంటి గెడ్డాన్నీ ఎట్టాగా కందిపోయేలాగ ముద్దెట్టుకున్నాను. దాన్తో ఆ 'నెలబాలుడు' మరింత ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. అంతకన్న ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న వదిన్ని చూసి అన్నాను: 'కనేవాళ్ళం మనం, మొట్టమొదట నా అనేవాళ్ళం మనం, పెంచేవాళ్ళం మనం, ప్రేమించేవాళ్ళం మనం. మొగాళ్ల కేం తెలుసు, వాళ్ల మొహం, నా మొహమూను! నీ వెర్రిగాని ఈ విషయంలో వాళ్ల నడిగే దేమిటి! ఇందాక నువ్వు అన్ననీ నాన్ననీ యీ విషయం అడుగుతూంటే నేను కనిపెట్టుకుఉన్నది దేనికో తెలుసా? వ్యతిరేకంగా వాళ్ల నోటంట ఒక్కముక్క వచ్చిందిగాదు చెబుదును మరి...'

వదిన కన్నీళ్లు ఆగలేదు. నన్ను కౌగలించుకుని ముద్దెట్టుకుంది. 'విజయా! దీనికి అడ్డుపెట్టే మొట్టమొదటిదానివి నువ్వే అనుకున్నాను. అందుకనే రాగానే నిన్ను సంప్రదించలేదుకూడా ... నీదింత విశాలహృదయ మని పోల్చుకోలేకపోయాను ... ఈదయాసాగరంలోంచి యిక చందమామే వస్తాడో, ఇందిరమ్మే వస్తుందో చూడాలి మరి...'

సిగ్గుతో మొహాన చేతులు కప్పుకుని నేను గదిలోకి పరిగెడుతూంటే నాన్న అడ్డుకుని చేతుల్ని ఎడదీశారు.

'పిల్లలంటే చాలు, దీనికి వెర్రిప్రేమ. ఇల్లు తీసి పందిరేసే పిల్లలతల్లి ఈ పిచ్చితల్లి ఎప్పు డౌతుందో!'

'ఇంటి కొచ్చిన లేగదూడవి ఒక ముద్దయినా పెట్టుకోకుండా ఊరుకోడం మరి నీలా అందరికీ చేతనవుతుందా నాన్నా!'

నాన్న మొహం మరింత వికసించింది. నే నా అవకాశం వృధా చెయ్యదలచుకోలేదు.

'ఇంకా చూస్తావేం వదినా! శాస్త్రిలుగారికి కబురంపు, దత్తతముహూర్తం త్వరలో పెట్టించు. ఈ పోకిరీవెధవని చూసి ఎవరా అని అనుకోగలరు; వీడు నా మేనల్లుడుసుమీ!'

అందరూ నవ్వేరు. అందరికన్న సంతృప్తిగా నవ్వినవారు మా వదినగారు. చిట్టిగాడు మా యింట్లో ప్రవేశించిన వివరం యిదిరా నాయనా! కాని మరో పిచ్చివాడు మా యింట్లో ప్రవేశిస్తాడని నే నెప్పుడూ కలలోకూడా అనుకోలేదుసుమీ బాబూ!'

## 17

తరువాత ఉత్తరం పిచ్చిబాబు వీలయినంతత్వరగా చదివేడు.

'రెండే రెండుముక్కలు నీకు రాసి నే ననుకున్నది పూర్తి చేసుకుందా మని మొదట్లో నాకు అనిపించకపోలేదు. కాని నీ పిన్ని స్వరూపం నీకు పూర్తిగా తెలియడానికి ఇందులో ప్రతిఅక్షరం అతిముఖ్యం. ఇందులో ఏది తీసెయ్యను, ఎలా తగ్గించను, ఏది చెప్పకుండా దాచను? ఈనాడు, ఏనాడూ నువ్వు చూడని, యికముందు కూడా నువ్వు చూడలేని, నీ పిన్ని నీ ముందు నిలబడుతోంది, చూడు.

అదేమిటో చిట్టిగాడు మా యింటికి వచ్చిందగ్గిర్నుంచీ నాలోని తపన మరింత ప్రజ్వరిల్లింది. పిల్లలగురించి చదవడమూ, వినడమేగాని యింత ఫస్ట్‌హ్యాండ్ ఇన్ఫర్మేషను యిదివరకు నే నెరగను. అందులో వాణ్ని మొదటిరెండేళ్ళూ పెంచడంలో వదిన పడిన పాట్లు చూస్తూంటే, ఆ తీయనిబాధ ఎంత లోతైనదో ప్రత్యక్షంగా కనిపించేది.

ఆమెలో అదివరకున్న అన్నిరకాల లోపాలూ, ఉవ్వెత్తున లేచిన యీ మాతృమమత మడతల్లమధ్య, మరి కనపడకుండా మరుగుపడ్డాయేమో అనిపించింది. 'నేను ఎన్ని చేస్తేమాత్రం కన్నతల్లిని తీసుకురాగలనా విజయా! ఈ పసివాడికి నేను చేసినలోపం పరమాత్ముడయినా క్షమిస్తాడా?' అని కళ్ళనీరు పెట్టుకొనేది.


'పరమాత్మ దెవడు క్షమించడానికి. ఆఫ్టరాల్, అతడూ మొగాడేకదా; కడుపు తీపి ఆయన కెలా తెలుస్తుంది? అయినా కన్నతల్లిని తీసుకొస్తే ఆమెమాత్రం ఏం చెయ్యగలదు నీ కన్న! ఆమె కిది ఆరో సంతానం. నీ కిది ఆరోప్రాణం. నేను చూడ్డంలేదా?'

ఇలా ఏదో జవాబులు చెప్పి, తృప్తిపరచేదాన్ని గాని నాకే ఏమిటో తృప్తిగా ఉండేది కాదు; ముఖ్యంగా పాలగురించి వచ్చేది తగవు. ఈ క్షీరసాగరమధన మెలాగో మాకు బోధపడలేదు. ఆఖరికి 'పిల్లల్ని ఎలా పెంచాలి?' అనే పుస్తకం

తెప్పించాం. మేం గమనించిన పొరపాటు ఏమిటంటే, అందులో సూచనలన్నీ కన్న తల్లులకు - పెంపకపు తల్లులకు మాత్రం కాదు! అందులో కొన్ని కొన్ని విశేషాలు చదువుతూంటే నాలో నేను మరింతగా పరవశించిపోయేదాన్ని. ముఖ్యంగా 'మాతృమూర్తి' అనే ప్రకరణం చదువుతూంటే నే నెక్కడ ఉన్నానో నాకే తెలియ లేదు. అందులో యిలా ఉంది: 'ఆ కన్నుల్లో కూరిమి, ఈ కౌగిలిలో వేడిమి కన్నతల్లి యివ్వాలిగాని మరొకరు యివ్వగలరా? ఎన్నిరకాల ఐస్‌క్రీమ్‌లు తింటే మాత్రం చల్లని మంచినీళ్ళ సాటి వస్తుందా? శారీరకంగా మానసికంగా తల్లీ పిల్లల అనుబంధంతో యింకొకటి పోలుతుందా? మరొకటి, అది ఏదైనాగానీ, తల్లిపాలతో సాటి వస్తుందా! ప్రకృతిలో ఉన్న ఈ విచిత్ర పవిత్ర సంబంధాన్ని ఎవరైనా కాదనగలరా? తల్లిపాలు తాగే ఈ కుర్రకారు జన్మహక్కు తుడిచి పెట్టెయ్యాలంటే అది కుదురుతుందా? తల్లిపాలు పరిశుద్ధమైనవి; సరియైన ఉష్ణోగ్రతలో ఉండేవి; బిడ్డకు సుళువుగా అరిగేవి; ఇంకేఆహారంలోనూ లభించనంత సమగ్రతగలవి. చన్నిచ్చి చంటిపాపను నిద్రపుచ్చక వెన్నిచ్చి వైతొలగే నవనాగరికతారోగపీడితులు ఇది ఎంత త్వరగా తెలుసుకుంటే అంత మంచిది. తల్లిపాలు బదులు ఆవుపాలు పట్టొచ్చునని కొంద రంటారు. ఆవుపాలు ప్రకృతిలో తయారయేది ఎవరికోసం? ఆవుదూడకోసం. మానవశిశువుకు కావలసినవన్నీ అందులో ఎలా వుంటాయ్? మనుషులకున్న మానసికాభివృద్ధి పశువులకు లేదుగనుక వాటి ఆహారపు అవసరాలే వేరు.

తల్లిపాలకీ పోతపాలకీ తేడాగా ఒక్కటే ఉదహరణ యిస్తాను చూడండి. పదిమంది పిల్లల్నెత్తిన ఆరోగ్యస్వరూపిణి అయిన ఏ తల్లినయినా అడిగిచూడండి; ఆ అనన్యమైన అనుభవంలోని అందచందాలు అర్థమవుతాయి. పాలసీసాలబాధ లేదు; అప్పటికప్పుడు ఏ అర్ధరాత్రో పాలసీసా బద్దలయితే బజార్లమ్మట పరిగెత్తడంలేదు; పీకలు ఉడకబెట్టడం, దబ్బనం కాల్చి వాటికి కన్నాలు పొడవడం లేదు; ఓ రాత్రివేళ లేచి కుంపటో, స్టౌవ్వో వెలిగించి పాలు కాచడం లేదు; బ్లాకు మార్కెట్‌దారులాంటి గ్లాక్సోకోసమో, డ్యుమెక్సుకోసమో, ఆస్టరు మిల్కు కోసమో బయలుదేరనక్కరలేదు; ఇన్ని చమ్చాల పాలగుండ అనీ, ఇంత పంచదారనీ, ఇన్ని వేణ్ణీళ్ళనీ యీ గొడవలేదు - ఏ యింట్లోనో ఒకనాటి రాత్రి వేళ అన్నిలైట్లూ వెలిగి ఊరంత గోల జరుగుతుందంటే ఏమిటి అర్థం! తల్లి పాలకి నోచుకోని ఓ బుల్లినోరు చేసే హడావుడే కదూ!

స్తన్యమిచ్చి ధన్యయైన తల్లిసంగతే చూడండి. ఓ రాత్రి బాబుకి ఆకలేసిందే




పెద్దలకు మాత్రమే

అనుకోండి పిల్లాణ్ణి తన పక్కలోకి తీసుకుంటుంది ముచ్చట కలిగించే ఆమాతృమూర్తి కళ్ళూ, ముద్దులు మూటకట్టే ఆ పాప కళ్ళూ...నిమిషాలమీద మూసుకుపోతాయి మరుక్షణంలో యిద్దరూ మత్తునిద్రలో ఉంటారు ' పరిపూర్ణత – ప్రశాంతత – ప్రపంచమంటే కృతజ్ఞత '

ఆ పుస్తకంలో నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి చాలా వదివాను. కాని నేను మరచిపోలేని వాక్యాలు ఇవిమాత్రమే చిట్టిగాడితో వదిన పడే పాట్లు చూస్తూంటే నిజాన్ని రచయిత ఎంత చక్కగా చెప్పేడో అర్ధమవుతోంది

నా చదువు ఆగిపోయిందనీ, నేను కాలేజీ మానేశాననీ చెప్పేనుగదా చిట్టిగాడి సంరక్షణలోనే నాకు చాలావరకు గడిచిపోయేది వేళకి నాన్నకి మందియ్యడంకూడా అప్పుడప్పుడూ మరచిపోయేదాన్ని

'చూశావుటమ్మా – ఏం న్యాయంగాఉందో...ఇప్పట్నుంచీ ఈ చిట్టిగాడికి ఎంత

పక్షపాతమో! ఇక్కడికి తీసుకొచ్చిన నన్ను కాదని నిన్నూ, మావగార్నీ తలుచుకుంటున్నాడిదేమైనా బాగుందా ? అంది వదిన'

'మొట్టమొదట పిల్లలు అత్తా తాతా అనడం కొత్తగాదుగాని నువ్వు చెప్పడం కొత్తగావుంది వదినా! ఇంతకీ అమ్మని గుర్తిస్తే వాడు మరోణ్ణి తలుచుకుంటాడా!'

'అమ్మని గుర్తించడమా?! అంటే ఏమిటి విజయా?' అంది వదిన వణికిపోతూ.

'అదేమిటి వదినా! మామూలు మాటకి అలా త్రుళ్ళిపడతావ్? నేను మరో అర్థంతో ఏమీ అనలేదే! నిజంగా మనసున్నవాడయితే వాడు నిజం తెలిసినా నిన్ను నిరాకరిస్తాడా?'

'ఏమో విజయా! నేనూ చిట్టిగాదే లేంగా...చుట్టూ ప్రపంచ ముంది,' అంది బాబుని మరింత దగ్గరగా తీసుకుంటూ వాడీమధ్య బొత్తిగా వదినని వదలడం లేదు, కృతఘ్నుడు నా దగ్గిరకూడా రావడం మానేశాడు

నాన్న ఓ పక్కనుంచి నాకు సంబంధాలు వెతుకుతున్నారు కలలు కంటున్న కన్నెపిల్లలా, నవరసాల అనుభవాలు ఊహించుకుంటూ వచ్చేపోయేవాళ్ళను వింతగా చూస్తూ, ఆరోజుల్లో నేను కాలం గడిపేదాన్ని నాయిష్టం ఏనాడూ కాదనని నాన్న వరాన్వేషణలో నాకు పూర్తి స్వాతంత్ర్యం యిచ్చారు వదిన పెళ్ళిచూపుల తతంగానికి ఏమాత్రమూ లోపం రాకుండా చూసుకునేది జాతకాల విషయంలోనో, గోత్రాల విషయంలోనో, కట్నాల విషయంలోనో ఒకరికొకరు సరిపోక నాలుగైదు సంబంధాలు పుసిగిపోయాయి ఆ తర్వాత ఒకనాడు మీ నాన్నగారు వచ్చి నన్ను చూసుకువెళ్ళేరు

'అలా కుర్రాళ్ళా కనపడుతున్నాడుగాని ఆ రఘుపతి వయస్సెంతో తెలుసా?' మా నాన్న స్నేహితుడు అడిగాడు అతనే చెప్పేడు ఇరవైతొమ్మిదట

'పిల్లకు పదహారూ, పిల్లాడికి ఇరవైతొమ్మిదీనా? ఇంతతేడా ఎలాగండీ?' అన్నాడు నాన్న అదోలా మొహం పెట్టి

'అదొకటే అయితే ఫరవాలేదు, అతనికిది రెండోపెళ్ళిట!'

'ఆఁ! ముందు చెప్పకుండా ఎంతధైర్యం!'

'అదేం కాదులెండి .. అన్నీ ముందుగానే చెప్పేడు అదిగాక పదేళ్ళకొడుకు కూడా ఉన్నాట్ట!'

'ఇంకోళ్ళ పిల్లల్ని పెంచే ఖర్మ నాకేమిటి! వద్దని వెంటనే కబురంపించు నాన్నా!' అనేసి అక్కణ్నుంచి నేను కోపంగా లేచిపోయాను

ఆ మర్నాడు మా నాన్నగారి స్నేహితుడు మళ్ళీ పనిగట్టుకుని మా యింటి కొచ్చేడు ఒరే సుబ్బరామయ్యా! మళ్ళీ ఓమారు ఆలోచించి చూడ్రా; ఇలాంటి కాళ్ళదగ్గిర కొచ్చిన సంబంధం మళ్ళీ రాదురా!'

మా నాన్న అడ్డుపెట్టకపోడం చూసి అతను మళ్ళీ అందుకున్నాడు 'ఇదే నా కూతురైతే ఎగిరి గంతేసి ఒప్పుకుని ఉందును రఘుపతిరావు క్లాస్-ఒన్ రేంకులో ఉన్నాడు అందగాడు, ఆరోగ్యవంతుడ, పైగా ఆరోజుల్లో తండ్రి గడించిపారే సిన ఇల్లు, తోట_ ఒకటేమిటి? పైగా ఒంటిమనిషి, ఓ అత్తా ఆడపడుచూ పోరు ఉండదు మొదటిభార్య పోయాక అసలు అత నిన్నాళ్ళు బ్రహ్మచారిగా ఉండి పోడమే ఓ పెద్ద విచిత్రం ఇవాళ నువ్వు కాదంటే రేపీపాటికి ఓ వందమంది అతనికి పిల్ల నివ్వడానికి సిద్ధంగా ఉంటారని తెలుసుకో... మనపిల్ల బాగుందని అతను మోజుపడ్డాడుకదా అని,.'

'అందుకే నా అనుమానం, అతని నడత ఎటువంటిదో... ఏవేం లోపాలు ఉన్నాయో...'

'అతనిభార్య అలాంటి భర్తని వదిలి చనిపోవడమే అతని లోపం పదేళ్ళ కొడు కొకడు ఉండడం మరో పెద్దలోపం... కాణీ కట్నం పుచ్చుకోకుండా మీ పిల్లని చేసుకుంటానని ఎగబడ్డం మరీ పెద్దలోపం కదూ?'

'బాగుంది, ఇవన్నీ లోపాలు అని ఎవ రనుకోగలరు!'

'మరి?'

'అంత వయసు తేడాతో పిల్లను ఎలా ఇవ్వనా అని!'

'ఏమిటి పెద్దతేడా? మా నాన్నకంటె మా అమ్మ ఇరవైఏళ్ళు చిన్నది నిషే పంలా కాపరం చెయ్యిలా?'

'అదీ నిజమే అనుకో..'

నేను పక్కగదిలోంచి ఇవన్నీ వింటున్నానని వాళ్ళకు తెలుసునో, తెలియదో... నాన్న ఏమంటారోనని మరింత శ్రద్ధగా వినజొచ్చాను.

'ఇంతకీ మీ విజయ పదహారేళ్ళదాన్లా ఉందా? ఎంతో ఏవుగా ఏ ఇరవైఏళ్ళు వెళ్ళిన పిల్లలాగో ఉంది అతనికీ యీ అమ్మాయికీ ఈడూ జోడూ సరిగ్గా కుదురు తుంది... పిల్లకి తొందరగా పెళ్ళి చెయ్యాలని ఊం ఆరాటపడుతున్నానని చెబుతావ్, రోజురోజుకీ దేహస్థితి క్షీణిస్తోందని అంటున్నావ్, అవకాశం వచ్చినపుడు ఇంతగా ముందుకీ వెనక్కీ ఊగుతావు దేనికి?'

నాన్న సమాధానం నాకు ఆశ్చర్యం కలిగించింది 'నీ ఇన్ఫర్మేషన్ రైటయితే నాకూ యిష్టమేరా.. దానికి యిష్టం లేకుండా ఎలాగా అని'...

'మీ విజయని ఇలా పిలు. ఎందు కిష్టంలేదో కనుక్కుంటాను '

'ఆడపిల్లకి ఏది ఎందుకు యిష్టంలేదో ఎలా తెలుసుకోగలం ' దాని మొహం చూస్తే యిష్టం లేన ట్టనిపించింది. అంతే ''

'పోనీ నీ మటుకు నీకు అన్ని విధాలా ఇష్టమేనా ? నిజంగా చెప్పు '

'సరే, నా ఆఖరి అనుమానంకూడా చెప్పేస్తా విను ... వయసుమాట సరే సర్దుకోవచ్చుననుకో... ఇళ్ళూ వాకిళ్ళూ ఉన్నాయంటున్నావ్, పదేళ్ళ కుర్రాడు ఉన్నాడంటున్నావ్. ఈ ఆస్తంతా ఎవరిపేర ఉందో ఏమిటో ?'

శంకరంగారికి ఒళ్ళు మండిపోయిందికాబోలు, లేచి వెళ్ళిపోయాడు ఆయనికి మొదట్నుంచీ మేమంటే ఎంతో అభిమానం ఎన్నో ఆపదల్లోంచి ఆయన మమ్మల్ని గట్టెక్కించారు. అన్ని విషయాలూ పూర్వాపరాలు సూటిగా ఆలోచిస్తారు. మనసులో ఏముందో ఏమాత్రమూ సందేహంలేకుండా అనేస్తారు ఓసారి ఓ సంబంధం విషయంలో యిలాగే మా కెంతో ఉపకారం చేసి రక్షించారు అప్పుడు ఓసారి మా నాన్న ఆయన్తో అన్నాడు 'ప్లీడరు దాశరథిగార్ని ఎరుగుదువుకదూ' ఆయన రెండోకొడుక్కి మన విజయని చేసుకుంటామని వాళ్ళే కబురంపించారు ఇంచు మించు అన్నీ కుదిరిపోయినట్టే ! చాలా సొగసైన సంబంధం '


'నేను ఊరెళ్ళివచ్చేలోగా ఇంత ఘోరం జరపడానికి సిద్ధం అయావన్నమాట ఇంకా నయం, తల్లిలేని పిల్లగదా, ఏం చేస్తే ఎవరడుగుతారని నీ ఉద్దేశంకాబోలు ! ఆ సంబంధం చేసుకునేకన్న విజయ మేలు కోరే మనం ఇంకోపని చేస్తే మంచిది.' అన్నాడు శంకరంగారు

'ఏమిటది ?' అని అడిగాడు నాన్న ఆతృతగా

'అమ్మాయి కాళ్ళు నువ్వు పట్టుకో, చేతులు నేను పట్టుకుంటాను, గంగలో పడేద్దాం '

నాన్న నవ్వేడు

'ఇంత ఘనకార్యం చేసి నవ్వుతా వెందుకు సిగ్గులేక ? మళ్ళీ అన్నీ పెద్ద కను క్కుంటానని కబుర్లు చెబుతావ్, పెళ్ళికొడుకుగురించి నువ్వు కనుక్కున్న దేమిటీ ? అతగాడు దూరంగా ఉన్నంతమాత్రాన ఆమాత్రం భోగట్టా చేసుకోఅక్కర్లేదా ? వాడికి రాని రోగం లేదు, వాడికి లేని వ్యసనం లేదు ఇక ఉన్నవా-ఉద్యోగమంతా చిక్కులు, ఊరంతా అప్పులు ' ఆవాళ అది జ్ఞాపకం వచ్చిందికాబోలు, వెళ్ళబోతూ శంకరంగారు అన్నారు 'చాలా సొగసైన సంబంధం.. మరొకటి చూసుకో. నే వెడతాను '




'కూర్చోరా, అంతలో అలక దెనికి?'

'కూర్చోను, ఏముంది నీకంతగా ఆ స్త్రీవివరాలూ అవీ మాట్లాడుకోవాలనుంటే రఘుపతిరావుని పిలిపిస్తాను అతను మనని మించి ప్రాక్టికల్‌గా ఆలోచించే మనిషి ఏమీ అనుకోడు ఇష్టమైతే చెబుతాడు. లేపోతే లేదు.'

ఇంతలో నేనక్కడికి వచ్చాను నాన్న నావైపు చూసి — 'ఏమే, పిలిపించమన్నావటే?' అని అడిగాడు

'పిలిపించండి — నేనే మాటాడతాను'

'నువ్వా!' అంటూ వదిన ఇవతలిగదిలోంచి వచ్చి

'ఏం, మాటాడకూడదా? మాటాడలేనా?'

'అదే నా అనుమానం,' అంది

'అదికాదు తల్లీ అలాంటివి ఇంటావంటా ఎరగం ఎవ రేమనుకుంటారో,' అని

'అనుకోనియ్యి—మన కేం? . మీనాన్నకంటె నువ్వే నయం విజయా! ఎల్లుండి మంచిది, అతన్ని పిలిపిస్తాను ' అంటూ శంకరంగారు వెళ్ళిపోయారు

* * * *

అదిరా పిచ్చిబాబూ! నేను మీ యింటికి రాకముందు జరిగిన కథ మీనాన్న గారు మా నాన్నగారింటికి వచ్చిననాడు నేను ఆయనతో మాటాడి ఒప్పించినది ఒకటే ఒకటి. నిన్ను రెసిడెన్షియల్ స్కూల్లో జాయిన్ చేయించి - నీ పోషణకు ఏమాత్రమూ లోపం జరక్కుండా నెలనెలా డబ్బు పంపించడం, అంతే

'బస్సు తిరగబడి పదిమంది దుర్మరణం.' అని మనం పేపర్లో చదివినపుడు 'అయ్యో పాపం!' అని ఒక్కమాటలో మన విచారమంతా ప్రదర్శించి, మరుక్షణం ఆ మాటే మరచిపోతాం చూశావూ, అలాగే ఉండేది మొట్టమొదటి రోజుల్లో నీమీద నా భావం 'పాపం పదేళ్ళకుర్రాడు, తల్లిలేనివాడు!' అనిపించింది, అంతే తర్వాత మంచిగాగాని చెడుగాగాని నీమీద నా భావాల నీడలనైనా నేను పడనీయలేదు

మీ నాన్నగారు నన్ను చూసినవిధంగా సాధారణంగా ఏభర్తా భార్యను చూడరను కుంటాను నేనెక్కడ కష్టపడిపోలానో అని ఆరాటడిపోయే ఆయనకళ్ళు నాకు జీవితాంతమూ గుర్తుంటాయి ఇక్కడ మనవాళ్ళ ఆడపిల్లలు కొత్తగా కాపురానికి వెళ్ళినపుడు పడే దురవస్థను ప్రస్తావిస్తాను అన్నం పెట్టలేక ఏ తల్లిదండ్రులూ తమ అమ్మాయిల్ని అత్తారిళ్ళకు పంపరు పదహారేళ్ళు తమను పెంచిన తల్లిదండ్రుల్ని ఏ అమ్మాయి మరచిపోదు పుట్టిల్లు పాత, అత్తిల్లు అంతా కొత్త కొత్తవాతావరణానికి అలవాటుపడ్డానికి ఎంత తెలివైన అమ్మాయికైనా కొన్నాళ్ళు పడుతుంది అత్తవారితరపువారు విచక్షణ చూపాలి వ్యవధి యివ్వాలి నెమ్మది నెమ్మదిగా మార్పుకి అవకాశం ఇవ్వాలి కాని మనవాళ్ళు ఇవేం ఇవ్వరు, నిముషాలమీద వాళ్ళలో కలసిపోవాలి అంతవరకూ పెంచుకున్న ఆలోచనల్ని, అలవాట్లనీ సెకండ్లమీద మార్చేసుకోవాలి పదహారేళ్ళ ప్రభావాన్ని పదిరోజుల్లో మరచిపోవాలి 'నాన్న ఇంక్రిమెంటు ఏమయిందో, అమ్మ కీళ్ళవాతం ఎలా ఉందో, తమ్ముడు పరీక్ష ప్యాసయ్యాడోలేదో, చెల్లికి సంబంధం కుదిరిందోలేదో,' ఇలాంటి పుట్టింటి వారి ఊసయినా ఎత్తకూడదు, ఉత్తరమైనా యింట్లోవాళ్ళ పర్మిషనులేకుండా రాయ కూడదు. ఇరుగుపొరుగిండ్లకైనా మూడేళ్ళ మరిదిగాడి అనుజ్ఞయినా లేకుండా వెళ్ళకూడదు! ఇది సాధ్యమా? స్పష్టంగా కాదని తెలుస్తోంది నవదాంపత్యంలో పెద్దవాళ్ళు చేయించే మొదటిఅపత్యం ఇదే జీవితమంతా రోగభూయిష్ఠ మవడాని క్కారణం ఇదే

తర్వాత తర్వాత విని తెలుసుకున్నానుగాని ఈ ఆడపిల్లల అగచాట్లు నాకు తెలియనేతెలియవు మా నాన్నగారు నేను వచ్చాక బతికున్న అయిదేళ్ళలోనూ ఒక్కమారయినా సూచనప్రాయంగానయినా నన్నిలాంటి దురవస్థకు గురిచెయ్య

లేదు. అసలు ఆయన్ని విడిచి ఒక్క క్షణమయినా నాకు ఎక్కడికీ వెళ్ళాలనే ఉండేదికాదు ఎప్పుడూ తెల్లటిబట్టలు, తెల్లటికర్టెన్లు, తెల్లటిదుప్పట్లు, గోరు మీగడలాంటి పరుపులు, మల్లెపువ్వులాంటి అన్నం - తోటంతా తెల్లని పువ్వులు మనసంతా తెల్లని వెన్నెల - పాలసముద్రంలా పరవశించిపోయాను

'ఇక ఇందులోంచి ఇందిరమ్మే వస్తుందో చందమామే వస్తుందో చూడాలి అన్న మా వదినమాటలు అస్తమానూ గుర్తొచ్చి మరీ పిచ్చెత్తిపోయేది మొదటి సారిగా తల్లి నౌతానని తెలిసినపుడు నేను అనుభవించిన ఆనందం ఏవిధంగానూ మాటల్లో వ్యక్తపరచలేను. ఆరోజుల్లో ఏ చీమిడిముక్కు చింపిరితలా పిల్ల కనిపించినా ఏమాత్రం సందేహంలేకుండా ఎత్తుకు ముద్దులాడేదాన్ని ఏ ఊరు కుక్కపిల్ల కనిపించినా పాలుపోసి మురిసిపోయేదాన్ని ఎక్కడచూసినా అంతులేని ఆనందం, ఏరోజు చూసినా పున్నమి వెన్నెల నన్ను నేనే అద్దంలో చూసుకుని పాడుకునేదాన్ని

పాపగారు, ఎందుకింత బాగున్నారు ?
మాయింట్లో ఎప్పుడొచ్చి దాగున్నారు ?
చందమామ పక్కనున్న చుక్క మీరు ?
చక్కనైన ముద్దబంతి రెక్క మీరు ?

ఎలా ఉంటాడు ? ఎంతుంటాడు ? నలుపా, ఎరుపా ? పొడుగా, కురచా ? అన్నిటినీ మించి ఆడా, మొగా ? ఇనితప్ప ఇంకో ఆలోచనలేదు ప్రహ్లాదుడికి నవ్వుతున్నా, ఏడుస్తున్నా, తెలివిగా ఉన్నా, నిద్రిస్తున్నా, మాటాడుతున్నా, మూగగా ఉన్నా.. ఏంచేసినా, చెయ్యకపోయినా హరిధ్యానమేనట. అలాగే నా కెప్పుడూ పరధ్యానమే రంగులన్నీ వేసిన మంచిచిత్రం, రుచులన్నీ కలిసిన మధురపాకం, ఊహ లున్నకొద్దీ రూపకల్పన ఎన్నిరకాలు ! ఎన్నెన్ని సుఖాలు !!

నా ఆశలు అడియాసలు అని తెలిశాక, నా స్వప్నాలు సైకతసౌధాలు అని తెలిశాక నాలోని ఆశువులు నాకు దక్కలేదని తెలిశాక, బ్రతుకు భారమై, ప్రపంచం శూన్యమై పావక ఇంకా ఎందుకు బతికున్నానా అని నన్ను నేనే తిట్టుకున్నాను చచ్చిపోడానికి ఎన్నో వ్యర్థప్రయత్నాలుకూడా చేశాను ఆయన నన్ను అనున యించినకొద్దీ నాదుఃఖం మరింత ఎక్కువైపోయేది


జ్ఞాపక ముందీ, 'తమ్ముడు పుడతాడ్రా బాబూ !' అని నేను నీకు చెప్పినప్పుడు ను వ్వేసినగంతులు, చేసిన గల్లంతులు ! రెండుచేతులూ జాచి నిన్నునేను దగ్గరకు తీసుకుని ముద్దులవర్షం కురిపించినపుడు నీ ఒళ్ళంతా పులకలు, నీ గుండెల్లో ఉరకలు,

తెలిసీ తెలియని జ్ఞానంతో నీ పిన్నికోసం నువ్వుపడిన ఆరాటం, ఆవేదనా జ్ఞాపక ముందీ ?

నేనుమాత్రం మరచిపోలేను నిన్ను మొట్టమొదట గుర్తించినదీ, నా ఆలోచనల్ని నీవైపుకి మళ్ళించినదీ ఆ ముహూర్తంలోనే. 'పైవాడుకాదు, వీడు నాకు కావల్సిన వాడు,' అని అప్పుడే అనిపించింది కాని నా మొదటిసంతానం నాశనం కాగానే, నాలో కరడుగట్టిన కాఠిన్యత అలుముకొంది 'వీ డెవడు మధ్యని నాకు ? కడుపా, వీపా ?' అనిపించింది అందుకే నాతో దుఃఖం పంచుకుందామని పరిగెత్తుకువచ్చిన నిన్ను మనిషిలా ఆదరించలేకపోయాను

ఇక్కడ ఒకమాట చెప్పాలి బాగా చిన్నవయసులోనే పెళ్ళి అయిపోయిందనో ఏమిటో మీ అమ్మ శాంతమ్మగారితో మీ నాన్నగారి వైవాహికజీవితం ఏమీ సుఖంగా సాగినట్టు కనబడదు పొరపాటునయినా ఆమెప్రసక్తి తీసుకురావడం ఆయన కిష్టం లేకపోయేది అందువల్లే నీవిషయంలో అంతటి నిర్లక్ష్యం వహించారా అనిపిస్తుంది. అదే కారణమైతే అది సమర్థనీయంకాదు అక్కగారి అనారోగ్యం ఆమె కొని తెచ్చుకున్నదికాదు ఒకవేళ ఆమెవల్ల ఏ చిన్నపొరపాటయినా జరిగితే, అది నోరెరగని నీమీద చూపించడం హృదయమున్నవాళ్ళు మెచ్చరు నే నెక్కడ కందిపోతానో అన్నంతగా చూసుకునే ఆయన హృదయమైశాల్యం కన్నకొడుకుదగ్గిర ఎందుకు సంకుచిత మైంది ? ను వ్వెలా ఉన్నావో అని ఎన్నిసార్లడిగినా ఆయన సరైన జవాబీయ రెందుచేత ? "ఆయన నిన్ను అనాదరణ చేస్తున్నారేమో అనిపించినదగ్గిర్నుంచీ అస్తమానూ నా మనసు నీగురించే ఆరాటపడేది 'ముందు నుంచీ తెలియబరచడం దేనికి, ఈసారి వాడికి ఏకంగా పిల్లనే చూపిద్దాం !' అని మళ్ళీ గర్భవతి నయాక నీకు తెలియనీయనేలేదురా నాయనా !

ఇదివరకులా కాక నెలలు నిండినకొద్దీ నాకు నీమీద భ్రాంతి ఎక్కువైపోయేది ఏ ఆలోచన మొదలుపెట్టినా నీదగ్గిరకే వచ్చి ఆగేది ఏదో వెలితి జరిగినట్టు, ఏదో తప్పు జరిగినట్టు గజగజలాడిపోయేదాన్ని 'పిన్నీ ! డబ్బుతో అన్నిలోపాలూ సవరించబడతాయా ?' అని అస్తమానూ నువ్వడుగుతున్నట్టు తోచేది నా కెన్నో మందులు, కొత్తకొత్త నౌకర్లు, టానిక్కులు, పళ్ళరసాలు – అయినా భయం, బెంగా ఓసారి నిన్ను పంపించమని రాయమని ఆయనతో చెప్పినట్టుకూడా గుర్తు ఎంచేతో నిన్ను పిలిపించడం మాత్రం కుదర్లేదు ఆవాళ తెల్లవారుఝామునమాత్రం చాలా అధైర్యం తోచింది ఆయన డాక్టరుదగ్గిరకి వెళ్ళడం చూసి నీకు కబురు పంపించాను




నువ్వు వచ్చావు - ఎక్కడికి ? ఏరూపంలో ? సరాసరి నా హృదయసీమలోకి కన్నకొడుకులా - పచ్చనిచేలూ, పంటకాలువా, పైరుగాలీ నాలో మళ్ళీ పూర్తిగా నింపేవు

నువ్వు పైవాడ వనే భావాన కలలోకూడాలేదు నేను తల్లిని, నువ్వు బిడ్డవు, అంతే ఇంక మనకు మరోప్రపంచంలేదు మీ నాన్నగారి ఆఖరి ఒకటిరెండు సంవత్సరాలలో ఆయన్నికూడా నేను కొంతవరకు 'నెగ్లెక్ట్' చేశానేమో నీకోసం ఏదైనా ఒదులుకోగలనన్నంత ప్రేమతో నిన్ను పెంచాను బాబూ!

పిచ్చిబాబూ! ఇంతవరకు నేను రాసింది అంతో ఇంతో నువ్వెరిగున్నది ఇక ముందు నువ్వు చదివేది నీకు దిగ్భ్రమ కలుగజేసేది, నిన్ను దీనుణ్ణి చేసేది, నిన్ను తీరని వేదనలో ముంచెత్తేసేది ఏం చేసేది బాబూ! నీపిన్ని కఠినాత్మురాలు!'.

'బాబూ!' రంగమ్మ గావుకేక వేసింది

'ఇప్పటికి ఓ పదసార్లయినా పిలిచిఉంటాను, భోజనానికి ఎంతకీ రావేం ?'

ఆవిడ వచ్చేసరికి పిచ్చేశ్వర్రావు కాగితాలు హడావిడిగా పరుపుకిందకి తోసేశాడు

బాగా తలనొప్పిగా ఉంది రంగమ్మా! - ఓ గ్లాసుడు చిక్కని మజ్జిగమాత్రం తెచ్చిపెట్టు '

'అవి డెప్పుడొస్తుందో ఏమిటోగాని, నీకు చెయ్యలేక నా ప్రాణాలు పోతున్నాయ్ బాబూ!' అంటూ విసురుగ మజ్జిగ్లాసు అక్కడ పెట్టివెళ్ళింది. పిచ్చిబాబు గడగడ మజ్జిగ త్రాగేసి మూతి తుడుచుకున్నాడు.

'ఏముంది, అన్నా వదినా, ఆస్తీ తగవూ, సంబంధాలూ – ఈగోల ప్రారంభ మౌతుందికాబోలు!' అనుకున్నాడు తాత్కాలికంగా. కాని అతనికే ఆభావం సబబుగా తోచలేదు. పరుపుకింద కాగితాలు తీసి భయం భయంగా చదవడం ప్రారంభించాడు.

## 18

'ఇన్ని పేజీలు రాసిన నాకు యికముందు ఎలా రాయాలో తెలియడంలేదురా బాబూ! సున్నితమైన, సుకుమారమైన, సృష్టికి మూలకారణమైన స్త్రీ పురుష సంబంధాన్ని నిండుగా నిరాడంబరంగా చెప్పడం ఎంతకష్టం! పుట్టిననాటినుండీ కన్ను మూసేదాకా జీవుల్ని పాలిస్తుందని మానసికశాస్త్రవేత్తలు వ్రాక్కుచ్చే ఈ సెక్సుని మాటల్లో యిమడ్చడానికి ఎంత నేర్పుకావాలి! ఆ భావాన్ని ఒకతల్లిలాంటి స్త్రీ ఒక కొడుకులాంటివాడికి చెప్పడం ఎంత శ్రమ! కాని అన్నిటికీ తెగించిన యీ చివరిఅధ్యాయంలో నాకు దేనికి భయం!

చచ్చినా తీరవంటారే, బతికుండగా కోరికల్ని రూపుమాపుకోగలమా, పిచ్చిబాబూ! జన్మ, కర్మ, పునర్జన్మల నమ్మకం గల భారతదేశంలో పుట్టినవాళ్ళమే మనం, ఒక్కజన్మలో, అందులో మంచివయసులో వాంఛల్ని అరికట్టగలమా? నాకోసం ప్రాణంపెట్టే నా భర్త నాకోసం ప్రాణం నిలుపుకోనేలేదు. మహావృక్షమై నా ప్రత్యణువులోనూ ఊడలు దింపిన నా మాతృత్వఫలం నిలవనేలేదు. తీరని దుఃఖం కొన్నాళ్ళు కామితాన్ని కనుమరుగు చెయ్యవచ్చు; కాని వయసు వాడకుండా ఉడుకు చల్లారిపోదుగా, బతుకు తెల్లారిపోదుగా!'...

"పొరపాటయితే నన్ను క్షమించాలి. విజయలక్ష్మిగారు ఎవర్నైనా తీసుకుని అక్కణ్ణుంచి అలా లేచిపోలేదుగా?" అన్నాడు విజయకుమార్ సస్పెన్సు ఇక భరించలేక.

"ఉత్తరం అయిపోయేదాకా మాటాడనని మాటిచ్చారు..."

"ఉత్తరం అవడమంటూ కనపడలేదులెండి; అందుకని...సారీ...చదవండి...కాదు, కాదు చెప్పండి."

శ్రీకృష్ణమూర్తి మిగిలిన ఉత్తరంసంగతి చెప్పేడు:

'సరిగా ఇదే సమయంలో నా దగ్గిరకి నువ్వూ, నీ దగ్గిరకు నేనూ వచ్చాం.



నాలోకి నువ్వూ, నీలోకి నేనూ చూసుకున్నాం. నీకు తల్లి ఉన్నా, నాపిల్ల బతికున్నా మనం ఒకరిమొహం ఒకరు చూసుకునేవాళ్ళమే కాదేమో! నీకు అందించేవారు కావాలి; నాకు అందుకోవలసినవారు కావాలి. అందుకనే మనం ఒకరికొకరు దిక్కయినాము; మరల విడని చిక్కయినాము. పరమపవిత్రమైన ప్రేమ లహరిలో ప్రపంచాన్నే మరచిపోయాము. సహజమైన సంబంధమే అయితే ఇంతటి సాన్నిహిత్యమూ ఉండదు, ఇంతటి సంచలనమూ కలగదు!

నీకు జ్ఞాపకం ఉందనుకుంటాను, ఆ చిన్న సంగతి!

కొన్నాళ్ళక్రితం ఒకసారి మా అన్నయ్యా వదినా నన్నిక్కడికి తీసుకొచ్చి ఉంచేశారు; అప్పుడు జరిగిన సంఘటన యిది.

ఇది నీకు తెలియనిది కాదు. బహుశా నువ్వు అప్పుడే అది మరచిపోయి ఉంటావు.

అప్పుడు నీకు పబ్లిక్ పరీక్షలు. చంద్రశేఖరం మేష్టారియింట్లో ఉండిపోయి

చదువుకున్నావ్. జ్ఞాపకం వచ్చిం దనుకుంటాను. అయితే నీలో మార్పు గుర్తించి నేను తట్టుకోలేకపోయిన సంఘటనలు అడుగడుగునా ఉన్నాయి. నా చేతుల్తో పెంచిన నిన్ను మరొకదృష్టితో చూడగలనని కలలోకూడా అనుకోలేదు.

నేను చెప్పేది అలాంటి సంఘటనలకి ఒక ఉదాహరణ మాత్రమే.

భువనేశ్వరంనుంచి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన నేను యిల్లు చేరుకునేసరికి చిరుచీకటి వేళ.

వీధిలో ఏదో అలికిడి వినిపించి ఇంట్లోంచి యివతలికి వచ్చాను.

క్రోటన్సు చెట్టుపక్క ఎవరో అటు తిరిగి నిల్చునిఉన్నారు. నాకు భయంకూడా వేసింది. చీకటివేళా, ఎవరో ఏమో!

'ఎవరుకావాలండీ?' అన్నాను.

'పిచ్చేశ్వర్రావు ఉన్నాడా అండీ?' నాకు ధైర్యం వచ్చింది. ఎవరో నీ ఫ్రండన్న మాట.

'నేను వచ్చానని సముద్రంచేత కబురంపించాను. ఈపాటికి వస్తూంటాడు. లోపలికి వచ్చి కూచోండి.'

ఫక్కున నవ్వు వినిపించింది. ఆ వ్యక్తి మరెవరోకాదు నువ్వే! ఎంత చీకటి ఐతేమాత్రం నిన్ను నే నెరగనా? ఈ కొద్దినెలల్లోనే ఇంత ఎదిగావా? నీ గొంతులో కూడా మార్పేనా? పసితనపు బంగారపుఛాయలు ఒకటీ ఒకటీ నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాయా? నాకు పెద్దవాడివీ, పరాయివాడివీ అయిపోతున్నావా! ఎప్పటిలా చమత్కారం నాకు రక్షణ ఇవ్వలేదు. నువ్విలా 'కొత్త చెయ్యడం' నా కేం నచ్చ లేదు.

'ఏమిటి పిన్నీ ఆలోచిస్తూ కూచున్నావ్? మీవా శ్శింటికి వెళ్లొస్తేమాత్రం నే నెవర్నో గుర్తుపట్టనంతగా మారిపోవాలా?'

'లేదురా బాబూ!... నల్లబడ్డావ్... ఏమిటో నేను వెళ్ళినప్పట్లామాత్రం లేవు — పెద్దవాడి వైపోతున్నావ్...'

'అయిపోక? ఎల్లకాలం నీలా పొట్టిపిచ్చికలా కూచుంటా ననుకున్నావా? పరీక్షలగొడవ అయిపోయిందా ... యిక మా ఫ్రెండ్సు కొందరం రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజుకూడా చెయ్యదల్చుకున్నాం. నన్ను రేపట్నుంచీ తెల్లారీసరికల్లా లేపాలి. లేవకపోతే చెవిలో నీళ్ళోసెయ్... అలాగేనా?'

నేను బుగ్గమీద చెయ్యేట్టుకుని అలాగే మెట్లమీద కూచున్నాను. నా కడుపులో కదలాడే పాప, నా ఒడిళ్లో పాలు తాగే పాప, పాట పాడితేగాని కన్నుమూయని

పాప, చందమామని చూపిస్తేగాని బువ్వతినని పాప... ఇదేనా? ఇదేనా? ఎందుకో నా కళ్ళలో నీళ్ళు తిరిగేయి. నువు నావైపు చూశావు. నాలో దైన్యం ఏమాత్రమూ భరించలేని నీచూపు నేను పోల్చుకున్నాను. నాన్నగార్ని తలుచుకుని నేను కన్నీరు పెట్టుకున్నానని నువ్వనుకున్నావేమో. అది మరలించడమూ, నన్ను నవ్వించడమూ — నీ పవిత్రమైన ప్రయత్నం నాకు కొత్తకాదు.

'మాకు పరీక్షల్లో ఇంగ్లీషునాడు పడ్డవాచరు చాలా విశాలహృదయం ఉన్నవాడు సుమీ! నలుగురూ చందా వేసుకుని అయిదు రూపాయిలు యిచ్చేసరికి కాపీరైటు, అంటే కాపీ కొట్టేహక్కు, అమ్మేశాడు!'

నేను నవ్వేను. నీకళ్ళు వెలిగేయి.

'తక్కిన విషయాలకేం గాని — నువ్వు లేనప్పుడు పాపిడి తీసుకోడం చాలా కష్టమైపోయింది పిన్నీ!... ముళ్ళపంది వెంట్రుకల్లా నా జుత్తు లేచి నిలబడ్డమేగాని ఓ వినయం విధేయతా ఎరగదాయెను! అప్పటికీ ఇన్ని నీళ్ళు. ఇంత వేసలైనూ రాశాను. లొంగుతేనా? మరి నీ చేతుల్లో ఏముందో ఏమిటో! మొహం కడుక్కొస్తాను; తిన్నగా పాపిడితీసి నున్నగా తలదువ్వు పిన్నీ — అలా బజారు కెళ్ళొద్దాం; నాకు బట్టలు కొందువుగాని. అన్నీ బాగా పొట్టిఅయిపోయాయ్ పిన్నీ! అందరూ నవ్వుతున్నారూ!'

మళ్ళీ నాకళ్ళనీళ్ళు తిరిగేయి. నా వెర్రిగాని పిల్లలు ఎదక్కుండా అలా ఉండిపోతారా? వయసువచ్చిన ఏ పిల్లవాడయినా తల్లినిమించి ఎదిగిఉంటాడు. అందులో ఆశ్చర్య మేముంది? కొత్తదనం ఏముంది! నన్ను నేనే తిట్టుకున్నాను; ఎప్పట్లా నిన్ను ప్రేమించడానికి రోజులతరబడి సాధన చేశాను. కొన్నాళ్లు నిలిచాను, గెలిచాను.

రెండేళ్ళకిందట హఠాత్తుగా రంగమ్మని పిలిపించాను; ఎందుకో తెలుసూ? చెబ్తాను విను.

కొత్తగా మీ కాలేజీకి ప్రొఫెసరుగా వచ్చిన ఇంజనీర్ని ఒకాయన్ని మనింటికి భోజనానికి తీసుకువచ్చావ్. మన బాంధవ్యం ఎరగని అతడు ఎలా అంచనావేశాడో నీకు గుర్తుందా? అతడి మాటలు నా అస్తిని పట్టిపోయాయి. 'కంగ్రాచ్యులేషన్స్ పిచ్చేశ్వర్రావ్. ఇంకా నువ్వు ఒంటిగాడివేమో అనుకున్నాను. అయాం హైలీ సేటిస్ ఫయిడ్ విత్ హెర్. వెరీగుడ్ సెలక్షన్!'

అర్థం కాక తెల్లబోయావు నువ్వు. సిగ్గుతో తల పాతాళంలోకి దింపుకున్నాను నేను. 'ఏమిటీ అంటాడు వెర్రివెధవ?' అని అడిగావు వాడు వెళ్ళేక. 'నా బుర్రా, వాడి బుర్రాను!' అన్నాను — ఇంకేమనాలో తెలీక. తెలియనివాళ్లు ఇలా అనుకుంటే,

తెలిసినవాళ్లు, అంటే — మన చుట్టూ ఉన్న బంధువులు ఏవేవో గుసగుసలు. ఇవేవీ ఎప్పుడూ లక్ష్యపెట్టను నేను. నేను లక్ష్యపెట్టకుండా ఉండలేనిది ఒకటే — నా మనస్సు లోని గుసగుస! సాంఘిక ధర్మానికి కట్టుబడి ఉండకపోవచ్చు; శరీరధర్మాన్ని ఏం చెయ్యను! ఈ చింతను నానుంచి ఎలా వేరుచేసుకోను!

నీకు ఐదేళ్లు ఉండగా నేను మీయింటికి వచ్చాను. అప్పటికి నాకు పదహారు వెళ్ళేయి. మానసికంగా ఎంత పెద్దరికం తెచ్చుకుంటేమాత్రం మన ఈ వయస్సుల తేడా ఎలా మారుతుంది! అప్పుడు నీకు ఇరవై, నాకు ఇరవై ఏడు. శరీరమైతే పెరిగిందిగాని ఆవాసన లేవీ ఇంకా నీలో జొరబడలేదు. నీ చదువేమో, నీ ఆట లేమో — అంతే. ఇంకా ఇంకా కుర్రాడిలా నీ పిన్ని కొంగు పట్టుకు తిరగడం; నే నెంత తప్పించుకుందామన్నా భోజనాలవేళమాత్రం నీతో గడపక తప్పేదికాదు.

'నువ్వు తినెయ్ బాబూ! తర్వాత నేను తింటాను,' అన్నాను ఒకనాడు.

'నేనూ తర్వాతే తింటాను.'

'నేను ఇప్పట్లో తినను. ఇందాకే ఏదో తిన్నాను.'

'నేనుమాత్రం తక్కువ తిన్నానా? నేనూ తినను.'

'ఒరే, ఇలా కాల్చుకుతిన్నావంటే ఇంట్లోంచి పోతాను.'

'పద; ఒకేయింట్లో ఉండి నాకూ విసుగెత్తిపోయింది; ఉన్నపాటున ఎక్కడి కైనా లేచిపోదాం.'

'లేచిపోదాం' అని నువ్వన్నమాటలో నాకు విపరీతార్థం స్ఫురించి త్రుళ్ళిపడ్డాను. ఎన్నిసార్లు వద్దనుకున్నా సాధారణంగా నువ్వు ఉపయోగించిన ఆమాట నాచెవిలో గింగుర్లెత్తనిక్షణం లేదు. ఆరాత్రి ఏమాత్రమూ నిద్రపట్టలేదు; నే నేమైపోతున్నానో నాకే బోధపడలేదు.

అందకుండా పోతున్న మనసుని అదుపులోకి తీసుకువద్దామని విశ్వప్రయత్నాలు చేశాను, ఆనాటినుంచీ. సహనానికి పేరుబడ్డ మహిళల చరిత్రలు చదివాను; నియమ జీవితం గడిపిన మహాత్ముల మహనీయగాథలు చదివిచూశాను; ఆఖరికి అతి సామాన్యురాలైన ఆ విశాలాక్షికథ — ను వ్వెరుగుదువుకదూ — పదే పదే చదువు కున్నాను. ఏంలాభం? ఆత్మవంచన చేసుకునే అబద్ధాలుకూడా దేనికి? అవి యేవీ నాలో స్థిరమైనమార్పు తేలేకపోయాయి. నేను సాధించగలిగింది మాత్రం ఒకటుంది. నాలో ఉవ్వెత్తున లేచిన ఈ జ్వాలవేడి ఏమాత్రం నీకు సోకకుండా జాగ్రత్తపడడం. తమాషామాటల్లో నీకు మత్తు కలిగించి నన్ను నీనుంచి దాచుకుందా మని ప్రయత్నించాను. అమాయకంగా ఉన్న నీ మొహం చూస్తూంటే చాలావరకు నేను కృతకృత్యురాల నయాననే అనిపిస్తుంది.

కాని ఎన్నాళ్ళు ? ప్రతిరోజూ నిన్ను చూడక, నీతో గడపక నాకు తప్పదు.

నువ్వెంత చదువులో పడి కొట్టుకున్నా, నీ ఫ్రెండ్స్‌సర్కిల్ నీకు ఎంత ఎక్కువై పోయినా, నిద్రలో చంటిపాప పాలకోసం లేచి అమ్మకోసం తడుము కున్నట్టు నాకోసం పరిగెత్తుకువస్తావు – నాకు తెలుసు. ఈ భావం ఎలా భరించను ? విషపుచుక్క కలసిన నా ప్రేమక్షీరాన్ని నీ కేమని ఇవ్వను ? ఈ ద్వంద్వంలో ఎన్నాళ్ళని, ఎలాగని నిగ్రహించను ! నాకు కావలసిన ఒకేఒక వ్యక్తితో ఈ అబద్ధపుబతుకు ఏమని సహించను ! సూటిగా చూడడం, తిన్నగా నడవడం, చక్కగా నవ్వడం – ఇవి లేనిబతుకు అ దెలాంటిబతుకు ! నిన్ను విడిచి కొన్నాళ్ళు ఎక్కడికైనా పోతే ?

'మా అన్నయ్యకు జబ్బుచేసినట్టు కల వచ్చిందిరా బాబూ !' అన్నాను నీతో.

'అలాగా ! ఓసారి ఆ వూరు వెళ్ళి చూసివచ్చినట్టుకూడా కల గనెయ్. సరిపో తుంది.' అనేశావు నువ్వు నవ్వుతూ. నేను నీ వైపు చూశాను నీ పళ్ళు ఎంత తెల్లగా ఉన్నాయో నీ నవ్వు అంత స్వచ్ఛంగా ఉంది భగవంతుడా పవిత్రమైన ఈ పరిహాసాన్ని చూస్తూ పరిపూర్ణంగా బతకమని ఆశీర్వదించు స్వచ్ఛమైన వెలుగుతో తుచ్ఛమైన నీడల్ని జత చేస్తేగాని నీకు తృప్తి వుండదా ?

'ఎందుకు పిన్నీ ఏడుస్తున్నావ్ ?'

నే నక్కడ నిలబడలేకపోయాను. జలజలా కారే కన్నీళ్ళను ఆపుకుందామని వ్యర్థప్రయత్నం చేస్తూ గదిలోకి వచ్చేశాను నువ్వు నన్ను వదిలిపెట్టలేదు

'పిన్నీ ! ఎందు కేడుస్తున్నావ్ ? నిజంగా మీ అన్నయ్యకోసమేనా ? నూటి కోనాడు మీరు ఉత్తరాలు రాసుకుంటారు హఠాత్తుగా ప్రేమ పొంగుకొచ్చిందా? నే నమ్మను.'

నేను మాటాడలేదు.

'నాన్న జ్ఞాపకానికి వచ్చిఉంటారు, అవునా ?'

ఇంకేం అనలేక అవునన్నట్టు తల ఊగిస్తూ యిటు చూశాను ఎదురుగుండా నిలువుటద్దం ! అందులో పక్కపక్కగా దగ్గిరదగ్గిరగా మన ప్రతిబింబాలు ! ఆ దృశ్యం చూడలేక నా కళ్ళు మూసుకున్నాను. నేను సరిగా ఇదివరకు గుర్తించ నిది అప్పుడు గుర్తించినందుకు ఆశ్చర్యపడ్డాను ముఖకవళికల్లో తేడా ఉండొచ్చు. కాని ఆ నడకలో, ఆ తల ఊపడంలో నీకూ మీ నాన్నగారికీ ఎంతపోలిక ! అప్పుడు, నా పక్కని కూర్చుని, అదేగదిలో అదే శయ్యమీద ఒకప్పుడు. మరెవరూ లేనప్పుడు, న న్నిదేవిధంగా అనునయించేది ఎవరు? నువ్వేనా ? కాదు. మీ నాన్నగారు ! నాకు నీలాంటి కొడుకు నివ్వవలసినవారు – నాకు నీలాంటి కొడుకు

కావాలి! కావాలి_కావాలి_కావాలి ఈసారి నా మొహంమీది చేతులు తీసుకునేసరికి నా నరాల్లో తీపు, నా రక్తంలో వేడి నాకు తెలియడమేకాకుండా నా కళ్ళల్లో కాంక్ష నాకు స్పష్టంగా కనిపించింది ఈసారి అది నాకు తప్పనికూడా అనిపించలేదు. అదివరకు బతుకంతా అబద్ధమనీ, ఆ క్షణ మొక్కటే పరమసత్యమనీ అనిపించింది.

సరిగ్గా అదేసమయానికి నీ ఫ్రండ్సెవరో నిన్ను ఆటకి పిలిచారు 'లేనిదాని కోసం ఏడుస్తే ఏం లాభం పిన్నీ' నే నీ్నకు చెప్పలా? లేచి మొహం కడుక్కో. ఇవాళ మంచి పాటకచేరీ ఉంది. ఆరున్నరకల్లా నేను వచ్చేస్తాను, సిద్ధంగా ఉండు. లే, మరీ.. నే వెడుతున్నాను.' ను వ్వెళ్ళిపోయావు

నే నక్కణ్ణుంచి లేవలేదు హృదయంలేని ఆ అద్దంవైపే చూస్తూకూచున్నాను చూస్తూండగా మనోఫలకానికి పట్టిన బూజు ఎగిరిపోయింది సిగ్గుతో దహించుకు పోయాను అభిమానంతో కుదించుకుపోయాను అప్పుడే ఎందులోనైనా పడి చచ్చిపోదామా అనిపించింది నిజంగా అప్పుడే నా చావు మొదలయింది. నిజంగా ఊపిరి ఆగిపోయిననాటి చావు చావేకాదుసుమీ పిచ్చిబాబూ!

నీ దగ్గర మరి ఉండలేక యిక్కడికి వచ్చేశాను హఠాత్తుగా వచ్చిన నన్ను చూసి వీళ్లు ఆశ్చర్యపోయారు సంబంధంకోసం వచ్చానని చెప్పేను ఆ అబద్ధం కప్పిపుచ్చుకుందామని కొందరు పిల్లల్ని చూశానుకూడా ఎలాగా వచ్చాను కాబట్టి పూరీ అవీ చూసివెడతానని అలాఅలా వుండిపోయాను పరీక్షలముందు నీ మనసు నొప్పించకుండా అప్పుడప్పుడూ నీపేర ఒకటిరెండు ఉత్తరాలుకూడా రాశాను

అన్నయ్యతో ఇక్కడికి వచ్చాను సముద్రపొడ్డున ఒక హోటల్లో దిగేం వాడికి శలవ లేదని కంగారుపడుతూంటే 'నా ఆరోగ్యానికి ఈ సముద్రపుగాలి పడింది. ఇంకొన్నాళ్ళు ఉంటాను పిచ్చిబాబుకి పరీక్ష లైపోయివుంటాయి, రమ్మని రాశాను. నువ్వెళ్ళు.' అని వాణ్ణి పంపేశాను

పిచ్చిబాబూ! నిన్నింక కల్సుకోలేను అప్తులదగ్గిర ఆత్మవంచన నే నింక ఊహించలేను.

ఈ సముద్రపుఒడ్డునే ప్రతిరోజూ తిరిగేదాన్ని, ఇందులో పడిపోదం అన్నది సముద్రమంత సత్యం నన్ను వేధించేసమస్య ఒకటే ఇవన్నీ నీతో చెప్పుకోనా వద్దా అని నే నిలా చస్తే ఏమనుకుంటారు? కాలు జారి నీటిలో పడి చచ్చిం దను కొంటారు. కొన్నాళ్ళు ఏడుస్తావు, మళ్ళీ మరచిపోతావు. అలాకాదు, చస్తూకూడా నీలాంటివాడిముందు అసత్యస్థాపన చేసి నేను వెళ్ళలేను ఇదే స్వార్థమైతే 'నయన పథగామి' అయిన ఈ జగన్నాథస్వామి నన్ను శిక్షించుగాక! నా పిచ్చితండ్రీ!

నీతి ఎంత లోతయినదో నీతో చెప్పుకున్నాను మనసు మలినపరిచేదిగా కాక, పచ్చని, వెచ్చని నీముందు జీవితంలో నీ పిన్నిచరిత్ర ఏమాత్రం సానుభూతితో చూడబడినా నా ఆత్మ తృప్తిపడుతుంది

నేను మళ్ళీ జన్మిస్తాను. నా బతుకు పండేలాగ, నా మనసు నిండేలాగ నిన్ను కంటాను నాకు ఆశ్రయమిచ్చిన ఈ చల్లనినీటిలోని అనంతకోటిబిందువుల్లో కలసి నశించిపోను ఉవ్వెత్తున లేచి, ఊరంతా నిండి, ఊడలమర్రినై, ఉజ్జ్వలమూర్తినై, పిల్లలతల్లినై, తెల్లని జేజినై మళ్ళీ ప్రభవిస్తాను నువ్వు ఏకాకివీ కాదు, నేను ఏమీ లేకపోతున్నదాన్నీ కాదు ఈ పిచ్చివాడికి ఈ వెర్రిఅమ్మ ఎప్పుడూ ఉంటుంది !

—నీ. పిన్ని.'

*　　*　　*　　*

సిగ్నలింగ్ ఆఫీసరు శ్రీకృష్ణమూర్తి కన్నీళ్ళు తుడుచుకుని చేతులు పైకెత్తి నమస్కరించాడు. అతనేకాదు, ఆర్మీడాక్టరు విజయకుమార్ కూడా అతనితోపాటు నమస్కరించాడు

"వెరీ ఇన్నొసెంట్ ఫెలో, ఆ పిచ్చేశ్వర్రావు మీరేకదూ ?"

శ్రీకృష్ణమూర్తి అవునని తల ఊపి యిలా అన్నాడు "మొదట మీ సమస్య గురించి ఆలోచిద్దాం. అందర్నీ వదిలివచ్చారు. ఆర్మీలో చేరేరు ఆస్పత్రిల్లో చేరిన రోగులకు అన్నదమ్ములకంటె ఎక్కువగా సేవ చేశారు ఆ సేవలో మిమ్మల్ని మీరు మరచిపోయారు అంతటి ఆశాసౌధమూ అమాంతంగా అణగారిపోతే నిల దొక్కుకోలేక అల్లాడిపోతున్నారు మా బాధకి కారణం ఎక్కడుందో పోల్చుకున్నారా ?"

ప్రశాంతవదనంతో విజయకుమార్ అన్నాడు "ఇప్పుడింక ఆ అవసరం ఏం లేదులెండి "

"అదేం ?"

"ఇంక నన్ను ఏ బాధలూ ఏం చెయ్యలేవు ఇంకొక అరగంటలో తెల్లారిపోతుంది. తొందరతొందరగా పన్లు చేసుకుని ఆస్పత్రికి వెళ్ళాలి తాత్కాలికంగా షెడ్లూ, టెంట్లూ వేసి అందులోకి రోగుల్ని తరలించాలి ఇక్కడ చాలవరకు పరికరాలు దెబ్బతిన్నాయి కనుక వెంటనే పైనుంచి తెప్పించే ఏర్పాటయినా చెయ్యాలి, లేదా వీళ్ళని తరలించడానికి ఏంబులెన్స్ అయినా సిద్ధం అయేటట్టు చూడాలి...''

అలా విజయకుమార్ చెబుతూంటే శ్రీకృష్ణమూర్తి విస్ఫారిత నయనాల్తో

వింతగా, సంతృప్తిగా అతనివైపు చూశాడు "ఇంత ఆశాభంగం పొందికూడా మళ్ళీ ఏమంటూ బయలుదేరుతున్నారు డాక్టర్ ?"

కొంటెగా నవ్వుతూ అడిగాడు. "నన్నింకా పరీక్షించదలుచుకున్నారా మూర్తీ ! ఆశ అన్నది ఉంటే భంగం అన్నది ఉంటుంది ఫలితం అన్నదానిమీద దృష్టి నిలుపుతే జయాపజయాలనుబట్టి సుఖదుఃఖాలు ఏర్పడతాయి. ఆ భేదంలేని సమదృష్టి ఉంటే ?"

"నిష్కామమైన కర్తవ్యపరాయణం అంత సులభమా డాక్టర్ ?''

"సాధనవల్ల సమకూరనిది ఉందా ! అయినా ప్రయత్నమే మనది ఫలితం ఏమైతే మన కేం !''

శ్రీకృష్ణమూర్తి విజయకుమార్ రెండుచేతులూ పట్టుకున్నాడు.

''ఇవాళ నాకు చాలా ఆనందంగా ఉంది డాక్టర్ ఇంత సుళువుగా మీ చిక్కు ప్రశ్నకు జవాబు చెప్పగలనని నే ననుకోలేదు ''

''మిమ్మల్ని నే నెప్పుడూ కృతజ్ఞతతో గుర్తుంచుకుంటాను మూర్తీ మీ కథతో నా కళ్ళు తెరిపించారు ముఖ్యంగా మీ పిన్నికి నా హృదయపూర్వక వందనాలు ''

శ్రీకృమూర్తి గద్గదకంఠంతో అన్నాడు ''ఎక్కడో ఉంది యుద్ధం అనుకుంటారు దానిలో చేరటంలో అంతరార్థం ఏమిటంటారు. ఆలోచించిచూస్తే మనసున్న ఏ మనిషిలో అంతర్యుద్ధం లేదు ! మంచిచెడ్డల సైనికులు ఏ హృదయంలో మాత్రం లేరు ?"

"వేదాంతంలోకి దిగారా ?''

"మన దేశాన్ని రక్షించిందీ, మనకు నైతికబలాన్నిచ్చి ముందుముందు రక్షించేదీ వేదాంతమే వేదాంతానికి నిర్వచనం గోళ్ళు గిల్లుకుంటూ కూచోడంకాదే ! బాహ్యయుద్ధంతో సంబంధించిన మీ కథలోని ప్రశ్నకు అంతర్యుద్ధంతో అలమటించిన నా కథలోని జవాబు ఒకప్పుడు దేవుడు నరుడికి చెప్పిందేకదా !"

"మనల్ని యిలా తయారుచేసి శత్రుసంహారానికి తగిన శారీరక మనోబలాన్ని యిచ్చిన మన మహిళామతల్లులు మంచివాళ్ళు ఇలాంటి మంచివాళ్ళను కన్న మన అమ్మ, మన దేశమాత ప్రస్తుతం ఆపదలో ఉంది మనం, మన దేశజనం చెయ్యవలసింది ఎంతైనా ఉంది వ్యక్తిగత వ్యథలూ కథలూ యిక చాలు ''

అప్పుడే సూర్యోదయ మయింది శ్రీకృష్ణమూర్తి విజయకుమార్ భుజంమీద చెయ్యి వేసి అటువైపు తీసుకెళ్ళేడు.

(సమాప్తం)

---